

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 310

సోమవారం 24-7-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సాత్విక్‌-చిరాగ్‌ అదరహో



భారత బ్యాడ్మింటన్‌ పురుషుల డబుల్స్‌ జోడీ సాత్విక్‌ సాయిరాజ్‌-చిరాగ్‌ శెట్టి నాలుగో టైటిల్‌ను సొంతం చేసుకున్నారు. కొరియా ఓపెన్‌ వరల్డ్‌ టూర్‌ సూపర్‌- 500 టోర్నీలో చాంపియన్లుగా అవతరించారు. ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్‌ జోడీ ఫజర్‌- రియాన్‌(ఇండోనేసియా)పై విజయం సాధించారు. 12లో

మిజోరాం నుంచి మెయితీల వలస



మిజోరాంలో ఉంటున్న మణిపూర్‌ మెయితీలు ప్రాణభయంతో ఆ రాష్ట్రాన్ని కూడా వదిలేసి అస్సాం చేరుకున్నారు.

వివరాలు 6లో ▸

ఎఫ్‌ఎం స్టేషన్లకు ఈ-వేలం



దేశవ్యాప్తంగా 808 ఎఫ్‌ఎం రేడియోస్టేషన్ల ఏర్పాటుకు త్వరలో ఈ-వేలం నిర్వహిస్తామని కేంద్ర మంత్రి అనురాగ్‌ ఠాకూర్‌ తెలిపారు.

వివరాలు 6లో ▸

ట్విట్టర్‌ పక్షికి వీడ్కోలు!



ట్విట్టర్‌ లోగోను మారుస్తామని ఎలాన్‌ మస్క్‌ చెప్పారు. దీనిని పలు సేవలందించే 'ఎక్స్‌' యాప్‌గా రీబ్రాండ్‌ చేయనున్నట్లు సమాచారం.

వివరాలు 6లో ▸

పాక్‌ ఆపద్ధర్మ ప్రధానిగా ఇషాఖ్‌!



షెహబాజ్‌ షరీఫ్‌ పదవీకాలం ముగియనుండటంతో పాక్‌ ఆపద్ధర్మ ప్రధానిగా ప్రస్తుత ఆర్థిక మంత్రి ఇషాఖ్‌ దార్‌ పేరు తెరపైకి వచ్చింది.

వివరాలు 6లో ▸



కృష్ణా జిల్లా వణుకూరు-2లోని వైఎస్సార్‌ విలేజ్‌ క్లినిక్‌.. ఓ వ్యక్తికి వైద్య పరీక్ష చేస్తున్న సిబ్బంది

పల్లె చెంతకు వైద్యం

వైఎస్సార్‌ విలేజ్‌ క్లినిక్స్‌తో ప్రజలకు ఆరోగ్య భరోసా

- ఇప్పటికే 7.12 కోట్ల ఓపీలు నమోదు
- ఒక్కో చోట రోజుకు సగటున 40 ఓపీలు.. 10 టెలీ కన్సల్టేషన్లు
- రాష్ట్రవ్యాప్తంగా సేవలందిస్తున్న 10,032 క్లినిక్‌లు
- 12 రకాల సేవలు.. 14 పరీక్షలు.. 105 రకాల మందులు
- ప్రతి క్లినిక్‌లో సీహెచ్‌వో, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్‌
- స్పెషలిస్టు డాక్టర్‌తో రోగి మాట్లాడేలా టెలీ మెడిసిన్‌ సౌకర్యం.. ఫ్యామిలీ డాక్టర్‌ కాన్సెప్ట్‌తో నెలకు 2 సార్లు పీహెచ్‌సీ వైద్యుల సందర్శన
- ఎప్పటికప్పుడు రోగుల వైద్య చరిత్రను గమనిస్తూ పరామర్శలు.. పల్లెలతో వైద్యులకు పెరుగుతున్న అనుబంధం
- మొత్తంగా గ్రామీణుల్లో జీవన శైలి జబ్బులు ఆదిలోనే కట్టడి

2లో

ఆ గుండెకు ధైర్యం..



కృష్ణా జిల్లా వణుకూరుకు చెందిన కె.సరోజరాణి హృద్రోగ బాధితురాలు. రెండున్నరేళ్ల క్రితం వైఎస్సార్‌ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా స్టెంట్‌ వేసి ప్రాణాన్ని కాపాడారు. క్రమం తప్పకుండా మందులు వాడుకుంటూ బీపీ, షుగర్‌ పరీక్షించుకోవాలని డాక్టర్లు ఆమెకు సూచించారు. గతంలో ఐదు కి.మీ ప్రయాణించి కంకిపాడు లేదా విజయవాడ వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు గ్రామంలోనే డాక్టర్‌ వైఎస్సార్‌ విలేజ్‌ క్లినిక్‌ ద్వారా ఉచితంగా పరీక్షలు, మందులు ఇవ్వడంతోపాటు ఫ్యామిలీ డాక్టర్‌ కాన్సెప్ట్‌తో సొంతూరిలోనే వైద్య సేవలు అందడం ఆమెకు ఎంతో ఊరటనిస్తోంది. 'గుండె జబ్బు బారిన పడ్డాక నేను కూలికి వెళ్లట్లేదు. మా అబ్బాయి సంపాదనే ఆధారం. వ్యయ ప్రయాసలకు భయపడి గతంలో వైద్య పరీక్షలకు వెళ్లకుండా చాలాసార్లు నిర్లక్ష్యం చేశా. ఇప్పుడు గ్రామంలోనే అన్నీ అందుతున్నాయి. డాక్టర్‌ వచ్చి పరామర్శిస్తున్నారు' అని సంతోషం వ్యక్తం చేసింది.



కుటుంబ ఆస్తి కోసమే

సీబీఐ డైరెక్టర్‌ ప్రవీణ్‌ సూద్‌కు ఎంపీ అవినాశ్‌రెడ్డి లేఖ

నర్రెడ్డి కుటుంబానిదే కుట్ర

- రెండో భార్యకు ఆస్తి రాసి నోటరీ వీలునామా రాసిన వివేకా
- ఆయన్ని హత్య చేసి ఆ వీలునామాను అపహరించారు.. అనంతరం సునీత పేరిట ఆస్తుల బదిలీ
- ఈ కోణాలను ఉద్దేశపూర్వకంగా పట్టించుకోని సీబీఐ.. దురుద్దేశంతో వ్యవహరించిన దర్యాప్తు అధికారి రాంసింగ్‌
- అప్రూవర్‌ దస్తగిరి వాంగ్మూలం పూర్తిగా కట్టుకథ.. బెంగళూరు భూవివాదం లేనే లేదు
- గుర్తు తెలియని వేలి ముద్రలపై సీబీఐ మౌనం ఎందుకు?.. ఇప్పటికైనా సమగ్రంగా దర్యాప్తు చేయాలి

సాక్షి, అమరావతి: మాజీ ఎంపీ వైఎస్‌ వివేకానందరెడ్డి హత్యకు కుటుంబ ఆస్తి వివాదాలే ప్రధాన కారణమని కడప ఎంపీ వైఎస్‌ అవినాశ్‌రెడ్డి సీబీఐకి తెలిపారు. కుటుంబ వారసత్వ ఆస్తి కోసమే వివేకా అల్లుడు నర్రెడ్డి రాజశేఖర రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు ఈ హత్య చేయించారని ఆధారాలతో సహా వివరించారు. వివేకా తన రెండో భార్య షమీమ్, ఆమె కుమారుడి పేరిట రాసిన నోటరీ వీలునామాను నిందితులు నర్రెడ్డి కుటుంబానికి అందచేశారని తెలిపారు. షమీమ్‌కు వాటా ఇవ్వకుండా వివేకా ఆస్తి మొత్తాన్ని సునీత తన పేరిట మ్యుటేషన్‌ చేసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. గతంలో దర్యాప్తు అధికారిగా ఉన్న రాంసింగ్‌ దురుద్దేశపూరితంగా ఈ అంశాలపై దర్యాప్తు చేయకుండా

మిగతా 3వ పేజీలో ▶

ఫ్యాక్ట్‌ చెక్‌

'ఇంటి'పై ఏడుపు ఇంతింత కాదయ్యా..

- పేదల ఇళ్ల నిర్మాణంపై రామోజీ పగ
- 'సెంటు పట్టా.. అక్రమాల చిట్టా' అంటూ ఈనాడు అడ్డగోలు రాతలు
- నిబంధనల ప్రకారం అమరావతిలో అర్హులకు ఇచ్చినా గగ్గోలు
- ఆధారాల్లేకుండా తప్పుడు కథనం
- ఇప్పటివరకు ఈ యజ్ఞాన్ని అడ్డుకునేందుకు వివిధ కోర్టుల్లో 26 కేసులు వేసిన ఎల్లో గ్యాంగ్‌
- వీటన్నింటినీ అధిగమించి 50,793 మంది నిరుపేద అర్హులకు అక్కడ పట్టాల పంపిణీ..
- నేడు ఇళ్లకు శంకుస్థాపన చేస్తుంటే ఓర్వలేక అక్కసు

14లో

పిల్లల భోజనంపైనా

ఏడుపేనా?

- పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనంలో మార్పులు కనబడటంలేదా రామోజీ?
- పిల్లలకు పౌష్టికాహారం ఇస్తుంటే.. ఈనాడు జీర్ణించుకోలేకపోతోంది
- ఇప్పటిలా నిధులు ముందే విడుదల చేయడం మీ బాబు హయాంలో ఉందా?
- 2014–18లో మధ్యాహ్న భోజన సగటు వ్యయం రూ. 450 కోట్లే
- ఇప్పుడు ఐదేళ్లలో బడ్జెట్‌ కేటాయింపులు మొత్తం రూ. 7,244.60 కోట్లు
- బాబు సర్కార్‌ నీళ్ల సాంబారు తప్ప మంచి భోజనం పెట్టిందా?
- ఇప్పుడు ప్రతిరోజు మెనూ మార్పుతో రుచికరమైన భోజనం
- ఇన్ని చేస్తున్నా అడ్డగోలుగా అబద్ధపు రాతలు

3లో



'ఉపాధి'లో ఏపీ ఫస్ట్‌

వంద రోజుల్లో రూ.4,554 కోట్ల విలువైన ఉపాధి పనులు

42.27 లక్షల కుటుంబాలకు లబ్ధి

- ఈ ఏడాదికి రాష్ట్రానికి ప్రాథమికంగా కేటాయించింది 15 కోట్ల పని దినాలు.. ఇప్పటికే 18.47 కోట్ల పనిదినాల కల్పన
- 24 కోట్ల మేర పని దినాలు పెంచాలని వినతి
- 27న కేంద్ర అధికారులతో సమావేశం

సాక్షి, అమరావతి: పేదలకు ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించే విషయంలో దేశంలోనే మన రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచింది. ఈ ఏడాది ఏప్రిల్‌ 1వ తేదీ తర్వాత వంద రోజుల వ్యవధిలోనే పేదలకు వారి గ్రామాల్లోనే ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం రూ.4,554.34 కోట్ల మేర లబ్ధి చేకూర్చింది. పని కావాలని అడిగిన ప్రతి వారికి పనులు కల్పించడంతో పాటు సగటున రోజువారీ వేతనంగా రూ. 246 చొప్పున అందజేసింది. ఏప్రిల్‌ 1వ తేదీ నుంచి మొదలయ్యే ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి ప్రాథమికంగా 15 కోట్ల పని దినాలు కేటాయించింది. ఉపాధి హామీ పథకం చట్టం ప్రకారం పని కావాలని అడిగిన ప్రతి వారికి తప్పనిసరిగా పనులు కల్పించాలన్న నిబంధనకు అనుగుణంగా జూన్‌ నెలాఖరు నాటికే ఆ 15 కోట్ల


మిగతా 2వ పేజీలో ▶

24 కోట్ల పని దినాలు సాధించే దిశగా..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొదటి నాలుగు నెలలు పూర్తికాక మునుపే.. 18.47 కోట్ల పని దినాలు కల్పించిన నేపథ్యంలో.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి మొత్తం 24 కోట్ల పనిదినాలు కల్పించేలా లేబర్‌ బడ్జెట్‌ కేటాయింపులను పెంచాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈ నేపథ్యంలో ఈ నెల 27వ తేదీన రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో కేంద్ర అధికారులు సమావేశం నిర్వహించనున్నారు.

వారం రోజులు వర్షాలే

- ఒడిశా తీరంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం
- నేడు బంగాళాఖాతంలో అల్పపీడనం



సాక్షి, అమరావతి/విశాఖపట్నం: రాష్ట్రంపై ఉపరితల ఆవర్తనం, రుతు పవన ద్రోణులు ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా రాష్ట్రంలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా మరో వారం రోజులు వర్షాలు కొనసాగే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో విస్తారంగా వర్షాలు పడతాయని, పలుచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. దక్షిణ ఒడిశాకు ఆనుకుని ఒక ఉపరితల ఆవర్తనం కొనసాగుతుండటం, బంగాళాఖాతంలో

మిగతా 5వ పేజీలో ▶

శ్రీశైలం ప్రాజెక్టులోకి

వరద ప్రవాహం

- నారాయణపూర్, ఉజ్జయిని డ్యామ్‌లకు దిగువన కురుస్తున్న వర్షాలతో జూరాలకు వరద
- జూరాలలో విద్యుత్‌ ఉత్పత్తి చేస్తూ 37,930 క్యూసెక్కులు దిగువకు విడుదల
- స్థానిక వర్షాలతో సాగర్‌లోకి 2,015 క్యూసెక్కులు.. మూసీ నుంచి పులిచింతల ప్రాజెక్టులోకి 8,685 క్యూసెక్కులు
- మున్నేరు, వాగుల నుంచి ప్రకాశం బ్యారేజ్‌లోకి 15,698 క్యూసెక్కులు
- ప్రకాశం బ్యారేజ్‌ నుంచి 9,584 క్యూసెక్కుల మిగులు జలాలు కడలిలోకి

5లో

నిలకడగా గోదావరి

మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ

5లో

సులభంగా.. శరవేగంగా..



ఆస్తుల రిజిస్ట్రేషన్లను రాష్ట్ర ప్రభుత్వం సులభతరం చేస్తోంది. 'కార్డ్‌ ప్రైమ్‌' పేరుతో సాఫ్ట్‌వేర్‌ రూపొందిస్తోంది. దీని ద్వారా స్టాంపు పేపర్లు, సంతకాలతో పనిలేకుండా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. డాక్యుమెంట్‌ను ఎవరికివారే ఆన్‌లైన్‌లో తయారు చేసుకుని, చలానా కట్టి, ఒక టైం స్లాట్‌ బుక్‌ చేసుకుని.. సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయం లేదా గ్రామ, వార్డు సచివాలయానికి వెళితే అక్కడ వెంటనే రిజిస్ట్రేషన్‌ పూర్తవుతుంది.

- 2లో

డియర్‌ పవన్‌.. మీకు ట్యూషన్‌ చెబుతా



విద్యా శాఖపై ట్విట్టర్‌లో పలు ఆరోపణలు చేసిన జనసేన అధినేత పవన్‌కు మంత్రి బొత్స సత్యనారాయణ కౌంటర్‌ ఇచ్చారు. 'డియర్‌ పవన్‌.. ఈరోజు నుంచి నేను మీకు ట్యూషన్లు తీసుకుంటాను, కానీ నాదొక షరతు.. మీరు హోం వర్క్‌ చేస్తానని వాగ్దానం చేయాలి. ఈ ఏడు పాఠాలను క్షుణ్నంగా చదవడమే నేటి అసైన్‌మెంట్‌'.. అంటూ ట్వీట్‌ చేశారు. టెండర్ల విధానంలో తీసుకు వచ్చిన సంస్కరణలను, విద్యా రంగంలో సాధించిన ప్రగతిని బొత్స వివరించారు.

- 14లో



ట్యూనా.. భలే స్టామినా

5లో

బంగాళాఖాతంలోని లోతు జలాల్లో మాత్రమే లభించే ట్యూనా చేప దేశ సరిహద్దులు దాటుతోంది. ఎక్కువ పోషకాలతో కూడిన బలవర్ధక ఆహారం కావడంతో వివిధ దేశాలు తమ సైనికుల కోసం వీటిని దిగుమతి చేసుకుంటున్నాయి. ట్యూనా చేపల ఎగుమతుల్లో భారత్‌ రెండో స్థానంలో ఉంది. ఏటా 42 వేల టన్నుల ట్యూనా చేపలు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి.

నేడు సీఆర్‌డీఏలో

పేదల ఇళ్లకు శ్రీకారం

శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి

- రూ.1,829.57 కోట్లతో 50 వేల మందికి పైగా పేదలకు సర్కారు స్థిర నివాసాలు
- ఎల్లో ముఠా కుట్రలు అధిగమించి ఇప్పటికే అమరావతిలో 1,402.58 ఎకరాల్లో 50,793 మంది పేదలకు ఉచితంగా ఇళ్ల పట్టాల పంపిణీ

సాక్షి, అమరావతి: అమరావతిలో పేదలకు ఇళ్లు ఇస్తే సామాజిక సమతుల్యత దెబ్బతింటుందన్న పెత్తందారుల వితండ వాదాలకు చెక్‌ పెడుతూ నిరుపేద అక్కచెల్లెమ్మల సొంతింటి కల సాకారానికి రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా.. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద సీఆర్‌డీఏలో 50వేలకు పైగా ఇళ్ల నిర్మాణానికి సోమవారం ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. గూడు లేని పేద అక్కచెల్లెమ్మలకు స్థిరనివాసం సమకూర్చి, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలన్న

మిగతా 2వ పేజీలో ▶



కృష్ణాయపాలెం జగనన్న లేఅవుట్‌లో నిర్మించిన మోడల్‌ హౌస్‌


మోడల్‌ హౌస్‌ చాలా బాగా వచ్చింది



లేఅవుట్‌లో తొలుత నాకు కేటాయించిన స్థలంలో మోడల్‌ హౌస్‌ నిర్మించడం చాలా ఆనందంగా ఉంది. సెంటు స్థలంలో ఇల్లు బాగా వచ్చింది. ఇల్లు కట్టుకోవడమే కలగా మిగిలిపోతుందని అనుకున్నా. కానీ, జగనన్న స్థలం ఇవ్వడమే కాక ఇల్లు కట్టించి నా కలను సాకారం చేశాడు. సెంటు స్థలంలో ఇల్లు ఎలా వస్తుందని అన్న వారు దీనిని చూడాలి. సొంతింటి కల సాకారం చేసిన సీఎం జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– ఈపూరి జీవరత్నం, కృష్ణాయపాలెం

యమున మరోసారి ఉగ్రరూపం



ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో దేశ రాజధాని ఢిల్లీలో యమునా నది మరోసారి ఉగ్ర రూపం దాల్చింది. ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహిస్తోంది. నీటి మట్టం 206.7 మీటర్లకు చేరుకుందని కేంద్ర జల సంఘం తెలిపింది. ఇది మరింత పెరిగే ప్రమాదమున్నందున.. వరదబాధితులు సహాయక శిబిరాల్లోనే మరికొన్ని రోజులు గడపాల్సి ఉంటుందని అధికారులు అన్నారు.

- 6లో

30న పీఎస్ఎల్వీ సీ56 ప్రయోగం

నాలుగు దశల రాకెట్ అనుసంధానం పనులు పూర్తి

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఈనెల 30న ఉదయం 6.30 గంటలకు సతీష్ ధవన్ స్పేస్ సెంటర్–షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ సీ56 ప్రయోగాన్ని చేపట్టేందుకు ఆదివారం నాలుగు దశల రాకెట్ అనుసంధానం పనులు పూర్తి చేశారు. పీఎస్ఎల్వీ ఇంటిగ్రేషన్ బిల్డింగ్‌లో అనుసంధానం పనులు పూర్తి చేసి ఎంఎస్టీకి తరలించారు. ఇస్రోలో అంతర్భాగంగా ఉన్న న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ వాణిజ్య ఒప్పందం మేరకు ఈ ప్రయోగాన్ని చేపడుతున్నారు. ఈ ప్రయోగంలో సింగపూర్‌కు చెందిన 422 కిలోల బరువు కలిగిన ఏడు ఉపగ్రహాలను రోదసిలోకి పంపనున్నారు. షార్ నుంచి చేసిన ప్రయోగాల్లో ఇది 91వది కాగా, పీఎస్ఎల్వీ సిరీస్‌లో 58వది, కోర్ అలోన్ దశలో ఇది 16వ ప్రయోగం, పూర్తి స్థాయి వాణిజ్యపరమైన ప్రయోగాల్లో ఇది ఆరో ప్రయోగం కావడం విశేషం.

‘ఉపాధి’లో ఏపీ ఫస్ట్

▶ మొదటి పేజీ తరువాయి

పని దినాల లక్ష్యం పూర్తయినా.. అదనపు పనుల కేటాయించాలని కోరుతూ కేంద్రానికి సమాచారం తెలియజేసి, ఆ తర్వాత పని కావాల్సిన వారికి పనులు కల్పిస్తూ వస్తోంది. శనివారం (జూలై 22వ తేదీ) నాటికి గ్రామీణ ప్రాంతాల్లో 42.27 లక్షల కుటుంబాలు 18.47 కోట్ల పని దినాలను పూర్తి చేసుకుని లబ్ధి పొందినట్టు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు వెల్లడించారు.

దేశంలో ఏ రాష్ట్రం కల్పించలేని స్థాయిలో..

దేశవ్యాప్తంగా మొత్తం 34 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం పనులు కొనసాగుతుండగా... అత్యధికంగా పనుల కల్పనలో మన రాష్ట్రమే దేశంలో మొదటి స్థానంలో నిలిచింది. మన రాష్ట్రం తర్వాత తమిళనాడు, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ వరుసగా రెండు, మూడు, నాలుగు స్థానాల్లో కొనసాగుతున్నాయి. ప్రస్తుత కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ గణాంకాల ప్రకారం.. మన రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో 69.26 లక్షల కుటుంబాలకు ఉపాధి హామీ పథకం కార్డులు ఉండగా, అందులో 56.76 లక్షల కుటుంబాలు గత మూడేళ్లలో అవసరమైన రోజు ఉపాధి హామీ పథకంలో పనులు చేసుకొని లబ్ధి పొందినట్టు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ పేర్కొంది. గత వంద రోజులలో మన రాష్ట్రంలో మొత్తం 74,092 మంది దివ్యాంగులు కూడా ఉపాధి హామీ పథకం పనులకు హాజరై లబ్ధి పొందారని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ గణాంకాలు పేర్కొంటున్నాయి.

సులభంగా.. శరవేగంగా



ఆస్తుల రిజిస్ట్రేషన్ సులభతరం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

- ‘కార్డ్ ప్రైమ్’ ద్వారా అత్యంత ఆధునికంగా రిజిస్ట్రేషన్లు
- డాక్యుమెంట్లను వినియోగదారులే ఆన్‌లైన్‌లో తయారు చేసుకోవచ్చు
- స్టాంప్‌డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు ఆన్‌లైన్‌లో కట్టేయొచ్చు
- డాక్యుమెంట్ తయారు చేసేటప్పుడే టైమ్ స్లాట్ బుకింగ్
- రిజిస్ట్రేషన్‌తో పాటే సబ్ డివిజన్, ఆటోమ్యుటేషన్
- స్టాంపు పేపర్ల అవసరం ఉండదు.. సంతకం పెట్టాల్సిన పనిలేదు
- ఆధార్ ఈ సైన్ ద్వారానే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి

సాక్షి, అమరావతి : ఇది టెక్నాలజీ యుగం. అన్ని పనులు ఆన్‌లైన్‌లోనే, అరచేతిలోనే నిమిషాల్లో అయిపోతున్నాయి. ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదు. వేచి ఉండాల్సిన అవసరం అంతకన్నా లేదు. ఇకపై ఆస్తుల రిజిస్ట్రేషన్లు కూడా ఆన్‌లైన్‌లోనే చేసుకోవచ్చు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖను రాష్ట్ర ప్రభుత్వం టెక్నాలజీ వైపు నడిపిస్తోంది. కంప్యూటర్ ఎయిడెడ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ డిపార్టుమెంట్ (కార్డ్)ను ఆధునీకరించి కార్డ్ 2.0కు రూపకల్పన చేస్తోంది. ‘కార్డ్ ప్రైమ్’ పేరుతో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందిస్తోంది. దీని ద్వారా స్టాంపు పేపర్లు, సంతకాలతో పనిలేకుండా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. డాక్యుమెంట్‌ను ఎవరికివారే ఆన్‌లైన్‌లో తయారు చేసుకుని, ఆన్‌లైన్‌లోనే చలానా (స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు) కట్టి, ఒక టైం స్లాట్‌ను (అపాయింట్‌మెంట్) బుక్ చేసుకుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, లేదా గ్రామ, వార్డు సచివాలయానికి వెళితే అక్కడ వెంటనే రిజిస్ట్రేషన్ పూర్తి చేసే విధానం త్వరలో అందుబాటులోకి రానుంది.

కొత్త విధానంలో సులభంగా రిజిస్ట్రేషన్లు

ప్రస్తుత విధానంలో డాక్యుమెంట్ తయారీ, చలానా కట్టడం వంటివన్నీ రిజిస్ట్రేషన్ల శాఖతో సంబంధం లేకుండా బయట జరుగుతున్నాయి. వీటిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇస్తే అక్కడ రిజిస్ట్రేషన్ చేస్తారు. ఇదో పెద్ద ప్రహసనం. కార్డ్ ప్రైమ్ విధానంలో చాలా తక్కువ సమయంలో సులభంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. కేవలం బయోమెట్రిక్ ద్వారా వేలిముద్ర వేయడానికి 5 నుంచి 10 నిమిషాలు ఉంటే సరిపోతుందని అధికారులు చెబుతున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం బయట జరిగే పనిని సులభంగా ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చు. దీన్ని పబ్లిక్ డేటా ఎంట్రీ ఇంటిగ్రేషన్ అంటారు. అంటే వినియోగదారులే ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్ తయారు చేసుకోవచ్చు. ఆస్తి వివరాలు, పేరు, ఆధార్, సాక్షులు వంటి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో ఎంటర్ చేస్తే వెంటనే ఆస్తి మార్కెట్ విలువ, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, యూజర్ ఛార్జీలు ఎంత కట్టాలో చూపిస్తుంది. ఆ సొమ్మును ఆన్‌లైన్‌లో చెల్లించొచ్చు. ఆఫ్‌లైన్, స్టాక్‌హోల్డింగ్ ద్వారా కూడా చలానా కట్టొచ్చు. అనంతరం రిజిస్ట్రేషన్‌కి టైమ్ స్లాట్ బుక్ చేసుకోవాలి. ఆ సమయానికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం లేదా గ్రామ/వార్డు సచివాలయానికి వెళితే అక్కడ అప్లికేషన్‌లో నమోదు చేసిన ఆధార్ వివరాలను సరి చూస్తారు. బయోమెట్రిక్ ద్వారా వినియోగదారుని వేలిముద్ర తీసుకుంటారు.

రిజిస్ట్రేషన్‌తోపాటే సబ్ డివిజన్, మ్యుటేషన్

ఇదంతా అయిన తర్వాత ఆ ఆస్తిని సబ్ డివిజన్ చేయాల్సి వస్తే వెంటనే చేస్తారు. పాత విధానంలో రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక దాన్ని రెవెన్యూ శాఖలో సబ్ డివిజన్ చేయించడం ఓ పెద్ద ప్రహసనం. కార్డ్ ప్రైమ్‌లో రిజిస్ట్రేషన్ సమయంలోనే సబ్ డివిజన్ (అవసరమైతే) పూర్తవుతుంది. వ్యవసాయ భూములైతే మ్యుటేషన్ కూడా ఆటోమేటిక్‌గా జరిగిపోతుంది. దానికోసం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం ఉండదు. రెవెన్యూ రికార్డుల్లో పేరు కూడా వెంటనే మారిపోతుంది. ఇందుకోసం కార్డ్ 2.0ని రెవెన్యూ శాఖ వెబ్‌ల్యాండ్ సాఫ్ట్‌వేర్‌కి అనుసంధానం చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ను ప్రింట్ తీసి ఇస్తారు. గతంలో మాదిరిగా స్టాంప్ పేపర్ల అవసరం ఉండదు. వినియోగదారుడు కోరుకొంటే స్టాంప్ పేపర్లపై ప్రింట్ ఇస్తారు. ఈ విధానంలో వినియోగదారుడు ఎక్కడా సంతకం పెట్టాల్సిన అవసరం ఉండదు. ఈ–సైన్‌తోనే పని పూర్తవుతుంది.

సులభం.. పారదర్శకం..

కార్డ్ ప్రైమ్ ద్వారా రిజిస్ట్రేషన్ల విధానం మరింత సులభమవుతుంది. మొత్తం ప్రక్రియ ఆన్‌లైన్‌లోనే పూర్తవుతుంది. రిజిస్ట్రేషన్లు చాలా తక్కువ సమయంలో సులభంగా, పారదర్శకంగా జరుగుతాయి. అవకతవకలకు ఆస్కారం ఉండదు. ప్రభుత్వ అనుమతితో త్వరలో దీన్ని అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాం.

– వి రామకృష్ణ, కమిషనర్ అండ్ ఐజీ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ

నేడు సీఆర్‌డీఏలో పేదల ఇళ్లకు శ్రీకారం

▶ మొదటి పేజీ తరువాయి

కృతనిశ్చయంతో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. ఎల్లో ముఠా కుట్రపూరితంగా సృష్టించిన అడ్డంకులను అధిగమించి సీఆర్‌డీఏ పరిధిలో 1,402.58 ఎకరాలు, 25 లేఅవుట్‌లలో 50,793 మంది పేద అక్కచెల్లెమ్మలకు ఈ ఏడాది మే 26న ఉచితంగా ఇళ్ల పట్టాలు అందించిన విషయం తెలిసిందే. ఒక్కో ప్లాట్ రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల విలువ చేసే రూ.1,371.41 కోట్ల ఖరీదైన భూమిని పేదలకు ఉచితంగా పంపిణీ చేయడమే కాక.. ఆయా లేఅవుట్‌లలో రూ.384.42 కోట్లతో మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించనుంది. అలాగే.. విద్య, ఆరోగ్య సేవలు అందించేందుకు రూ.73.74 కోట్లతో 11 అంగన్‌వాడీ కేంద్రాలు, 11 పాఠశాలలు, 11 డిజిటల్ లైబ్రరీలు, 12 ఆస్పత్రుల నిర్మాణం కూడా చేపట్టనుంది. లేఅవుట్ల పరిధిలో పచ్చదనాన్ని పెంపొందించి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటుచేసేందుకు రెండు దశల్లో రూ.168 లక్షలతో 28,000 మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోనున్నారు.

ఒకొక్కరికి రూ.15లక్షల వరకు ఆస్తి..

ఇలా ఇళ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాల ఏర్పాటుతో ఒక్కో పేద అక్కచెల్లెమ్మ చేతుల్లో దాదాపు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలకు పైగా విలువైన స్థిరాస్తిని పెట్టబోతోంది. ఈ లెక్కన ఏపీ గృహ నిర్మాణ సంస్థ ద్వారా సీఆర్‌డీఏలోని ఈడబ్ల్యూఎస్ లేఅవుట్లలో రూ.1,829.57 కోట్ల వ్యయంతో పేదలకు పక్కా గృహాలను సమకూరుస్తోంది.

మహిళా సాధికారతే లక్ష్యంగా..

సీఎం జగన్ ప్రభుత్వం తొలి నుంచి మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ వస్తోంది. మహిళలు తమంతట తాము నిలదొక్కుకునేలా వివిధ పథకాలు, కార్యక్రమాలను అమలుచేస్తోంది. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం కింద మహిళల పేరిట స్థలాలు, ఇళ్లు అందిస్తోంది. దేశంలో ఎక్కడాలేని విధంగా 71,811 ఎకరాల్లో 30.65 లక్షల మంది అక్కచెల్లెమ్మల పేరిట ఉచితంగా రూ.76,625 కోట్ల మార్కెట్ విలువైన భూములను పంపిణీ చేశారు. వైఎస్సార్, జగనన్న కాలనీల రూపంలో 17వేలకు పైగా ఊళ్లనే నిర్మిస్తున్నారు. పంపిణీ చేసిన స్థలాల్లో ఇప్పటికే రూ.57,375 కోట్ల వ్యయంతో 21.25 లక్షల ఇళ్ల నిర్మాణం కొనసాగుతోంది. కాలనీల్లో రూ.32,909 కోట్లతో నీటి సరఫరా, విద్యుత్, ఇంటర్‌నెట్, డ్రైనేజీ, రోడ్లు వంటి మౌలిక వసతులను కల్పిస్తున్నారు.

రూ.లక్షల కోట్ల సంపద సృష్టి

ప్రతి పేద అక్కచెల్లెమ్మకు ఇంటి స్థలం, ఇల్లు సమకూర్చడం ద్వారా రూ.2 లక్షల కోట్ల నుంచి రూ.3 లక్షల కోట్ల సంపదను ప్రభుత్వం సృష్టిస్తోంది. ఇంటి స్థలం ఉచితంగా ఇచ్చి.. ఇంటి నిర్మాణానికి యూనిట్‌కు రూ.1.80 లక్షల చొప్పున అందిస్తోంది. పావలా వడ్డీకి రూ.35 వేలు చొప్పున బ్యాంకు రుణం సమకూరుస్తోంది. ఉచితంగా ఇసుక ఇవ్వడం ద్వారా రూ.15 వేలు, సిమెంట్, స్టీల్, మెటల్ ఫ్రేమ్స్ ఇంకా ఇతర నిర్మాణ సామాగ్రిని సబ్సిడీపై అందించడంతో మరో రూ.40 వేల మేర లబ్ధి చేకూరుస్తోంది.

అమరావతిలో ఇళ్ల నిర్మాణం.. సీఎం సంకల్పానికి తార్కాణం

- చారిత్రాత్మక ఘట్టానికి ఇది నాంది
- ఇళ్ల పట్టాలిచ్చాం.. ఇళ్లు కట్టించి తీరుతాం
- చంద్రబాబు కడుపుమంటతో రగలిపోతున్నాడు
- మంత్రులు జోగి రమేష్, విడదల రజిని, ఆదిమూలపు సురేష్, ఎంపీ నందిగం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు, ఎమ్మెల్సీ

మంగళగిరి/సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లు కట్టడం ఒక ఎత్తయితే.. అమరావతి రాజధానిలో అది మరొక ఎత్తని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృఢ సంకల్పానికి ఇది తార్కాణమని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, ఎంపీ నందిగం సురేష్ అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కృష్ణాయపాలెంలోని జగనన్న లేఅవుట్‌లో ‘నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు’ పథకం ద్వారా నిర్మిస్తున్న గృహాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్న ప్రాంతాన్ని ఆదివారం వారు సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఆర్‌డీఏ పరిధి అమరావతి రాజధానిలో పేద, బడుగు, బలహీనవర్గాలు ఉండటానికి వీల్లేదని.. సామాజిక సమతుల్యత దెబ్బతింటుందని చంద్రబాబు, ఆయన సామాజికవర్గం మాత్రమే ఇక్కడ నివసించాలని కుట్రతో కోర్టులకు వెళ్లి అడ్డుకునే ప్రయత్నం చేశారన్నారు. అయినా.. ముఖ్యమంత్రి పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు 50 వేలకు పైగా ఇళ్ల పట్టాలను ఇవ్వడమే కాక అక్కడ ఇళ్లను సైతం నిర్మించి ఇచ్చేందుకు చేస్తున్న కృషి ఆయన దృఢ సంకల్పానికి నిదర్శనమని మంత్రులు కొనియాడారు. ఇక్కడ ఇళ్ల నిర్మాణం జరగదని, పేదలకు ఇళ్లు రావని టీడీపీతో పాటు ఆయన తోక పార్టీలు చెప్పినా, ఎన్ని కుట్రలు చేసినా పేదలకు ఇళ్లు కట్టించి ఇచ్చి తీరుతున్నామన్నారు. ఇది రాష్ట్రంలో చారిత్రక ఘట్టమని, రాష్ట్ర ప్రజలంతా పండుగ చేసుకుంటుంటే చంద్రబాబు మాత్రం కడుపుమంటతో రగలిపోతున్నాడన్నారు.

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఇళ్లు..

ఇక అమరావతిలో ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజతో పాటు సామాజిక మౌలిక వసతులకు సంబంధించి అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, డిజిటల్ లైబ్రరీ, ఈ–హెల్త్ సెంటర్ల భవన నిర్మాణాలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని మంత్రులు తెలిపారు. గ్రీన్ సోషల్ ఫారెస్ట్‌లో భాగంగా లేఅవుట్‌లో అభివృద్ధి చేసిన చెరువు వద్ద, ఇతర ప్రాంతాల్లో 30వేల మొక్కలు నాటే కార్యక్రమం కూడా జరుగుతుందన్నారు. సీఆర్‌డీఏ పరిధిలోని 25 లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను అతి త్వరలోనే పూర్తిచేసేందుకు అత్యంత నాణ్యతా ప్రమాణాలతో, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానమైన షీర్‌వాల్ టెక్నాలజీతో ఇళ్లను శరవేగంగా నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారన్నారు. సీఆర్‌డీఏ పరిధిలో దాదాపు 35వేల ఇళ్లను ఈ టెక్నాలజీతో నిర్మిస్తారని వారు చెప్పారు. ఇక్కడ ప్రతి ఇంటికీ నీరు, విద్యుత్ సౌకర్యంతో పాటు పూర్తిస్థాయిలో రహదారులు, డ్రైనేజి వ్యవస్థలను ఏర్పాటుచేసి గేటెడ్ కమ్యూనిటీ లేఅవుట్లుగా ఆరు నెలల్లో తీర్చిదిద్దుతామన్నారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్, జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ఎండీ లక్ష్మీశా తదితరులు పాల్గొన్నారు.

పల్లె చెంతకు వైద్యం

వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌తో ఆరోగ్య భరోసా ■ ఇప్పటివరకు 7.12 కోట్ల ఓపీలు నమోదు

ఇంటి పక్కనే నిశ్చింతగా..



■ ఉయ్యూరు మండలం బోళ్లపాడుకు చెందిన వి.శ్రీదేవి కొన్నేళ్లుగా బీపీ, గ్యాస్ సమస్యతో బాధపడుతోంది. 1,624 మంది జనాభా నివసించే గ్రామంలో విలేజ్ క్లినిక్ ఏర్పాటు కావడంతో శ్రీదేవి రెండున్నరేళ్లుగా అక్కడే వైద్యం, మందులు ఉచితంగా అందుకుంటోంది. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో) బీపీ, షుగర్ పరీక్షలు చేసిన తరువాత టెలీ మెడిసిన్ ద్వారా స్పెషలిస్ట్ వైద్యుడితో ఆన్‌లైన్‌లో మాట్లాడుతోంది. ఫ్యామిలీ డాక్టర్ ద్వారా కాటూరు పీహెచ్ డాక్టర్ నెలకు రెండు సార్లు విలేజ్ క్లినిక్‌కు వస్తున్నారు. శ్రీదేవి ఆరోగ్యంపై ఆరా తీస్తూ ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నారు. ‘గతంలో హెల్త్ చెకప్, మందుల కోసం వెళ్లాలంటే ఓ ప్రహసనమే. కుటుంబ సభ్యుల్లో ఎవరో కచ్చితంగా తోడుండాల్సిందే. ఇప్పుడా సమస్య లేదు. మా ఇంటి పక్కనే విలేజ్ క్లినిక్ ఉంది. ఏ చిన్న ఆరోగ్య సమస్య తలెత్తినా ఇక భయం లేదు’ అని శ్రీదేవి నిశ్చింతగా చెబుతోంది.

(వడ్డే బాలశేఖర్ – వణుకూరు, బోళ్లపాడు గ్రామాల నుంచి సాక్షి ప్రతినిధి)

రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో నెలకొల్పిన పది వేలకుపైగా వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల ద్వారా వైద్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం రోగుల చెంతకే చేర్చింది. పల్లె పల్లెకు ఆరోగ్య భరోసా కల్పిస్తోంది. చాపకింద నీరులా గ్రామాల్లోనూ విస్తరిస్తున్న జీవన శైలి జబ్బులను ప్రాథమిక దశలోనే గుర్తించి అరికట్టే లక్ష్యంతో విలేజ్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను తీసుకొచ్చింది. ఒక్కో పీహెచ్‌సీకి ఇద్దరు చొప్పున మండలానికి నలుగురు డాక్టర్లను నియమించి గ్రామీణ వైద్య వ్యవస్థను బలోపేతం చేసింది. జీవన శైలి వ్యాధులను ఆదిలోనే గుర్తించడం ద్వారా ప్రాణాంతకం కాకుండా నివారించవచ్చు. రక్తపోటు లాంటి వాటికి సకాలంలో చికిత్స చేయకుంటే నరాల జబ్బులు, కార్డియాక్ అరెస్టు, పక్షవాతం బారిన పడే ప్రమాదం ఉంది. డయాబెటిస్‌కు సరైన సమయంలో చికిత్స చేయకుంటే కిడ్నీ సమస్యలకు దారి తీస్తుంది. గ్రామీణులకు సొంతూరిలోనే మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉంటే ఇలాంటి వాటిని నియంత్రించడం సులభం అవుతుంది. ఇప్పుడు వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థలు సరిగ్గా అదే పని చేస్తున్నాయి. ఫ్యామిలీ డాక్టర్ క్రమం తప్పకుండా గ్రామాలను సందర్శించడంతో స్థానికులతో మంచి అనుబంధం ఏర్పడుతోంది. అందరినీ గుర్తు పట్టి పేరుతో పిలిచేంత సన్నిహితంగా మసలుకుంటున్నారు. వారు సూచించిన విధంగా ఆహార అలవాట్లను మార్చుకోవడం, తగిన వ్యాయామాల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. ఇక స్పెషలిస్టు డాక్టర్ల వైద్య సేవలు పొందాలంటే గతంలో ఎన్నో వ్యయ ప్రయాసలను అధిగమించాల్సి వచ్చేది. దూరాభారం కావడం వల్ల కుటుంబ సభ్యులు ఎవరో ఒకరు తోడుగా రావాల్సిందే! ఇప్పుడా కష్టాలు లేవు. టెలీమెడిసిన్ ద్వారా గైనకాలజీ, పీడియాట్రిక్స్ లాంటి స్పెషలిస్ట్ డాక్టర్ల సేవలను సైతం గ్రామంలోని క్లినిక్స్ నుంచే పొందగలుగుతున్నారు.



వారి సూచనల మేరకు మందులను సైతం ఉచితంగానే ఇస్తున్నారు. ఈ–సంజీవని ఓపీ యాప్ ద్వారా కూడా స్మార్ట్ ఫోన్లు ఉన్న ప్రతి ఒక్కరు టెలీమెడిసిన్ సేవలను పొందవచ్చు. స్మార్ట్ ఫోన్‌ను వినియోగించడం రానివారు, విలేజ్ క్లినిక్ వరకూ వెళ్లలేని వృద్ధులు, వికలాంగులు, మంచానికే పరిమితం అయిన వారికి ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు ఇంటి వద్దకే వెళ్లి మొబైల్ ద్వారా టెలీమెడిసిన్ సేవలను అందిస్తున్నారు. టెలిమెడిసిన్ ద్వారా వృద్ధులు, మహిళలకు సేవలందించడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచినట్లు కేంద్ర ప్రభుత్వం తాజాగా పార్లమెంట్‌లో ప్రకటించడం గమనార్హం. కృష్ణా జిల్లా వణుకూరు, బోళ్లపాడు గ్రామాల్లో పర్యటించిన ‘సాక్షి’ ప్రతినిధి వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్ ద్వారా అందుతున్న సేవలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. వణుకూరు విలేజ్ క్లినిక్–2 పరిధిలో 3,412 జనాభా ఉండగా 148 మంది బీపీ, 152 మంది షుగర్ బాధితులు ప్రయోజనం పొందుతున్నారు. ఈ రెండు సమస్యలున్న బాధితులు 70 మంది ఉన్నారు. గర్భిణులు 18 మంది, బాలింతలు 10 మందికి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహిస్తూ మందులు అందిస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ రవికుమార్ గ్రామానికి వస్తున్నారు. మంచానికే పరిమితం అయిన 12 మంది బాధితులకు ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. బోళ్లపాడులో 1,600 మందికిపైగా వైద్య సేవలు అందుతున్నాయి.

12 రకాల వైద్య సేవలు.. 14 పరీక్షలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామీణ ప్రజలకు మెరుగైన ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా 2,500 జనాభాకు ఒకటి చొప్పున 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను నెలకొల్పింది. వీటిల్లో వైద్య సేవలు అందించేందుకు బీఎస్సీ నర్సింగ్ అర్హత కలిగిన మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ల (ఎంఎల్‌హెచ్‌పీ) నియామకం చేపట్టి సీహెచ్‌వో హోదా కల్పించింది. వీరితో పాటు సచివాలయాల ఏఎన్ఎం, ఆశా వర్కర్లు విలేజ్ క్లినిక్‌లలో సేవలు అందిస్తున్నారు. క్లినిక్‌లలో 12 రకాల వైద్య సేవలు, 14 రకాల వైద్య పరీక్షలు, 105 రకాల మందులు అందుబాటులో ఉంటున్నాయి. విలేజ్ క్లినిక్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.1,692 కోట్లు వెచ్చించింది. ప్రతి విలేజ్ క్లినిక్‌కు శాశ్వత భవనాలను సమకూర్చారు.

గ్రామ స్థాయిలో పటిష్ట వ్యవస్థ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం అమలులో విలేజ్ క్లినిక్‌లే కేంద్ర బిందువులుగా ఉంటున్నాయి. విలేజ్ క్లినిక్ యూనిట్‌గా ప్రతి గ్రామాన్ని పీహెచ్‌సీ వైద్యులు నెలలో రెండు సార్లు సందర్శిస్తున్నారు. విలేజ్ క్లినిక్‌లోనే ఫ్యామిలీ డాక్టర్ క్లినిక్‌లు నిర్వహిస్తున్నారు. 10,032 విలేజ్ క్లినిక్స్‌ను ఇప్పటివరకూ 2.05 లక్షల సార్లు వైద్యులు సందర్శించారు. 1.70 కోట్లకు పైగా సేవలు ఫ్యామిలీ డాక్టర్ విధానంలో నమోదు అయ్యాయి. గ్రామ స్థాయిలోనే వైద్య సేవల కల్పనకు ఇంత పటిష్టమైన వ్యవస్థ ఉండటంతో చాలా వరకు ఆరోగ్య సమస్యలకు గ్రామాల్లోనే పరిష్కారం లభిస్తోంది. బీపీ, షుగర్, ఇతర జీవన శైలి జబ్బులను ప్రాథమిక దశలోనే గుర్తించగలుగుతున్నారు.

వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్ సేవలు ఇలా

- గర్భిణులు, చిన్నారుల సంరక్షణ
- నవజాత శిశువుల ఆరోగ్య సంరక్షణ
- బాల్యం, కౌమార దశ ఆరోగ్య సేవలు
- కుటుంబ నియంత్రణ, గర్భ నిరోధక సేవలు, పునరుత్పత్తి ఆరోగ్య సంరక్షణ సేవలు
- జీవన శైలి జబ్బుల స్క్రీనింగ్, నివారణ, నియంత్రణ, నిర్వహణ
- అంటువ్యాధుల నిర్వహణ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు
- సాధారణ అనారోగ్యాలు, చిన్న జబ్బులకు జనరల్ అవుట్ పేషెంట్ కేర్
- ఆప్తాల్మిక్ (కంటి సమస్యలు), ఈఎన్‌టీ సమస్యలపై జాగ్రత్తలు
- దంత ఆరోగ్య సంరక్షణ
- వృద్ధాప్య వ్యాధులకు చికిత్స, ఉపశమన ఆరోగ్య సంరక్షణ సేవలు
- కాలిన గాయాలు, ప్రమాదాల్లో గాయపడిన (ట్రామా) వారికి అత్యవసర వైద్య సేవలు
- మానసిక ఆరోగ్య వ్యాధుల స్క్రీనింగ్, ప్రాథమిక నిర్వహణ, అనారోగ్య సమస్యలను జయించడం, మానసిక ప్రశాంతత కోసం రోగులకు యోగాపై అవగాహన

7.12 కోట్ల ఓపీలు నమోదు

2020లో రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ విలేజ్ క్లినిక్ సేవలను ప్రారంభించారు. ఇప్పటివరకూ 7,12,08,533 ఓపీ సేవలు నమోదు అయ్యాయి. వివిధ సమస్యలతో క్లినిక్స్‌కు వచ్చిన బాధితులకు డాక్టర్ సలహాల కోసం 3 కోట్ల టెలీ కన్సల్టేషన్లు నిర్వహించారు. ప్రస్తుతం ఒక్కో క్లినిక్‌లో రోజుకు సగటున 30 నుంచి 40 వరకూ ఓపీలు, 10 వైద్య పరీక్షలు, 10 టెలీ కన్సల్టేషన్లు నమోదవుతున్నాయి.

2020 నుంచి వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లలో నమోదైన ఓపీ సేవలు

జిల్లా	కన్సల్టేషన్లు
అల్లూరి సీతారామరాజు	24,02,327
అనకాపల్లి	24,49,715
అనంతపురం	31,06,400
అన్నమయ్య	33,39,612
బాపట్ల	25,07,084
చిత్తూరు	40,34,055
తూర్పు గోదావరి	21,80,521
ఏలూరు	36,99,158
గుంటూరు	19,24,872
కాకినాడ	26,71,537
బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	21,82,912
కృష్ణా	26,22,434
కర్నూలు	30,86,293
నంద్యాల	28,43,959
ఎన్టీఆర్	18,86,355
పల్నాడు	34,44,346
పార్వతీపురం మన్యం	19,16,108
ప్రకాశం	42,94,899
ఎస్పీఎస్ఆర్ నెల్లూరు	32,69,574
శ్రీసత్యసాయి	27,02,886
శ్రీకాకుళం	30,30,401
తిరుపతి	31,99,561
విశాఖపట్నం	3,44,372
విజయనగరం	28,50,813
పశ్చిమ గోదావరి	20,19,713
వైఎస్సార్	31,98,626
మొత్తం	7,12,08,533

గ్రామాల్లో విలేజ్ క్లినిక్స్‌కు సంబంధించిన వివరాలు జిల్లా పేజీల్లో

కుటుంబమంతా.. గ్రామంలోనే వైద్యం



గతంలో వైద్యం కోసం చాలా ఇబ్బందులు పడ్డాం. జలుబు, జ్వరం లాంటి చిన్న సమస్యలకు ఐదు కిలోమీటర్లు ప్రయాణించి కాటూరు, ఉయ్యూరు వెళ్లాల్సి వచ్చేది. అంత దూరం వెళ్లలేక ఆర్ఎంపీలపై ఆధారపడేవాళ్లం. ఇప్పుడు గ్రామంలో విలేజ్ క్లినిక్ ఏర్పాటైంది. ప్రతి నెల ఒకటో శుక్రవారం, మూడో శనివారం పీహెచ్‌సీ డాక్టరమ్మ మా ఊరికే వస్తోంది. నాకు బీపీ, గ్యాస్ సమస్య ఉంది. ఇంట్లో ఎవరికి ఏ చిన్న ఆరోగ్య సమస్య తలెత్తినా క్లినిక్‌కే వెళ్తున్నాం.

– వీర వెంకటేశ్వరరెడ్డి, బోళ్లపాడు, కృష్ణా జిల్లా

రోజంతా సరిపోయేది...



నాకు బీపీ, షుగర్ సమస్య ఉంది. గతంలో 15 రోజులకు ఒకసారి విజయవాడ ఆస్పత్రికి వెళ్లేదాన్ని. ఒక రోజంతా సరిపోయేది. ఇప్పుడు ఆ సమస్య లేదు. గ్రామంలోనే క్లినిక్‌కు రెండు వారాలకు ఒకసారి వెళ్తున్నా. అక్కడ ఇచ్చే మందులు బాగా పనిచేస్తున్నాయి.

– ఎం.రాణి, వణుకూరు, కృష్ణా జిల్లా

వ్యయప్రయాసలు తొలిగాయి



వయసు మళ్లడంతో ఆరోగ్య సమస్యల కారణంగా రెండు వారాలకు ఒకసారి విలేజ్ క్లినిక్‌కు వస్తుంటా. బీపీ, షుగర్ చెక్ చేయించుకుని దగ్గుకు మందులు తీసుకుంటున్నా. గతంలో పీహెచ్‌సీకి వెళ్లాలంటే ఆటో, బైక్‌లపై వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు గ్రామానికే పీహెచ్‌సీ డాక్టర్ వస్తున్నారు. గ్రామంలోనే విలేజ్ క్లినిక్ ఏర్పాటుతో వ్యయ ప్రయాసలు తొలిగాయి. అవసరమైతే కంప్యూటర్‌లో పెద్ద డాక్టర్‌తో మాట్లాడిస్తున్నారు.

– కె. మధు, వణుకూరు, కృష్ణా జిల్లా

రోజుకు 40 ఓపీలు



గ్రామస్తులకు ఏ చిన్న ఆరోగ్య సమస్య ఉన్నా ప్రస్తుతం విలేజ్ క్లినిక్‌కే వస్తున్నారు. ఇక్కడ రోజుకు 40 వరకూ ఓపీలు నమోదవుతుంటాయి. 30 ఏళ్లపైబడిన వారందరికీ జీవనశైలి జబ్బుల స్క్రీనింగ్ చేశాం. బీపీ, షుగర్ బాధితులను గుర్తించి వారికి ఫ్యామిలీ డాక్టర్ ద్వారా రెగ్యులర్ హెల్త్ చెకప్ జరిగేలా ప్రభుత్వం పర్యవేక్షిస్తుంది.

– యామిని, సీహెచ్‌వో వణుకూరు–2 వైఎస్సార్ విలేజ్ క్లినిక్, కృష్ణా జిల్లా

నైపుణ్యాలపై శిక్షణ..



ఇంజెక్షన్‌లు ఇవ్వడం, సెలైన్ ఎక్కించడం, కుట్లు వేయడం, కట్లు కట్టడం లాంటి ప్రాథమిక చికిత్స విధానాల్లోని నైపుణ్యాలపై మాకు ఇటీవలే శిక్షణ ఇచ్చారు. పీహెచ్‌సీ వైద్యుడి సూచన మేరకు సెలైన్, ఇంజెక్షన్లు చేయడం లాంటి విధులను నేను ప్రధానంగా నిర్వహిస్తున్నా.

– శివకృష్ణ, సీహెచ్‌వో బోళ్లపాడు వైఎస్సార్ విలేజ్ క్లినిక్, కృష్ణా జిల్లా

సీహెచ్‌వోలకు ప్రత్యేక శిక్షణ



గ్రామ స్థాయిలోనే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న సీఎం వైఎస్ జగన్ లక్ష్యానికి అనుగుణంగా వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అమలులోకి వచ్చాయి. సీహెచ్‌వోల్లో నైపుణ్యాల పెంపు ద్వారా ప్రజలకు మరింత మెరుగ్గా వైద్య సంరక్షణ అందించాలని సీఎం ఆదేశించారు. ప్రత్యేక కరిక్యులమ్‌ను రూపొందించి వారికి శిక్షణ ఇచ్చాం. ఇంజెక్షన్ చేయడం, కుట్లు వేయడం, సెలైన్ ఎక్కించడం, పాము కాట్లు, గుండె పోటు సందర్భాల్లో అందించాల్సిన ప్రాథమిక చికిత్సపై అవగాహన కల్పించాం. జబ్బులు రాకముందే నివారించడం ఎంతో కీలకం. ప్రపంచాన్ని వేధిస్తున్న జీవన శైలి జబ్బులతోపాటు ఇతర రుగ్మతలను నివారించడంలో విలేజ్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ విధానం ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి.

– ఎం.టి. కృష్ణబాబు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, వైద్య ఆరోగ్య శాఖ

క్లుప్తంగా...

ప్రైవేటీకరణ ఆపకపోతే నిరవధిక సమ్మె

ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ హెచ్చరిక



అభివాదం చేస్తున్న నాయకులు

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): బ్యాంక్‌లను ప్రైవేటీకరణ చేయాలని కేంద్రం చేస్తున్న ప్రయత్నాలను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యదర్శి బీఎస్ రాంబాబు తెలిపారు. కెనరా బ్యాంక్ వర్క్‌మెన్ ఎంప్లాయీస్ యూనియన్ (సీబీడబ్ల్యూఈయూ) ఏపీ కమిటీ 16వ రాష్ట్ర సదస్సు విజయవాడ ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్‌లో ఆదివారం జరిగింది. రాంబాబు ప్రసంగిస్తూ బ్యాంక్‌ల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం ఉపసంహరించుకోకపోతే తాము నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. సీబీడబ్ల్యూఈయూ అధ్యక్షుడు జీపీ శర్మ, జనరల్ సెక్రటరీ సురేష్‌కుమార్, కెనరా బ్యాంకు విజయవాడ సర్కిల్ జనరల్ మేనేజర్ రవివర్మ, సీబీడబ్ల్యూఈయూ రాష్ట్ర అధ్యక్షుడు సి.శ్రీనివాసులు రెడ్డి, అసోసియేషన్ సభ్యులు పుష్కరేంద్రబాబు, బొమ్మదేవర వడయార్లు, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ఆలయాల జీర్ణోద్ధరణకు విశేష కృషి

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అర్చకుల జీతభత్యాలు సకాలంలో చెల్లిస్తూ, హిందూ ఆలయాల్లో ధూపదీప నైవేద్యాల కోసం ప్రత్యేక నిధులు విడుదల చేస్తూ ఆలయాల జీర్ణోద్ధరణకు ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. ఏలూరులో ఆదివారం ఏలూరు త్రిశక్తి జ్యోతిర్నిలయం పంచాంగకర్త వి.భరద్వాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ పంచాంగకర్తల సమాఖ్య ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. హిందూ మతంపై సీఎం జగన్‌కి అత్యంత భక్తి, అచంచల విశ్వాసం ఉన్నాయన్నారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, ఏపీ పంచాంగకర్తల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు బి.వీరభద్ర దైవజ్ఞ, కార్యదర్శి తెన్నేటి శ్రీనివాస శర్మ పాల్గొన్నారు.

జగనన్న సురక్షకు విశేష ఆదరణ:ఎమ్మెల్సీ ఇజ్రాయెల్



సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్ చరిత్రాత్మకంగా చేపట్టిన 'జగనన్న సురక్ష' ద్వారా ప్రజలకు అవసరమైన పథకాలు, సర్టిఫికెట్‌లకు సంబంధించిన ఏమైనా సమస్యలు ఉంటే వాటిని గుర్తించి పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రతి ఇంటికి వెళ్లి సమగ్ర సర్వేను నిర్వహిస్తోందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయెల్ తెలిపారు. ఆయన ఆదివారం తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 'జగనన్న సురక్ష'కు విశేష ఆదరణ లభిస్తోందన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 1,26,06,648 గృహాల్లో సర్వే పూర్తయిందని, 71,03,658 సర్టిఫికెట్లను ప్రజలకు అందించారని తెలిపారు.

రాజధాని పేరుతో చంద్రబాబు భూ దోపిడీ

బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్



ఏఎన్‌యూ (గుంటూరు): రాజధాని నిర్మాణం పేరుతో చంద్రబాబు భూ దోపిడీకి పాల్పడ్డారని భారతీయ చైతన్య యువజన (బీసీవై) పార్టీ అధ్యక్షుడు బి .రామచంద్ర యాదవ్ ఆరోపించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా ఉన్న స్థలంలో ఆదివారం జరిగిన ప్రజా సింహగర్జన సభలో మాట్లాడుతూ విజయవాడ, గుంటూరు ప్రాంతాలను హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల మాదిరిగా అభివృద్ధి చేసే అవకాశం ఉన్నా.. కేవలం తన వర్గానికి భూములు దోచిపెట్టడం కోసం తాత్కాలిక రాజధాని పేరుతో టీడీపీ ఈ రాష్ట్రాన్ని, ప్రజలను వంచించిందని ఆరోపించారు. సుదీర్ఘకాలం రాష్ట్రాన్ని పాలించిన టీడీపీ అన్ని వర్గాలకు తీరని అన్యాయం చేసిందన్నారు. సభలో అంబేడ్కర్ మనవడు ప్రకాశ్ యశ్వంత్ అంబేడ్కర్, బీపీ మండల్ మనువడు సూరజ్ మండల్ పాల్గొన్నారు.

టీడీపీని గెలిపిస్తే పొగాకు రైతుల సమస్యలు పరిష్కరిస్తాం




పొదిలి రూరల్: రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో తెలుగుదేశం పార్టీకి చెందిన ఎంపీలను గెలిపిస్తే పొగాకు రైతుల సమస్యలను పరిష్కరిస్తామని టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చెప్పారు. యువగళం పాదయాత్రలో భాగంగా లోకేశ్ ఆదివారం ప్రకాశం జిల్లా పొదిలి మండలం తలమళ్లలో పొగాకు రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. లోకేశ్ మాట్లాడుతూ పొగాకు బోర్డు కేంద్ర పరిధిలో ఉంటుందని, టీడీపీ ఎంపీలను గెలిపిస్తే సమస్య పరిష్కరిస్తామన్నారు. ప్రపంచానికి ఎగుమతి చేసే పంటలు పండిస్తే అధిక ఆదాయం పొందవచ్చని చెప్పారు.

పిల్లల భోజనంపైనా ఏడుపేనా?

పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనంలో మార్పులు కనబడటంలేదా రామోజీ?

పిల్లలకు పౌష్టికాహారం అందిస్తుంటే.. ఈనాడు జీర్ణించుకోలేకపోతోంది



సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న లక్షలాది మంది పేదింటి పిల్లలకు చదువు, పుస్తకాల నుంచి మధ్యాహ్నం పౌష్టికాహార భోజనం వరకు అన్ని వసతులు కల్పించడం కూడా రామోజీరావుకు తప్పుగానే కనిపిస్తోంది. పిల్లలు సంతృప్తిగా తినేలా రుచికరమైన ఆహారం అందిస్తుంటే ఆ అన్నంలో మట్టి కొట్టాలని చూస్తున్నారు. గత ప్రభుత్వంలో మధ్యాహ్న భోజనం పేరుతో నిధులు నొక్కేసి, ఎనిమిది తొమ్మిది నెలలకు కూడా బిల్లులు చెల్లించకపోయినా, నాసిరకం ఆహారం అందించినా ఈనాడు పత్రిక పట్టించుకున్న పాపానపోలేదు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న గోరుముద్ద' పేరుతో రోజుకో మెనూ, పిల్లల ఆరోగ్యం కోసం రాగిజావ, చిక్కీ అందిస్తున్నా, వాటికి అవసరమైన నిధులను ముందే విడుదల చేస్తున్నా.. ఈనాడుకు కంటగింపుగా మారింది. ప్రజలను తప్పుదోవ పట్టించేలా 'మాటల్లోనే మధ్యాహ్న భోజనం' అంటూ ఆధారాలు లేకుండా అడ్డగోలు రాతలు రాసింది. రాష్ట్ర ముఖ్యమంత్రే స్వయంగా 'జగనన్న గోరుముద్ద' పథకాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో ఒకటి నుంచి పదో తరగతి వరకు 44,392 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 37,63,698 మంది విద్యార్థుల పౌష్టికాహారం కోసం రూ. 1,689 కోట్లు కేటాయించారు. ఏజెన్సీలకు, వంటవారికి, సహాయకులకు ఏ నెలకు ఆ నెల చెల్లింపులు జరుగుతున్నాయి. అయినా అబద్ధపు రాతలకు ఈనాడు తెగబడింది.

అప్పటికీ.. ఇప్పటికీ ఎంతో తేడా

చంద్రబాబు హయాంలో 2019కి ముందు వారంలో ఎక్కువ రోజులు అన్నం, పప్పు లేదా నీళ్ల సాంబారుతోనే పిల్లలకు మధ్యాహ్న భోజనం సరిపెట్టేవారు. అది తినలేక పిల్లలు ఎంత ఇబ్బంది పడ్డా మెనూ మార్చిన పరిస్థితే లేదు. కానీ 2020లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యక్తిగతంగా గోరుముద్ద మెనూ రూపొందించి, పిల్లలకు పోషకాహారం అందించాలని ఆదేశించారు. పర్యవేక్షణకు ప్రత్యేక విభాగాన్నే పెట్టారు. విద్యార్థులందరికీ ఫోర్టిఫైడ్ సార్టెక్స్ బియ్యంతో అన్నం, వారంలో ఐదు రోజులు గుడ్డు, మూడురోజులు చిక్కీ అందిస్తున్నారు. విద్యార్థుల్లో పోషకాహార లోపం, రక్తహీనత వంటి సమస్యలను అధిగమించేందుకు రాగిజావను సైతం మెనూలో చేర్చి ఏరోజు ఏ వంటకం అందించాలో మెనూ ప్రకారం బడిలో పిల్లలకు పక్కాగా పెడుతున్నారు. స్కూళ్లల్లో పిల్లలకు రుచికరమైన పౌష్టికాహారం అందుతోంది. దీంతో విద్యార్థుల హాజరు శాతం కూడా పెరిగింది.

గోరుముద్దకు బడ్జెట్‌లో భారీగా కేటాయింపు

గత ప్రభుత్వ హయాంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ఏనాడు సకాలంలో డబ్బులు చెల్లించ లేదు. 2014–2018 వరకు బడుల్లో అసలు వంటపాత్రల సరఫరా లేదు. అసలు ఈ పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయింపే అరకొరగా ఉండేవి. 2014–2018 మధ్య పిల్లల భోజనానికి చేసిన సగటు వ్యయం కేవలం రూ. 450 కోట్లు మాత్రమే. ప్రస్తుతం ప్రభుత్వ హయాంలో ఇప్పటి వరకూ బడ్జెట్ కేటాయింపులు రూ. 7,244 కోట్లకు పైగా ఉన్నాయంటే పేద పిల్లల ఆహారం విషయంలో ప్రభుత్వం ఎంత ఉన్నతంగా ఆలోచిస్తోందో అర్థమవుతుంది. ఈ విషయం రాష్ట్ర ప్రజలకు తెలిసినా రామోజీకి మాత్రం తెలియనట్లు నటించడం విచారకరం. ఈ ఏడాది అన్ని పాఠశాలల్లో 37,63,698 మంది విద్యార్థులకు గ్లాసులు అందించారు. వంట పాత్రలు కొనుగోలు పూర్తి చేశారు. వీటిని సెప్టెంబర్ నెలాఖరులోగా అన్ని స్కూళ్లకు అందించనున్నారు. 2023–24లో బడ్జెట్‌లో రూ. 1,689 కోట్లు గోరుముద్ద కోసం ప్రభుత్వం కేటాయించింది. వంట ఖర్చు, అదనపు మెనూ, ఆహార ధాన్యాలు, రవాణాతో సహా మొత్తం ఖర్చు రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది.

వంట ఖర్చు పెంపు

గత ప్రభుత్వంలో 2014–18 మధ్య విద్యార్థుల వంట ఖర్చు రూ. 3.59 నుంచి రూ. 6.51 మధ్య మాత్రమే కేటాయించారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ ఖర్చును రూ. 8.57 పెంచి చెల్లిస్తోంది. నిబంధనల ప్రకారం పాఠశాలలకు మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్న కేంద్రీకృత కిచెన్ ఏజెన్సీలకు వంట ఖర్చు కూడా క్రమం తప్పకుండా ప్రభుత్వం చెల్లిస్తోంది. వంట చేసే కుక్/హెల్పర్స్ గౌరవ వేతనాన్ని సైతం క్రమం తప్పకుండా ప్రతి నెలా నేరుగా వారి ఖాతాల్లోనే జమచేస్తోంది. ఈ చెల్లింపులు జూన్ నెల వరకు పూర్తి చేశారు.

ప్రస్తుతం మెనూ ఇలా..

- సోమవారం: వేడి పొంగల్, ఉడికించిన గుడ్డు లేదా వెజిటబుల్ పులావ్, గుడ్డు కూర, చిక్కీ
- మంగళవారం: చింతపండు పులిహోర, దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు, రాగిజావ
- బుధవారం: వెజిటబుల్ అన్నం, ఆలూకుర్మా, ఉడికించిన గుడ్డు, చిక్కీ
- గురువారం: సాంబార్‌బాత్/నిమ్మకాయ పులిహోర, టమాటా పచ్చడి, ఉడికించిన గుడ్డు, రాగిజావ
- శుక్రవారం: అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ
- శనివారం: ఆకుకూరతో చేసిన అన్నం, పప్పుచారు, స్వీట్ పొంగల్, రాగిజావ

ఐదేళ్లలో గోరుముద్దకు బడ్జెట్ కేటాయింపు ఇలా (రూ.కోట్లలో)..

బడ్జెట్	కేటాయింపు
2019-20	979.48
2020-21	1,187.49
2021-22	1,840.05
2022-23	1,548.58
2023-24	1,689.00
మొత్తం	7,244.60

వచ్చే ఎన్నికల తర్వాత ఆ ఇద్దరూ ఇంటికే..

చంద్రబాబు, పవన్‌లపై మంత్రి అంబటి రాంబాబు ధ్వజం



సత్తెనపల్లి: పవన్ ఇంటికి వెళ్లి చంద్రబాబు కలిసినా.. చంద్రబాబు ఇంటికి పవన్ వచ్చి కలిసినా.. వచ్చే ఎన్నికల తరువాత ఇద్దరూ హైదరాబాద్‌లోని వాళ్ల ఇళ్లకు శాశ్వతంగా వెళ్లిపోతారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'పవన్ కళ్యాణ్ పాతిక్కో, పరక్కో కక్కుర్తి పడతాడు. ప్రభుత్వాన్ని స్థాపించబోతున్నామన్న లెవెల్లో పోజు కొట్టి ఒకరోజు మాట్లాడతారు. రెండో రోజు.. తమ ప్రభుత్వం లేకపోయినా ఫర్వాలేదు, నేను గెలవనని కూడా తెలుసు అని పవన్ అంటాడు' అని సెటైర్లు వేశారు. చిత్రవిచిత్రంగా మాట్లాడుతున్న జనసేన, టీడీపీకి ప్రజలు ఓట్లు వేయరన్నారు. రామోజీ డైరెక్షన్‌లో చంద్రబాబు నిర్మాతగా వలంటీర్ల మీద ఇష్టమొచ్చినట్లు పవన్ మాట్లాడారన్నారు. ఒక వ్యవస్థను అనవసరంగా దుర్భాషలాడితే.. ఆ వ్యవస్థ పరువు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అందుకే పరువునష్టం దావా అని చెప్పారు. ప్రభుత్వ డబ్బుతో పెట్టిన మీటింగ్‌ల్లో సీఎం జగన్ వ్యక్తిగత విమర్శలు చేయడం తప్పు అన్న కన్నా లక్ష్మీనారాయణపై అంబటి మండిపడ్డారు. చంద్రబాబు హయాంలో ప్రభుత్వ డబ్బుతో మీటింగ్‌లు పెట్టి ప్రధాని మోదీనే తిట్టినప్పుడు కన్నా ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు పెట్టి బస్సుల్లో టీడీపీ కార్యకర్తలను పోలవరం తీసుకెళ్లి చంద్రబాబు భజన చేయించుకున్న విషయం మర్చిపోయావా అంటూ ధ్వజమెత్తారు.

వివేకా హత్య కుటుంబ ఆస్తి కోసమే

▶ మొదటి పేజీ తరువాయి

పక్కదారి పట్టించారన్నారు. అధికారికంగా బాధ్యతలు స్వీకరించటానికి మూడున్నర నెలల ముందు నుంచే రాంసింగ్ దర్యాప్తు చేపట్టడం, సాక్షులు చెప్పినదానికి భిన్నంగా వాంగ్మూలాలను నమోదు చేయడాన్ని ప్రస్తావించారు. ఈమేరకు ఎంపీ అవినాశ్‌రెడ్డి సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్‌కు సవివరంగా రాసిన లేఖ తాజాగా వెలుగులోకి వచ్చింది. వివేకా రెండో వివాహంతో ఆ కుటుంబంలో తలెత్తిన ఆస్తి వివాదాలు, అనంతర పరిణామాలను లేఖలో వివరించారు. హత్యలో పాల్గొన్న దస్తగిరిని అప్రూవర్‌గా మార్చి ఇప్పించిన వాంగ్మూలం పూర్తిగా అసత్యాల పుట్ట అని స్పష్టం చేశారు. వివేకా బాత్‌రూమ్‌లో లభ్యమైన గుర్తు తెలియని వేలి ముద్రలు ఎవరివి? అనే విషయాన్ని సీబీఐ పట్టించుకోకపోవడాన్ని ఎంపీ అవినాశ్ లేఖలో ప్రస్తావించారు. కడప ఎంపీ టికెట్‌పై ఎలాంటి సందిగ్ధత లేదని స్పష్టం చేస్తూ హత్యకు ముందు రోజు వరకు ఎంపీగా తన గెలుపు కోసం వివేకా ప్రచారం చేశారని గుర్తు చేశారు. రాంసింగ్ ఉద్దేశపూర్వకంగా విస్మరించిన అంశాలను పునఃసమీక్షించి ఐపీసీ 457, 460, 394, 398, 302 సెక్షన్ల కింద సమగ్రంగా దర్యాప్తు చేయాలని కోరారు. వివేకా హత్య కేసు దర్యాప్తును జూన్ 30 లోగా పూర్తి చేయాలని న్యాయస్థానం సీబీఐకి గడువు నిర్దేశించింది. అంటే అప్పటిలోగా సీబీఐ తుది చార్జ్‌షీట్ దాఖలు చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో జూన్ 19న సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్‌కు ఎంపీ అవినాశ్‌రెడ్డి ఈ లేఖను రాశారు. సీబీఐ నమోదు చేసి న్యాయస్థానానికి సమర్పించిన సాక్షుల వాంగ్మూలాలు, అంతకు ముందు ఛార్జ్ షీట్ల లో పేర్కొన్న అంశాలను విశ్లేషించిన అనంతరం తాను సహేతుకంగా ఈ సందేహాలు, అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. సీబీఐ గత గత ఛార్జ్ షీట్ల లో విస్మరించిన కీలక అంశాలను పునసమీక్షించి సమగ్రంగా దర్యాప్తు చేసి న్యాయం చేయలని కోరారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి లేఖలో ప్రస్తావించిన ప్రధానాంశాలు సంక్షిప్తంగా...



రెండో భార్య షమీమ్, కుమారుడు షెహన్‌షాతో వివేకానందరెడ్డి (ఫైల్ ఫొటో)

పక్కదారి పట్టించిన రాంసింగ్



రాంసింగ్

రాంసింగ్ దర్యాప్తు అధికారిగా 2021 నవంబరు 9వ తేదీన అధికారికంగా బాధ్యతలు స్వీకరించగా అప్పటికి మూడున్నర నెలల ముందే సీఆర్‌పీసీ నిబంధనలకు విరుద్ధంగా దర్యాప్తు చేపట్టారు. సెప్టెంబరు రెండో తేదీనే వివేకా అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి వద్ద వాంగ్మూలం తీసుకున్నారు. నాతోపాటు నా తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డి, డి.శివశంకర్‌రెడ్డికి వ్యతిరేకంగా ఉద్దేశపూర్వకంగానే సాక్షుల పేరిట వాంగ్మూలాలు నమోదు చేశారు. సాక్షులు చెప్పని విషయాలను కూడా చెప్పినట్టుగా వాంగ్మూలాలు నమోదు చేసి తన కింది అధికారులతో వాటిపై సంతకాలు చేయించారు. సీఐ శంకరయ్య, అభిషేక్‌రెడ్డి చెప్పని విషయాలను చెప్పినట్లుగా రాంసింగ్ ఏకపక్షంగా వాంగ్మూలాలను నమోదు చేశారు. దీన్ని వ్యతిరేకిస్తూ శంకరయ్య కడప ఎస్పీకి ఫిర్యాదు కూడా చేశారు. తాను చెప్పినట్లు అబద్ధాలు చెప్పాలని ఉదయకుమార్‌రెడ్డిని రాంసింగ్ చిత్రహింసలకు గురిచేయడంతో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. 2021 నవంబర్ 9వరకు రాంసింగ్ దర్యాప్తు కొనసాగించి రెండు చార్జ్‌షీట్లు దాఖలు చేశారు. వివేకా రెండో వివాహం అంశాన్ని ఉద్దేశపూర్వకంగానే విస్మరించారు.

బెంగళూరు భూవివాదం కట్టుకథే



దస్తగిరి

దస్తగిరిని అప్రూవర్‌గా మార్చి రాంసింగ్ ఇప్పించిన వాంగ్మూలంలోని అంశాలు పూర్తి అవాస్తవమని సీబీఐ దర్యాప్తులోనే వెల్లడైంది. బెంగళూరులోని ఓ భూవివాదానికి సంబంధించి డబ్బుల కోసం వివేకానందరెడ్డిని హత్య చేయాలని, తనకు వైఎస్ భాస్కర్‌రెడ్డి సహకారం ఉందని ఎర్ర గంగిరెడ్డి చెప్పినట్టు దస్తగిరి వాంగ్మూలం ఇచ్చాడు. బెంగళూరు భూవివాదానికి సంబంధించి పది మందిని సీబీఐ విచారించింది. ఆ భూమికి సంబంధించిన పత్రాలు నకిలీవని తేలడంతో వాటిని బెంగళూరుకు చెందిన వై.వెంకట ప్రసాద్‌కు అప్పటికే అప్పగించేసినట్టు వెల్లడైంది. అంటే వివేకానందరెడ్డి హత్యకు చాలా నెలల ముందే బెంగళూరు భూవివాదం సమసిపోయింది. దస్తగిరి వాంగ్మూలం పూర్తిగా అవాస్తవమని స్పష్టమైంది. ఆ వాంగ్మూలం ఆధారంగా రాంసింగ్ దర్యాప్తు చేయడం దురుద్దేశపూరితమే.

నర్రెడ్డి కుటుంబానిదే ఆ కుట్ర



నర్రెడ్డి రాజశేఖరరెడ్డి

కుటుంబ వారసత్వ ఆస్తి కోసమే వివేకాను హత్య చేశారు. ఆ హత్య వెనుక వివేకా అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, ఇతర నర్రెడ్డి కుటుంబ సభ్యులున్నారు. ఎందుకంటే తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వివేకా తన రెండో భార్య షమీమ్, ఆమె కుమారుడు షెహన్‌షాకు ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చలేకపోయారు. తన కుమారుడి చదువు, భవిష్యత్ కోసం తన ఆస్తిలో కొంత వాటా రాసివ్వాలనుకున్నారు. కుటుంబ ఉమ్మడి ఆస్తిలో తన పేరిట ఉన్న 25 శాతం వాటాను షమీమ్, ఆమె కుమారుడి పేరిట ఆయన నోటరైజ్డ్ వీలునామా రాసినట్లు తెలిసింది. దీన్ని ఆయన మొదటి భార్య, కుమార్తె, అల్లుడు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో వివేకా హత్య జరిగింది. వివేకా కుమార్తె సునీత, అల్లుడు, చిన్న బావమరిది నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డిలతో ఎర్ర గంగిరెడ్డికి సన్నిహిత సంబంధాలున్నాయి. ఆయన ద్వారానే వారు వివేకా హత్యకు పన్నాగం పన్ని ఉంటారు. తమ కుటుంబ సభ్యులతో అక్రమ సంబంధం పెట్టుకున్నారని వివేకాపై ఆగ్రహంతో ఉన్న సునీల్ యాదవ్, గజ్జల ఉమాశంకర్‌రెడ్డిల సహకారంతో ఎర్ర గంగిరెడ్డి ఈ హత్యకు పథకం వేశాడు. డబ్బు ఆశ చూపించి దస్తగిరిని కూడా పాత్రధారిని చేశారు. వివేకా హత్య తరువాత ఆ ఇంట్లో కొన్ని పత్రాల కోసం ఎర్ర గంగిరెడ్డి, ఇతర నిందితులు గాలించారు. హత్యలో పాలు పంచుకున్న దస్తగిరితో పాటు వాచ్‌మెన్ రంగయ్య కూడా తన వాంగ్మూలంలో ఇదే విషయాన్ని చెప్పారు. బెంగళూరు భూవివాదం లేదని ఎర్ర గంగిరెడ్డికి తెలుసు కాబట్టి వారు వెతికింది వివేకా రాసిన నోటరీ వీలునామా గురించే అని స్పష్టమవుతోంది. నోటరీ వీలునామాను ఎర్ర గంగిరెడ్డి వివేకా కుమార్తె, అల్లుడికి ఇచ్చి ఉంటారు. అంటే కుటుంబ ఆస్తి కోసమే వివేకాను హత్య చేశారు. వివేకా హత్య తరువాత ఆ కుటుంబ ఆస్తి మొత్తాన్ని సునీత తన పేరిట మ్యుటేషన్ ద్వారా మార్పించుకోవడం గమనార్హం. షమీమ్‌కు ఎలాంటి ఆస్తి దక్కలేదు. ఆస్తి కోసమే వివేకాను ఆయన అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి హత్య చేయించారని ఈ కేసులో నిందితుడు సునీల్ యాదవ్‌కు సమీప బంధువైన భరత్ యాదవ్ తన వాంగ్మూలంలో చెప్పాడు. తాము చెప్పినట్లు సీబీఐకి అవాస్తవాలు చెప్పకుంటే ఈ కేసులో ఇరికిస్తామని వివేకా పీఏ కృష్ణారెడ్డిని సునీత బెదిరించారు. ఈ వాస్తవాలన్నీ వివేకా హత్య వెనుక నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులే ఉన్నట్లు స్పష్టం చేస్తున్నాయి. సీబీఐ ఈ కోణంలో అసలు దర్యాప్తు చేయలేదు.

ఆ తరువాత మాట మార్చిన సునీత



నర్రెడ్డి సునీత

కడప ఎంపీ టికెట్ కోసమే వివేకాను హత్య చేశారని రాంసింగ్ చార్జ్‌షీట్‌లో పేర్కొన్న అంశాలు పూర్తిగా అవాస్తవం. అప్పటికే సిట్టింగ్ ఎంపీగా ఉన్న నన్నే (అవినాష్‌రెడ్డి) 2019 ఎన్నికల్లోనూ అభ్యర్థిగా పార్టీ ఖరారు చేసింది. నా గెలుపు కోసం పార్టీ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా వివేకానందరెడ్డి ఉన్నారు. ఆయన చనిపోయే ముందు రోజు వరకూ నా గెలుపు కోసం కృషి చేశారు. మైదుకూరు నియోజకవర్గంలో పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రఘురామిరెడ్డితో కలసి ప్రచారం కూడా చేశారు. సీబీఐ ఈ విషయాలపై ఏమాత్రం దృష్టి సారించలేదు. కనీసం రఘురామిరెడ్డినిగానీ పార్టీ నేతలను గానీ సంప్రదించలేదు. వివేకా హత్య తరువాత తొలుత సునీత కూడా మీడియాకు ఇదే విషయాలను చెప్పారు. తన తండ్రి చివరి వరకు అవినాశ్‌రెడ్డి గెలుపు కోసం పని చేశారని వెల్లడించారు. 2019 అక్టోబరు తరువాత ఆమె మాట మార్చి నాపై, మా పార్టీపై అసత్య ఆరోపణలు చేస్తున్నారు.

చెక్ పవర్ రద్దుతో ఆర్థిక ఇబ్బందులు..



సునీల్‌యాదవ్


కుటుంబ సభ్యులు తన చెక్ పవర్ రద్దు చేయడంతో వివేకా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విపరీతంగా మద్యానికి బానిసయ్యారు. మోసగాడైన సునీల్ యాదవ్ చెప్పిన వజ్రాల కథను విశ్వసించారు. వాటిని విక్రయించి డబ్బులు ఇప్పించాలని సునీల్ యాదవ్ కోరడంతో తన వాహనాన్ని ఇవ్వడంతోపాటు అతడితో కలసి పలు ప్రాంతాలు తిరిగారు. తరువాత సునీల్ యాదవ్ చెప్పినదంతా కట్టుకథేనని ఎర్ర గంగిరెడ్డి గ్రహించాడు. అప్పటి నుంచి సునీల్ యాదవ్, గజ్జల ఉమాశంకర్‌రెడ్డి వివేకా ఇంటికి రావడం మానేశారు. వారిద్దరి కుటుంబాల్లో మహిళలతో వివేకాకు వివాహేతర సంబంధాలు కూడా ఉన్నాయి. దీంతో వారిద్దరూ ఆయనపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. వివేకాపై దాడి చేసిన తరువాత ఆయన మర్మాంగంపై సునీల్ యాదవ్ కాలితో తన్ని తీవ్రంగా దూషించారు.

ఆ వేలిముద్రలు ఎవరివి?

వివేకా హత్య జరిగిన ప్రదేశాన్ని కడప పోలీసుల క్లూస్ టీమ్ పరిశీలించి బాత్రూమ్ గోడలు, తలుపు వెనుక ఉన్న వేలిముద్రలను సేకరించింది. ఆ వేలిముద్రల్లో కొన్ని నలుగురు నిందితుల వేలిముద్రలతో సరిపోలేదు. అంటే హత్య జరిగిన రోజు రాత్రి ఆ నలుగురు నిందితులే కాకుండా ఆ ఇంట్లో మరెవరో ఉన్నట్లు స్పష్టమవుతోంది. సీబీఐ అప్రూవర్‌గా మార్చిన దస్తగిరి ఆ వ్యక్తి పేరును వెల్లడించలేదు. ఆ వేలి ముద్రలు ఎవరివి? అనే కోణంలో సీబీఐ దర్యాప్తు చేయలేదు. ఎవరినో రక్షించేందుకే ఆ వేలి ముద్రలను ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తోందని స్పష్టమవుతోంది. ఆ వేలి ముద్రలు ఎవరివన్న కోణంలో దర్యాప్తు చేస్తే ఈ హత్య వెనుక అసలు కుట్ర బయటపడుతుంది.

నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి వాంగ్మూలంలో అవాస్తవాలు

మీడియాకు వివేకా పీఏ కృష్ణారెడ్డి వీడియో విడుదల



పులివెందుల (వైఎస్సార్ జిల్లా): వైఎస్ వివేకా అల్లుడు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో అవాస్తవాలు చెప్పారని వివేకా పీఏ కృష్ణారెడ్డి తెలిపారు. ఒక దినపత్రికలో (సాక్షి కాదు) ఆదివారం ప్రచురించిన నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి వాంగ్మూలాన్ని ఆయన ఖండిస్తూ మీడియాకు ఓ వీడియో విడుదల చేశారు. అందులో కృష్ణారెడ్డి ఏం చెప్పారంటే..

'2019 మార్చి 13న నేను వైఎస్ వివేకా ఇంట్లో ఉన్నట్లు, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి నా పక్కన ఉన్నట్లు.. ఆ సమయంలో నేను రాజశేఖర్‌కు ఫోన్‌చేశానని సీబీఐకి వాంగ్మూలం ఇచ్చినట్లుగా 'ఈనాడు'లో వచ్చింది. అయితే, వాస్తవంగా ఆ రోజు అనంతపురంలో ఉండే వాస్తు నిపుణులు సూర్యనారాయణను పిలిపించాలని వైఎస్ వివేకా నాకు చెప్పారు. దీంతో నేను ముందురోజు సూర్యనారాయణకు ఫోన్‌చేసి మరుసటి రోజు ఉదయానికి పులివెందులకు వచ్చేలా ఏర్పాట్లుచేసుకున్నా. 13న ఉదయం సూర్యనారాయణ పులివెందులకు రావడంతో అక్కడ మా బంధువైన చందా జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి వాస్తును కూడా ఆయన పరిశీలించారు. ఆ తర్వాత అక్కడ నుంచి వివేకా ఇంటికి చేరుకుని... అక్కడ కూడా వివేకా ఇంటిని పరిశీలించి వాస్తు ప్రకారం చిన్న మార్పులు చేయాలని సూచించారు. ఈ విషయంపై కడపలో ఉన్న వివేకా రాగానే చర్చిస్తానని చెప్పారు. దీంతో వివేకా ఎప్పుడు వస్తారని తాను నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డికి ఫోన్‌చేయగా.. ఆయన మేం కడపలో ఉన్నామని.. అయినా ఈ రోజుల్లో కూడా వాస్తులేంటి అని నా మీద అరిచారు. అయితే, బావ పిలిపించమంటేనే వాస్తు నిపుణుడిని పిలిపించాను.. నాకెలాంటి సంబంధంలేదని చెప్పాను. అనంతరం 8.30 గంటల ప్రాంతంలో వివేకానందరెడ్డి నాకు ఫోన్‌చేసి.. వాస్తు నిపుణుడికి టిఫిన్ సిద్ధంచేసి, నీకు కాలేజీ టైం అవుతుంది కనుక వెళ్లిపో.. నేను వచ్చి ఆయనతో మాట్లాడతానని చెప్పారు. దీంతో సూర్యనారాయణకు టిఫిన్, కాఫీ ఇవ్వాల్సిందిగా ఇంట్లో పనిమనిషికి చెప్పి నేను కాలేజీకి వెళ్లిపోయాను. వాస్తవం ఇదయితే.. అయితే, నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఇందుకు విరుద్ధంగా తప్పుడు వాంగ్మూలం ఇచ్చారు. ఇందులో నిజానిజాలు కావాలంటే సూర్యనారాయణను విచారించి తెలుసుకోవచ్చు. అంతేగానీ.. ఇలాంటి తప్పుడు వాంగ్మూలం ఇవ్వడం నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డికి తగదు'.. అని కృష్ణారెడ్డి చెప్పారు.

రాయలసీమ డిక్లరేషన్‌కు కట్టుబడి ఉన్నాం

బీజేపీ ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి



ప్రొద్దుటూరు క్రైం: రాయలసీమ డిక్లరేషన్‌కు తమ పార్టీ కట్టుబడి ఉందని బీజేపీ ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి చెప్పారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో ఆదివారం నిర్వహించిన బీజేపీ జోనల్ సమావేశం, ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ విభజన తర్వాత ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఏపీకి కేంద్రం అన్ని విధాలుగా సహకారం అందిస్తోందని చెప్పారు. కేంద్రం ఇస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారిమళ్లిస్తోందని ఆరోపించారు. దశలవారీ మద్యపాన నిషేధం అమలు చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన వైఎస్ జగన్ సీఎం అయ్యాక ఆ దిశగా చర్యలు తీసుకోలేదని విమర్శించారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం కోసం రూ.780 కోట్లకు పైగా విడుదల చేశారని, ఇక్కడ పని 18 శాతమే జరిగిందని చెప్పారు. రాష్ట్రంలో పొత్తుల విషయాన్ని ఢిల్లీ పెద్దలు చూసుకుంటారని ఆమె చెప్పారు. మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ సీఎం రమేష్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీమంత్రి ఆదినారాయణరెడ్డి, జోనల్ ఇన్‌చార్జి బిట్రా శివనారాయణ పాల్గొన్నారు. కాగా, ప్రొద్దుటూరు వచ్చిన మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యేలు వరదరాజులరెడ్డి, వీరశివారెడ్డి, టీడీపీ నాయకులు వి.ఎస్.ముక్తియార్, శెట్టిపల్లె ప్రభాకర్‌రెడ్డి కలిసి మాట్లాడారు.



నేను ఆలోచించడానికి ప్రయత్నిస్తున్నాను.
నన్ను వాస్తవాలతో గందరగోళానికి గురిచేయొద్దు.
– ప్లేటో

సాక్షి

సోమవారం, 24 జూలై 2023

బతుకు పండుగ

లోకంలో దుఃఖం మాత్రమే ఉందా? లేదు, సంతోషం కూడా ఉంది. శత్రుత్వపు చేదు మాత్రమే ఉందా? లేదు, ఆపదలో ఆదుకునే స్నేహమాధుర్యమూ ఉంది. సమరమే కాదు, శాంతీ; సంఘర్షణే కాదు, సామరస్యమూ; భయబీభత్సాలే కాదు; కరుణారౌద్రాలూ ఉన్నాయి. ఒక్కోసారి ప్రళయ తాండవంతో భయపెట్టే ప్రకృతిలోనే, సేదదీర్చే అందాలూ, ఆహ్లాదాలూ ఉన్నాయి. కానీ ఎంత సేపూ పెద్ద పెద్ద కష్టాలనే ఊహించుకుంటూ చిన్న చిన్న సంతోషాలను విస్మరిస్తాం. జీవితాన్ని ముళ్ళకంపగా భావించుకుంటూ పక్కనే ఉన్న మల్లెపొదల గుబాళింపును గమనించలేకపోతాం. జీవించడం కోసం చేసే ప్రయత్నంలో మనసారా జీవించడాన్ని మరచిపోతాం.

మన పక్కనే ఉన్న మంచినీ, మానవత్వాన్నీ గుర్తించడంలో ఎలా విఫలమవుతామో ఒక చక్కని కథలో రావిశాస్త్రి చిత్రిస్తాడు. ఆ కథలో ఇద్దరు మిత్రులుంటారు. ఒకతను ఎప్పుడూ ఏదో కష్టంలో చిక్కుకుని కుంగిపోతూ ఉంటాడు; నిరాశానిస్పృహలకు ప్రతిరూపంగా మారి జీవితంపై విరక్తుడవుతుంటాడు. రెండో వ్యక్తి ప్రతిసారీ అతనికి చేయందించి సమస్య నుంచి గట్టెక్కిస్తూ ఉంటాడు. అలా అతను తేరుకున్న ఓ రోజున తన ఖర్చుతో సినిమాకు తీసుకెడతాడు. ఆ సినిమాలోని ప్రతినాయకుడు నాయికానాయకులను పెడుతున్న ముప్పుతిప్పలు చూసి, లోకంలో ఎక్కడా మంచితనం, మానవత్వమే లేవంటూ అతను భారంగా నిట్టూర్చుతాడు. పక్కనే ఉన్న మిత్రుడు అతని వైపు ఒకసారి వింతగా చూసి మనసులోనే నవ్వుకుంటాడు.

ఇప్పుడు కొంత మారి ఉండచ్చు కానీ, నిన్నమొన్నటివరకు పెళ్లి అనగానే కట్నాలు, కయ్యాలు, అలకలు, మాటపట్టింపులు, మనస్పర్థలే గుర్తుకొచ్చేవి. గుండె బరువెక్కించే ఇలాంటి అలవాటు పడిన చిత్రణకు భిన్నంగా అడుగడుగునా ఆహ్లాదం నింపేలా ఎవరైనా పెళ్లి కథను నడిపిస్తే అది మండువేసవిలో హఠాత్తుగా వీచిన మలయానిలంలా అలరిస్తుంది. 'వసుంధర' రాసిన 'పెళ్ళిచేసి చూడు' అనే నవల అలాంటి ఓ అరుదైన ఆశ్చర్యం. అందులో ముగ్గురు అన్నదమ్ములు, వారి భార్యలు ఆడబడచు పెళ్లిని తలకెత్తుకుంటారు. అన్ని విషయాలూ కలసి చర్చించుకుంటారు, సమష్టిగా నిర్ణయాలు తీసుకుంటారు, సమానంగా బరువు బాధ్యతలు పంచుకుంటారు, సంఘటితంగా అడుగులు వేస్తారు. మగపెళ్ళివారి నుంచి సాధారణంగా ఎదురయ్యే సమస్యలే వస్తాయి. జయప్రదంగా పెళ్లి చేయడం ఒక్కటే లక్ష్యంగా వాటిని తెలివిగా, ఓర్పుగా పరిష్కరించుకుంటారు. ఎలాంటి క్లిష్టపరిస్థితిలోనూ ఆందోళనకు లోనుకారు; ఒకరిపై ఒకరు లోక్తులు విసురుకుంటూ, ఒకరి నొకరు ఆటపట్టించుకుంటూ పరిసరాలను సంతోషభరితం చేసుకుంటారు. కల్యాణాన్నే కాదు, కల్యాణం చేయించిన తీరునూ కమనీయం చేస్తారు.

ఈ 'పెళ్ళిచేసిచూడు' నమూనా పెళ్లికే కాదు; తమలో తమకున్న అన్ని విభేదాలనూ పక్కన పెట్టి పదిమందీ ఉమ్మడిగా నిర్వర్తించాల్సిన ఏ బాధ్యతకైనా వర్తిస్తుంది. ఉదాహరణకు, దేశాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయడమన్న ఉమ్మడి లక్ష్యం దిశగా విజయవంతంగా నడిపించడంలో అధికారపక్షానికీ, ప్రతిపక్షాలకూ కూడా చక్కని ఒరవడి అవుతుంది.


గొప్ప తాత్విక గాంభీర్యమూ, బహిరంతర్దర్శణా, జీవితం గురించిన చిక్కు ప్రశ్నలూ, ఒడుదొడుకులూ ఉన్న రచనల్లోనూ, బరువైన పాత్రల సరసనే, వాతావరణాన్ని తేలిక చేసి ఉల్లాసపరిచే పాత్రలూ కనిపిస్తూ ఉంటాయి. అవి జీవితం తాలూకు అన్ని పార్శ్వాలనూ స్పృశించే రచయిత దృష్టివైశాల్యాన్ని పట్టి చూపుతాయి. బుచ్చిబాబు 'చివరికి మిగిలేది' నవలలోని జగన్నాథం అలాంటి పాత్ర. సమస్యలకు అతీతంగా, దేనిమీదా ఎలాంటి ఫిర్యాదూ లేకుండా, సరదాగా, స్నేహంగా, హాస్యంగా ప్రవర్తించే జగన్నాథం చిన్నపాత్రే అయినా నాయకుడు దయానిధితో సమానంగా గుర్తుండిపోతాడు. గమనించే చూపే ఉండాలి కానీ, అలాంటి వ్యక్తులు మన నిజజీవితంలోనూ మన చుట్టుపక్కల తారసపడుతూనే ఉంటారు. తను రచయితా, గొప్ప చదువరీ కాకపోయినా ప్రతి సాహిత్యసమావేశంలోనూ, రచయితల గోష్ఠుల్లోనూ విలక్షణమైన వాక్చాతుర్యంతో తన ఉనికిని ప్రముఖంగా చాటుకునే సంకు పాపారావు అనే రావిశాస్త్రి మిత్రుని గురించి వైజాగ్‌లోనూ, బయటా కూడా సాహితీ ప్రముఖులు ఇప్పటికీ కథలు కథలుగా చెప్పుకుంటారు.

తమ ఉజ్జ్వల వ్యక్తిత్వంతో శత్రుమిత్రుల తేడా లేకుండా అందరి మధ్యా సమానంగా తళుకులీనే పాత్రలూ ఆ యా విశిష్ట రచనల్లో కనిపిస్తాయి. అమెరికా అంతర్యుద్ధం నేపథ్యంగా మార్గరెట్ మిచెల్ రచించిన 'గాన్ విత్ ద విండ్' నవలలోని మెలనీ పాత్ర అలాంటిది. చాలా అర్భకంగా, అమాయకంగా ఉండే మెలనీ, ప్రేమించడమే తప్ప ద్వేషించడం తెలియని తన ఉదాత్త వ్యక్తిత్వంతో ఆ నవలలోని ఇతర ప్రధాన స్త్రీ, పురుషపాత్రలను మించి ఎంతో ఎత్తుకు ఎదిగిపోతుంది. అభద్రత, అల్లకల్లోలం, ఉద్రిక్తత, స్థానభ్రంశం, లేమి నిండిన ఆ యుద్ధ వాతావరణం వజ్రం లాంటి ఆమె వ్యక్తిత్వానికి మరింత సానపట్టి కొత్త కాంతుల్ని ఆవిష్కరింపజేస్తుంది. యుద్ధం వరకే శత్రుత్వమని చెప్పి స్వపక్షంతో ఒంటరి పోరాటం చేసి, శత్రు సైనికుల సమాధుల వద్ద కూడా మెలనీ పుష్ప గుచ్ఛాలు ఉంచి వస్తుంది.

ఇలాంటి పాత్రలూ, వ్యక్తులూ ప్రపంచాన్ని మరింత ఆశావహంగానూ, వాసయోగ్యంగానూ రూపిస్తారు. బతుక్కి ఓ అర్థాన్ని, పరమార్థాన్ని సంతరిస్తారు. ప్రేమనూ, స్నేహాన్నీ ఇచ్చి పుచ్చుకుని జీవితాన్ని ఉత్సవభరితం చేసుకోడానికి స్ఫూర్తినిస్తారు. మిట్టపల్లాల చీకటిదారిలో దీపస్తంభాలవుతారు.

కనీస స్పందన కరవైందా?

కామెంట్



కరణ్ థాపర్

మణిపురలో మహిళలను నగ్నంగా ఊరేగించి, తర్వాత వారిపై అత్యాచారం జరిపిన ఘటన తాలూకు వీడియో దేశాన్ని దిగ్భ్రాంతికి లోనుచేసింది. దశాబ్దం క్రితం జరిగిన భయంకరమైన ఘటన 'నిర్భయ' లాగా ఇదీ మన అంతరాత్మలోకి చొచ్చుకుపోయింది. మే 4న జరిగినట్టు చెబుతున్న ఈ ఘోరమైన ఘటన తాలూకు వీడియో రెండు నెలల తర్వాత బయటికి రావడం ఒకటైతే, ఆ ఘటన పట్ల ప్రభుత్వం, అధికారులు, పోలీసుల స్పందన ఆందోళన కలిగిస్తోంది. దాన్ని కనీస స్పందన అని కూడా అనలేం. అది మిన్నకుండటమా? పట్టించుకోకపోవడమా? బాధ్యతారాహిత్యమా? వారి వివరణలను బట్టి చూసినా ఎన్నో ప్రశ్నలు తలెత్తుతాయి. ఇవి కూడా మనలో ఆందోళన రేకెత్తించేవే!

మణిపురలో జరిగిన హింసాత్మక ఘటనలను ఏ విశేషణాలతోనూ వివరించడం సాధ్యం కాదు. అది ఏ వర్ణనకూ లొంగనిది. దశాబ్దం క్రితం జరిగిన మరో భయంకరమైన ఘటన 'నిర్భయ' లాగా ఇదీ మన అంతరాత్మలోకి చొచ్చుకుపోయింది. అయితే మే 4వ తేదీన జరిగిన అత్యాచారాలు గర్హనీయమైన ఒక సంఘటన మాత్రమే. రెండు వేర్వేరు వర్గాల నుంచి సేకరించిన సమాచారాన్ని బట్టి చూస్తే, కనీసం ఇంకో ఐదు ఇలాంటివి చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది.

రానున్న రోజుల్లో మన దృష్టి మొత్తం ఆ ఘటనల తాలూకూ బాధాకరమైన వివరాల వైపు వెళుతుంది. నా భయం ఏమిటంటే... మణిపుర ఘోరాలు ఇంకా ఎన్నో మనం చూడాల్సి వస్తుందన్నది! అయితే ప్రస్తుతానికి మే 4వ తేదీ ఘటనలపై అధికారిక వివరణలు లేవనెత్తుతున్న ప్రశ్నలకే పరిమితమవుదాం. ఇవి కూడా మనలో ఆందోళన రేకెత్తించేవే!

బాధిత మహిళల్లో చిన్న వయసు మహిళ 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రిక ప్రతినిధితో, ''దుండగుల గుంపు మా ఊరిపై దాడి చేస్తున్నప్పుడు పోలీసులు అక్కడే ఉన్నారు'' అని చెప్పింది. దీనర్థం మనల్ని రక్షించాల్సిన వాళ్లే అక్కడ నిలబడి మౌన ప్రేక్షకులయ్యారా? ''పోలీసులే మమ్మల్ని వారికి (దుండగులకు) అప్పగించారు'' అని కూడా ఆ అమ్మాయి వాపోయింది. అంటే, తక్కువ సంఖ్యలో ఉన్నా సరే, పోలీసులు బలహీనంగా చేతులెత్తేశారు అని అర్థమా? అరాచక శక్తుల దాడి నుంచి పోలీసులు మహిళలను రక్షించలేదు సరికదా, వారు వారి భద్రత, ప్రాణాల సంగతి మాత్రమే చూసుకున్నారు. మనం వారి నుంచి ఆశించేది అది కాదు కదా?

మహిళలను దుండగులకు అప్పగించిన తరువాతైనా పోలీసులు అదనపు బలగాలను ఎందుకు రప్పించలేదు? అలాంటి ఘటనలు జరిగినప్పుడు పోలీసుల తక్షణ తప్పనిసరి ప్రతిస్పందన ఇలాగే కదా ఉండాలి? ఇది కూడా జరగలేదు. పైగా ఆ బాధిత మహిళలు దగ్గరలోని ఆసుపత్రిని చేరేందుకు దాదాపు ఏడు కిలోమీటర్లు కాలినడకన వెళ్లాల్సి వచ్చింది! కనీసం ఇప్పుడైనా పోలీసులు తిరిగివచ్చి, ఆ మహిళలకు కాస్తంత చేయూతనివ్వాల్సింది కదా?

మే నాలుగున జరిగిన ఘటనలకు సంబంధించి తొలి జీరో ఎఫ్ఐఆర్ నమోదైంది ఆ నెల 18వ తేదీన. రెండోది జూన్ 21వ తేదీన.



కానీ దాడులకు పాల్పడిందెవరో తెలియని కారణంగా తాము ఏ చర్య కూడా తీసుకోలేకపోయామని పోలీసులు అంటున్నారు. నిజంగానా? తాము ఎవరికి ఆ మహిళలను అప్పగించామో కూడా గుర్తు పట్టలేకపోయారా? వారి ముఖాలు మరచిపోయారా? దుండగుల గుంపులో కొందరిని తాను గుర్తుపట్టగలనని బాధిత యువ మహిళ 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'కు తెలిపింది. అందులో తన సోదరుడి స్నేహితుడూ ఉన్నాడని పేర్కొంది. పోలీసులు చర్య తీసుకునేందుకు ఈ సమాచారమూ సరిపోలేదా? నిజమేమిటంటే... పోలీసులు ఆ బాధిత మహిళ వాఙ్మూలాన్ని ఇప్పటివరకూ రికార్డే చేయలేదు.

సరే... ఇదంతా జరిగిన తరువాత కనీసం ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ అయినా తగిన చర్యలు తీసుకునే ప్రయత్నం చేశారా? వీడియో చూసిన వెంటనే తనకు తానుగా సూమోటో కేసుగా దీన్ని తీసుకున్నానని ఆయన చెప్పారు. ఎఫ్ఐఆర్ నమోదైన రెండు నెలలకు 'సూమోటో' కేసుగా తీసుకోవడం ఏమిటి?

మే నాలుగు నాటి ఘటనల గురించి తాను జూన్ 19న మణిపుర ప్రధాన కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డీజీపీ)లకు సమాచారం ఇచ్చానని జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వెల్లడించారు. మరి, ముఖ్యమంత్రికి ఎవరూ చెప్పలేదా? ప్రధాన కార్యదర్శి, డీజీపీ ఎందుకు ఏ రకమైన చర్యా తీసుకోలేదు?

ఇంకో విషయం. దాడులకు పాల్పడిందెవరో గుర్తించలేని కారణంగా తాము రెండు నెలలుగా ఏ చర్యా తీసుకోలేకపోయామని అధికార వర్గాలు చెబుతున్నాయి. కానీ (వీడియో బయటికి వచ్చిన) కేవలం 24 గంటల్లోనే నలుగురిని అరెస్ట్ చేశారు. రెండు నెలలుగా సాధ్యం కానిది 24 గంటల్లో మెరుపువేగంతో ఎలా చేయగలిగారు? ఈ ప్రశ్నకూ సమాధానం కావాలి.

చివరగా... జాతీయ మహిళా కమిషన్ విషయానికి వద్దాం. జూన్ 12న నార్త్ అమెరికన్ మణిపుర ట్రైబల్ అసోసియేషన్, ఇద్దరు మణిపుర మహిళా కార్యకర్తలు రాసిన లేఖ ఒకటి కమిషన్‌కు చేరింది. ''మే నెల నాలుగవ తేదీన కాంగ్పోక్పీ జిల్లాలోని బి. ఫైనామ్ గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలను వివస్త్రలను చేశారు. నగ్నంగా ఊరేగించారు. కొట్టడం మాత్రమే కాకుండా చుట్టుముట్టిన మైతేయ్ మూక బహిరంగంగా మానభంగానికి పాల్పడింది. రాష్ట్రానికి చెందిన పోలీసులు ప్రేక్షకుల్లా ఉండిపోయారు. ఇద్దరు బాధితులు చురాచాంద్‌పూర్ జిల్లా శరణార్థి శిబిరాల్లో ఉన్నారు'' అని ఆ ఘటనలకు సంబంధించి నిర్దుష్టంగా, వివరంగా తెలిపారు. అయినాసరే... జాతీయ మహిళ కమిషన్ చైర్‌పర్సన్ రేఖా శర్మ తాను ఎలాంటి చర్య తీసుకోలేకపోయానని చెబుతూ, అందుకు కారణం అది సాధారణ సమాచారం కావడమనీ, నిర్దిష్టంగా ఫలానా ఘటన గురించిన సమాచారం లేదనీ అన్నారు. మణిపురలోని పరిస్థితుల దృష్ట్యా కమిషన్ తన ప్రతినిధి బృందాన్ని అక్కడకు పంపలేకపోయిందని కూడా ఆమె చెప్పారు. అయినప్పటికీ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మణిపురను సందర్శించగలిగారు. సామాజిక కార్యకర్త అన్నీ రాజా వెళ్లగలిగారు. కానీ శౌర్యగల కమిషన్ మాత్రం వెళ్లలేకపోయింది!

అయితే రేఖా శర్మకు ఇవ్వాల్సిన క్రెడిట్ ఇద్దాం. ఆమె మణిపుర ప్రధాన కార్యదర్శి, డీజీపీలకు లేఖనైతే రాశారు. వాళ్లేం చేయలేదు. ఈమె కూడా పట్టించుకోలేదు. దీనర్థం తాను చేయాల్సిన పని కనీస మాత్రంగానే చేశారనా? అది కూడా సంశయాస్పదమా?

తమ కామెంట్లు తమపైకే తిరగబడే సందర్భం వస్తుందని ఊహించని కొందరు రాజకీయ నేతలు చేసిన వ్యాఖ్యతో ముగిస్తాను. 2017లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా... ప్రధానమంత్రి ఓ ట్వీట్ చేస్తూ...''రాష్ట్రంలో శాంతిని కాపాడలేని వారికి మణిపురను పాలించే అర్హత లేదు'' అన్నారు. ఈ వ్యాఖ్యతో నాకు ఎలాంటి విభేదాలూ లేవు!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

వీధి వింత



చాలాకాలం తర్వాత నా మనుమలు ఇండియాకు వెళ్లొచ్చారు. వచ్చాక వాళ్ల స్నేహితులతో 'యజమానులు లేని కుక్కల' గురించి ఆశ్చర్యంగా చెబుతున్నారు.

– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

గమనార్హం



భారత్‌లోని దాదాపు ఏ ముస్లిం రాజు, నవాబు, లేదా వారి కుటుంబ సభ్యులు కూడా హజ్ యాత్రకు వెళ్లలేదనే విషయాన్ని చాలా కొద్దిమందే గమనిస్తారు. మరోవైపు ఆరోగ్యం, స్థోమత ఉన్న ప్రతి ముస్లింకు అది తప్పనిసరి.

– సాకిబ్ సలీమ్, హిస్టారియన్

మీ దేశమే!



నా భార్య: ఒమన్ నుంచి వెళ్లిపోవడానికి ముందు 19 ఏళ్లుగా ఆ నంబర్ వాడుతున్నాను. నేను మళ్లీ అదే నంబర్ తీసుకోవచ్చా? ఒమన్‌టెల్ (టెలికమ్యూనికేషన్స్ కంపెనీ) మహిళ: మాషా అల్లా, 19 ఏళ్లు! సుస్వాగతం. ఇది మీ దేశం, మీ ఇల్లు. మీరు మీ నంబర్ మళ్లీ తీసుకోవచ్చు.

– రమేశ్ రాధాకృష్ణన్, ముంబయికర్ మల్లు

చేస్తున్నదైనా నమ్మాలిగా!



కనీసం తమ ఔషధాలను నమ్మి, వాటినే తమ పేషెంట్లకు ఇచ్చే హోమియోపతి వైద్యుల పట్ల నాకు ఎంతో గౌరవం ఉంది. ఏ హోమియోపతి వైద్యుడు కూడా (కొందరు ఆయుర్వేద వైద్యుల్లా) తమ మార్గానికి భిన్నమైన మందుల్ని రాయగా నేను ఎప్పుడూ చూడలేదు. అందువల్లే వాళ్ల మౌలికత కొనసాగుతూ వస్తోంది.

– ధ్రువ్ చౌహాన్, హెల్త్ యాక్టివిస్ట్

పడిపోతారు!



మీరు యువకులైతే, ఒక మధ్యవయస్కుడిని 90ల్లో ఏ పాటలు విన్నాడో అడగండి. దానిమీద అరగంట మాట్లాడనీయండి. ఆసక్తిగా వింటున్నట్లు నటించండి. 'ఓ, ఎంత బాగున్నాయో, కూల్' అని చెప్పండి. తర్వాత మీకు ఎలాంటి సాయం కావాలన్నా వాళ్లను అడగండి.

– డెరెక్ గై, కాలమిస్ట్

పాలు చాలు!



పాలు, పాల ఉత్పత్తులను వాడటం మానేశాను. రెండు వారాల తర్వాత నేను మరింత బాగున్నాను. కడుపు ఆరోగ్యం మెరుగు పడింది. త్రేన్పులు లేవు. కొవ్వు కరిగింది. డబ్బులు కూడా పొదుపయ్యాయి. ఇప్పుడు నేను చక్కెర లేని బ్లాక్ కాఫీ మాత్రమే తాగుతున్నాను.

– నిర్మల్ జ్యోతి, ఆర్మీ డాక్టర్

ఫస్ట్ ఇంప్రెషన్



సైకియాట్రీ రెసిడెంట్స్ కోసం: మీ క్యాబిన్‌లోకి మొదటిసారి ఏ కొత్త పేషెంట్ వచ్చినా, పది సెకన్ల పాటు ఏమీ చేయొద్దు. మాట్లాడటం కూడా వద్దు. తనకు తానుగా అలవాటు పడేదాకా గమనించండి. ఇదొక్కటే, మీరు ఆ వ్యక్తి మీద ఎప్పటికైనా చేయగలిగే తాజా, అప్రయత్న పరిశీలన. తర్వాత జరిగేదంతా మీకు, వ్యవస్థకు ఇచ్చే ప్రతిస్పందన మాత్రమే!

– అనిరుధ్ కాలా, సైకియాట్రిస్ట్

ఇగిరిపోని స్నేహపరిమళం



ఘంటశాల నిర్మల


మంచి మిత్రుడు శ్రీరమణ శాశ్వత నిష్క్రమణ దిగ్భ్రాంతినీ, ఎంతో బాధనూ కలిగించింది. 'మిత్రుడు' అనటం సరియేనా! ఎందుకంటే, ఇద్దరం ఒకేసారి ఉద్యోగాల్లో చేరినా... వయసులో, సాహిత్య పరిజ్ఞానంలో, రచనానుభవంలో, రచనల విస్తృతి – వైవిధ్యాలలో – పత్రికారంగాన అడుగుపెట్టక ముందే జర్నలిస్టు సమూహాలలో ప్రసిద్ధుడుగా వెలుగొందుతూండటంలో– ఇలా ఎన్నిటిలోనో అధికుడు అతను.

ఉపసంపాదకురాలిగా 1978లో నేను చేరినప్పుడే శ్రీరమణ, కడప నుంచి వచ్చిన రామకృష్ణారెడ్డి (పి. రామకృష్ణ) 'ఆంధ్రజ్యోతి'లో సహోద్యోగులయ్యారు. అవి చాలా మంచిరోజులు! ఉద్యోగమే వ్యసనమైన రోజులు. చిక్కులూ చింతలూ లేవని కాదు – సమస్యల్ని సమసింపజేసుకునే దీటుదనం, స్ఫూర్తి ఈ బృందంతో పనిచేస్తున్నప్పుడు నిత్యం వర్ధిల్లుతుండేవి. ఏ రోజుకారోజు ఒక వికసనంలా ఉండటంలో శ్రీరమణ ఛలోక్తులు, ఎక్కడెక్కడి ప్రముఖుల గురించిన హాస్యోదంతాలు పూయిస్తూండిన చిరునవ్వులు ఒక ఆహ్లాదకరమైన భాగం. మాబోటి ఔత్సాహికులకు ఏవైనా చిక్కులు – ఎదురైతే కాదు సుమా – ఎదురు కాబోతున్నాయన్నదీ తానే ముందుగా ఊహించి, తప్పించుకునే మెలకువలు నేర్పివుంచటం అతని వాత్సల్య మైత్రీ పరిమళం. కొత్తలో ఒకసారి ఓ ప్రసిద్ధ రచయిత, పైగా అప్పటి సంపాదకుడి ప్రియమిత్రుడు కథ రాసి ఇస్తే, నన్ను అభిప్రాయం చెప్పమని కోరిన సందర్భంలో, అత్యుత్సాహంతో తీక్షణంగా చదివేసి, ఏవో లోపాలు కనిపెట్టి, చెప్పాలని బయలుదేరాను; ఈ తమాషా అంతా గమనిస్తున్నారు కాబోలు – శ్రీరమణ నేనేమి సంకల్పం చేసుకున్నానో అడిగి, శాంతంగా విని, ఎంతమేరకు ఎలా సుతారంగా చెప్పాలో... అసలు ఏ అంశాలు చెప్పకపోతే నా అప్రెంటిస్ ఉద్యోగం 'ఆనక వేరే కారణాలతో' పోకుండా ఉంటుందో చెప్పీచెప్పనట్లు బోధించారు. అలా ఆరేళ్ళ సహోద్యోగం నల్లేరు నడకగా సాగేందుకు తాను ఏరేసిన పల్లేర్లు మరి కొన్ని ఉన్నాయి. బాపు రమణలు తనను వారి బృందంలో చేరమని ఆహ్వానించినప్పటికి సంస్థ తాలూకు మాసపత్రికను మేమిద్దరమే నిర్వహిస్తున్నాము; వెళ్ళిపోయే ముందు ఎన్నెన్నో అమూల్యమైన సలహాలు, సమాచారం, మెలకువలు, చిట్కాలు వివరించి నాకు గల ఆధార సూత్రాల్ని మరింత పటిష్ఠపరచారు.

'ఫెమినిజమ్' పేరు చెప్పి నన్ను వెక్కిరించినా, ''మీ 'మిథునం' అంతా వంటలేగా...'' అంటూ నేను తిరిగి వెటకరించినా – నవ్వులే దొర్లేవి మా మధ్య.

చమత్కారాలు, వ్యంగ్యాలు, వెటకారాలూ అతని వేలికొసలనే! ఎవ్వరినీ నొప్పించని హాస్య నిర్మాణం తన సహజ కళ. ఎవరి మీద జోక్ వేసినా ఆ ఎదుటి మనిషీ ఆనందించటమే! జరుక్ శాస్త్రికి అచ్చమైన వారసుడి వలె ఆయన రాసిన పేరడీలు అప్పటికీ, ఎప్పటికీ గొప్ప హిట్లు. 'రైలుబండిలో వైతాళికులు' మరపురాని నవ్వులపందిరి. ప్రసిద్ధుల ప్రేమలేఖలు పేరడీ మరో నిత్యం మెరిసే రవ్వ. మో (వేగుంట మోహన్ ప్రసాద్) శైలికి పేరడీ చేస్తూ, ఆయన ప్రేమలేఖ ఆ అందుకున్న ప్రేయసికి కించిత్తు కూడా అర్థంకాలేదన్న చమక్కు మో నీ మెప్పించింది; సాహితీ జగతికి దశాబ్దాలకు సరిపడ నవ్వులను ఇచ్చింది. అప్పట్లోనే రంగనాయకమ్మ విమల – బుచ్చిబాబు తరహా జంట పాత్రలతో శ్రీరమణ ఒక సున్నిత హాస్యభరితమైన నవలను సీరియల్‌గా అందించి అలరించారు. 'చిలకలపందిరి', 'టీ కప్పులో సూర్యుడు' తెలుగు పాఠకులకు తేనెల ఊటలు. కథల నిర్మాణంలోనూ శ్రీరమణ బాణీ, భాష, ఆ చెక్కడపు పనితనం – తన సంతకం లేకుండానే ఇట్టే గుర్తుపట్టిస్తాయి.

నివాళి



శ్రీరమణ (1952-2023)

అయితే, అందరూ వేనోళ్ళ చెప్పి పరవశించే 'మిథునం'ను అలా ఉంచితే, ఆయన చివరి రచన (ఎరిగిన మేరకు) అద్భుతమైన నవలిక – 'నాలుగో ఎకరం'. ఒకప్పటి రమ్యమైన తన సొంత పల్లె జీవనం నేపథ్యంలో, ఛిద్రమవుతున్న సంస్కృతికి, చివికి చితికిపోతున్న వ్యావసాయిక రంగానికి వ్యథాభరిత దర్పణంగా ఆ రచనను తీర్చారు. బహుశః మూడేళ్ళ నాడు – మా ఇద్దరికీ మిత్రురాలు సోమరాజు సుశీల సంస్మరణ సభలో కలిసి ఎన్నో కబుర్లు పంచుకున్నాము. అప్పటికే తన శారీరక స్థితిని చూసి నివ్వెరపోయాను. అయితే ఇంత త్వరలో ఇటువంటి విషాద వార్తను – కనీసం చివరిగా చూసేందుకు వీలులేని దూర దేశాన చిక్కుపడి ఉన్న సమయాన – వినవలసివస్తుందని ఊహించలేదు.

'రంగులరాట్నం'లో తానే అన్నట్లు, 'జీవితంలో చెయ్యాల్సిన పనులు గిన్నెలో మిగిలిన కుంకుడుకాయల్లా ఉండిపోయాయి!' అవును నిజం శ్రీరమణగారూ – అటువంటి చేదైన పోలిక – మిమ్మల్ని చూడాలనీ, మాట్లాడాలనీ ఇటీవల ఎంతగా ఆశించినా యాంత్రికత రద్దీలో చూడనే లేకపోవటం! సాహిత్య ప్రపంచం, పాఠక సందోహం భావిస్తున్నది అక్షరాలా నిజం: నేడు మనం కోల్పోయిన మణిపూస – ఒక తరపు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన, బాధ్యతాయుతమైన సృజనకు శ్రీరమణుడినే!

వ్యాసకర్త రచయిత్రి, సీనియర్ జర్నలిస్ట్
nirmalaghantasala@gmail.com

ఇది అమానవీయ భారతం!

అభిప్రాయం



జూలూరు గౌరీశంకర్

అడవి పొదలు, పట్టణాలు, పల్లెలు, నడివీధులు అనే తేడా లేకుండా బిక్కుబిక్కుమంటూ మానాలను, ప్రాణాలను కాపాడుకోలేక మణిపుర ఆడపడుచులు తల్లడిల్లిన తీరును చూస్తే ఇది ఏమి రాజ్యంరా? మనమెక్కడున్నాం రా అనిపించడం లేదూ! ఆధిపత్యం అనే వికృత జంతువుకు అధికారం తోడైతే తోడేలుగా మారి బక్క ప్రాణాల్ని చంపేస్తుంది. చెరిచేస్తుంది. నాగరికుల ముసుగులో ఉన్న అనాగరిక ఆధిపత్య వర్గాలకు బడుగుల దేహాలు ఆహారమా? బడుగుల్ని నగ్నంగా ఇంకా ఊరేగిస్తున్న స్వాతంత్ర్యమా వర్ధిల్లు! ఎటువంటి స్వతంత్ర దేశంలో బతుకుతున్నాం మనం! అంబేడ్కర్ విగ్రహాలు కలత చెంది చూస్తున్నాయ్. గాంధీ విగ్రహాలు రోదిస్తున్నాయ్. ఏమి దేశం.. ఏమి నీతి.. ఏమి సంస్కారం?

వలువలొలిచిన బడుగు తల్లుల నగ్నదేహాల ఊరేగింపులేనా పాలనంటే? పాలనంటే ఎక్కువ తలల గుంపు పక్కన నిలిచేదా? పాలనంటే మెజార్టీ గుంపు ఓట్ల గంపగుత్తేనా? బలహీనుల పక్కన నిలవాల్సిన రాజదండాలు బలవంతుల పక్కలో కులుకుతున్నాయ్. నోరు లేనోళ్ళ పక్కన, మాట పెగలని మూగజీవాల పక్కన నిలవాల్సిన వారు ఆధిపత్య వర్గాల పంచన చేరితే ఎట్లా? గ్లోబలైజేషన్ కాలంలో కులమెక్కడ? మతమెక్కడ? ఆధిపత్య వర్గాల ఊసెక్కడ అని నీతిపాఠాలు చెప్పకండి. చెప్పేదొకటి చేసేదొకటి. అటు చూడండి... మణిపురను చూడండి. ఆ మంటల దగ్గర చలికాచుకుంటున్న ఆధిపత్యాల చేతుల్ని చూడండి. ఇదేందో... ఇదేం సంస్కృతో చూడండి. బడుగు జాతోళ్ళ, అణచివేతకు గురైన కులపోళ్ళ వలువలు ఒలిచి ఊరేగిస్తున్నారు కదా! వాళ్లంతా కోల్పోయిన శీలాల్ని ఆత్మగౌరవ జెండాలతో కప్పుకుంటున్నారు చూడండి. ఆత్మగౌరవం నుంచే కదా ధిక్కారం మొలకెత్తేది. ఊరేగించింది ఆ ఆడపడుచుల రెండు దేహాల్నే కాదు. ఈ దేశంలో పరంపరగా వస్తున్న సంస్కృతి, సంస్కారం, విలువల నగ్న స్వరూపాన్ని కూడా!

ఇది అత్యాధునిక నాగరిక కాలమని ఊకదంపుడు మాటలు చెప్పకండి. అటు చూడండి ఆ అమానుష వికృత ఆటలేంది? వాటిని పెంచి పోషిస్తున్న ఆధిపత్య రాజముద్రల పెత్తందారీతనమేంది? మనుషులకు మలం తినిపిస్తారా? మనుషులపై మూత్రం పోస్తారా? మానాలు దోచి ప్రాణాలు తీసి యథేచ్ఛగా తిరిగే హింసాత్మక



చిత్రమా ఈ దేశం? మానవత్వాన్ని ఆధిపత్యపు రంపపు కోతలకు గురిచేస్తారా? దేశమంటే ఎక్కువ తలలున్న మెజార్టీ గుంపా? గద్దెలపై అధికారం కోసం గద్దల ఫీట్లా? అయ్యో... తినే బువ్వలో మట్టిపోస్తిరి కదా! పేదసాదల అనుబంధాల గూళ్ళను కాల్చి, పిట్టల గుంపుల్ని చెదరగొట్టి నట్లు మానవత్వాన్ని బెదరగొడుతున్నారు కదరా? తక్కువ జాతోళ్ళని ముద్ర వేసి సర్వసత్తాక ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యాన్ని అమానవీయ భారతంగా మార్చేస్తున్నారు కదరా! సాంకేతిక విప్లవాలు విరగ కాస్తున్న కాలంలో మనుషుల్ని మతం పేరున, కులం పేరున అట్టడుగు జాతిని విభజించి పాలించే దుర్నీతి సంస్కృతా? ఎట్లాంటి దేశం, ఎట్లుండె దేశం! ఇంద్రధనుస్సులోని రంగుల్లాగా... విభిన్న జాతుల, మతాల, సంస్కృతులతో ఏకత్వపు మహాగీతం లాంటి ఈ దేశాన్ని అమానవీయ అశుద్ధ భారతంగా మార్చుతున్నారు కదరా!

అన్ని రంగులు కలగలిసిన అందం కదా మనం. మన దేశమంటే మానవీయ మహా సమ్మేళనం కదా! అధికార కుర్చీల కోసం మణిపురను మసి చేస్తారా? మానవత్వాన్ని తగులబెడతారా? కశ్మీర్‌ను కాల్పుల కేంద్రం చేస్తారా? ఆ తల్లులు గుండెలు పగిలేలా అరుస్తున్నారు వినబడడం లేదా? సిగ్గే సిగ్గుతో తలదించుకుంది కనపడటం లేదా? నోర్లు మూగబోయాయా? చూపు చీకటైందా? మణిపురలో హాహాకారాలు వినిపిస్తుంటే దేశం సుఖనిద్ర పోతోందా? అక్కడ వాళ్ళ కళ్ళు పీకేస్తుంటే మొకం తిప్పేసుకుంటారా? ఆ తల్లుల వలువలు ఒలిచి నగ్నంగా ఊరేగిస్తుంటే కళ్ళు మూసుకుంటారా? బలహీనుల ఆర్తనాదాలు వినకుండా చెవులు మూసుకుంటారా? మీరు మౌనంగా ఉంటే మణిపుర మంటలు రేపు మీ ఇంటి తలుపులూ తట్టాయ్ జాగ్రత్త! ఉచ్చ నీచాలు మరచిన అమానవీయ సంస్కృతిని తరిమికొట్టే చైతన్యం రగలక తప్పదు. న్యాయదేవత కళ్ళ గంతలు విప్పి కన్నీరు పెడుతోంది. గాంధీ విగ్రహం చేతికర్ర కదులుతోంది. అంబేడ్కర్ విగ్రహం ఎరుపెక్కుతోంది. ఆగ్రహ నదుల ఆనకట్టలు తెగుతున్నాయ్. ప్రళయాగ్ని పాటకట్టి పాడుతోంది.

'బహుజన హితాయ బహుజన సఖాయ'ను ధరిద్దాం రండి. గుడిసె తను కోల్పోయిన శీలాన్ని తాటి ఆకులతో కప్పుకుంటోంది చూడండి. మానవీయ మహారాజ్య నిర్మాణానికి పోటెత్తి కదులుదాం. మణిపుర మంటలు మరెక్కడా రాజుకోకుండా మానత్వ పూదండను అల్లుదాం రండి. గంగా జమునా తెహజీబ్ సంస్కృతిని దేశమంతా నాటేసుకుంటూ పోదాం పదండి!

వ్యాసకర్త తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** శు.షష్ఠి ఉ.9.12 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** హస్త సా.6.44 వరకు, తదుపరి చిత్త, **వర్జ్యం:** రా.3.11 నుండి 4.53 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.32 నుండి 1.23 వరకు, తదుపరి ప.3.04 నుండి 3.56 వరకు, **అమృతఘడియలు:** ప.12.17 నుండి 2.01 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.39, **సూర్యాస్తమయం:** 6.32.

క్లుప్తంగా...

శ్రీవారి సేవలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి



ఆలయం వెలుపల కుటుంబంతో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గారావు

తిరుమల: తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గారావు ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా, అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

అభిమాన హీరో ఫ్లెక్సీ కడుతూ..అనంత లోకాలకు!

- విద్యుత్ షాక్‌కు గురై ఇద్దరు విద్యార్థుల మృతి



నక్కా వెంకటేష్ (ఫైల్)



పోలూరి సాయి (ఫైల్)

నరసరావుపేట రూరల్: తమ అభిమాన హీరో పుట్టిన రోజు సందర్భంగా ఫ్లెక్సీ కడుతున్న ఇద్దరు విద్యార్థులు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన ఘటన పల్నాడు జిల్లా యక్కలవారి పాలెంలో ఆదివారం జరిగింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం..నరసరావుపేట మండలం యక్కలవారిపాలేనికి చెందిన నక్కా వెంకటేష్ (20), బాపట్ల జిల్లా జె.పంగులూరు మండలం నార్నెవారిపాలేనికి చెందిన పోలూరి సాయి (20), పమిడిమర్రు గ్రామానికి చెందిన గోపాలం స్నేహితులు. వీరు నరసరావుపేటలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. శనివారం వెంకటేష్ పుట్టినరోజు కావడంతో సాయి, గోపాలంను యక్కలవారిపాలేనికి ఆహ్వానించాడు. జన్మదిన వేడుకల అనంతరం ఆదివారం సినీ హీరో సూర్య జన్మదినాన్ని పురస్కరించుకుని 20 అడుగుల ఫ్లెక్సీని వెంకటేష్ సిద్ధం చేశాడు. అర్ధరాత్రి ఈ ఫ్లెక్సీని నిలబెట్టే క్రమంలో ఫ్లెక్సీకి ఉన్న ఐరెన్ బద్ద విద్యుత్ వైర్లకు తాకింది. ఫ్లెక్సీ పట్టుకుని ఉన్న వెంకటేష్, సాయిలు విద్యుత్ షాక్‌కు గురై అక్కడే మృతి చెందారు. సమీపంలో ఉన్న గోపాలానికి స్వల్ప గాయాలయ్యాయి.

సీఎంకే బహుజనుల మద్దతు



రిలే దీక్షలో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ: సుదీర్ఘ కాలంగా కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తూ అలసిపోయిన బహుజనుల కలలు నేడు నెరవేరుతూ సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా ఇళ్ల నిర్మాణాలకు శుభారంభం జరగనుండటం హర్షణీయమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో 3 రాజధానులకు మద్దతుగా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం నాటికి 1,029వ రోజుకు చేరాయి. ఈ శిబిరాన్ని పలువురు సందర్శించి మద్దతు తెలిపి మాట్లాడారు. రాజధానిలో తమకు అండగా నిలిచి పేదల కలలు సాకారం చేస్తున్న సీఎం జగన్‌కు బహుజనుల మద్దతు ఎప్పటికీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఈపూరి ఆదాం, పి.దాసు, పి.వరప్రసాద్, పి.బాబు, గురునాథం పాల్గొన్నారు.

బీఎస్ రావుకు ఘన నివాళి



మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): విద్యారంగం అభివృద్ధి కోసం ఎన్నో ప్రయోగాలు చేసిన అణిముత్యం శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత బీఎస్ రావు అని పలువురు కొనియాడారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని సీకే ఫంక్షన్ హాల్‌లో బీఎస్ రావు సంస్మరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. వ్యక్తిగా జీవితాన్ని ప్రారంభించి శక్తిగా అవతరించి సంస్థ కోసం జీవితాన్ని అంకితం చేసిన మహామనీషి బీఎస్ రావు అని పలువురు కొనియాడారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాశ్, టీడీపీ నాయకులు దేవినేని ఉమా, కన్నా లక్ష్మీనారాయణ తదితరులు బీఎస్ రావు చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు.

వారం రోజులు వర్షాలే

▶ మొదటి పేజీ తరువాయి

మరో ఉపరితల ఆవర్తనం ఏర్పడటంతోపాటు నైరుతి రుతుపవనాలు బలంగా ఉండటం వల్ల వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఉన్న ఉపరితల ఆవర్తనం వచ్చే 24 గంటల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు. వీటి ప్రభావంతో ఈ నెల 29వ తేదీ వరకు వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. ఆదివారం విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా విజయనగరం జిల్లా కొత్తవలసలో 11.3 సెం.మీ, విశాఖపట్నం మధురవాడలో 10.6 సెం.మీ. భారీ వర్షపాతం నమోదైంది.

ట్యూనా.. భలే స్టామినా

ట్యూనా చేపల ఎగుమతుల్లో శ్రీలంక మొదటి స్థానంలో ఉండగా.. రెండో స్థానం మన దేశానిదే. ఏటా 42 వేల టన్నుల ట్యూనా చేపలు లేదా, మాంసంగా విదేశాలకు ఎగుమతి అవుతోంది. 2021–22 ఎంపెడా గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. బంగాళాఖాతంలో పట్టుకునే ట్యూనాలను మత్స్యకారులు రాష్ట్రంలో కాకినాడ, విశాఖపట్నం, నిజాంపట్నం, మచిలీపట్నం రేవులకు చేర్చి అక్కడి నుంచి చెన్నై, కేరళ రాష్ట్రాలకు కంటైనర్ల ద్వారా ఎగుమతి చేస్తున్నారు. అక్కడి నుంచి విదేశాలకు ఎగుమతి జరుగుతోంది. ఇక్కడ కిలో రూ.1,200 నుంచి రూ.1,500 ధర పలుకుతోంది. విదేశాల నుంచి డిమాండ్ ఎక్కువగా ఉండే సందర్భంలో కిలో రూ.3,500 కూడా పలుకుతోంది. స్థానిక ప్రజలు ట్యూనా చేపల్ని పెద్దగా ఇష్టపడరు. విదేశాల్లో మాత్రం చాలా బలవర్ధక ఆహారంగా ఆర్మీ జవాన్‌లకు వారానికి రెండు రోజులు కచ్చితంగా పెడుతున్నారు. అందుకే విదేశాల్లో మన ట్యూనాకు అంత డిమాండ్ ఉంది.

ఎగుమతుల్లో రెండో స్థానం



కాకినాడ రేవులో వేలం వేసేందుకు సిద్ధం చేసిన ట్యూనా చేపలు

విదేశీ రక్షణ దళాల్లో ట్యూనా పేరు తరచూ వినిపిస్తోంది. అలాగని.. ఇదేమీ సైనికులు వినియోగించే ఆయుధం కాదు. వివిధ దేశాల్లోని సైనికులు లొట్టలేసుకుని తినే ఆహారం. బంగాళాఖాతంలోని లోతు జలాల్లో మాత్రమే లభించే ట్యూనా చేప దేశ సరిహద్దులు దాటుతోంది. ఎక్కువ పోషకాలతో కూడిన బలవర్ధక ఆహారం కావడంతో వివిధ దేశాలు సైనికుల కోసం వీటిని దిగుమతి చేసుకుంటున్నాయి. ట్యూనా చేపలను ప్రాసెస్ చేసిన కేన్డ్ ప్రొడక్ట్స్ (మాంసంగా తయారుచేసి డబ్బాల నుంచి నేరుగా తినేసేలా–రెడీ టు ఈట్)ను విదేశాల్లోని జవాన్ల కోసం ఎక్కువగా వినియోగిస్తున్నారు.

విదేశీ సైనికులకు బలవర్ధక ఆహారం ఈ చేప

- అరబ్, ఫ్రాన్స్, జర్మనీలకు ఎగుమతి
- పోషకాల్లో టాప్ లేపుతోంది
- ఏటా 40 వేల టన్నుల ఎగుమతి
- అధిక ప్రొటీన్లు.. తక్కువ కేలరీలు దీని ప్రత్యేకత



సాక్షి ప్రతినిధి, కాకినాడ: ట్యూనా చేప బోర్డర్ దాటుతోంది. ట్యూనా ఏమిటి.. బోర్డర్ దాటడం ఏమిటని ఆశ్చర్యపోతున్నారా. అన్ని సముద్రాలలో ట్యూనా చేపలు లభిస్తున్నా.. మన సముద్ర జలాల్లో లభించే ట్యూనా చేపలకు అరబ్ ఎమిరేట్స్, ఫ్రాన్స్, జర్మనీ, యునైటెడ్ కింగ్‌డమ్, యూరోపియన్ దేశాలలో విపరీతమైన గిరాకీ ఉంది. రుచితోపాటు పోషకాలు ఎక్కువ ఉండటంతో బలవర్ధక ఆహారంగా ట్యూనా చేపల్ని ఇతర దేశాలు ఎగరేసుకుపోతున్నాయి. నరాల పటుత్వం కోసం వినియోగించే.. కొలెస్ట్రాల్ లేని అధిక ప్రొటీన్లు, తక్కువ కేలరీలు ట్యూనా ప్రత్యేకత. 100 నుంచి 150 నాటికల్ లోతు జలాల్లో మెకనైజ్డ్ బోట్ల ద్వారా ప్రత్యేక వలలు, లాంగ్ లైన్(హుక్స్, గేలం)లకు మాత్రమే ట్యూనాలు చిక్కుతాయి. ట్యూనా 20 నుంచి 80 కేజీల వరకు ఉంటుంది. వీటిపై 2012–15 మధ్య రెండు సంస్థలు సంయుక్తంగా అధ్యయనం చేసి వాటి ఉనికి, రాకపోకలను గుర్తించాయి. ఇంకోయిస్, సీఎంఎఫ్ఆర్ఐ సంస్థలు బంగాళాఖాతంలోని విశాఖపట్నం, కాకినాడ, పసిఫిక్ మహాసముద్రంలోని లక్షద్వీప్ ప్రాంతాల్లో రాడార్‌ల సాయంతో ఉపగ్రహాల ద్వారా ట్యూనాల గమనం, ఉనికి, దూరం, ఏ సమయాల్లో లోతు జలాల నుంచి పైకి వస్తున్నాయనేది గుర్తించాయి. అప్పటినుంచే ట్యూనా చేపలు మన సముద్ర జలాల్లో ఎక్కువగా పట్టుకుంటున్నారు.

రక్తపోటు తగ్గిస్తుంది

స్కాంబ్రిడే కుటుంబానికి చెందిన ట్యూనా శాస్త్రీయ నామం థున్నస్ ఆల్బాకేర్. సాధారణంగా వీటిని వాడుక భాషలో సూరలు అని కూడా పిలుస్తారు. ఐదు రకాల ట్యూనాలు ఉన్నా మన సముద్ర జలాల్లో లభించే రెక్క సూర (ఎల్లో ట్యూనా) అంటే విదేశీయులు లొట్టలేస్తారు. ట్యూనాలో ఉండే ఒకే ఒక ముల్లు తీసేస్తే మటన్ (మేక మాంసం) కంటే రుచిగా ఉండటమే కాకుండా.. తినడానికి వీలుగా ఉంటుంది. అందుకే ట్యూనాకు సీ చికెన్ అని మరో ముద్దు పేరు కూడా పెట్టుకున్నారు. ట్యూనా చేప మాంసంలో ఒమేగా–3 ఫ్యాటీ ఆమ్లాలు ఉండటంతో రక్తపోటు తగ్గించడంలో క్రియాశీలకంగా ఉంటుంది. అధిక ప్రొటీన్లు, తక్కువ కేలరీలతో కూడిన కొవ్వు ఉండటంతో నరాలు పటుత్వం, శరీరంలో అవయవాలు బలీయంగా ఉండటానికి దోహదపడతాయి. వీటిలో విటమిన్ బి, బి–12, విటమిన్ సీ అధికంగా ఉండటంతో రోగనిరోధకత పెరుగుతుంది. పొటాషియం, మాంగనీస్, జింక్, సెలీనియం వంటి మినరల్స్ ఎక్కువగా ఉంటాయి. వారానికి రెండు రోజులు ట్యూనాను తీసుకుంటే క్యాన్సర్ దరిచేరదని మత్స్యశాఖ శాస్త్రవేత్తలు నిర్ధారించారు. ఆరోగ్యానికి బలవర్ధక ఆహారంగా వైద్యులు నిర్ధారించడంతోనే విదేశీయులు మన సముద్ర జలాల్లోని ట్యూనాలను దిగుమతి చేసుకుంటున్నారు. మన రాష్ట్రం నుంచే కాకుండా తమిళనాడు, కేరళ, అండమాన్, లక్షద్వీప్ నుండి ఎగుమతి చేస్తున్నారు.

రోగ నిరోధక శక్తి ఎక్కువ

బంగాళాఖాతంలో లభించే ట్యూనా చేపలలో రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుంది. ఈ కారణంగానే విదేశాల్లో డిమాండ్ ఎక్కువ. క్యాన్సర్‌ను కూడా ఇది నియంత్రిస్తుందని పలు అధ్యయనాల్లో తేలింది. ఈ చేపల్లో పోషకాలు ఎక్కువగా ఉంటాయి. విదేశాల్లో ఎక్కువగా మిలట్రీలో పనిచేసే సిపాయిలకు వారం వారం క్రమం తప్పకుండా వినియోగిస్తున్నారు.

– చిట్టూరి గోపాలకృష్ణ, మత్స్య పరిశోధకుడు, కాకినాడ

విదేశాల్లో డిమాండ్



విదేశాల్లో డిమాండ్ ఎక్కువగా ఉండటంతో ప్రాసెసింగ్ యూనిట్లకు తరలిస్తున్నాం. బంగాళాఖాతంలో లోతైన ప్రాంతాల్లో లభిస్తున్న ట్యూనా చేపలు పట్టుకోవడానికి 120 నాటికల్స్ వరకు వెళ్లాల్సి వస్తోంది. వేటకు వెళితే వారం రోజులు నడిసంద్రంలోనే ఉంటారు. ప్రస్తుతం ట్యూనాలు రాక కొంత తగ్గినా విదేశాల్లో డిమాండ్ ఎక్కువగా ఉండటంతో వీటి వేట లాభదాయకంగానే ఉంది. కాకినాడ తీరంలోని మెకనైజ్డ్ బోట్లు ఎక్కువగా ఉండటంతో ట్యూనా చేపలు ఎక్కువగా పడుతున్నాయి.

– గోనెల వెంకటేశ్వరరావు, వ్యాపారి, కాకినాడ

మంత్రాలయంలో శ్రీరాముడి భారీ విగ్రహం

- 108 అడుగుల పంచలోహ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ
- వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా



వర్చువల్‌గా మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, చిత్రంలో సుబుధేంద్రతీర్థులు, మంత్రి జయరాం, మాజీ ఎంపీ వెంకటేశ్

మంత్రాలయం రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో 108 అడుగుల పంచలోహ శ్రీరాముడి భారీ విగ్రహం నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం ఆదివారం అట్టహాసంగా జరిగింది. మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు, జై శ్రీరామ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.250 కోట్లతో చేపట్టే శ్రీరాముడి విగ్రహం, దానికి అనుబంధంగా నిర్మించే తొమ్మిది ఆలయాల నిర్మాణానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్, ఎమ్మెల్సీ బీటీనాయుడు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు వై.ప్రదీప్‌రెడ్డి అతిథులుగా హాజరయ్యారు. ఫౌండేషన్ నిర్వాహకులు ఎంపీ శ్రీధర్, కె.రాములు ఆధ్వర్యంలో నమూనా విగ్రహం వద్ద పండితుల వేద మంత్రోచ్ఛారణల మధ్య భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. తుంగభద్ర నదీ తీరంలో రాఘవేంద్రస్వామి కొలువైన మంత్రాలయం అంటే తనకెంతో ఇష్టమని తెలిపారు. మఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో చాలా అభివృద్ధి చెందుతోందన్నారు. 108 అడుగుల పంచలోహ శ్రీరాముడి విగ్రహం ఏర్పాటుతో భారతదేశం సనాతన హిందూ ధర్మాన్ని ప్రపంచానికి చాటుతున్నారన్నారు. ఆదర్శమూర్తి అడుగు జాడల్లో కేంద్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందని చెప్పారు. మంత్రాలయం అభివృద్ధి కోసం కేంద్రం అన్ని విధాలుగా అండగా నిలబడుతుందన్నారు. అనంతరం వేదికపై ఏర్పాటు చేసిన ఎల్ఈడీ తెరలపై 108 అడుగుల శ్రీరాముడి పంచలోహ విగ్రహం, చుట్టూ తొమ్మిది ఆలయాల నిర్మాణం, పచ్చతోరణం తదితరాలతో రూపొందించిన వీడియోను ప్రదర్శించారు. జై శ్రీరామ్ ఫౌండేషన్ నిర్వాహకులు, ప్రముఖులను పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు శాలువా కప్పి ఆశీర్వదించారు.

ప్రేమఖైదీ!

- పాకిస్తాన్ వాసితో నంద్యాల జిల్లా మహిళ ప్రేమ పెళ్లి
- 2011లో అక్రమంగా దేశంలోకి వచ్చిన గుల్జార్
- ఇక్కడే కాపురం.. నలుగురు సంతానం..
- 2019లో భార్యాపిల్లలతో కలిసి పాక్ వెళ్లే ప్రయత్నంలో పోలీసులకు చిక్కిన వైనం



కుటుంబ సభ్యులతో గుల్జార్‌ఖాన్ (ఫైల్)

గడివేముల: నంద్యాల జిల్లా మహిళను ప్రేమించిన ఓ పాకిస్తాన్ పౌరుడు ఆమె కోసం దేశంలోకి అక్రమంగా వచ్చాడు. ఆపై ఇక్కడ ప్రేమ'ఖైదీ'గా మారాడు. వివరాల్లోకి వెళ్తే... పాకిస్తాన్‌లోని సియాకోట్ జిల్లా కుల్లులార్ గ్రామానికి చెందిన గుల్జార్‌ఖాన్‌కు 2008లో రాంగ్ కాల్ ద్వారా నంద్యాల జిల్లా గడివేములకు చెందిన దౌలత్‌బీతో పరిచయం ఏర్పడింది. అప్పటికే దౌలత్‌బీకి భర్త చనిపోయాడు. ఒక కుమారుడు కూడా ఉన్నాడు. అయినప్పటికీ గుల్జార్ తాను ప్రేమించిన దౌలత్‌బీ కోసం 2011లో తాను పనిచేస్తున్న సౌదీ అరేబియా నుంచి భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించాడు. గడివేములకు చేరుకుని 2011, జనవరి 25న కర్నూలులో దౌలత్‌బీని వివాహం చేసుకున్నాడు. సమీప గ్రామాల్లో పెయింటింగ్ పనులు చేస్తూ అక్కడే ఉండిపోయాడు. ఈ దంపతులకు నలుగురు పిల్లలు జన్మించారు. గుల్జార్, అతని భార్య, పిల్లలకు గడివేములలోనే ఆధార్ కార్డులు పొందారు. వాటి ఆధారంగా తనతోపాటు భార్య, ఐదుగురు పిల్లలను సౌదీ అరేబియాకు తీసుకువెళ్లేందుకు వీసా తీసుకున్నాడు. అక్కడి నుంచి పాకిస్తాన్‌కు వెళ్లాలని ప్రణాళిక రూపొందించుకున్నారు. ఈ మేరకు 2019లో సౌదీ వెళ్లేందుకు గడివేముల నుంచి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకోగా, అక్కడ పోలీసులు గుల్జార్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఆరు నెలలు అనంతరం విడుదల చేశారు. అప్పటి నుంచి గుల్జార్ గడివేములలోనే ఉంటున్నాడు. అయితే, 2022, ఫిబ్రవరి 9న మళ్లీ గుల్జార్‌ను అరెస్టు చేసి మళ్లీ చర్లపల్లి జైలుకు తరలించారు. దీంతో దౌలత్‌బీ మళ్లీ కోర్టుల చుట్టూ తిరిగి తన భర్తను కండీషన్ బెయిల్‌పై ఈ నెల 20న బయటకు తీసుకువచ్చింది. గడివేముల వచ్చిన గుల్జార్‌ను ఆదివారం పోలీసులు స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారించారు. ఈ నెల 27న హైదరాబాద్ కోర్టులో గుల్జార్ హాజరుకావాల్సి ఉందని దౌలత్‌బీ తెలిపింది.

శ్రీశైలం ప్రాజెక్టులోకి వరద ప్రవాహం

- నారాయణపూర్, ఉజ్జయిని డ్యామ్‌లకు దిగువన కురుస్తున్న వర్షాలతో కృష్ణా, భీమాల నుంచి జూరాలకు వరద
- జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,930 క్యూసెక్కులు దిగువకు విడుదల

ఆదివారం సాయంత్రం 6 గంటలకు కృష్ణా బేసిన్‌లో ప్రధాన ప్రాజెక్టుల్లో నీటి నిల్వ, ప్రవాహాలు ఇలా..

ప్రాజెక్టు పేరు	గరిష్ట మట్టం (అడుగుల్లో)	గరిష్ట నిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత మట్టం (అడుగుల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)
ఆల్మట్టి	1,705	129.72	1,685.73	54.56	1,07,769	6,671
నారాయణపూర్	1,615	37.64	1,597.67	17.80	5,081	0
ఉజ్జయిని	1,630	117.64	1,603.61	49.52	17,544	147
జూరాల	1,045	9.66	1,043.54	8.75	41,925	37,930
తుంగభద్ర	1,633	105.79	1,599.86	21.36	54,657	125
శ్రీశైలం	885	215.81	808.99	33.7	22,573	0
నాగార్జునసాగర్	590	312.05	516.8	143.51	2,015	8,207
పులిచింతల	175	45.77	153.13	18.39	8,685	200
ప్రకాశం బ్యారేజ్	57.05	3.07	3.07	3.07	15,698	15,698

సాక్షి, అమరావతి: శ్రీశైలం ప్రాజెక్టులోకి వరద ప్రవాహం ప్రారంభమైంది. జూరాల ప్రాజెక్టులో జలవిద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు వదులుతున్న జలాల్లో ఆదివారం శ్రీశైలం ప్రాజెక్టులోకి 22,573 క్యూసెక్కులు చేరుతున్నాయి. శ్రీశైలం ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 885 అడుగులు.. పూర్తి నీటినిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలు. ప్రస్తుతం ప్రాజెక్టులో 808.90 అడుగుల్లో 33.67 టీఎంసీల నీరు ఉంది. కృష్ణా పరీవాహక ప్రాంతంలో నారాయణపూర్, ఉజ్జయిని డ్యామ్‌లకు దిగువన కురుస్తున్న వర్షాల ప్రభావం వల్ల కృష్ణా ప్రధానపాయ, భీమా నదుల నుంచి తెలంగాణలోని జూరాల ప్రాజెక్టులోకి 41,925 క్యూసెక్కులు చేరుతున్నాయి. ప్రాజెక్టులో నీటినిల్వ గరిష్ట స్థాయికి చేరడంతో విద్యుదుత్పత్తి చేస్తూ 37,930 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. స్థానికంగా కురిసిన వర్షాల వల్ల నాగార్జునసాగర్‌లోకి 2,015 క్యూసెక్కులు చేరుతున్నాయి. తెలంగాణలో కురిసిన వర్షాల ప్రభావంతో మూసీ నుంచి పులిచింతల ప్రాజెక్టులోకి 8,685 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటినిల్వ 18.39 టీఎంసీలకు చేరింది. పులిచింతలకు దిగువన మున్నేరు, వాగులు, వంకల ప్రవాహంతో ప్రకాశం బ్యారేజ్‌లోకి 15,698 క్యూసెక్కులు చేరుతుండగా.. కృష్ణాడెల్టాకు 6,114 క్యూసెక్కులను వదులుతూ మిగిలిన 9,584 క్యూసెక్కులను అధికారులు కడలిలోకి వదిలేస్తున్నారు.

ఆల్మట్టిలోకి పెరిగిన వరద


పశ్చిమ కనుమల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో కృష్ణా ప్రధానపాయలో ఎగువన వరద ఉద్ధృతి పెరిగింది. ఆల్మట్టి డ్యామ్‌లోకి 1,07,769 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటినిల్వ 54.56 టీఎంసీలకు చేరింది. ఆల్మట్టిలో విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు వదులుతున్న ఆరువేల క్యూసెక్కులు నారాయణపూర్ డ్యామ్‌కు చేరుతున్నాయి. సోమవారం ఆల్మట్టిలోకి మరింతగా వరద పెరగనుంది.

తుంగభద్రలోను పెరిగిన ప్రవాహం

భద్ర డ్యామ్, తుంగ ఆనకట్ట దిగువన కురుస్తున్న వర్షాల ప్రభావం వల్ల తుంగభద్రలో వరద ఉద్ధృతి కొంత పెరిగింది. తుంగభద్ర డ్యామ్‌లోకి 54,657 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటినిల్వ 21.36 టీఎంసీలకు చేరింది.

నిలకడగా గోదావరి

- భద్రాచలం వద్ద 42.6 అడుగులకు చేరిన నీటిమట్టం
- మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ
- ధవళేశ్వరం బ్యారేజీ నుంచి 8.51 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి



ధవళేశ్వరం బ్యారేజీ

సాక్షి, అమరావతి/పోలవరం రూరల్/చింతూరు/ధవళేశ్వరం: ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గోదావరిలో వరద ప్రవాహం క్రమేణా తగ్గుతోంది. భద్రాచలం వద్దకు ఆదివారం రాత్రి 7 గంటలకు ప్రవాహం 9.03 లక్షల క్యూసెక్కులకు తగ్గడంతో నీటిమట్టం 42.6 అడుగులకు తగ్గింది. దాంతో మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. భద్రాచలం నుంచి పోలవరం ప్రాజెక్టులోకి వస్తున్న వరదను 48 గేట్ల ద్వారా దిగువకు వదిలేస్తున్నారు. ప్రాజెక్ట్ వద్ద వరద 32 మీటర్లకు చేరుకుంది. విలీన మండలాల్లో గోదావరి, శబరి నదుల్లో వరద ప్రభావం పెరిగింది. వరదనీ రు రహదారులపైనే ఉండిపోవడంతో అల్లూరి జిల్లా చింతూరు, వీఆర్ పురం, కూనవరం మండలాల్లో 57 గ్రామాలకు వరుసగా నాలుగో రోజు కూడా రాకపోకలు స్తంభించాయి. ధవళేశ్వరం బ్యారేజీలోకి 8,63,134 క్యూసెక్కులు చేరుతుండగా.. గోదావరి డెల్టాకు 12,100 క్యూసెక్కులను వదులుతూ మిగులుగా ఉన్న 8,51,034 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు. సోమ, మంగళవారాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా నేపథ్యంలో వరద పెరిగే అవకాశం ఉంది.

శ్రీరామ్‌సాగర్‌కు తగ్గిన ప్రవాహం

కాగా.. శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టుకు వస్తున్న ప్రవాహం 26,966 క్యూసెక్కులకు తగ్గింది. దాని దిగువన ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి చేరుతున్న వరద 41,282 క్యూసెక్కులకు తగ్గడంతో.. ప్రాజెక్టులో నీటిని నిల్వ చేస్తూ దిగువకు 20,450 క్యూసెక్కులను వదిలేస్తున్నారు. ప్రాణహితలో కూడా వరద తగ్గడంతో కాళేశ్వరంలో అంతర్భాగమైన మేడిగడ్డ బ్యారేజీలోకి చేరుతున్న వరద 5,03,450 క్యూసెక్కులకు తగ్గింది. అంతే స్థాయిలో మేడిగడ్డ నుంచి దిగువకు వదిలేస్తున్నారు. తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క బ్యారేజీలోకి 7,87,050 క్యూసెక్కులు చేరుతుండగా.. అంతే స్థాయిలో దిగువకు వదిలేస్తున్నారు.

నకిలీ ఏసీబీ అధికారి జయకృష్ణ పయ్యావుల అనుచరుడే

- అతడికి వెన్నుదన్నుగా ఉరవకొండ నియోజకవర్గ టీడీపీ ముఖ్యనేతలు
- రెండు రోజుల క్రితం హైదరాబాద్ పోలీసులకు చిక్కిన నూతేటి జయకృష్ణ



ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌తో నిందితుడు నూతేటి జయకృష్ణ (తెల్లచొక్కా వ్యక్తి) (ఫైల్)

ఉరవకొండ: ఏసీబీ అధికారి అవతారమెత్తి ఇటీవల హైదరాబాద్ పోలీసులకు చిక్కిన నూతేటి జయకృష్ణ తెలుగు రాష్ట్రాల్లో అధికారులను బెదిరించి రూ.కోటికి పైగా వసూలు చేసినట్టు ప్రాథమికంగా గుర్తించారు. అనంతపురం జిల్లా విడపనకల్లు కొట్టాలపల్లికి చెందిన జయకృష్ణ ఉరవకొండ టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు, ఆయన సోదరుడు పయ్యావుల శ్రీనివాసులుకు ప్రధాన అనుచరుడు కావడం గమనార్హం. పయ్యావుల కుటుంబానికి వీరవిధేయుడిగా ఉండే జయకృష్ణపై పలు నేరాలకు సంబంధించి కేసులు ఉన్నాయి. అడ్డదారుల్లో డబ్బు సంపాదించడమే లక్ష్యంగా అనేక నేరాలకు పాల్పడ్డాడు.

చైన్ స్నాచింగ్‌తో మొదలుపెట్టి..

నూతేటి జయకృష్ణ బీకాం పూర్తి చేశాడు. అనంతపురంలో తొలిసారిగా బంగారు చైన్ దొంగతనం చేసి జైలు పాలయ్యాడు. 2019లో అనంతపురం జిల్లా జైలులో శిక్ష అనుభవిస్తున్న సమయంలో అనిల్, శ్రీనాథ్‌రెడ్డి అనే వ్యక్తులతో పరిచయం ఏర్పడింది. గ్యాంగ్ సినిమాతో ప్రభావితమైన ఈ ముగ్గురూ అడ్డదారిలో డబ్బు సంపాదించి జల్సాలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే ఏసీబీ అధికారుల అవతారమెత్తారు. 2019లో నెల్లూరు జిల్లాకు చెందిన రవాణా శాఖ అధికారికి ఫోన్ చేసి డబ్బు డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో పోలీసులకు అడ్డంగా దొరికి మరోసారి జైలు పాలయ్యారు. జైలు నుంచి విడుదలయ్యాక జయకృష్ణ తన కాలేజీ స్నేహితులు రాఘవేంద్ర, రామచంద్రతో కలిసి అనంతపురం జిల్లాలో 16 చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డాడు. ఈ క్రమంలోనే ఇంకోసారి జైలుకెళ్లాడు. జైలులో సాల్మన్‌రాజ్, సాయికుమార్, గంగయ్య అనే ఖైదీలతో పరిచయం ఏర్పడింది. బయటకు వచ్చిన తర్వాత అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ జిల్లాలతో పాటు తెలంగాణలో వివిధ జిల్లాలకు చెందిన సుమారు 200 మంది అధికారులు, ఉద్యోగులను ఏసీబీ అధికారుల పేరుతో బెదిరించి రూ.1.02 కోట్లు వసూలు చేశారు.

జయకృష్ణతో టీడీపీ నేతలకు సంబంధాలు

నూతేటి జయకృష్ణకు ఉరవకొండ నియోజకవర్గంలోని టీడీపీ ముఖ్యనేతలతో సత్సంబంధాలు ఉన్నట్టు సమాచారం. అతను నిర్వహించిన కార్యక్రమాలకు ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, పయ్యావుల శ్రీనివాసులు హాజరైన సందర్భాలు ఉన్నాయి. జయకృష్ణ అక్రమ సంపాదనను టీడీపీ కార్యక్రమాలకు కూడా ఖర్చు పెట్టినట్టు తెలుస్తోంది. పయ్యావుల సోదరులు నేరచరిత్ర గల వారిని ప్రోత్సహించడం పరిపాటిగా మారిందన్న విమర్శలు ఉన్నాయి. గతంలో ఎమ్మెల్యే కేశవ్ స్వగ్రామం కొకుంట్లలో భారీ జూద కేంద్రంపై పోలీసులు దాడి చేసి.. భారీగా నగదుతో పాటు పయ్యావుల ముఖ్య అనుచరులను కూడా అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. కాగా, నూతేటి జయకృష్ణకు ఉరవకొండ నియోజకవర్గంలోని టీడీపీ నేతలతో ఉన్న సంబంధాలపై పోలీసులు ఆరా తీస్తున్నట్టు సమాచారం. ఇతను గతంలో విడపనకల్లు, కర్ణాటక ప్రాంతాల్లో దారిదోపిడీ కేసుల్లోనూ కీలక పాత్ర పోషించినట్టు భావిస్తున్నారు. దారి దోపిడీలో టీడీపీ నాయకులకూ వాటాలు అందినట్టు అనుమానిస్తున్నారు. ఏసీబీ అధికారినంటూ బెదిరింపులకు దిగి అధికారుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసిన అనంతరం జయకృష్ణతో పాటు ఉరవకొండ టీడీపీ నేతలు గోవా వెళ్లి ఎంజాయ్ చేసినట్టు సమాచారం. ప్రస్తుతం హైదరాబాద్‌లో అరెస్ట్ అయిన జయకృష్ణను పూర్తిస్థాయిలో విచారిస్తే టీడీపీ నాయకుల బండారం కూడా బయటపడే అవకాశముంది.

గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

గిరిజనోత్సవం ముగింపు వేడుకల్లో డిప్యూటీ సీఎం పీడిక



గిరిజన కళాకారులతో కలిసి నృత్యం చేస్తున్న రాజన్నదొర, కళావతి తదితరులు

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): రాష్ట్రంలో గిరిజనాభివృద్ధికి ప్రభుత్వ పెద్దపీట వేస్తోందని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. రాష్ట్ర సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి గిరిజనోత్సవం ముగింపు వేడుకలను వుడా చిల్డ్రన్ ఎరీనాలో ఆదివారం నిర్వహించారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను చాలా ఆసక్తిగా ఉంటాయని, వాటి పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని చెప్పారు. సాలార్‌జంగ్ మ్యూజియం తరహాలో తాజంగిలో గిరిజన మ్యూజియాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు రమ్మని ప్రతిపక్షాలను పిలిచినప్పటికీ.. ఎవరూ స్పందించలేదన్నారు. అనంతరం గిరిజన కళారూపాలను ప్రదర్శించిన గిరిజనులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రాజన్నదొర, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే కళావతి కళాకారులతో కలిసి నృత్యం చేశారు.

క్లుప్తంగా...

విమానంలో అమెరికా మహిళ మూత్ర విసర్జన

న్యూయార్క్: విమానంలో మూత్ర విసర్జన ఘటనలు నానాటికి ఎక్కువైపోతున్నాయి. విమానం సిబ్బంది రెండు గంటలుగా టాయిలెట్‌లోకి వెళ్లడానికి నిరాకరించడంతో విమానం ఫ్లోర్‌పైనే ఒక మహిళ మూత్ర విసర్జన చేసిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. అమెరికాకు చెందిన స్పిరిట్ ఎయిర్‌లైన్స్‌లో ఈ ఘటన జరిగింది. విమాన సిబ్బంది తనని రెస్ట్ రూమ్ వాడనివ్వకుండా అడ్డుకోవడంతో వారితో వాదించిన ఆ మహిళ ఒక మూలగా వెళ్లి తన పని కానిచ్చింది. రెండు గంటలైనా తనకి టాయిలెట్‌లోకి వెళ్లడానికి అంగీకరించకపోవడంతో భరించలేక తాను ఈ పని చేశానని చెబుతోంది. తనపై కేసులు పెట్టుకుంటారో ఇంకేం చేస్తారో అంటూ ఆ మహిళ అంటున్న మాటల్ని సిబ్బంది రికార్డు చేశారు. అయితే ఈ ఘటనపై విమానయాన సంస్థ ఇప్పటివరకు స్పందించలేదు.

టమాటాలు తినకండి

యూపీ మంత్రి సలహా

లక్నో: టమాటా ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ మంత్రి ప్రతిభా శుక్లా జనాలకి ఒక ఉచిత సలహా పారేశారు. టమాటా ధరలు దిగి రావాలంటే అందరూ వాటిని తినడం మానేయాలన్నారు. ''మీరు టమాటాలు తినడం మానేస్తే ధరలు వాటంతటవే దిగి వస్తాయి. అసలు టమాటాలు కొనడం ఎందుకు ? మీ ఇళ్లల్లోనే పండించండి. టమాటాకి బదులుగా నిమ్మకాయని వంటల్లో వాడండి. ఎవరూ టమాటాలు కొనకపోతే, తినకపోతే ధరలు అవే తగ్గిపోతాయి'' అని సూచించారు. వీటిపై కాంగ్రెస్ మండిపడింది.

చార్లీ చాప్లిన్ కూతురు జోసెఫిన్ కన్నుమూత

లండన్: దిగ్గజ నటుడు చార్లీ చాప్లిన్ కూతురు, నటి జోసెఫిన్ చాప్లిన్(74) ఈ నెల 13న పారిస్‌లో కన్నుమూశారు. కాంటెర్‌బరీ టేల్స్ వంటి చిత్రాల్లో ఆమె నటించారు. చార్లీ చాప్లిన్ నాలుగో భార్య, నోబెల్ బహుమతి విజేత వూనా ఓ నీల్‌కు పుట్టిన ఈమె.. చాప్లిన్ 11 మంది సంతానంలో ఒకరు. జోసెఫిన్ 1949లో అమెరికాలోని సాంటా మోనికాలో జన్మించారు.



అంతిమ సంస్కారం

రాజస్తాన్‌లో గెహ్లోత్ ప్రభుత్వం కొత్త చట్టం

మృతదేహాలతో ధర్నాలు చేసే పెడ ధోరణులకు అడ్డుకట్ట



మనుషులు ఎలా బతికినా మరణానంతరం కాస్తయినా మర్యాద ఉండాలి. అంతిమ సంస్కారం గౌరవప్రదంగా సాగాలి. కానీ ఈ విషయంలోనూ కొన్నిచోట్ల పెడ ధోరణులు కనిపిస్తున్నాయి. తమ డిమాండ్ల సాధన కోసం మృతదేహాలతో కూర్చొని నిరసన ప్రదర్శనలకు దిగడం మనం చూస్తూనే ఉన్నాం. ఎంతోమంది విషయంలో ఈ అంతిమ యాత్ర సవ్యంగా జరగడం లేదు. రాజస్తాన్‌లో మృతదేహాలతో ధర్నాలు అధికంగా కనిపిస్తూ ఉంటాయి. ఈ రకమైన ట్రెండ్‌కు అడ్డుకట్ట వేయడానికి రాజస్తాన్‌లోని అశోక్ గెహ్లోత్ ప్రభుత్వం ఏకంగా ఒక చట్టాన్నే తీసుకొచ్చింది. 'ది రాజస్థాన్ ఆనర్ ఆఫ్ డెడ్ బాడీ బిల్లు, 2023'కు గత వారమే అసెంబ్లీ ఆమోద ముద్ర వేసింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

చట్టంలో ఉన్నదిదీ...!

మరణానంతరం హక్కులుంటాయ్!

ఎవరైనా వ్యక్తి మరణించిన తర్వాత కూడా వారికి హక్కులుంటాయి. వారి అంతిమ సంస్కారం గౌరవప్రదంగా వారి వారి మతాచారాలు, సంప్రదాయాలకనుగుణంగా నిర్వహించాలి. వ్యక్తి ప్రాణం పోయిన తర్వాత వీలైనంత త్వరగా వారి అంత్యక్రియలు పూర్తి చేయాలి. చనిపోయిన వారి కుమారులు, కూతుళ్లు దూర ప్రాంతం నుంచి రావల్సి ఉంటే తప్ప వెంటనే అంత్యక్రియలు ముగించాలి. ఒక వేళ కుటుంబ సభ్యులు అలా అంత్యక్రియలు పూర్తి చేయకపోతే ప్రభుత్వ అధికారులే ఆ బాధ్యత తీసుకుంటారు.

మృతదేహాలతో నిరసన కుదరదు

ఈ చట్ట ప్రకారం మృతదేహాలతో కుటుంబ సభ్యులు నిరసన ప్రదర్శనలు చేయకూడదు. ఏదైనా కారణంగా వాళ్లు అలా నిరసనలకు దిగితే చర్యలు తీసుకునే అధికారం జిల్లా యంత్రాంగానికి ఉంటుంది. వెంటనే ఆ మృత దేహాన్ని స్వాధీనం చేసుకొని అధికారులు తామే అంతిమ సంస్కారం నిర్వహిస్తారు. అంతేకాదు బహిరంగ ప్రదేశాల్లో మృతదేహంతో నిరసనకు దిగినందుకుగాను ఆ కుటుంబసభ్యులకు ఏడాది వరకు జైలు శిక్ష లేదంటే జరిమానా, రెండూ కూడా విధించవచ్చు.

ఎందుకీ చట్టం?

రాజస్తాన్‌లో మృతదేహాలతో నిరసనలకు దిగడం సర్వసాధారణంగా మారిపోయింది. ప్రాణాలు కోల్పోయి వారం రోజులు గడిచినా దహన సంస్కారాలు నిర్వహించకుండా ఉద్యోగం కోసమో, డబ్బుల కోసమో ఆస్పత్రులు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ధర్నాలకు దిగుతున్నారు. 2014–2018 మధ్య బీజేపీ హయాంలో ఇలాంటి ధర్నాలు 82 వరకు జరిగాయి. 30 వరకు కేసులు నమోదయ్యాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 2019–2023 మధ్య కాలంలో మృతదేహాలతో ధర్నా కేసులు 306కి పెరిగాయి. అందుకే ఈ చట్టాన్ని తీసుకువచ్చినట్టుగా రాజస్తాన్ శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శాంతి ధారివాల్ చెప్పారు. మరోవైపు ప్రతిపక్ష బీజేపీ దీనిని వ్యతిరేకించింది. మృతదేహాలతో ధర్నాకు దిగారంటే వారిలో ఎంతటి ఆక్రోశం ఉందో అర్థం చేసుకోవాలే తప్ప వారి ఆగ్రహ ప్రదర్శనని అడ్డుకోవడం సరికాదని వ్యాఖ్యానించింది. రాజస్తాన్‌లో కాంగ్రెస్ సర్కార్‌కు ఇక ప్రజలే అంతిమ సంస్కారం నిర్వహిస్తారంటూ బీజేపీ నేతలు వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. అయితే ఈ తరహా ఒక చట్టాన్ని చేసిన తొలి రాష్ట్రంగా రాజస్తాన్ చరిత్ర పుటల్లో నిలిచిపోతుంది.

ఆ మృతదేహాలు పదిలం

ప్రమాదాలు, ఘర్షణలు ఇతర విపత్కర పరిస్థితుల్లో ఎవరైనా మరణించి వారి మృత దేహాన్ని ఎవరూ క్లెయిమ్ చేసుకోని పక్షంలో ఆస్పత్రులు, జిల్లా యంత్రాంగం ఆ మృతదేహం కుళ్లిపోకుండా, దెబ్బ తినకుండా సకల జాగ్రత్తలతో ఫ్రీజర్‌లో భద్రపరచాలి.

పెనాల్టీ

మృతదేహాల మర్యాదకి ఏ మాత్రం భంగం కలిగిందని భావించినా వివిధ రకాల నేరాలకు వివిధ రకాల శిక్షలూ ఉంటాయి. కుటుంబసభ్యులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకోవడానికి నిరాకరించడం, మృతదేహాలతో నిరసన ప్రదర్శనలకి దిగడం, అలాంటి ప్రదర్శనలకు అనుమతులివ్వడం వంటివి నేరాల కిందకే వస్తాయి. ఆ నేరాలకు ఆరు నెలలు, ఏడాది, రెండేళ్లు, అయిదేళ్లు ఇలా జైలు శిక్ష పడుతుంది

డేటా బ్యాంకు

ఈ బిల్లులో అన్నింటికంటే ముఖ్యమైనది ఎవరూ గుర్తుపట్టని మృతదేహాల డేటా. ఎవరూ గుర్తు పట్టకుండా ఉన్న మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలు జరిపించి జన్యుపరమైన వారి డేటాను ప్రభుత్వం భద్రపరచాలి. అలా గుర్తు పట్టని శవాలకు శాస్త్రోక్తంగా అంతిమ సంస్కారాలు నిర్వహించినప్పటికీ వారి అస్థికలు, జన్యుపరమైన వివరాలను ఒక డేటా బ్యాంకు ఏర్పాటు చేసి భద్రపరుస్తారు. జిల్లాల వారీగా డిజిటల్ డేటా బ్యాంకుల్ని ఏర్పాటు చేసి అందులో మృతి చెందిన వారి వివరాలు ఉంచుతారు. పోలీసు స్టేషన్లలో వచ్చే మిస్సింగ్ కేసులతో ఆ డేటాను పోల్చడం ద్వారా కనిపించకుండా వెళ్లిన వారు ఏమయ్యారో అన్నదానిపై ఒక క్లారిటీ వస్తుంది. ఇక ఈ డేటాను అధికారులెవరైనా బయటపెడితే మూడేళ్ల నుంచి పదేళ్ల వరకు జైలు శిక్ష పడుతుంది.

ట్విట్టర్ పక్షులకు వీడ్కోలు చెప్పేస్తా

'ఎక్స్' యాప్‌గా రీబ్రాండ్ చేస్తా: ఎలాన్ మస్క్


న్యూయార్క్: ట్విట్టర్.. ఈ సోషల్ మీడియా వేదిక గురించి తెలియని నెటిజన్లు ఉండరు. నీలి రంగు ట్విట్టర్ పిట్ట అందరికీ సుపరిచితమే. ఈ పిట్ట ఇకపై కనిపించదు. ఈ విషయాన్ని ట్విట్టర్ యజమాని, బిలియనీర్ ఎలాన్ మస్క్ స్వయంగా ప్రకటించారు. తమ యాప్ లోగోను మార్చనున్నట్టు ఆదివారం వెల్లడించారు. ట్విట్టర్‌ను రీబ్రాండ్ చేయనున్నట్టు తెలియజేశారు. చైనాకు చెందిన వియ్‌చాట్ తరహాలో అన్నింటికీ పనికొచ్చే 'ఎక్స్' యాప్‌ను రూపొందించాలని ఆయన కొంత కాలంగా యోచిస్తున్నారు. ఇది కేవలం సోషల్ మీడియా వేదికగానే కాకుండా ఆన్‌లైన్ చెల్లింపులకు, ఆహారాన్ని ఆర్డర్ చేయడానికి పనికొస్తుంది. చాలా రకాల సేవలు అందించేలా ఎక్స్ యాప్‌ను తీర్చిదిద్దాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగానే ట్విట్టర్‌ను త్వరలో 'ఎక్స్' యాప్‌గా రీబ్రాండ్ చేయనున్నట్టు తెలుస్తోంది. 'త్వరలోనే మేం ట్విట్టర్ బ్రాండ్‌కు.. ఆ తర్వాత క్రమంగా నీలి రంగు ట్విట్టర్ పక్షులకు వీడ్కోలు పలుకనున్నాం' అని ఎలాన్ మస్క్ తాజాగా ట్వీట్ చేశారు. ఎక్స్ యాప్‌నకు కొత్త లోగోను సూచించాలని ఆయన కోరారు. ఎలాన్ మస్క్ గత ఏడాది ట్విట్టర్‌ను కొనుగోలు చేశారు. సంస్థలో పలు మార్పులకు శ్రీకారం చుట్టారు. ట్విట్టర్ బిజినెస్ పేరును ఎక్స్ కార్పొరేషన్‌గా మార్చారు. ట్విట్టర్ ఈ ఏడాది ఏప్రిల్‌లో ఎక్స్ కార్పొరేషన్‌లో చట్టబద్ధంగా విలీనమైంది.



808 ఎఫ్ఎం రేడియో స్టేషన్లకు త్వరలో ఈ వేలం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 284 నగరాల్లో 808 ఎఫ్ఎం రేడియో స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వం త్వరలోనే ఈ వేలం నిర్వహించనుందని కేంద్ర సమాచార ప్రసార మంత్రి అనురాగ్ ఠాకూర్ వెల్లడించారు. ప్రస్తుతం దేశంలోని 26 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 113 నగరాల్లో 388 ఎఫ్ఎం స్టేషన్లు నడుస్తున్నాయని చెప్పారు. కవరేజీ పెంచేందుకు గాను మారుమూల ప్రాంతాల్లోనూ రేడియో టవర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కమ్యూనిటీ రేడియోలు సహా రేడియో స్టేషన్లకు లైసెన్స్ జారీ ప్రక్రియను సులభతరం చేశామన్నారు. టయర్–2, 3 నగరాల్లోనూ విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఆలిండియా రేడియో ఎఫ్ఎం ట్రాన్స్‌మిటర్ల ద్వారా దేశంలోని భౌగోళిక ప్రాంతాన్ని 59 శాతం నుంచి 66 శాతానికి, జనాభాలో 68 నుంచి 80 శాతం మందికి సేవలందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. మారుమూల, గిరిజన, వామపక్ష తీవ్రవాద ప్రాబల్య ప్రాంతాల్లోని వారికి ఉచితంగా 8 లక్షల డీడీ ఫ్రీ డిష్ సెట్ టాప్ బాక్సులను అందజేయనున్నామని తెలిపారు.

పాక్ ఆపద్ధర్మ ప్రధానిగా ఇషాఖ్ దార్!



ఇస్లామాబాద్: పాకిస్తాన్ ఆపద్ధర్మ ప్రధానమంత్రిగా ఆర్థిక మంత్రి ఇషాఖ్ దార్ (73) పేరు తెరపైకి వచ్చింది. షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వ పదవీ కాలం ఆగస్టు 14న ముగియనుంది. కానీ 8వ తేదీనే జాతీయ అసెంబ్లీని రద్దు చేయాలని ప్రధాని నిర్ణయించుకున్నట్లు పాక్ మీడియా ఆదివారం వెల్లడించింది. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యేదాకా ఇషాఖ్ దార్‌ను ఆపద్ధర్మ ప్రధానమంత్రిగా కొనసాగిస్తారని తెలియజేసింది. ఆయన పేరును అధికార పాకిస్తాన్ ముస్లిం లీగ్–నవాజ్ పార్టీ ప్రతిపాదించింది. పాక్ ఇప్పుడు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది. అంతర్జాతీయ సంస్థల నుంచి అప్పుల కోసం, విదేశాల నుంచి పెట్టుబడుల కోసం ప్రయత్నిస్తోంది. రుణాలు, పెట్టుబడులతో ఆర్థికంగా కుదురుకోవడానికి చాలా సమయం పట్టనుంది. ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించేందుకు షరీఫ్ ప్రభుత్వం ఇష్టపడడంలేదు. అందుకే ఆపద్ధర్మ ప్రభుత్వంతో నెట్టుకురావాలని భావిస్తోంది. పాకిస్తాన్ రాజ్యాంగం ప్రకారం.. జాతీయ అసెంబ్లీ పదవీ కాలం పూర్తయితే 60 రోజుల్లోగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. కానీ, జాతీయ అసెంబ్లీని పదవీ కాలం ముగియక ముందే రద్దు చేస్తే 90 రోజుల్లోగా ఎన్నికలు నిర్వహించవచ్చు. కొత్త ప్రభుత్వం కొలువుదీరే దాకా ఆపద్ధర్మ ప్రధానమంత్రి పరిపాలన సాగిస్తారు. ఆపద్ధర్మ ప్రధానిగా ఇషాఖ్ దార్ నియామకంపై పాకిస్తాన్ ప్రభుత్వం వచ్చేవారం తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది.

బోరు బావిని జయించాడు

మృత్యుంజయుడిగా తిరిగొచ్చిన శుభమ్



నలంద: బిహార్‌లో నలంద జిల్లా కుల గ్రామంలో 40 అడుగుల లోతైన బోరుబావిలో పడిపోయిన మూడేళ్ల బాలుడు మృత్యుంజయుడై తిరిగి వచ్చాడు. ఇంటికి సమీపంలో ఆడుకుంటున్న శుభమ్ కుమార్ అనే బాలుడు తెరిచి ఉన్న బోరు బావిలో ప్రమాదవశాత్తూ పడిపోయాడు. ప్రమాదం విషయం తెలిసిన జాతీయ విపత్తు సహాయ బృందం రంగంలోకి దిగింది. దాదాపుగా అయిదు గంటల సేపు శ్రమ పడి శుభమ్‌ను కాపాడింది. బోరు బావిని తవ్విన ఒక రైతు అందులో నీళ్లు పడకపోవడంతో దానిని మూసేయకుండా అలాగే ఉంచేయడంతో ఈ ప్రమాదం జరిగింది. సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పుడు బోరుబావిలో పడిన శుభమ్ సీసీటీవీ కెమెరాలకి చిక్కడం, రాళ్లు రప్పలు చిమ్మ చీకట్లో ఒంటరిగా ఏడుస్తున్న దృశ్యాలు చూసిన వారి గుండెలు పిండేశాయి. ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది ఎలాగైతేనేం బాలుడి ప్రాణాలు కాపాడి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బోరుబావిలో చిన్నారులు పడిపోతున్న ఘటనలు ఎన్ని జరుగుతున్నా వాటిని మూసి ఉంచకుండా నిర్లక్ష్యంగా వదిలివేసే వైఖరిపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

ప్రియుడ్ని కలవాలని ఊరికే కరెంటు కట్!

పాట్నా: బిహార్‌లో పశ్చిమ చంపారన్ జిల్లా బెట్టయా గ్రామానికి చెందిన ప్రీతి అనే అమ్మాయి తన ప్రియుడ్ని కలుసుకోవడం కోసం ఏకంగా గ్రామానికే కరెంట్ కట్ చేయడం మొదలు పెట్టింది. పొరుగు గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ అనే తన బాయ్ ఫ్రెండ్‌ని కలుసుకోవడానికి రాత్రయితే పవర్ కట్ చేయసాగింది. ఆ చిమ్మచీకట్లో ప్రియుడితో ప్రేమాయణం సాగించేది. వరసగా వారం రోజుల పాటు రాత్రయితే కరెంట్ పోతూ ఉండడంతో గ్రామస్తులకి అనుమానం వచ్చి మాటు వేసి చూడగా ప్రీతి నిర్వాకం బయట పడింది. వారిద్దరి ప్రేమాయణం సంగతేమో కానీ గ్రామంలో దొంగతనాలు కూడా పెరిగాయి. దీంతో గ్రామస్తులు కాపలా కాసి మరీ వారిద్దరిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆ తర్వాత ఇరు గ్రామాల పెద్దలు వారికి గుళ్లో పెళ్లి చేశారు.

మెయితీల వలసబాట

మిజోరాం నుంచి అస్సాంకు..

- మాజీ మిలిటెంట్ గ్రూప్ నుంచి మెయితీలకు బెదిరింపులు
- బాధితులకు పూర్తి రక్షణ కల్పిస్తున్నామన్న మిజోరం ప్రభుత్వం



గువాహటి/కోల్‌కతా: కల్లోల మణిపూర్‌లో తెగల మధ్య రాజుకున్న మంటలు ఆరడం లేదు. బాధితులు ప్రాణభయంతో రాష్ట్రం విడిచి వెళ్లిపోతున్నారు. సురక్షిత ప్రాంతాలను వెతుక్కుంటూ పొరుగు రాష్ట్రాలకు చేరుకుంటున్నారు. సొంత రాష్ట్రంలో పరిస్థితులు కుదుటపడేదాకా మరోచోట తలదాచుకోవడమే మేలని భావిస్తున్నారు. ఇద్దరు గిరిజన మహిళలను దిగంబరంగా ఊరేగించిన ఘటన బయటపడిన తర్వాత మెయితీ తెగ ప్రజల్లో భయాందోళన మరింత పెరిగిపోయింది. ఇప్పటికే మిజోరాంలో ఉంటున్న మణిపూర్ మెయితీల్లో ప్రాణ భయం మొదలైంది. మాజీ మిలిటెంట్ గ్రూప్ నుంచి బెదిరింపులు రావడమే ఇందుకు కారణం. 41 మంది మెయితీలు శనివారం రాత్రి మిజోరాం నుంచి అస్సాంలోని సిల్చార్‌కు చేరుకున్నారు. వారికి బిన్నాకండీ ఏరియాలోని లఖీపూర్ డెవలప్‌మెంట్ బ్లాక్ కార్యాలయ భవనంలో ఆశ్రయం కల్పించినట్లు పోలీసులు వెల్లడించారు. వీరంతా ఆర్థికంగా మెరుగైన స్థానంలో ఉన్నవారేనని, సొంత వాహనాల్లో అస్సాం దాకా వచ్చారని పేర్కొన్నారు. ఈ 41 మంది మెయితీల్లో కాలేజీ ప్రొఫెసర్లు, ప్రభుత్వ సీనియర్ అధికారులు కూడా ఉన్నారని తెలియజేశారు. మిజోరంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదని వారు చెప్పారని వివరించారు. అయినప్పటికీ అక్కడ రిస్క్ తీసుకోవడం ఇష్టంలేక అస్సాంకు వచ్చామంటూ తమతో పేర్కొన్నారని వెల్లడించారు. బాధితులకు పూర్తి రక్షణ కల్పిస్తున్నట్లు అస్సాం పోలీసులు ఉద్ఘాటించారు.

వదంతులు నమ్మొద్దు: మిజోరాం ప్రభుత్వం

మణిపూర్‌లో మే 3వ తేదీ నుంచి ఘర్షణలు ఉధృతమయ్యాయి. ఇప్పటిదాకా వేలాది మంది మెయితీలతోపాటు గిరిజన తెగలైన కుకీలు, హమర్ ప్రజలు వలసబాట పట్టారు. వీరిలో చాలా మంది అస్సాంలో ఆశ్రయం పొందుతున్నారు. ఇదిలా ఉండగా, వెంటనే రాష్ట్రం విడిచి వెళ్లిపోవాలంటూ మిజోరంలో తలదాచుకుంటున్న మణిపూర్ మెయితీలకు మాజీ తీవ్రవాద గ్రూపు నుంచి బెదిరింపులు వచ్చినట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ మాజీ మిలిటెంట్ గ్రూప్‌నకు కుకీ అనుకూల వర్గంగా పేరుంది. తమ రాష్ట్రంలో ఉంటున్న బాధితులకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పిస్తున్నామని, వదంతులు నమ్మొద్దని మిజోరం ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. బెదిరింపులు తట్టుకోలేక కొందరు మెయితీలు మిజోరం నుంచి సొంత రాష్ట్రం మణిపూర్‌కు వెళ్లిపోయినట్లు తెలిసింది. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటన మే 4న చోటుచేసుకుంది. మే 15న ఇంఫాల్‌లో 18 ఏళ్ల బాలికలపై గ్యాంగ్ రేప్ జరిగిందంటూ తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది.

గ్రీజ్ అంటిన చేతితో తాకాడని.. దళితుడి ఒంటికి మలం రాశాడు!

చత్తర్‌పూర్: అనుకోకుండా గ్రీజ్ పూసిన చేతితో తాకినందుకు ఓబీసీ కులానికి చెందిన ఓ వ్యక్తి తనకు మలం పూశాడంటూ మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ దళితుడు ఆరోపించడం కలకలం రేపుతోంది. ఈ ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. దశరథ్ అహిర్వార్ అనే వ్యక్తి బికౌరా గ్రామంలో పంచాయతీ మురుగుకాల్వ నిర్మాణ పనులు చేస్తున్నాడు. సమీపంలోని చేతి పంపు వద్ద రామ్‌కృపాల్ పటేల్ స్నానం చేస్తున్నాడు. గ్రీజ్ అంటిన చేతితో తాకడంతో ఆగ్రహించిన పటేల్ చేతిలోని మగ్గుతో మలాన్ని తీసుకువచ్చి అహిర్వార్ ముఖం, తల సహా ఒంటిపై రాశాడు. కులం పేరుతో దూషించాడు. పంచాయతీ పెద్దలు అహిర్వార్‌కు రూ.600 జరిమానా కూడా విధించారు. బాధితుడు కేసు పెట్టడంతో పటేల్‌పై కేసు నమోదయ్యాయి. వారు సరదాగా వస్తువులు విసిరేసుకున్నారు. అది కాస్తా ఇలా వికటించినట్టు విచారణలో తేలిందని పోలీసులు చెప్పారు. కాగా, మధ్యప్రదేశ్‌లోని సిద్ధి జిల్లాలో గిరిజన యువకుడిపై ఒక వ్యక్తి మూత్రవిసర్జన చేసిన ఘటనపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమైన విషయం తెలిసిందే.

ఏఎస్ఐ సర్వేపై సుప్రీంకోర్టుకు జ్ఞానవాపి మసీదు కమిటీ

న్యూఢిల్లీ: యూపీలోని వారణాసిలో ఉన్న జ్ఞానవాపి మసీదు ఆవరణలో శాస్త్రీయ సర్వే చేపట్టాలన్న వారణాసి కోర్టు ఉత్తర్వులపై మసీదు నిర్వహణ కమిటీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. తమ పిటిషన్‌పై సత్వరమే విచారణ చేపట్టాలని కోరింది. ఈ పిటిషన్ సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ముందుకు రానుంది. జ్ఞానవాపి మసీదుకు సంబంధించిన అన్ని ఉత్తర్వులపై వెంటనే స్టే ఇవ్వాలని మసీదు కమిటీ కోరుతోంది. ఇప్పటికే జూలై మొదటి వారంలోనే ఈ పిటిషన్ వేసింది. అయితే, విశ్వనాథుని ఆలయాన్ని ఆనుకుని ఉన్న జ్ఞానవాపి మసీదు ఆవరణలో సర్వే చేపట్టాలంటూ వారణాసి కోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో మసీదు కమిటీ సత్వర విచారణ కోరుతోంది.

ట్రంపెట్లోయ్... ట్రంపెట్లు...!



అల్‌ఫోర్న్.. ఇది స్విట్జర్లాండ్‌కు చెందిన జానపద సంగీత పరికరం. స్విట్జర్లాండ్‌లోని ట్రాకోయెట్ పర్వత పచ్చిక బయళ్లపై ఈ నెల 23న 22వ అంతర్జాతీయ అల్‌ఫోర్న్ ఉత్సవం జరిగింది. చివరి రోజున దేశవిదేశాల నుంచి 100 మంది వరకు అల్‌ఫోర్న్ కళాకారులు కలిసి ప్రదర్శన ఇచ్చారు.

మళ్లీ యమున ఉగ్రరూపం

- ప్రమాద హెచ్చరికను మించిన ప్రవాహం
- ఢిల్లీకి మళ్లీ వరద ముప్పు



న్యూఢిల్లీ: ఢిల్లీలో యమునా నది మరోసారి ఉగ్రరూపం దాల్చింది. ఆదివారం ప్రమాదహెచ్చరికను దాటి ప్రవహిస్తోంది. ఎగువన హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌ల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో హరియాణాలోని హత్నికుండ్ రిజర్వాయర్ నిండుకుండలా మారింది. దీంతో 2 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నెల 13న యమునలో వరద ప్రవాహం గరిష్ట స్థాయిలో 208.66 మీటర్లకు చేరింది. కొన్ని రోజులుగా ప్రమాద హెచ్చరిక 205.33 మీటర్లకు అటూ ఇటుగా ప్రవహిస్తోంది. ఆదివారం ఉదయం 205.96 మీటర్లుగా ఉన్న నీటి మట్టం సాయంత్రానికి 206.7 మీటర్లకు చేరుకుందని కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) తెలిపింది. నీటి మట్టం మరింత పెరిగే ప్రమాదముందన్న హెచ్చరికల నేపథ్యంలో ఢిల్లీలోని లోతట్టు ప్రాంతాల్లో వారం రోజులుగా కొనసాగుతున్న సహాయ పునరావాస కార్యక్రమాలకు ఆటంకం ఏర్పడేలా కన్పిస్తోంది. వరదబాధితులు సహాయక శిబిరాల్లోనే మరికొన్ని రోజులు గడపాల్సి ఉంటుందన్నారు. వజీరాబాద్ పంప్‌హౌస్‌ను వరద నీరు చుట్టుముట్టడం నగరంలోని 25% ప్రాంతంలో నాలుగైదు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. మంగళవారం తర్వాత మాత్రమే నీటి సరఫరాను పునరుద్ధరించేందుకు అవకాశాలున్నాయని అధికారులు చెప్పారు. ఈ నెల 25వ తేదీ వరకు ఎగువన ఉన్న హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌ల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ విభాగం(ఐఎండీ) హెచ్చరికలతో ఢిల్లీ యంత్రాంగం అప్రమత్తమైంది.

సీబీఎస్ఈ బోధన... ఇకపై తెలుగులో కూడా

భువనేశ్వర్: ఉన్న సీబీఎస్ఈ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) స్కూళ్లలో విద్యార్థులు ఇకపై తెలుగుతో పాటు 22 భారతీయ భాషల్లో చదువుకోవచ్చు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆదివారం ఈ మేరకు వెల్లడించారు. ప్రస్తుతం వాటిల్లో హిందీ, ఇంగ్లిష్ మీడియాల్లో మాత్రమే చదువుకునేందుకు వీలుంది. ఇకపై రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో గుర్తించిన తెలుగు, బెంగాలీ, కన్నడ, కొంకణి, మరాఠీ, పంజాబీ, సంస్కృతం, తమిళం, మైథిలి, డోగ్రీ వంటి 22 భాషల్లో తమకిష్టమైన వాటిలో చదువుకోవచ్చు. పరీక్షలు కూడా ఆయా భాషల్లోనే జరుగుతాయి.

ఆజాద్, తిలక్‌కు మోదీ నివాళులు

న్యూఢిల్లీ: స్వాతంత్య్ర యోధులు చంద్రశేఖర్ ఆజాద్, బాలగంగాధర్ తిలక్ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం వారికి ఘనంగా నివాళులర్పించారు. వారి ధైర్య సాహసాలు ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తాయంటూ ట్వీట్ చేశారు. మాతృభూమికి విముక్తి కలిగించడానికి ఆజాద్, 'పూర్ణ స్వరాజ్' నినాదంతో తిలక్ తన జీవితాన్నే త్యాగం చేశారని పేర్కొన్నారు.



ఈ ఫొటోలోని వారి చేతుల్లో ఉన్నవి చిన్నారుల మృతదేహాలు. అఫ్గానిస్తాన్‌లోని మైదాన్ వర్దాక్ ప్రావిన్స్ జల్‌రెజ్ జిల్లాలో శనివారం అర్ధరాత్రి సంభవించిన ఆకస్మిక వరదల్లో 30 మందికి పైగా మృతి చెందగా మరో 40 మంది కనిపించకుండాపోయారు. మృతుల్లో చిన్నారులు కూడా ఉన్నారు. మరో 600కు పైగా నివాసాలు పూర్తిగా, పాక్షికంగా దెబ్బతిన్నాయని, వందలాది ఎకరాల్లో పంటలు నేలకొరిగాయని తాలిబన్ ప్రభుత్వం తెలిపింది. వరదల కారణంగా రాజధాని కాబూల్–సెంట్రల్ బమియాన్ ప్రావిన్స్ రహదారిని మూసివేశారు.

సాక్షి 24|7
తమిళనాడు
TAMILNADU
సోమవారం : 24 : జూలై : 2023

రాష్ట్రంలో రూ. 6 వేల కోట్ల పెట్టుబడులు

- 10 పరిశ్రమలకు ప్రభుత్వ అనుమతి

సాక్షి, చెన్నై: రాష్ట్రంలో రూ. 6 వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు పది పరిశ్రమలు ముందుకొచ్చాయి. వీటికి మంత్రివర్గం ఆమోదించినట్లు ఆదివారం వెలుగులోకి వచ్చింది. రాష్ట్రంలో విస్తృతంగా పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ముందుకు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా మరో 10 సంస్థలు సమ్మతి తెలిపాయి. ఈ పరిశ్రమలకు అనుమతి ఇస్తూ శనివారం జరిగిన మంత్రివర్గంలో ఆమోద ముద్ర వేశారు. ఇందులో ఐఫోన్లకు చిప్‌లను తయారు చేసే పరిశ్రమ, ఫాక్స్ ఖాన్ విస్తరణ, ఎలక్ట్రానిక్ అండ్ ఆటోమొబైల్ సంస్థలతో పాటు గాద్రెజ్ నేతృత్వంలో యూపీఎస్‌ల తయారీ, మరికొన్ని సంస్థలకు అనుమతి ఇచ్చారు. వీటి ద్వారా 27 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

నేడు, రేపు కన్యాకుమారిలో గవర్నర్ పర్యటన

కొరుక్కుపేట: తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి రెండు రోజుల పర్యటన నిమిత్తం సోమవారం (జులై 24) కన్యాకుమారి వెళ్లనున్నారు. మొదటి రోజు సూర్యాస్తమయ సమయంలో ఏర్పడే అపురూప దృశ్యాలను వీక్షిస్తారు. ఆ తర్వాత రాత్రికి కన్యాకుమారిలో బస చేస్తారు. ఈనెల 25 వ తేదీ మంగళవారం గవర్నర్ ఆర్ ఎన్ రవి వివేకానంద మెమోరియల్ హాల్‌కు వెళ్లి అక్కడ ధ్యానం చేయనున్నారు. అనంతరం గవర్నర్ వివేకానంద కేంద్రాన్ని సందర్శించి కేంద్ర ప్రాంగణంలోని భారతమాత దేవాలయం, రామాయణ దర్శన చిత్ర ప్రదర్శనను సందర్శిస్తారు. తర్వాత భగవతి అమ్మన్ ఆలయం, సుసీంద్రం థనుమాలయ స్వామి ఆలయాన్ని సందర్శించి దర్శనం చేసుకోనున్నారు. ఆరోజు మధ్యాహ్నం 2 గంటలకు ఆయన చెన్నైకి బయలుదేరుతారు. గవర్నర్ పర్యటన సందర్భంగా కన్యాకుమారిలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మాజీ సీఎం కరుణానిధి బహుముఖ ప్రజ్ఞాశాలి



మాట్లాడుతున్న నటుడు రాజేష్

కొరుక్కుపేట: మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి సినీ, సాహిత్యం, రాజకీయాలతో పాటు అనేక రంగాల్లో గొప్ప కళాకారుడిగా రాణించారని నటుడు రాజేష్ కొనియాడారు. వివరాలు.. విల్లివాక్కం బస్ స్టేషన్ సమీపంలో వెస్ట్ రీజియన్ డీఎంకే తరపున కారుణానిధి శత జయంతి సందర్భంగా భారీ బహిరంగ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి పీకే శేఖర్ బాబు అధ్యక్షత వహించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా నటుడు రాజేష్ పాల్గొన్నారు. తన ప్రసంగంలో కరుణానిధి సేవలని కొనియాడారు. చెన్నై కార్పొరేషన్ మేయర్ ప్రియ, డివిజన్ కార్యదర్శి జైన్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

మారథాన్‌లో పాల్గొన్న విద్యార్థి మృతి

తిరువొత్తియూరు: మదురైలో ఆదివారం ఉదయం జరిగిన మారథాన్ పోటీల్లో పాల్గొన్న ఇంజినీరింగ్ విద్యార్థి స్పృహతప్పి పడి మృతి చెందాడు. ఈ ఘటన ఆ ప్రాంతంలో దిగ్భ్రాంతిని కలిగించింది. వివరాలు.. మదురైలో ఆదివారం కురుది కొడైనర్ రోజును పురస్కరించుకుని మారథాన్ పోటీలు జరిగాయి. ఈ పోటీలకు తిరుపరకుండ్రంలోని ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 160 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆ కళాశాలలో కల్లకురుచ్చి జిల్లా చిన్న సేలం దక్షిణ వీధికి చెందిన ముత్తు కృష్ణన్ కుమారుడు దినేష్ కుమార్ (20) ఫైనలియర్ చదువుతున్నాడు. ఇతను ఆదివారం ఉదయం ఈ పోటీల్లో పాల్గొని, తరువాత కళాశాల హాస్టల్‌కు వచ్చాడు. ఆ సమయంలో దినేష్ కుమార్‌కు హఠాత్తుగా ఫిట్స్ రావడంతో దిగ్భ్రాంతి చెందిన సహ విద్యార్థులు స్నేహితులు వెంటనే అతన్ని మదురై ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ తీవ్ర చికిత్స చేస్తున్న క్రమంలో దినేష్ కుమార్ గుండెపోటుతో మృతి చెందాడు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

భద్రతా సిబ్బందిపై కేంద్రమంత్రి ఆగ్రహం

సాక్షి, చెన్నై: భద్రతా సిబ్బంది వైఖరి కారణంగా తాను సకాలం విమానం అందుకోలేని పరిస్థితి నెలకొందని కేంద్ర సహాయ మంత్రి ఎల్. మురుగన్ ఆగ్రహం వ్యక్తం చేయడం వెలుగులోకి వచ్చింది. ఆయన ఆదివారం ఉదయం ఢిల్లీ వెళ్లాల్సి ఉంది. ఇందుకోసం ఓ విమానంలో టికెట్లు బుక్కయ్యాయి. అయితే ఆయన సకాలంలో ఆ విమానాన్ని అందుకోలేకపోయారు. ఆయన విమానాశ్రయం చేరుకున్నా, అక్కడి ప్రైవేటు భద్రతా సిబ్బంది వైఖరికారణంగా సకాలంలో లోనికి వెళ్లలేని పరిస్థితి నెలకొన్నట్లు తెలిసింది. ఆయన వెళ్లేలోపు బోర్డింగ్ ముగియడంతో వేచి ఉండిమరో విమానంలో ఢిల్లీ వెళ్లారు. ఇదే విషయాన్ని ఎల్. మురుగన్ తన సోషల్ మీడియా పోస్టు ద్వారా వెల్లడించారు.

బైక్ నడుపుతూ ఇంటి చిరునామా మరిచిన వృద్ధుడు

- రోజంతా రోడ్లపై తిరుగుతూ అగచాట్లు

అన్నానగర్: చెన్నైలోని కొలత్తూరు తిరుపతి నగర్‌కు చెందిన తిరువెంకటం (65) బైకుపై స్థానికంగా ఉండే ఓ దుకాణానికి వెళ్లేందుకు శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయలుదేరాడు. అయితే ఆ తర్వాత ఆయన జ్ఞాపకశక్తిని కోల్పోయి, ఇంటికి వెళ్లే మార్గం తెలియక రోజంతా బైకుపై కొలత్తూర్, అన్ననగర్, అమంజకరై, అరుంబాక్కంలలో చక్కర్లు కొట్టాడు. చివరికి అరుంబాక్కంలోని 100 అడుగుల రోడ్డులో అర్ధరాత్రి 1.30 గంటలకు అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ విజయకుమార్ వాహనాల తనిఖీల్లో భాగంగా వృద్ధుడిని ఆపి విచారణ చేపట్టాడు. ఈ సమయంలో తన ఇంటికి వెళ్లే దారి తెలియక రాత్రంతా రోడ్లపై తిరుగుతున్నట్లు వెల్లడించారు. దీంతో వృద్ధుడి ఇంటి చిరునామా, సెల్‌ఫోన్ నంబర్‌ను గుర్తించిన పోలీసులు కుటుంబ సభ్యులను సమాచారం అందించి ఇంటికి పంపించారు.

ముమ్మరంగా ఎన్‌ఐఏ సోదాలు

జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు చేపట్టింది. ఎస్‌డీపీఐ (సోషియల్ డెమాక్రెటిక్ పార్టీ ఆఫ్ ఇండియా) వర్గాల టార్గెట్‌గా ఆ దాడులు సాగాయి. అగ్రనేత ముబారక్ ఇంట్లోనూ తనిఖీలు నిర్వహించారు. ఆ పార్టీ నాయకుల నిరసనలు, కేంద్ర బలగాల గట్టి భద్రత మధ్య ఎన్‌ఐఏ సోదాలు సాగాయి.

- ఎస్‌డీపీఐ లక్ష్యంగా పలు జిల్లాలో అధికారుల తనిఖీలు
- చట్టపరంగా ఎదుర్కొంటామన్న ఆ పార్టీ అధ్యక్షుడు ముబారక్
- పలుచోట్ల నిరసనలు



నెల్లైలో తనిఖీలు చేస్తున్న జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు



ఎస్‌డీపీఐ కార్యకర్తల నిరసనల మధ్యే తనిఖీలకు వెళ్తున్న అధికారులు

సాక్షి, చెన్నై: కేరళలో అధికారులు ఏదైనా అక్రమ రవాణాను గుర్తించినా, సంఘ విద్రోహ శక్తులు పట్టుబడినా ఎన్‌ఐఏ దృష్టి సరిహద్దుల్లోని తమిళ జిల్లాల మీద పడడం సర్వసాధారణంగా మారింది. గతంలో కేరళలో బంగారం స్మగ్లింగ్ రాకెట్ వెలుగులోకి వచ్చిన సమయంలో పలుమార్లు రాష్ట్రంలో ఎన్‌ఐఏ అధికారులు సోదాలు చేపట్టారు. అలాగే ఇటీవల కేరళ నుంచి శ్రీలంకకు తరలిస్తున్న కోట్ల విలువైన హెరాయిన్, ఏకే 47 ఆయుధాలు, తూటాలను స్వాధీనం చేసిన సందర్భంలో తనిఖీలతో హోరెత్తించారు. రాష్ట్రంలో ప్రధాన నగరాలుగా ఉన్న చెన్నై, కోయంబత్తూరు, తిరుచ్చి, మదురైలో సోదాలు తరచూ జరుగుతున్నాయి. అదే సమయంలో కేంద్ర నిఘా వర్గాల ఆదేశాల మేరకు.. పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియాను టార్గెట్ చేసి సోదాలు జరగడం రాష్ట్రంలో కలకలం రేపింది. పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియాకు చెందిన నేతల అరెస్టులతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అలాగే కోయంబత్తూరు ఉక్కడం కోట్టై ఈశ్వరన్ ఆలయం వద్ద బాంబు పేలుడు కుట్రలో భాగంగా దగ్ధమైన కారు పేలుడు కేసు రాష్ట్రం చుట్టూనే తిరుగుతోంది. అలాగే, మంగలూరులో చోటు చేసుకున్న కుక్కర్ బాంబు పేలుడు కేసు కోయంబత్తూరు చుట్టూ చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియాకు అనుబంధంగా ఉన్న ఎస్‌డీపీఐ పార్టీని ఆదివారం జాతీయ దర్యాప్తు సంస్థ టార్గెట్ చేయడం వివాదానికి దారి తీసింది.



తిరుచ్చిలో..



పుదుక్కోట్టైలో..

ముమ్మరంగా సోదాలు

తాజాగా ఎస్‌డీపీఐను టార్గెట్ చేసిన ఎన్‌ఐఏ అధికారులు ఆదివారం ఉదయాన్నే 9 జిల్లాల పరిధిలోని 24 చోట్ల సోదాలతో హోరెత్తించారు. అయితే, ఈ వ్యవహారంలో 2019లో సేలంలో జరిగిన పీఎంకే నేత రామలింగం హత్యకేసు అస్త్రం చేసుకుని దాడులు జరగడం గమనార్హం. ఈ కేసులో ఇప్పటికే 13 మంది అరెస్టు అయ్యారు. ఈ కేసును ప్రస్తుతం ఎన్‌ఐఏ చేపట్టింది. కాగా ఎన్‌ఐఏ దాడులపై ఎస్‌డీపీఐ వర్గాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. తిరునల్వేలి మేల పాలయంలోని ఎస్‌డీఐపీ రాష్ట్ర అధ్యక్షుడు నెల్‌లై ముబారక్ ఇంట్లోనూ సోదాలు జరిగాయి. అలాగే, తంజావూరు నటరాజపురంలోని ఆ పార్టీ ముఖ్య ప్రముఖుడు మహ్మద్ బహ్రాద్దీన్, రాజేరీలోని మహ్మద్ ఫారూక్, కుంబకోణంలోని అబ్దుల్ మజీద్, తిరుబువనంలోని మహ్మద్ అలీ జిన్నా నివాసాలు కార్యాలయాల్లోనూ తనిఖీలు జరిగాయి. తిరుచ్చి, విల్లుపురం, మైలాడుతురై, కోయంబత్తూరు, కడలూరు, పుదుకోట్టైలోనూ సోదాలు హోరెత్తాయి. ఈ సోదాలను వ్యతిరేకిస్తూ ఎస్‌డీపీఐ వర్గాలు పలుచోట్ల ఎన్‌ఐఏకు వ్యతిరేకంగా ఆందోళనలకు దిగారు. కేంద్ర ప్రభుత్వాన్ని, ఎన్‌ఐఏను వ్యతిరేకిస్తూ నినాదాలను హోరెత్తించారు. ఈ సోదాలు సాయంత్రం వరకు జరిగాయి. ఇందులో ఆయా ప్రాంతాలలో సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్లు, కంప్యూటర్ హార్డ్ డిస్కులు తదితర వాటిని ఎన్‌ఐఏ అధికారులు స్వాధీనం చేసుకుని విచారణ నిమిత్తం తీసుకెళ్లారు. ఈ సోదాలను ఎస్‌డీపీఐ తీవ్రంగా వ్యతిరేకించింది.

భయపడే ప్రసక్తే లేదు..

ఈ సోదాల గురించి ఎస్‌డీపీఐ నేత ముబారక్ మీడియాతో మాట్లాడుతూ, ఈ సోదాలను చట్టపరంగా ఎదుర్కొంటామన్నారు. నాలుగేళ్ల క్రితం జరిగిన హత్య కేసును అస్త్రంగా చేసుకుని తమ పార్టీకి చెందిన వారి నివాసాల్లో సోదాలు చేయడం వెనుక రాజకీయ కక్ష ఉందని ఆరోపించారు. తన నివాసంతో పాటు తమిళనాడులో పలు చోట్ల ఈ సోదాలు జరిగినట్టు తెలుస్తోందన్నారు. దీనికి భయపడే ప్రసక్తే లేదన్నారు. ఓ వర్గానికి వ్యతిరేకంగా జరుగుతున్న పరిణామాల్లో భాగంగానే ఎస్‌డీపీఐను ప్రస్తుతం టార్గెట్ చేశా రని మండిపడ్డారు. కేంద్రంలోని బీజేపీ ప్రభు త్వం తరచూ ఎన్‌ఐఏను ఉసి గొల్పి తమిళనాడులోని మైనారిటీలపై దాడులు చేయిస్తోందని ధ్వజ మెత్తారు. సంబంధం లేని ఈ కేసుల్లో కూడా ఎస్‌డీపీఐను లక్ష్యంగా చేసుకుంటూ ఎన్‌ఐఏను కేంద్రం ఉసిగొల్పుతోందని ఆరోపించారు. ఇలాంటి అక్రమ కేసులకు, దాడులకు భయపడబోమని తేల్చిచెప్పారు. ఇది పునరావృతమైన పక్షంలో తమిళనాడు ప్రజల ఆగ్రహాన్ని రుచి చూపించాల్సి ఉంటుందని కేంద్రాన్ని హెచ్చరించారు.



మీడియాతో మాట్లాడుతున్న ముబారక్

తమిళనాడుకు రండి!

- మణిపూర్ క్రీడాకారులకు సీఎం పిలుపు



సాక్షి, చెన్నై : అల్లర్లకారణంగా సతమతం అవుతున్న మణిపూర్ క్రీడాకారులకు సీఎం ఎంకే స్టాలిన్ ఆహ్వానం పలికారు. తమ రాష్ట్రానికి వచ్చి శిక్షణ పొందాలని పిలుపు నిచ్చారు. మణిపూర్‌లో గత మూడు నెలలుగా చోటు చేసుకుంటున్న పరిణామాలు యావత్ దేశాన్ని కలవరంలోకి నెట్టిన విషయం తెలిసిందే. ఇక్కడి పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని సేవ్ మణిపూర్ నినాదంతో ఆందోళనలు రాష్ట్రవ్యాప్తంగా సాగుతోన్నాయి. అదే సమయంలో మణిపూర్‌లో అథ్లెటిక్స్ అధికంగా ఉన్నారు. ఈ అల్లర్ల నేపథ్యంలో జాతీయ, అంతార్జతీయ పోటీలకు సిద్ధం అవుతున్న క్రీడాకారులు సాధన చేయలేని పరిస్థితి నెలకొంది. దీనిని పరిగణనలోకి తీసుకున్న సీఎం స్టాలిన్ మణిపూర్ క్రీడాకారులను ఆహ్వానిస్తూ లేఖ రాశారు. మణిపూర్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో క్రీడాకారులు సాధన చేయలేని పరిస్థితి ఉందని గుర్తుచేశారు. దేశంలోనే కనీ విని ఎరుగని రీతిలో అరచకాలు పెట్రేగి ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో క్రీడాకారులు అక్కడ సాధన చేయలేని పరిస్థితి ఉండటాన్ని తాము పరిగణించామన్నారు. మణిపూర్‌లో పరిస్థితులు సద్దుమణిగే విధంగా సర్వ ప్రయత్నాలు చేస్తున్నారని గుర్తు చేస్తూ, క్రీడాకారులు తమ సాధనను కొనసాగించేందుకు వీలుగా తమిళనాడులోకి ఆహ్వానిస్తున్నామన్నారు. ఇక్కడకు వచ్చి క్రీడాకారుల శిక్షణ పొందవచ్చు అని వారికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇప్పటికేక్రీడా శాఖ మంత్రి ఉదయ నిధి స్టాలిన్‌ను ఆదేశించామని, మణిపూర్‌న నుంచి వచ్చే క్రీడాకారుల కోసం ఏర్పాట్లు విస్తృతం చేయాలని, ఎలాంటి లోటు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు సీఎం స్టాలిన్ వివరించారు. అలాగే తమిళనాడుకు వచ్చి శిక్షణ పొందేందుకు ఉత్సాహం ఉన్న క్రీడాకారుల కోసం ప్రత్యేక వెబ్‌సైట్, ఫోన్ నంబర్లను సీఎం ప్రకటించారు. తమిళనాడులో జాతీయ, అంతర్జాతీయ పోటీలకు శిక్షణ పొందేందుకు తగినట్టు అన్ని అవకాశాలు ఉన్నాయని సీఎం వివరించారు. ఇదిలా ఉండగా, మణిపూర్‌లో శాంతియుత వాతావరణం కల్పించేందుకు ప్రధాని నరేంద్రమోదీ చర్యలు తీసుకోవాలని కోరుతూ డీఎంకే ఎంపీ కనిమొళి నేతృత్వంలో వళ్లువర్ కోట్టంలో ఆదివారం సాయంత్రం నిరసన చేపట్టారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా డీఎంకే మహిళా విభాగం నేతృత్వంలో మణిపూర్‌ను రక్షించాలనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని నగరాల్లో ధర్నా చేస్తామని ప్రకటించారు.

ధరల కట్టడిలో డీఎంకే విఫలం



మద్దతుదారులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న శశికళ

సాక్షి, చెన్నై : రాష్ట్రంలో పెరుగుతున్న కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరల కట్టడిలో డీఎంకే పూర్తి విఫలమైందని దివంగత సీఎం జయలలిత నెచ్చెలి శశికళ ధ్వజమెత్తారు. ఈరోడ్, తిరుప్పూర్, సేలం జిల్లాలలో పర్యటనలకు శనివారం సాయంత్రం చిన్నమ్మ శశికళ శ్రీకారం చుట్టారు. ఆదివారం ఆమె సేలం- ఈరోడ్ సరిహద్దుల్లో పర్యటించి తన మద్దతుదారులతో మమేకమయ్యే విధంగా ముందుకెళ్లారు. తిరుప్పూర్‌లోని భవానీ, అందియూరు, సేలం జిల్లా మేట్టూరులలో జరిగిన రోడ్ షోలలో ఆమె మద్దతు దారులను ఉద్దేశించి ప్రసంగించారు. దివంగత నేతలు ఎంజీఆర్, జయలలిత ఆశయ సాధనే లక్ష్యంగా తన ప్రయాణం ఉంటుందన్నారు. పార్టీని కొందరు వారి గుప్పెట్లోకి తీసుకున్నారని పేర్కొంటూ, వారి ఆగడాలకు కల్లెం వేసే సమయం ఆసన్నమైందన్నారు. దివంగత అమ్మ జయలలిత ఎల్లవేళలా ప్రజాహితాన్ని కాంక్షించే వారని, అయితే, ఇప్పుడు పార్టీని గుప్పెట్లో పెట్టుకున్న వాళ్లు, వారి స్వలాభం కోసం పాకులాడుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలోడీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినానంతరం ప్రజలు అష్ట కష్టాలు పడుతున్నారని వివరించారు. ఓ వైపు కాయగూరల ధరలు, మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు మండుతోంటే, ఈ పాలకులు ప్రజల నెత్తిన భారం మోపే విధంగా పలు రకాల పన్నులు, చార్జీల వడ్డనతో ముందుకెళ్తుండటం శోచనీయమని మండిపడ్డారు.

ఏడుగురిపై గూండా యాక్ట్

- పోలీస్ కమిషనర్ సందీప్ వెల్లడి

తిరువొత్తియూరు: చెన్నైలో దారి దోపిడీ కేసులో అరెస్ట్ అయిన ఏడుగురిపై గూండా యాక్ట్ నమోదు చేయాలని పోలీస్ కమిషనర్ సందీప్ రాయ్ ఆదేశాలు జారీ చేశారు. ఇందులో నిందితులైన సలీం (21), మడిపాక్కం ప్రాంతానికి చెందిన ఆరివాల్ అరుణాచలం (24) షాకార్‌పేటకు చెందిన సెల్వరాజు (44) గంజాయి కేసులో అరెస్ట్ అయిన నామక్కల్ జిల్లా తిరుచెంగోడు ప్రాంతానికి చెందిన ఈశ్వర మూర్తి (29), మత్తు పదార్థాలు కలిగి ఉన్న చూలైమేడు అవ్వైనగర్‌కు చెందిన తాజుద్దీన్ (39) సెల్‌ఫోన్ చోరీ కేసులో అరెస్టయ్యి సైదాపేట కొత్వాల్ చావడి వీధికి చెందిన తోట ప్రవీణ్ (23) చట్టవిర్ధంగా కిల్లర్ ట్యాబ్లెట్లను కలిగి ఉన్న షణ్ముఖ్ (26) పేర్లను చేర్చినట్లు వెల్లడించారు.

ఇల్లాలి అప్పలతో.. కుటుంబం బలవన్మరణం

- నలుగురి ఆత్మహత్య
- కోవైలో దారుణం

సాక్షి,చెన్నై: కట్టుకున్న భార్య ఇష్టానుసారంగా చేసిన అప్పుల కారణంగా ఓ భర్త కుంగిపోయాడు. తీసుకున్న అప్పులు చెల్లించాలని ఒత్తిడి పెరగడంతో కుటుంబం అంతా ఆత్మహత్యకు పాల్పడింది. ఆదివారం ఈ దారుణ ఘటన కోయంబత్తూరులో వెలుగు చూసింది. వివరాలు.. కోయంబత్తూరు నగరం పరిధిలోని వడ వెళ్లి వేంబు అవెన్యూలోని ఆ బహుళ అంతస్తుల భవనంలోకి కొంతకాలం క్రితం రాజేష్ (34) కుటుంబం అద్దెకు చేరింది. రాజేష్ ఇంజినీరుగా పనిచేస్తూ వచ్చాడు. అతడి భార్య లక్ష్య(29) ఫ్రెంచ్ కోర్సులో పట్ట భద్రురాలు. వీరికి యక్షిత(10) అనే కుమార్తె ఉంది. వీరితో పాటు రాజేష్ తల్లి ప్రేమ (70) ఆ ఇంట్లో ఉన్నారు. వీరి ఫ్లాట్ తలుపులు గత రెండు రోజులుగా తెరచుకోలేదు. ఆదివారం ఉదయం దుర్వాసన రావడంతో ఇరుగు పొరుగువారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి తలుపు పగల కొట్టి చూడగా, ఓ గదిలో రాజేష్ ఉరివేసుకుని మరణించి ఉండటం వెలుగు చూసింది. మరో గదిలో లక్ష్య, యక్షిత, ఇంకో గదిలో ప్రేమ విషం తాగి మరణించి ఉండడం వెలుగు చూసింది. ఆ ఇంట్లో లభించిన లేఖతో వీరు ఆత్మహత్య చేసుకున్నట్లు తేలింది. నాలుగో తరగతి విద్యార్థిని అయిన తన కుమార్తె చదువుతున్న పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఒకరితో తన భార్యకు పరిచయం ఏర్పడిందని రాజేష్ ఆలేఖలో వివరించాడు. అతడి వద్ద కొంత మొత్తాన్ని తన భార్య అప్పుగా తీసుకుని ఉందని, అతడికి కావాల్సి వ్యక్తులు వద్ద కూడా అప్పులు చేసి ఆ సొమ్మును ఏం చేసిందో తనకు తెలియదని పేర్కొన్నాడు. ప్రస్తుతం ఆ అప్పు మొత్తం 31 లక్షలకు చేరిందని వివరించాడు. ఈ సొమ్ము చెల్లించాలని సంబంధిత ఉపాధ్యాయుడు, అతడికి చెందిన వారు ఒత్తిడి తెస్తూవచ్చారని, ఈ అప్పు చెల్లించలేని పరిస్థితుల్లో తామంతా ఆత్మహత్య చేసుకుంటున్నట్టు ఆ లేఖలో రాజేష్ పేర్కొన్నాడు. దీంతో వీరికి అప్పు ఇచ్చిన వారి వద్ద పోలీసులు విచారిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కోయంబత్తూరు ఆసుపత్రికి తరలించారు. వీరికి స్నేహితులు,బంధవులు ఎవరైనా ఉన్నారా..? అని విచారిస్తున్నారు. రాజేష్ కుటుంబానికి సన్నిహితంగా ఎవరూ లేదని తేలడంతో ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం మార్చురీలోనే ఉంచారు. సోమవారం లేదా మంగళవారం వారి అంత్యక్రియల విషయంపై అధికారులు నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు.

కూడంకుళంలో విద్యుత్ ఉత్పత్తి పునఃప్రారంభం

తిరువొత్తియూరు: సాధారణ వార్షిక మరమ్మతులు, ఇంధన వాయువులు నింపే పని పూర్తయిన క్రమంలో కూడంకుళం- 2వ అణు విద్యుత్ కేంద్రంలో తిరిగి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైంది. నెల్‌లై జిల్లా కూడంకులంలో తలా 1,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన సామర్థ్యం కలిగిన రెండు యూనిట్లు కేంద్రాలు ఉన్నాయి. ఈ ఏడాది మే నెల 7వ తేదీ వార్షిక మరమ్మతుల కోసం అణు విద్యుత్ కేంద్రం -2లో ఉత్పత్తిని నిలిపివేశారు. ఇండియా, రష్యా శాస్త్రవేత్తలు ఆధ్వర్యంలో మరమ్మతులు పనులు చేపట్టారు. దీంతో శనివారం మధ్యాహ్నం నుంచి విద్యుత్ ఉత్పాదన పునః ప్రారంభమైంది. ప్రస్తుతం 240 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సాగుతోందని అధికారులు వెల్లడించారు.

ద్రవిడ మోడల్‌కు వ్యతిరేకంగా నిరసనలు

- రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ఆందోళనలు



ఆవడిలో నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

సాక్షి, చెన్నై : డీఎంకే ద్రవిడ మోడల్ పాలనను వ్యతిరేకిస్తూ బీజేపీ నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం ఆందోళన కార్యక్రమాలు జరిగాయి. మొత్తం 10 రిమాండ్లను నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆపార్టీ నాయకులు డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై పిలుపు మేరకు ఆదివారం ఉదయం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలు, నగర, పట్టణాలలో ఆ పార్టీ నేతృత్వంలో నిరసన కార్యక్రమాలను నేతలు హోరెత్తించారు. డీఎంకే ద్రవిడ మోడల్ పాలనను వ్యతిరేకిస్తూ, అవినీతి అక్రమాల్లో డీఎంకే పాలకులు వైఖరిని ఎత్తి చూపుతూ, మహిళలు అందరికీ రూ. 1000 నగదు పంపిణి చేయాలని కోరారు. టాస్మాక్ మద్యం దుకాణాలను మూసివేయాలని, నిత్యావసర వస్తువుల ధరను కట్టడి చేయాలని నినాదాలతో హోరెత్తించారు. చెన్నైలోనూ పలు చోట్ల నిరసన కార్యక్రమాలు జరిగాయి. షోలింగనల్లూరులో జరిగిన నిరసనలో పార్టీ అధ్యక్షుడు అన్నామలై మాట్లాడుతూ,అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో డీఎంకే పాలకులు అవినీతి అక్రమాలకు హద్దే లేకుండా పోయిందన్నారు. విద్యుత్ చార్జీల వడ్డన, ఆస్తిపన్ను పెంపు, రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు, వాహన రిజిస్ట్రేషన్ల పెంపు అంటూ ప్రజల నెత్తిన భారం వేసే విధంగా ఈ పాలకులు ముందుకెళ్తున్నారని ధ్వజమెత్తారు. డీఎంకే పాలకులకు గుణపాఠం చెప్పే విధంగా రానున్న ఎన్నికల్లో ప్రజలు నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లోకి క్రీడాకారులకు ఎలాంటి శిక్షణ ఇవ్వాలి, వారిని ఎలా ఆదుకోవాలో కేంద్రానికి తెలుసునని, సీఎం స్టాలిన్ ఈ వ్యవహారంలో మొసలి కన్నీరు కార్చడం శోచనీయమని విమర్శించారు. ఇక, తిరునల్వేలి, కన్యాకుమారి, కోయంబత్తూరు, ఈరోడ్, తిరుప్పూర్‌లో బీజేపీ నిరసనలు హోరెత్తాయి.అలాగే చెన్నైలో ఆవడి దక్షిణమండలం 44వ వార్డులో శక్తి కేంద్రం నిర్వాహకులు డాక్టర్ నాగభూషణం నేతృత్వంలో ఆధ్యాత్మిక విభాగం జిల్లా కార్యదర్శి రాజు నాయకత్వంలో నిరసన కార్యక్రమం జరిగింది. నాయకులు నిత్యానందం, గోపీ తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగి ముగ్గురు విద్యార్థుల దుర్మరణం

సాక్షి, చెన్నై: కోయంబత్తూరు పెరియనాయన్ పట్టిసమీపంలోని స్నానానికి వెళ్లి ముగ్గురు విద్యార్థులు మృతి చెందారు. కోయంబత్తూరు అరవచెట్టిపుదురుకు చెందిన సంతప్ కుమారుడు నితీష్(16) స్థానికంగా ఓ పాఠశాలలో చదువుతున్నాడు. అతడి పాటు అదే ప్రాంతానికి చెందిన మురుగేషన్ కుమారుడు విష్ణు(19), ఓ కళాశాలలో తొలి సంవత్సరం చదువుతున్నాడు. ఈ ఇద్దరితోపాటు మరో నలుగురు మిత్రులు ధనూష్, లోకరాజ్, సరేంద్ర, నిత్యానందం శనివారం సాయంత్రం కనిపించకుండా పోయారు. రోజు వీరు సమీపంలోని కొలనులో సాయంత్రం పూట స్నానానికి వెళ్లేవారిని విచారణలో తేలింది. దీంతో వీరి కోసం గాలించారు. ఎక్కడ జాడ కనిపించలేదు. ఆదివారం ఇందులో ముగ్గురి మృతదేహాలు బయపట పడ్డాయి. అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్లు జరిపిన గాలింపులో ఈ మృతదేహాలు వెలుగు చూశాయి. మిగిలిన ముగ్గురు మిత్రులు భయంతో ఆ పరిసరాల్లో స్పృహ తప్పి పడిపోయి ఉండడం వెలుగు చూసింది. మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మిత్రులు తమకళ్ల ముందే నీటముగి పోవడాన్ని చూసి సాయం కోసం కేకలు పెట్టి చివరికి విద్యార్థులు స్పృహ తప్పినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు.

చెన్నై సోమవారం । 24 । జూలై । 2023 సాక్షి

భక్తజన సంద్రం

అమ్మవారి ఆలయాలకు పోటెత్తిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న పుట్లూరు అంకాళపరమేశ్వరి


పూంగావనత్తమ్మ ఆలయం వద్ద కర్పూరం వెలిగిస్తున్న భక్తులు


పెద్దపాళ్యం భవానీ అమ్మవారి ఆలయంలో..

తిరువళ్లూరు: ఆషాడమాసం మొదటి ఆదివారం కావడంతో జిల్లావ్యాప్తంగా ఉన్న అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఏటా ఆషాడమాసంలో ప్రత్యేకంగా అమ్మవారి ఆలయాల్లో పూజలు నిర్వహించడం ఆనవాయతీ. ఇందులో భాగంగానే మొదటి ఆదివారం కావడంతో గ్రామాల్లో గ్రామదేవతకు అంబిలిపోయడం, పాలాభిషేకాలు చేపట్టారు. తిరువూరులోని ఓసూరమ్మ ఆలయంలో భక్తులు పాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి అభిషేకం చేశారు. అనంతరం రాత్రి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో ఊరేగించారు. పుట్లూరులోని శ్రీ అంకాళపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచి ఆరాధన పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులు సుమారు నాలుగు గంటల పాటు క్యూలో వేచి ఉండి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు అమ్మవారికి గాజులు, చీర, పసుపు కుంకుమ, మంగళసూత్రం, వేపాకు, నిమ్మపండు తదితర వాటిని నైవేద్యంగా పెట్టి మొక్కుబడి చెల్లించుకున్నారు. కాగా అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు ప్రసాదంతో పాటు అన్నదానం చేశారు.

భవానీ అమ్మవారి ఆలయంలో మంత్రి శేఖర్‌బాబు

పెద్దపాళ్యంలో ప్రసిద్ధి చెందిన శ్రీ భవానీ అమ్మవారి ఆలయంలో రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి శేఖర్ బాబు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరితో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. భక్తులకు ఇబ్బంది రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. క్యూలలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, భక్తులకు ఇబ్బందులు రాకుండా మౌలిక సదుపాయాలను కల్పించాలని సూచించారు. కాగా ఆషాడమాసం మొదటి ఆదివారం కావడంతో స్వయంభు అమ్మవారికి నవకలశ పూజలు, మూర్తి హోమం, మహాభిషేకం, విశేషపూజ, అలంకరణ, జ్యోతిదర్శనం తదితర పూజలను నిర్వహించారు. సాయంత్రం సూర్యప్రభ వాహనంలో అమ్మవారు ఉమామహేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మొత్తానికి ఆషాడమాసం మొదటి వారం కావడంతో అమ్మవారి ఆలయాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా కనిపించింది.


పుట్లూరులో భక్తుల రద్దీ


అమ్మవారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు


భవానీ అమ్మవారిని దర్శనం అనంతరం వెలుపలికి వస్తున్న మంత్రి శేఖర్‌బాబు

క్లుప్తంగా

గంధపు చెట్లు నరికిన ఐదుగురి అరెస్ట్

తిరువొత్తియూరు: నీలగిరి జిల్లా కొత్తగిరి సమీపంలో గంధపు చెట్లు నరికిన అయిదుగురిని ఐటీ శాఖ అధికారులు అరెస్టు చేశారు. నీలగిరి జిల్లా కోత్తగిరి సమీపంలో అటవీ ప్రాంతం కంబట్టి, కంబై తదితర ప్రాంతాల్లో రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు తిరుగుతున్నట్లు సమాచారం అందింది. దీంతో పోలీసులు కంబట్టి, కంబై వెళ్లే మార్గంలో ప్రైవేటు వారికి చెందిన స్థలంలో గంధపు చెట్టును కొట్టి దుంగలు తరలించారు. పోలీసులు గుర్తించి వెంబడించడంతో పారిపోవడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. గంధపు దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులకు రూ. 2 లక్షలు జరిమానా విధించారు.

చోరీ కేసులో ముగ్గురు మహిళల అరెస్టు

తిరువొత్తియూరు: మదురై జిల్లా సెమ్మనార్ ఆలయ ప్రాంతంలో చోరీ కేసులో ముగ్గురు మహిళలను పోలీసులు అరెస్టు చేశారు. మదురై జిల్లా వాడిపట్టి తాలూకా అలంగానల్లూర్ సందిమేట్టు వీధికి చెందిన వెంకటేష్ భార్య అంజమ్మాల్ అలియాస్ రేఖ (47), తంజై జిల్లా పేరా ఊరని తాలూకా కలినివాసల్ షోలనర్ ఆ ప్రాంతానికి చెందిన పక్రీ సామీ భార్య రాణి (48), కోవై జిల్లా ఉక్కడం ఆత్తుపాలెం ప్రాంతానికి చెందిన భువనేశ్వర్ భార్య నదియా (37) వీరు బస్సుల్లో వెళ్తున్న మహిళ వద్ద నగలు, నగదు చోరీ చేస్తున్నట్లు పలు ఫిర్యాదులు అందాయి. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి ముగ్గరి కోసం గాలించారు. ఈ క్రమంలో మైలాడుదురై జిల్లా సెమ్మనార్ ఆలయ పోలీసు పరిధికి చెందిన ప్రాంతంలో వేరువేరు స్థలాల్లో ఆ ముగ్గురినీ అరెస్టు చేశారు. అనంతరం తిరుచంపల్లి కోర్టులో హాజరుపరిచి తిరుచ్చి మహిళల సెంట్రల్ జైలుకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

తిరువళ్లూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని భవాని అమ్మవారి ఆలయానికి పాదయాత్రగా వెళుతున్న వృద్ధుడు మృతిచెందాడు. తిరువళ్లూరు జిల్లా ఊత్తుకోట తాలూకా మేల్‌చిట్రంబాక్కం గ్రామానికి చెందిన బాలురెడ్డి కుమారుడు రాజగోపాల్(73) పెద్దపాళ్యంలోని భవానీ అమ్మవారి ఆలయానికి పాదయాత్రగా బయలుదేరాడు. తారాచ్చి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తలకు తీవ్రగాయమైన రాజగోపాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఊత్తుకోట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆర్గనైజర్ పోస్టులకు దరఖాస్తు గడువు పొడిగింపు

కొరుక్కుపేట: యూనియన్, సిటీ, ఏరియా, సబ్ ఆర్గనైజర్, డిప్యూటీ ఆర్గనైజర్ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు యూత్ వింగ్ సెక్రటరీ, మంత్రి ఉదయనిధి స్టాలిన్ తాజాగా గడువును మరోసారి పొడిగించారు. ఈ మేరకు డీఎంకే యూత్ లీగ్ కార్యదర్శి ఉదయనిధి స్టాలిన్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. డీఎంకే యువజన బృందంలో జిల్లా, రాష్ట్ర, నగర ఆర్గనైజర్లు, సబ్ ఆర్గనైజర్ల నియామక ప్రక్రియ తాజాగా చేపట్టనున్నారు. ఈ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 31 గడువు పొడిగించినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాల వారీగా ఇంటర్వ్యూ తేదీలను తర్వాత ప్రకటిస్తామన్నారు.

మహిళా పోలీసు ఆత్మహత్య

అన్నానగర్: కోయంబత్తూరులో ఆదివారం ఓ పోలీసు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపింది. విల్లుపురం జిల్లా సెమ్మార్ గ్రామానికి చెందిన సుగంతి(25) చెన్నైలోని సెంట్రల్ సెక్రటేరియట్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తోంది. ఆమె తన సోదరుడు సుబ్బరాయన్‌తో కలిసి కోయంబేడు సీమతమ్మన్ నగర్‌లో నివసిస్తోంది. శనివారం పని ముగించుకుని ఇంటికి వచ్చిన సుగంది తన ప్రియుడు విష్ణుకి ఫోన్ చేసింది. అతడు ఆమె నంబరను బ్లాక్ లిస్ట్‌లో పెట్టడంతో మనస్తాపం చెందిన ఆమె ఆదివారం వంటగదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శరవేగంగా అధిగత్తూరు ఆనకట్ట నిర్మాణం


నిర్మాణంలో ఉన్న ఆనకట్ట

తిరువళ్లూరు: వర్షపు నీటిని ఆదా చేయడంతో పాటు.. సమీప ప్రాంతాల్లో భూగర్భ జల మట్టాన్ని పెంచడానికి గాను ప్రభుత్వం అధిగత్తూరు వద్ద ఓ ఆటకట్ట నిర్మిస్తోంది. ఈ ఆనకట్ట పనులు ప్రస్తుతం 85 శాతం పూర్తయ్యాయి. ఆ ఆనకట్ట అందుబాటులోకి వస్తే 20 గ్రామాలకు లబ్ధి చేకూరనుంది. తిరువళ్లూరు జిల్లా కేశవరం ప్రాంతంలోని కల్లు నది నుంచి వేరుపడి కూవం నది ప్రవహిస్తుంది. ఈ కూవం నది పేరంబాక్కం, కడంబత్తూరు, మనవాలనగర్, అరణ్‌వాయల్, పుదుసత్రం, జమీన్‌కొరట్టూరు ప్రాంతాల మీదుగా సుమారు 72 కిమీ దూరం ప్రవహించి చెన్నై నేపియర్ బ్రిడ్జి వద్ద బంగాళఖాతంలో కలుస్తుంది. ఈ నేపథ్యంలో కూవం నది మధ్యలో కేశవరం, జమీన్‌కొరట్టూరు తదితర రెండు ప్రాంతాల్లో 50 ఏళ్ల క్రితం ఆనకట్టను నిర్మించి సుమారు రెండు టీఎంసీల నీటిని ఆదా చేస్తున్నారు. ఈ ఆనకట్ట ద్వారా సుమారు 27 గ్రామాలకు సాగునీరు, తాగునీరు ఇబ్బందులు రాకుండా చూడడంతో పాటు భూగర్భ జలాలను పెంచడానికి ఉపయోగపడుతోంది. అయితే అధిక వర్షాలు పడే సమయంలో ప్రవాహం పోటెత్తడంతో నీటిని ఆదా చేసేందుకు రెండు ఆనకట్టలు సరిపోవడం లేదు. తద్వారా వందలాది టిఎంసీల నీరు వృతాగా పోతోంది. దీంతో అదనపు ఆనకట్టలను నిర్మించాలని గత పదేళ్ల నుంచి రైతులు పోరాటం చేస్తున్నారు. ఇందులో భాగంగానే పింజివాక్కం, పుట్లూరు వద్ద మరో రెండు ఆనకట్టలను ఐదేళ్ల క్రితం నిర్మించారు. ఈ క్రమంలోనే కూవం నదిలో అధిగత్తూరు – ఏకాటూరు వద్ద మరో ఆనటక్టను నిర్మించడానికి ప్రభుత్వం రూ.17.70 కోట్లు కేటాయించింది. ఈ పనులు గత ఫిబ్రవరిలో ప్రారంభించారు. సుమారు 200 మీటర్లు పొడవు,ఐదు అడుగుల మేరకు ఎత్తుతో పాటు ఆటోమెటిక్ షట్టర్‌లను అమర్చి నిర్మించనున్నారు. ఈ పనులు ప్రస్తుతం 85 శాతం పూర్తయింది. మిగిలిన పనులను సైతం త్వరగా పూర్తీ చేసి ఆగస్టులో అందుబాటులోకి తేనున్నారు. కాగా ఆనకట్ట ద్వారా 0.50 టీఎంసీల నీటిని ద్వారా నిల్వ చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు.

ఖాళీ బిందెలతో మహిళల ధర్నా


ధర్నా చేస్తున్న మహిళలు

వేలూరు: వేలూరు కార్పొరేషన్ పరిధిలోని అన్ని వార్డులోను కావేరి తాగునీటి పథకం కింద తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే తాగునీటిని సరఫరా చేసే పైపు లైన్‌లు విరిగి పోవడంతో గత వారం రోజులుగా వేలూరు సైదాపేట ప్రాంతంలో తాగునీరు సరఫరా కావడం లేదని తెలుస్తుంది. వీటిపై వార్డు కార్పొరేటర్, కార్పొరేషన్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఆగ్రహించిన మహిళలు ఖాళీ బిందెలతో ఆర్కాడు-వేలూరు రోడ్డుపై రాస్తారోకో నిర్వహించి నినాదాలు చేశారు. వారం రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మహిళల ధర్నా కారణంగా అర్ధగంట పాటు ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు మహిళలతో చర్చించి ఆందోళన విరమింపజేశారు.

కోలీవుడ్ టాక్స్

యోగిబాబు హీరోగా వానవన్

తమిళసినిమా: కథానాయకుడిగా, హాస్యనటుడిగా ప్రేక్షకులను అలరిస్తున్న నటుడు యోగిబాబు. తాజాగా హీరోగా నటిస్తున్న చిత్రం వానవన్. ఎడెన్ ఫ్లిక్స్ ప్రొడక్షన్స్ పతాకంపై థామస్ రెన్ని జార్జ్ నిర్మిస్తున్న చిత్రం ఇది. ఈయన గత ఏడాది నటి సాయిపల్లవి ప్రధానంగా పోషించిన హిట్ చిత్రం గార్గికి సహ నిర్మాత కావడం గమనార్హం. కాగా మలయాళ దర్శకుడు సజన్ కె.సురేంద్రన్ ఈ చిత్రం ద్వారా మలయాళంలో మాస్కురేట్ అనే వెబ్‌సిరీస్‌ను తెరకెక్కించిన మొట్టమొదటి దర్శకుడిగా గుర్తింపు పొందారు. ఇందులో యోగిబాబుతో పాటు రమేష్ తిలక్, కాళీ వెంకట్, లక్ష్మీప్రియా, చంద్రమౌళి, మాస్టర్ శక్తి రిత్విక్, లవ్ టుడే ప్రార్ధన నాదన్, కల్కి రాజా తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. చిత్ర దర్శకుడు తెలుపుతూ ఇది ఫీల్‌గుడ్ ఫాంటసీ చిత్రంగా ఉంటుందన్నారు. అదే సమయంలో యోగిబాబు స్టైల్‌లో వినోద భరిత సన్నివేశాలు చోటు చేసుకుంటాయన్నారు. ఆబాల గోపాలాన్ని అలరించే విధంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు చెప్పారు. ప్రేక్షకులందరికీ సరికొత్త అనుభూతిని కలిగిస్తుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. చిత్ర షూటింగ్ మదురై, చెన్నైలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. షూటింగ్ చివరి దశకు చేరుకుందని తెలిపారు. కాగా శనివారం పుట్టిన రోజు సందర్భంగా వానవన్ చిత్ర టైటిల్‌ను, మోషన్ పోస్టర్‌ను సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్, మావీరన్ చిత్ర దర్శకుడు మడోన్ అశ్విన్ ఆన్‌లైన్ ద్వారా విడుదల చేసినట్లు తెలిపారు. ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు.


వానవన్ చిత్ర వర్కింగ్ స్టిల్

కంగువా గ్లింప్స్ అదుర్స్


కంగువా చిత్రంలో సూర్య

తమిళసినిమా: సూర్య కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం కంగువా. బాలీవుడ్ బ్యూటీ దిశ పటాని కథానాయకిగా నటిస్తున్న ఈ చిత్రాన్ని శివ దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ సంస్థతో కలిసి స్టూడియో గ్రీన్ సంస్థ అధినేత జ్ఞానవేల్ రాజా అత్యంత భారీ బడ్జెట్‌లో నిర్మిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ చిత్ర గ్లింప్స్‌ను నటుడు సూర్య పుట్టినరోజు సందర్భంగా శనివారం అర్ధరాత్రి 12.01 నిమిషానికి విడుదల చేశారు. శత్రు మూకను చీల్చి చెండాడిన కంగువాకు సంబంధించిన ఈ గ్లింప్స్ సిల్వర్ స్క్రీన్ వండర్స్ అనే చెప్పాలి. చిత్రంలో సూర్య గెటప్పే అదిరిపోయింది. కంగువా పాత్రను పరిచయం చేస్తూ బ్యాగ్రౌండ్ సంభాషణలు చాలా గంభీరంగా ఒళ్లు గగుర్పాటుకు గురి చేసే విధంగా చోటు చేసుకున్నాయి. అందులో తమ ద్వీపాన్ని ఉద్ధరించడానికి ఉదయించిన ఒకే ఒక్క వీరుడు కంగువా అనే డైలాగ్ సూర్య పాత్రను ఎలివేట్ చేస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన గ్లింప్స్‌ను తమిళం, తెలుగు, కన్నడం, మలయాళం, హిందీ, ఆంగ్లం ఆరు భాషల్లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో చిత్ర దర్శకుడు శివ మాట్లాడుతూ కంగువా అంటే అగ్నిపుత్రుడు (సన్ ఆఫ్ ఫైర్) అని పేర్కొన్నారు. 1500 ప్రాంతంలో మొదలై సమకాలిన ఘటనల వరకు ఈ చిత్ర కథ సాగుతుందన్నారు. చిత్ర షూటింగ్ గోవా, కొడైక్కెనాల్ ప్రాంతంలోని దట్టమైన అడవుల్లో నిర్వహించినట్లు చెప్పారు. ఈ చిత్రంలో సూర్య నూరు శాతం అంకిత భావంతో నటిస్తున్నారని చెప్పారు. ఇప్పటి వరకు నిర్వహించిన షూటింగ్ బ్రహ్మాండంగా వచ్చిందనే సంతృప్తిని వ్యక్తం చేశారు. చిత్రాన్ని ఎక్కడా రాజీపడకుండా రూపొందించాలని నిర్ణయించుకున్నట్లు, అందుకే చిత్ర విడుదల విషయంలో తొందర పడడం లేదని, అయితే 2024లో కంగువా చిత్రం తెరపైకి వస్తుందని చెప్పారు. కాగా చిత్రాన్ని 10 భాషల్లో 3డీ ఫార్మెట్లో విడుదల చేయనున్నట్లు నిర్వాహకుడు ధనుంజయన్ తెలిపారు.

ఆగస్టు 4న తెరపైకి కల్లరై


దీప్తి దివాన్

తమిళసినిమా: హారర్, థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన కథా చిత్రాలకు మినిమం గ్యారెంటీ ఉంటుంది. అందుకే ఈ తరహా చిత్రాలకు ప్రత్యేకంగా సీజన్ అంటూ ఉండదు. అలాంటి విభిన్న కథాంశంతో రూపొందిన చిత్రం కల్లరై. గుడ్‌న్యూస్ ఫిలిమ్స్ పతాకంపై పొన్నేరి రతి జవగర్ నిర్మించిన ఈ చిత్రంలో సకో రమేష్, దీప్తి దివాన్ హీరో హీరోయిన్లుగా నటించగా, రతి జవహర్, టి.జవహర్ జ్ఞానరాజ్, వి.యశోద, ప్రేమప్రియా, రోషిలా భారతీ మోహన్, సురేందర్ హరిహరన్, సురేష్, రామ్ రంజిత్, నందకుమార్, అజయ్ సురేష్ తదితరులు ముఖ్యపాత్ర పోషించారు. దీనికి కథ, కథనం, మాటలు, కళా దర్శకత్వంతో పాటు దర్శకత్వం బాధ్యతలను ఏపీఆర్ నిర్వహించారు. ఆయన తెలుపుతూ కొడైక్కెనాల్‌లో మద్యం మత్తులో కొందరు వ్యక్తులు ఒక యువతపై అత్యాచారానికి పాల్పడి దారుణంగా హత్య చేస్తారన్నారు. ఆ జ్యోతి దెయ్యంగా మారి ఎవరైతే తనను మానభంగం చేసి చంపేశారో వారిపై ప్రతీకారం తీర్చుకునే కథాంశంతో రూపొందిన చిత్రమే కల్లరై అని చెప్పారు. పలు ఆసక్తికరమైన అంశాలతో ఈ చిత్రంలో మూడు పాటలు ఉంటాయని చెప్పారు. హారర్ థ్రిల్లర్ కథా చిత్రాలను తమిళ ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారని, ఆ నమ్మకంతోనే తాము ఈ చిత్రా న్ని నిర్మించినట్లు నిర్మాత రతి జవహర్ పేర్కొన్నారు. చిత్రం కచ్చితంగా వారి ఆదరణను పొందుతుందనే అభి ప్రాయాన్ని వ్యక్తం చేశారు. నిర్మాణ కార్యక్రమాలు పూ ర్తయ్యాయని, చిత్రాన్ని ఆగస్టు 4న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు.

రీ రికార్డింగ్ దశలో చంద్రముఖి-2

తమిళసినిమా: సూపర్‌స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా నటించిన సూపర్ హిట్ చిత్రం చంద్రముఖి. పి.వాసు దర్శకత్వం ఆ చిత్రానికి ఇప్పుడు సీక్వెల్‌గా చంద్రముఖి-2 రూపొందిస్తున్న విషయం తెలిసిందే. లారెన్స్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ సంచలన నటి కంగనా రనౌత్, వడివేలు, మహిమా నంబియార్, లక్ష్మీ మీనన్, సృష్టి తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. పి.వాసు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి ఆర్డీ రాజశేఖర్ ఛాయాగ్రహణం, ఆస్కార్ అవార్డు గ్రహీత ఎం ఎం కీరవాణి సంగీతాన్ని అందిస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ భారీ ఎత్తున నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ ఇటీవలే పూర్తి చేసుకుంది. ప్రస్తుతం నిర్మాణ కార్యక్రమాలను శరవేగంగా జరుపుకుంటోంది. కాగా ఇటీవలే నటుడు లారెన్స్ తన పాత్రకు డబ్బింగ్ చెప్పి పూర్తి చేశారు. కాగా శనివారం నుంచి ఎంఎం కీరవాణి ఈ చిత్రానికి నేపథ్య సంగీతాన్ని సమ కూర్చడం ప్రారంభించారని యూనిట్ వర్గాలు తెలిపారు. కాగా త్వరలోనే చంద్రముఖి -2 చిత్ర ఆడియో ఆవిష్కరణ కార్యక్రమాన్ని భారీగా నిర్వహించడానికి తెలిపారు. అంతకుముందే వచ్చే నెలలో చిత్రంలోని సింగిల్ సాంగ్‌ను విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.


చంద్రముఖి -2 చిత్రంలో లారెన్స్, వడివేలు

షూటింగ్ పూర్తి చేసుకున్న దేశీయ తలైవర్

తమిళ సినిమా: తమిళనాడులో ప్రఖ్యాతి గాంచిన నాయకుడు పశుమ్ పొన్ ముత్తు రామలింగ దేవర్ జీవిత చరిత్ర దేశీయ తలైవర్ పేరుతో చిత్రంగా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఇందులో ముత్తు రామలింగ దేవర్ పాత్రలో జేఎం బషీర్ నటిస్తున్నారు. ఇళయరాజా సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి ఆర్. అరవింద్ రాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం ప్రీ ప్రొడెక్షన్ పనులు జరుపుకుంటోంది. కాగా చిత్రాన్ని అక్టోబర్ 30వ తేదీన పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయడానికి నిర్మాత ఏఎం .చౌదరి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రం కర్ణాటకలోనూ విడుదల కానుంది. కాగా ఇటీవలే కర్ణాటక ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన డీకే శివకుమార్‌ను దేశీయ తలైవర్ చిత్ర కథానాయకుడు, నిర్మాత ఆయన ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు అందించారు. ఈ సందర్భంగా తాము నిర్మిస్తున్న దేశీయ తలైవర్ చిత్రం గురించి డీకే శివకుమార్‌కు వివరించినట్లు, ఆయన ఈ చిత్రంలో టైటిల్ పాత్రను పోషించిన జేఎం.బషీర్ ముత్తు రామలింగ దేవర్ మాదిరి గానే ఉన్నారని ప్రశంసించినట్లు చిత్రవర్గాలు ఆదివారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. కాగా ఈ చిత్రాన్ని కన్నడంలో రాష్ట్రీయ నేత పేరుతో విడుదల చేయనున్నట్లు తెలిపారు.


డీకే శివకుమార్‌ను కలిసిన దేశీయ తలైవర్ చిత్ర నిర్మాత చౌదరి, నటుడు బషీర్

హైకోర్టు రిజిస్ట్రార్ ఉత్తర్వులపై వివాదం

- వీసీకే వ్యతిరేకత
- రాష్ట్రవ్యాప్త ఆందోళనకు పిలుపు

సాక్షి, చెన్నై : రాష్ట్రంలోని అన్ని కోర్టులు, కోర్టు ఆవరణలో కేవలం మహాత్మాగాంధీ, తమిళమహాకవి తిరువళ్లువర్ చిత్ర పటాలు, విగ్రహాలు మాత్రమే ఉండాలని హైకోర్టు రిజిస్ట్రార్ జారీ చేసిన ఉత్తర్వులు వివాదానికి దారితీసింది. ఈ ఆదేశాలను వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు వీసీకే పిలుపు నిచ్చింది. వివరాలు.. రాష్ట్రంలో మద్రాసు హైకోర్టు పరిధిలో మదురై ధర్మాసనం, జిల్లా కోర్టు, అనుబంధ కోర్టులు, ప్రత్యేక కోర్టులు, పుదుచ్చేరి కోర్టు ఉన్న విషయం తెలిసిందే. ఈకోర్టులలోని నిర్వాహక అధికారులకు హైకోర్టు రిజిస్ట్రార్ జారీ చేసిన ఉత్తర్వులు ఆదివారం వెలుగులోకి వచ్చింది.


తిరుమావళవన్

ఇందులో కోర్టులు, ఆ పరిసరాల్లో కేవలం జాతిపిత మహాత్మా గాంధీ, తమిళ మహాకవి తిరువళ్లువర్ విగ్రహాలు, ఫొటోలు మాత్రమే ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమాచారం వీసీకే వర్గాలలో ఆగ్రహాన్ని రేపింది. భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను తెరమరుగు చేయడమే లక్ష్యమే ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయని ఆ పార్టీ నేత , ఎంపీ తిరుమావళవన్ ఆదివారం ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రత్యేకంగా కోర్టులకు హైకోర్టు రిజిస్ట్రార్ ఈ ఉత్తర్వులు జారీ చేయడం వెనుక దురుద్దేశం స్పష్టంగా కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం తిరువళ్లువర్, మహాత్మాగాంధీ విగ్రహాలు, చిత్ర పటాలకే ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించడం బట్టి చూస్తే అంబేడ్కర్‌ను తెర మరుగు చేయాలన్నది స్పష్టం అవుతోందన్నారు. దీనిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ఖండిస్తున్నామన్నారు. తక్షణం ఈ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నామని హెచ్చరించారు.

ఆస్తి కోసం లారీతో ఢీకొట్టి తండ్రి హత్య

అన్నానగర్: కరూర్ జిల్లాలో ఆస్తి ఇవ్వలేదని లారీతో ఢీకొట్టి తండ్రిని హత్య చేసిన కొడుకును పోలీసులు అరెస్టు చేశారు. వెల్లియనై సమీపంలోని కోరవపట్టికి చెందిన తంగరాజ్ (57) గ్రౌండింగ్ మెషిన్‌తో వ్యాపారం చేసేవాడు. శనివారం తోట నుంచి బైకులో ఇంటికి వెళుతుండగా కొరవపట్టి– తమ్మనాయకన్‌పట్టి సెక్షన్ రోడ్డులో లారీ ఢీకొంది. తంగరాజ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై వెల్లియనై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో తంగరాజ్ మృతిపై అనుమానం ఉందని బంధువులు ఫిర్యాదు చేశారు. పోలీసులు ప్రమాద స్థలం నుంచి స్వాధీనం చేసుకున్న నంబర్ ప్లేట్‌తో దర్యాప్తును వేగవంతం చేశారు. ఆ నెంబర్ ప్లేట్ తంగరాజ్ చనిపోయిన కుమారుడు మోహన సుందరానికి చెందిన వాహనానిదని తేలింది. మోహన సుందరంను పోలీసులు విచారణ చేశారు. ఆస్తి ఇవ్వలేదని తన తండ్రిని ట్రక్కుతో ఢీకొట్టి హత్య చేసినట్టు అంగీకరించాడు. అతన్ని పోలీసులు అరెస్టు చేశారు.

కాలువలో పడి లారీ డ్రైవర్ మృతి

తిరువళ్లూరు: కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన విషయం ఆలస్యంగా రెండు రోజుల తర్వాత వెలుగులోకి వచ్చింది. దిండుక్కల్ జిల్లా పరైపట్టి గ్రామానికి చెందిన పాండి(52) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పాండి అదే గ్రామానికి చెందిన రామతిలకం అనే మహిళను ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వీరికి సురేష్‌పాండి, లోకేష్‌పాండి పిల్లలు వున్నారు. 13 ఏళ్ల క్రితం భార్యాభర్తల మధ్య ఏర్పడిన ఘర్షణలో పాండి తన భార్య రాధిక తిలకంను హత్య చేశాడు. కేసు విచారణ కోర్టులో సాగుతూవుంది. తల్లిని తండ్రి హత్య చేశాడన్న విషయం తెలియడంతో ఇద్దరు పిల్లలు తండ్రి వద్దకు రావడం లేదు. ఈ నేపథ్యంలోనే రెండు రోజుల క్రితం అతను లోడ్ లారీతో గుమ్మిడిపూండి సిప్‌కాట్‌కు పాండి వచ్చాడు. పూటుగా మద్యం సేవించి పక్కనే వున్న కాలువలో పడిపోయాడు. ఆలస్యంగా విషయాన్ని గుర్తించిన సహచరులు అతన్ని బయటకు తీయగా అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. ఈ సంఘటనపై సిప్‌కాట్ కార్మికులు స్థానిక పోలీసులకు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి వచ్చిన పోలీసులు మృతదేహాన్ని శవపరిక్ష నిమిత్తం పొన్నేరి వైద్యశాలకు తరలించారు. అయితే మృతుడి వివరాలను గుర్తించడం పోలీసులకు కష్టంగా మారింది. అనంతరం లారీ యజమాని ద్వారా కుటుంబ సభ్యుల వివరాలను సేకరించిన పోలీసులు, ఆదివారం ఉదయం వారిని పొన్నేరికి తీసుకొచ్చి పోస్టుమార్టం నిర్వహించిన తరువాత మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

కలుషిత నీటి పంపిణీపై ప్రజల ఆందోళన

తిరువొత్తియూరు: శంకరాపురం సమీపంలో కలుషిత నీటిని సరఫరా చేయడంపై గ్రామ ప్రజలు శనివారం ఉదయ ధర్నా చేశారు. శంకరాపురం సమీపంలోని కోసప్పాడి కాలనీలో సుమారు 400కు పైగా కుటుంబాల వారు నివసిస్తున్నారు. వారికి ట్యాంకు ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. శనివారం సరఫరా అయిన నీరు దుర్గంధం వెదజల్లడంతోపాటు పాచి పట్టింది. దిగ్భ్రాంతి చెందిన ప్రజలు సీపీఎం నాయకుడు చిన్నదొరై నేతృత్వంలో యూనియన్ కార్యదర్శి శివాజీ, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ఏలుమలై, యూనియన్ కమిటీ సభ్యుడు, ఇండియా ప్రజాస్వామ్య సంఘం యూనియన్ కార్యదర్శి మురళీ తదితర సమక్షంలో ప్రజలు బయట నుంచి ఆందోళన చేపట్టారు. శంకరాపురం పోలీస్ ఇన్‌స్పెక్టర్ పాండియన్, తదితరులు అక్కడికి చేరుకుని ప్రజలతో సమాధాన మాటలు మాట్లాడి దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు ప్రజలు ఆందోళన విరమించారు.

కోదండరామాలయంలో విశేష ఉత్సవాలు

తిరుపతి కల్చరల్: కోదండరామస్వామి ఆలయంలో ఆగస్టులో విశేష ఉత్సవాలు జరుగనున్నాయి. ఆగస్టు 1, 31వ తేదీల్లో పౌర్ణమి సందర్భంగా ఉదయం 9 గంటలకు అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సీతా లక్ష్మణ సమేత కోదండరామస్వామి ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహిస్తారు. ఆగస్టు 5, 12, 19, 26వ తేదీల్లో శనివారం ఉదయం 6 గంటలకు సీతారామ లక్ష్మణుల మూలవర్లకు అభిషేకం చేస్తారు. సాయంత్రం 6 గంటలకు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగిస్తారు. అనంతరం ఆలయంలో ఊంజల్ సేవ చేస్తారు. 14వ తేదీన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని ఉదయం 11 గంటలకు సీతారాముల కల్యాణం, సాయంత్రం 5.30 గంటలకు రామచంద్ర పుష్కరిణి వద్ద ఊంజల్ సేవ చేపడతారు. 16వ తేదీన అమావాస్య నాడు ఆలయంలో ఉదయం 7 గంటలకు సహస్ర కలశాభిషేకం జరుగనుంది. అదే రోజు రాత్రి 7 గంటలకు కోదండరామస్వామి హనుమంత వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇస్తారు.

ఆధునిక వైద్య విధానంలో లేజర్ ప్రోక్టాలజీ కలికితురాయి

తిరుపతి తుడా: వైద్య రంగంలో సాంకేతికత అందుబాటులోకి వస్తోందని, ఇందులో లేజర్ ప్రోక్టాలజీ విభాగం ఓ కలికితురాయిగా మిగిలిపోతుందని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం తెలిపారు. చెన్నైలో కోలో రెక్టల్ సర్జన్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు నిర్వహించిన జాతీయ సదస్సులో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మొలలు, ఫిస్టులా, ఫిషర్, సైనస్, వెరికోస్ వీన్స్ తదితర వ్యాధులతో బాధపడుతున్న వారికి ఈ ఆధునిక లేజర్ చికిత్సా విధానం ఎంతో దోహదం చేస్తుందన్నారు. లేజర్ ప్రోక్టాలజీ చికిత్సతో కోత, కుట్లు, రక్తం నష్టం లేకుండా చికిత్స చేయవచ్చని పేర్కొన్నారు. చికిత్స అనంతరం రోగి 12 గంటల్లోనే సాధారణ స్థితికి వస్తాడని వెల్లడించారు.

లారీ ఢీకొని తాపీమేస్త్రి మృతి

తిరువొత్తియూరు: తిరువారూరు జిల్లా కోటూరు సమీపంలో మోటార్ సైకిల్‌ను లారీ ఢీకొనడంతో తాపీ మేస్త్రి మృతి చెందారు. లారీ డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. తిరువూరు జిల్లా కోటూరు సమీపం కంభంకుడి ఆర్చ్ ప్రాంతానికి చెందిన బాలసుబ్రమణ్యం కుమారుడు కార్తికేయన్ (37) తాపీ మేస్త్రిగా పనిచేస్తున్నారు. అతను శుక్రవారం రాత్రి పనిముగించుకొని మన్నారుకుడి నుంచి ఇంటికి మోటార్ సైకిల్‌లో బయలుదేరాడు. ఆ సమయంలో తిరుత్తురైపూండి రోడ్డులో సెంమోలి నగర్ వద్ద లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన కార్తికేయన్ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కోటూరు ఇన్‌స్పెక్టర్ శివకుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఇలంగోవన్, పోలీసులు అక్కడికి చేరుకుని కార్తికేయన్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని శవ పరీక్ష కోసం మన్నారుకుడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి లారీ డ్రైవర్ తిరుపూర్ జిల్లా గణపతి పాలెం ప్రాంతానికి చెందిన మోహన్ రాజు (33)ను అరెస్టు చేశారు.

1.5 కిలోల బంగారు నగల చోరీ

అన్నానగర్: నెల్లై జంక్షన్ వద్ద ఇంటి తాళం పగులగొట్టి రూ.75 లక్షల విలువైన బంగారు ఆభరణాలను చోరీ చేసిన దుండగుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన హనుమంతరావు, అతని బంధువు మెహరామ్ (43) నెల్లై జంక్షన్ సింధుపూందురై ప్రాంతంలోని సెల్వియమ్మన్ కోయిల్ ప్రాంతంలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. నెలకు ఒకటి, రెండు సార్లు ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు నుంచి పెద్దమొత్తంలో బంగారు ఆభరణాలను కొనుగోలు చేసి నెల్లై, తెన్ కాశి, తూత్తుకుడి తదితర ప్రాంతాలకు పంపుతుంటారు. హనుమంతరావు వ్యాపారాన్ని తన బంధువు మెహరామ్‌కు నెల్లూరులో స్థిరపడ్డాడు. ఈ క్రమంలో మేహరామ్ శనివారం ఉదయం 10 గంటలకు తూత్తుకుడి జిల్లాలోని జ్యువెలరీ షాపులకు వసూళ్ల కోసం వెళ్లాడు. అనంతరం రాత్రి 7 గంటలకు నెల్లైలోని తన ఇంటికి వచ్చాడు. ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడం చూసి లోపల పరిశీలించాడు. ఇంట్లో ఉంచిన రూ.75 లక్షల విలువైన బంగారు నగలు చోరీకి గురైనట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నెల్లై జంక్షన్ పోలీసులు కేసు నమోదు చేసి ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీల ద్వారా దర్యాప్తు చేస్తున్నారు. దొంగలను పట్టుకునేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

కొరుక్కుపేట: ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తిరువారూరు జిల్లాలో కలకలం రేపింది. జిల్లాలోని నార్కుడికి చెందిన బాబురాజ్ (42) స్టాక్ మార్కెట్ ఫైనాన్షియల్ ఇన్వెస్ట్‌మెంట్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నాడు. అతను 10 సంవత్సరాల క్రితం తంజావూరుకు వెళ్లాడు. దిగువ వీధిలోని ఓ వాణిజ్య సముదాయం గ్రౌండ్ ఫ్లోర్‌లో స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ డెస్క్ నడుపుతున్నాడు. ఈ క్రమంలో పలువురి నుంచి డబ్బులు తీసుకుని, ఎక్కువ లాభం వస్తుందని చెప్పి కొన్ని కంపెనీల షేర్లు కొని వ్యాపారం చేస్తున్నాడు. గత వారం బాబూరాజ్ ట్రేడింగ్ చేసిన కంపెనీల షేరు ధర భారీగా పడిపోయింది. శనివారం చెన్నైలోని ఓ ప్రైవేట్ బ్యాంకు ఉద్యోగి, అధికారి బాబురాజ్‌ను కలిశారు. ఆ తర్వాత తమకు జరిగిన నష్టానికి రూ.47 లక్షలు డిమాండ్ చేస్తూ బాబురాజ్‌ను బెదిరించి ఖాళీ బాండ్‌పై సంతకం చేయించుకున్నారు. దీంతో మనస్తాపానికి గురైన బాబురాజ్ శనివారం రాత్రి గ్రౌండ్ ఫ్లోర్‌లోని తన కార్యాలయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న వెస్ట్ పోలీస్ స్టేషన్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి బాబురావు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తంజావూరు మెడికల్ కళాశాల ఆసుపత్రికి తరలించారు.

భార్య మృతిని తట్టుకోలేక భర్త ఆత్మహత్య

అన్నానగర్: భార్య మృతిని జీర్ణించుకోలేక భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన శివగంగై జిల్లాలో చోటుచేసుకుంది. దేవకోటలోని నటరాజపురం మొదటి రోడ్డుకు చెందిన నాగరాజ్ (50) తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఇతని భార్య కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో నాగరాజ్ మనోవేదన చెందాడు. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న దేవకోట నగర పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నాగరాజ్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం దేవకోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీఎంకే ప్రభుత్వం తీరుకు నిరసనగా బీజేపీ ధర్నా


అత్తిమాంజేరి పంచాయతీ కార్యాలయం ఎదుట బీజేపీ శ్రేణుల ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న బీజేపి కార్యకర్తలు

పళ్లిపట్టు: డీఎంకే ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా బీజేపీ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల వద్ద ఆదివారం ధర్నా చేపట్టింది. పళ్లిపట్టు మండలం అత్తిమాంజేరి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాకు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు, బీజేపీ తిరువళ్లూరు జిల్లా పట్టభద్రుల విభాగం ఉపాధ్యక్షుడు సీ.వాసుదేవరాజు అధ్యక్షత వహించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణచంద్ మాట్లాడుతూ డీఎంకే ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలతో నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మంత్రులు ప్రజాధనాన్ని కొల్లగొడుతూ అవినీతికి కేరాఫ్‌గా నిలుస్తున్నారని ఆరోపించారు. బీజేపీకి అవకాశం కల్పిస్తే ప్రజా పాలనను చూపిస్తామని తెలిపారు. పార్టీ పంచాయతీ అధ్యక్షుడు శ్యామరాజు, శేఖర్‌రాజు, శరత్ పాల్గొన్నారు.

పిల్లలకు మెరుగైన విద్య అందించాలని బీజేపీ నేతల ధర్నా

వేలూరు: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని కోరుతూ బీజేపీ నేతలు ధర్నా చేశారు. వేలూరు టోల్‌గేట్‌లోని బస్టాండ్ వద్ద చేపట్టిన ధర్నాకు ఆ పార్టీ రీజినల్ కార్యదర్శి మదిఅయగన్ అధ్యక్షత వహించగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కార్తియాయిని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్య నాణ్యతను పెంచడంతో పాటు అదనపు కట్టడాలు నిర్మించాలని కోరారు. ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులతో పాటు హెచ్‌ఎం పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రతి నిరుపేద మహిళకు రూ: 1000 ఇవ్వాలని, నీటి నిల్వ కోసం చెక్‌డ్యామ్‌లు నిర్మించాలన్నారు. ఈ ధర్నాలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కుమార్, కోశాధికారి బాబు, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

వనరుల సముపార్జన కేంద్రం ప్రారంభం

కొరుక్కుపేట: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఇండియన్ బ్యాంకు ఆర్థిక రంగంలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి, కస్టమర్లతో అనుబంధాన్ని మరింతగా పెంచుకోవడానికి వనరుల సముపార్జన కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా తన 2వ వనరుల సముపార్జన కేంద్రాన్ని (ఆర్‌ఏసీ) చెన్నైలో ఏర్పాటు చేసింది. ఇండియన్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మహేష్ కుమార్ బజాజ్ పాల్గొని చెన్నై (సౌత్)లో వనరుల సేకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకు సాంకేతిక సామర్థ్యం, కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్‌పై ఎక్కువగా ప్రభావం చూపడంతో సమర్థవంతమైన బ్యాంకుగా స్థిరపడాలని భావించినట్టు తెలిపారు. వనరుల సముపార్జన కేంద్రం వ్యూహాత్మక చొరవను ప్రస్తావిస్తూ బ్యాంకు ఫైనాన్షియల్ ఇయర్ –24ని వనరుల సంవత్సరంగా ప్రకటించిందని చెప్పారు. నూతన ఆవిష్కరణలు, కస్టమర్ అనుభవాలను మెరుగుపరచడం, బ్యాంకు డిపాజిట్ బేస్‌ను బలోపేతం చేయడంలో ఆర్‌ఏసీలు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్ కెఎస్ సుధాకర రావు, ఫీల్డ్ జనరల్ మేనేజర్, చెన్నై ఎఫ్‌జీఎంవో జి.రాజేశ్వర రెడ్డి, జనరల్ మేనేజర్ ఆర్ అండ్ జీఆర్ అశోక్ పట్నాయక్, చెన్నై సౌత్ జోన్ జోనల్ మేనేజర్ అండ్ డిజిఎంఅన్బు కామరాజ్, చెన్నై సౌత్ జోన్, ఆర్‌ఏసీ ఏజీఎం – చెన్నై (సౌత్) స్వప్న అజిత్ ప్రసాద్ పాల్గొన్నారు.


వనరుల సముపార్జన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మహేష్ కుమార్ బజాజ్

ఆడి తపస్సు ఉత్సవాలు ప్రారంభం

తిరువొత్తియూరు: తూత్తుకుడి జిల్లా ఏరల్ సమీపంలో చేరుతుండనల్లు శంకర ఈశ్వర ఆలయంలో ఆడి తపస్సు ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఆలయంలో ఆడి తపస్సు ఉత్సవాలు ప్రత్యేకంగా నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయం పుణ్య తీర్థంతో ధ్వజస్తంభానికి ప్రత్యేక అభిషేకాలు, ఆరాధనలు చేశారు. ఈ ఉత్సవాలలో ముఖ్య ఉత్సవమైన ఆడి తపస్సు ఉత్సవాలు ఈ నెల 31వ తేదీ జరుగుతుంది. ఆ రోజు ఉదయం నాలుగు గంటలకు గర్భగుడిలో ఉన్న స్వామి, అమ్మవారికి కుంభాభిషేకం, మహా యాగశాల, దీపారాధన చేస్తారు. ఉదయం 6 గంటలకు 8 గంటలకు తామ్రభరణి నది నుంచి పుణ్య జలాలను కలశంలో ఊరేగింపుగా తెచ్చి మధ్యాహ్నం 12 గంటలకు అభిషేకం చేస్తారు. సాయంత్రం 6 గంటలకు శంకరేశ్వర స్వామి, శంకర నారాయణ స్వామిగా గోమతి అమ్మవారికి ఆదర్శ నామం ఇచ్చు ఉత్సవం జరుగుతుంది. రాత్రి 8 గంటలకు సంగీత కార్యక్రమంలో అర్ధరాత్రి ఒక గంటకు శంకర్ నారాయణ స్వామి అమ్మవారికి శంకరయ్యేశ్వర స్వామి దర్శనము ఇచ్చు ఉత్సవం జరుగుతుంది. ఈ క్రమంలో గోమతి అమ్మాల్ స్వర్ణ రథంపై ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇస్తారు.

కుంభకోణం మహా మహం కోనేరులో తీర్థవారి

తిరువొత్తియూరు: తంజావూరు మహా మహం కోనేరులో ఆడిపూరంను పురస్కరించుకుని ఘనంగా తీర్థవారీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పుణ్యస్నానాలు ఆచరించారు. కుంభకోణంలో ఆదికుంభేశ్వర్ ఆలయం, నాగేశ్వర్ ఆలయం, కాశీవిశ్వనాథర్ ఆలయం, సోమేశ్వరర్ ఆలయం, అభిముకేశ్వరర్ ఆలయం, చాముండేశ్వరి అమ్మన్ ఆలయం, కుంభకోణం ఆలయంలో ప్రతి సంవత్సరం ఆడిపూరం ఉత్సవాల నిర్వహిస్తారు. ఈ సందర్భంగా 6 ఆలయాల నుంచి ప్రధాన ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపుగా తీసుకువచ్చి మహా మహం కోనేరులో కొలువుదీర్చారు. ఈ ఏడాది ఆదికుంభేశ్వర ఆలయంలో కుంభానిషేకం చేయడంతో మంగళాంబగై అంబాల్‌తో పాటు నాగేశ్వర్ ఆలయం నుంచి పెరియనాయకి, కాశీ విశ్వనాథర్ ఆలయం నుంచి కాశీవిశాలాక్షి, సోమేశ్వరర్ ఆలయం నుంచి సోమసుందరి, అమృతవల్లి, ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తీర్థవారి అనంతరం శివాచార్యులు వేద మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాలతో దేవతలకు పాలు, పసుపు, తేనె, చందనంతో అభిషేకం చేసి దీపారాధన నిర్వహించారు. మహా మహం కోనేరులో తీర్థవారి చేపట్టారు. ఇందులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మహా మహం కొలనులో పుణ్యస్నానాలు ఆచరించారు.

2000 మందికి సహాయకాలు పంపిణీ

కొరుక్కుపేట: కరుణానిధి శత జయంతిని పురస్కరించుకుని చెన్నై నార్త్ జిల్లా డీఎంకే తరపున పలువురికి సహాయకాలు పంపిణీ చేశారు. రాయపురంలోని సెయింట్ పీటర్స్ స్కూల్ ప్లేగ్రౌండ్‌లో ఆదివారం బహిరంగ సభ నిర్వహించారు. దీనికి డీఎంకే ఉత్తర చెన్నై జిల్లా కార్యదర్శి అరుణ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యేలు కళానిధి వీరాసామి, ఐడ్రీమ్ మూర్తి, ఆర్‌డీ శేఖర్. జె.జె.ఎబినేజర్, డీఎంకే కార్యనిర్వాహకులు ఎస్.మనోహరన్, ఇరా.కరుణానిధి, వి.పి.సురేష్, ఐ.సెంథిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకులు ఆర్.వెట్రివీరన్, గోపి, ఎస్ ఆర్. కమలకన్నన్ స్వాగతం పలికారు. తమిళనాడు యువజన సంక్షేమం, క్రీడల అభివృద్ధి శాఖ మంత్రి, డీఎంకే యూత్ సెక్రటరీ ఉదయనిధి స్టాలిన్ పాల్గొని 500 మంది క్లబ్ మార్గదర్శకులకు బంగారు పతకాలు, 500 మంది కళాశాల విద్యార్థులకు విద్యా స్కాలర్‌షిప్‌లను అందజేశారు. 50 మహిళా స్వయం సహాయక సంఘాలకు సంక్షేమ సహాయం, 250 మంది క్లీనర్లు, 250 మంది క్రీడాకారులకు పరికరాలు పంపిణీ చేశారు. మంత్రులు పీకే శేఖర్‌బాబు, అన్బిల్ మహేశ్ పొయ్యామొళి పాల్గొన్నారు.

ఆల్ ఇండియా సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా కుమార్

కొరుక్కుపేట: ఆల్ ఇండియా సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడిగా కె.కుమార్ నియమితులయ్యారు. రాజస్థాన్‌లో ఆదివారం అఖిల భారతీయ సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో చెన్నై పుల్లాపురానికి చెందిన తెలుగు ప్రముఖులు కె.కుమార్‌ను తమిళనాడు రాష్ట్ర ఆల్ ఇండియా సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమించి నియామక పత్రాన్ని ఆల్ ఇండియా సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు చరణ్ సింగ్ టాంక్, సంఘ ప్రధాన కార్యదర్శి వీఆర్. సుధాకర్ పాణికర్ (పూణే) అందజేశారు.


నియామక పత్రాన్ని అందుకుంటున్న కె.కుమార్

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పుష్ప శిష్య బృందం ఆధ్వర్యంలో కళాకారులు భరతనాట్యం, జానపద నృత్యాలు ప్రదర్శించారు. కళాకారులు నాట్య గురువు పుష్ప, లాస్య, తానవిక, జోషిని, విద్య, తనూష, కీర్తి, అనన్య, వేదను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపకలు అందజేశారు. రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



భరతనాట్యం చేస్తున్న కళాకారులు

క్లుప్తంగా

ఉపాధ్యాయుడికి బైక్ బహుమతి


బైక్‌తో ఉపాధ్యాయుడు రామన్

కొరుక్కుపేట: విద్యాబుద్ధులు నేర్పిన గురువుకు విద్యార్థులు, పూర్వ విద్యార్థులు కలిసి వాహనాన్ని బహుమతిగా అందజేశారు. తిరువారూరు జిల్లా ముత్తుపేట సమీపంలోని ఆలంగాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రామన్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఆయన 1988 జూన్ 27న ఈ స్కూల్‌లో చేరి శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయన దగ్గర చదువుకున్న విద్యార్థులు దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా ఉన్నత స్థానాల్లో ఉన్నారు. ఈ క్రమంలో రామన్ ఉద్యోగ విరమణ చేస్తున్న విషయాన్ని తెలుసుకుని మాలంగాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చేరుకున్నారు. ఆయనకు రూ.లక్ష విలువైన ద్విచక్ర వాహనాన్ని బహుమతిగా అందజేశారు. ఉపాధ్యాయుడు రామన్‌ను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

మగమాయి అమ్మన్ ఆలయంలో రథోత్సవం

తిరువొత్తియూరు: కల్లకురిచ్చి జిల్లా శంకరాపురం సమీపంలో ఉన్న మగమాయి అమ్మన్ ఆలయంలో శనివారం రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులు అశేష సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగారు. కల్లకురిచ్చి జిల్లా శంకరాపురం సమీపంలో పావలం గ్రామంలో ప్రసిద్ధి పొందిన మగమాయి అమ్మన్ ఆలయం ఉంది. ఈ ఆలయంలో ఆడి నెల రథోత్సవం గత ఏడవ తేదీన ప్రారంభమైంది. ఈ క్రమంలో వరుసగా రోజు అమ్మవారికి ప్రత్యేక అభిషేకములు ఆరాధన, అలాగే కల్యాణోత్సవం, పల్లకి ఉత్సవం, పొంగల్ ఉత్సవం నిర్వహించారు. శనివారం సాయంత్రం 5 గంటల సమయంలో రథంలో అమ్మవారిని అధిష్ఠింపచేసి భక్తులు రథాన్ని లాగుతూ ఊరేగించారు.

ఎస్ఐ కుటుంబానికి ఆర్థిక సాయం


తిరువొత్తియూరు: అరియలూరు జిల్లాలో మృతి చెందిన సబ్ ఇన్‌స్పెక్టర్ కుటుంబానికి వాట్సాప్ గ్రూప్‌లో వున్న సహ ఉద్యోగులు రూ.13 లక్షల ఆర్థిక సహాయం చేశారు. అరియలూరు జిల్లా జయం కొండం పోలీస్ స్టేషన్లో ప్రత్యేక సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న మాయ కృష్ణన్ జూన్ మృతి చెందాడు. అతనితో పాటు 1997వ సంవత్సరం పనిలో చేరిన పోలీస్‌లు 2685 మంది వాట్సాప్‌లో గ్రూపుగా ఉన్నారు. వీరు సుమారు రూ.13.50 లక్షల నగదును సమకూర్చారు. దీని తర్వాత మృతి చెందిన ప్రత్యేక సబ్ ఇన్‌స్పెక్టర్ మాయ కృష్ణన్ కుటుంబ సభ్యులను జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయానికి రప్పించి ఎస్పీ ఫిరోజ్‌ఖాన్ సమక్షంలో అందజేశారు. ప్రత్యేక ఇన్‌స్పెక్టర్ సెల్వ కుమారి, పలు జిల్లాలకు చెందిన 1997 బ్యాచ్ పోలీసులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్కలు నాటుతున్న రైల్వే పోలీసులు

తిరుపతి అర్బన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని తిరుపతి రైల్వే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ వెల్లడించారు. తిరుపతి వెస్ట్ ఆర్పీఎఫ్ బ్యారెక్స్ పరిసర ప్రాంతాల్లో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ విచ్చలవిడిగా చెట్లను నరికేయడంతో వాతావరణం కలుషితం అవుతోందన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించి తమ వంతు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రైల్వే ఎస్ఐ రాంబాబు పాల్గొన్నారు.

108 ఎంప్లాయీస్ యూనియన్ కార్యవర్గం ఎంపిక


108 అంబులెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నూతన కమిటీ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: 108 అంబులెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ తిరుపతి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎంపిక చేశారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడిగా టి.రామకృష్ణ, అధ్యక్షుడిగా కె.మహేష్, ఉపాధ్యక్షుడిగా వి.శ్యామ్, ప్రధాన కార్యదర్శిగా ఆర్.మునిరాజ, కార్యదర్శిగా ఎం.పెంచలయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.సునీల్, కోశాధికారిగా కె.కేశవులురెడ్డి, మహిళా సభ్యురాలుగా డి.ప్రశాంతి, ఏడుగురు సభ్యులు ఏకగ్రీవంగా నియమితులయ్యారు.

క్లుప్తంగా...

రేషన్ డీలర్లను ఆదుకుంటాం

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



మధురానగర్ (విజయవాడ సెంట్రల్): రేషన్ డీలర్ల సమస్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అన్ని విధాలుగా ఆదుకుంటామని, రేషన్ డీలర్ల వ్యవస్థను బలోపేతం చేస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. విజయవాడ మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో ఆదివారం సాయంత్రం రాష్ట్ర రేషన్ డీలర్ల అసోసియేషన్ రాష్ట్ర మహాసభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కారుమూరి మాట్లాడుతూ కొన్ని పత్రికలు, మీడియా పనిగట్టుకుని రేషన్ దుకాణాలను మూసివేస్తారంటూ విషప్రచారం చేశాయన్నారు. రేషన్ డీలర్లు తమ కుటుంబ సభ్యుల వంటి వారని, వారికి ఎటువంటి అన్యాయం చేయబోమని సీఎం వైఎస్ జగన్ చెప్పారని గుర్తు చేశారు. డీలర్ల సమస్యల పరిష్కారం కోసం సోమవారం పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు, రేషన్ డీలర్లతో సమావేశమై చర్చిస్తారని తెలిపారు. త్వరలో సీఎం జగన్ వద్దకు రేషన్ డీలర్ల నాయకులను తీసుకెళ్లి ప్రతి సమస్యనూ పరిష్కరిస్తామన్నారు. ఎమ్మెల్యేలు సామినేని ఉదయభాను, వెలంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా తదితరులు పాల్గొన్నారు.

రాగద్వేషాలకు అతీతంగా తీర్పులిస్తా..

తెలంగాణ

తెలంగాణ హైకోర్టు సీజేగా జస్టిస్ అలోక్ అరాధే ప్రమాణ స్వీకారం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అలోక్ అరాధే ప్రమాణం స్వీకారం చేశారు. ఆదివారం రాజ్‌భవన్‌లో ఆయనతో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రమాణం చేయించారు. రాగద్వేషాలకు అతీతంగా నీతి, నిజాయతీతో విధులు నిర్వర్తిస్తూ తీర్పులు వెలువరిస్తానని ప్రమాణం చేశారు. అనంతరం గవర్నర్ తమిళిసై, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆయనకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. తర్వాత తెలంగాణ హైకోర్టు 6వ ప్రధాన న్యాయమూర్తిగా ఆయన దైవసాక్షిగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ అలోక్ కుటుంబసభ్యులు, హైకోర్టు న్యాయమూర్తులు, మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

నదిలో విహరిస్తూ... దేవాలయాలను దర్శిస్తూ..!

కృష్ణా నదిపై టెంపుల్ టూరిజానికి ప్రణాళిక రచించిన ఇన్‌లాండ్ వాటర్ వేస్

- ప్రముఖ ఆలయాలు, పర్యాటక ప్రదేశాలను కలుపుతూ రూట్ మ్యాప్
- ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో 7 ప్రదేశాల గుర్తింపు
- 2 చోట్ల జెట్టీల నిర్మాణం.. రూ.50 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం



పర్యాటక ప్రాంతాలను కలిపే మ్యాపు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: కృష్ణా నది జల విహారం పర్యాటకులకు మరింతగా ఆహ్లాదాన్ని పంచనుంది. నదీ తీరంలోని ఆలయాలను, పర్యాటక ప్రదేశాలను కలుపుతూ టెంపుల్ టూరిజానికి రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన చేస్తోంది. ఇందులో భాగంగా విజయవాడ చుట్టు పక్కల ఉన్న 7 ప్రధాన దేవాలయాలను ఒకే రోజు సందర్శించేలా ఏపీ ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ ప్రణాళికలు రూపొందించింది. దీనికి సంబంధించి రూ.50 కోట్లతో ప్రతిపాదనలను సిద్ధం చేసింది. కృష్ణా నది ద్వారా టెంపుల్ టూరిజంకు సంబంధించిన జెట్టీల నిర్మాణం, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లోని 7 ప్రాంతాల్లో పర్యాటక, దేవాలయాలను కలిపే విధంగా ప్రణాళిక రచించింది. ఒక్క రోజులోనే కృష్ణా నదిలో ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ, జల విహారం చేస్తూ 80 కిలోమీటర్లు ప్రయాణం చేయటం ద్వారా7 ప్రాంతాలను కవర్ చేసే విధంగా ఇన్ లాండ్ వాటర్ వేస్ చర్యలు తీసుకొంటోంది. జెట్టీలలోనే భోజనం, అన్ని వసతులు ఉండేలా చూస్తోంది. పర్యాటక ప్రాంతాల్లో పిల్లలకు ఆట వస్తువులు, ఎమ్యూజ్‌మెంట్ పార్కులు, ఓపెన్, ఎడ్వంచర్ గేమ్స్‌ను ఏర్పాటు చేస్తోంది.

జలవిహారం సాగనుంది ఇలా...

- ▲ విజయవాడ కనకదుర్గ అమ్మవారి దర్శనం అనంతరం ఉదయం దుర్గాఘాట్ నుంచి భవానీ ద్వీపానికి జెట్టీ వెళ్తుంది. అక్కడ గంట సేపు ద్వీపం అందాలను ఆస్వాదించవచ్చు.
- ▲ అక్కడ నుంచి జెట్టీ పవిత్ర సంగమంకు చేరుకుంటుంది. కొద్దిసేపటి తరువాత అక్కడి నుంచి గుంటూరు జిల్లా వైకుంఠపురంలో ఉన్న వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకోవచ్చు.
- ▲ అక్కడ నుంచి అమరావతి అమరలింగేశ్వర స్వామి ఆలయానికి తీసుకువెళతారు. ఆ తరువాత జగ్గయ్యపేట వద్దనున్న వేదాద్రికి చేరుకొని లక్ష్మీ నరసింహ స్వామి దర్శనం చేసుకోవాలి. సాయంత్రానికి ముక్త్యాల భవానీ ముక్తేశ్వర స్వామి ఆలయానికి చేరుకోవడంతో జల విహారం ముగుస్తుంది. అక్కడ స్వామి వారి దర్శనం పూర్తయిన తర్వాత ..బస్సులో రోడ్డు మార్గం ద్వారా విజయవాడకు చేరుస్తారు.

మౌలిక వసతులకు ప్రతిపాదనలు...

ప్రస్తుతం ఆయా ప్రదేశాల్లో జెట్టీ నిర్మాణాలు, దేవస్థానాలకు వెళ్లేందుకు రోడ్డు మార్గాలు,వెయిటింగ్ లాంజ్‌లు, టికెట్ కౌంటర్ల నిర్మాణాలు చేపట్టేందుకు వీలుగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. విజయవాడ నుంచి ఓ జెట్టీ, ముక్త్యాల నుంచి ఓ జెట్టీ ప్రతి రోజు ఉదయం బయలుదేరే విధంగా ప్రణాళిక సిద్ధం చేశారు.

ప్రతిపాదనలు ఇలా..

2 యాంత్రీకరణ బోట్లు కొనుగోలుకు అయ్యే ఖర్చు: రూ.22 కోట్లు

7 ప్రాంతాల్లో జెట్టీల నిర్మాణం, సౌకర్యాలకు: రూ.24 కోట్లు

జెట్టీలు నిర్మించే ప్రాంతంలో రూఫ్‌టాప్ సోలార్ పవర్ చార్జింగ్ స్టేషన్ల నిర్మాణానికి: రూ. 4 కోట్లు

మొత్తం అయ్యే ఖర్చు : రూ.50 కోట్లు

పర్యాటకులు సందర్శించేందుకు గుర్తించిన ప్రాంతాలివే..

జిల్లా	ప్రదేశం	ప్రాముఖ్యత
1. ఎన్టీఆర్	బెరం పార్కు (దుర్గా ఘాట్)	శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం
2. ఎన్టీఆర్	భవానీ ఐలాండ్	ప్రముఖ పర్యాటక ప్రదేశం
3. ఎన్టీఆర్	పవిత్ర సంగమం	కృష్ణా, గోదావరి నదులు కలిసే పవిత్ర ప్రదేశం
4. గుంటూరు	వైకుంఠపురం	వేంకటేశ్వర స్వామి దేవస్థానం
5. గుంటూరు	అమరావతి	అమరలింగేశ్వర స్వామి ఆలయం
6. ఎన్టీఆర్	వేదాద్రి	శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం
7. ఎన్టీఆర్	ముక్త్యాల	శ్రీ భవానీ ముక్తేశ్వర స్వామి ఆలయం (శివాలయం)

జలవిహారానికి ఏర్పాట్లు...



కృష్ణా నదిలో జల విహారం చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నాం. పర్యాటకులను ఆకర్షించే విధంగా టెంపుల్‌టూరిజం ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. ఒక్క రోజులోనే కృష్ణా నదిలో 80 కిలోమీటర్ల మేర జలవిహారం చేస్తూ, ఏడు ప్రదేశాలను సందర్శించే విధంగా చర్యలు తీసుకొంటున్నాం. విజయవాడ నుంచి శ్రీశైలానికి నదీమార్గంలో వెళ్లే విధంగా లాంచీ సర్వీసులను ప్రవేశపెట్టేందుకు ప్రణాళికలు రచిస్తున్నాం.

– ఎస్‌వీకే రెడ్డి, సీఈవో, ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ

మెత్తని మిఠాయి.. ప్రపంచం మెచ్చిందోయ్!

- మైసూర్ పాక్‌కు ఘన ఖ్యాతి
- ప్రపంచ మిఠాయిల్లో 14వ స్థానం
- మైసూర్ అంతఃపురంలో పుట్టి అంతర్జాతీయంగా పేరు



మైసూర్: మైసూర్ పాక్ అనగానే అందరి నోట్లో నీళ్లూరడం సహజం. ఈ మెత్తని మిఠాయి నోట్లో వేసుకుంటే ఆహా అనిపిస్తుంది. అందుకే.. మైసూర్ పాక్ అంటే అందరికీ ఎనలేని ఇష్టం ఏర్పడింది. ఇంతటి మైసూర్ పాక్ గురించి ఎన్నో కథలు, కథనాలు ప్రచారంలో ఉన్నాయి. మైసూర్ పాక్‌ను మైసూర్‌లోనే తినాలి అనే నానుడి కూడా ఉంది. రుచిగా చేయడంలో మరెవరూ సాటి రారు. విదేశీ పర్యాటకులు సైతం గబుక్కున నోట్లో వేసుకునే మైసూర్ పాక్ ప్రపంచ మిఠాయిల్లో 14వ స్థానాన్ని సంపాదించుకుంది.

50 స్వీట్లపై సర్వే

టేస్ట్ అట్లాస్ అనే సంస్థ ఆన్‌లైన్‌లో.. ప్రపంచంలో వీధి ఆహారం మిఠాయిల్లో ప్రజాదరణ పొందినవి ఏవి అనే అంశంపై ఓటింగ్ నిర్వహించింది. 5 పాయింట్లకు గాను 4.4 రేటింగ్ సాధించి మైసూర్ పాక్ 14వ స్థానంలో నిలిచింది. టాప్–50 మిఠాయిల జాబితాను ఆ సంస్థ రూపొందించింది.

రాజు కోసం వండిన మిఠాయి

సుమారు 90 సంవత్సరాల క్రితం మైసూర్ ఒడెయార్ అంతఃపురంలో ముఖ్యమైన వంటలు చేసే చెఫ్ మాదప్ప చేతి నుంచి మైసూర్ పాకం పుట్టిందంటారు. అప్పటి రాజు కృష్ణరాజ ఒడెయార్ భోజనం ఆరగిస్తున్న సమయంలో మహారాజు ప్లేట్‌లో స్వీటు ఏమీ లేదని గమనించాడు. వెంటనే చక్కెర, నెయ్యి, శనగ పిండి మిశ్రమాన్ని కలిపి పాకం వచ్చేదాకా వండి ఒక స్వీటును అప్పటికప్పుడు తయారు చేసి మహారాజుకు వడ్డించాడు. రాజు రుచి చూసి చాలా బాగుందని ప్రశంసించారు. అలా అంతఃపురం నుంచి ఈ మిఠాయి అంగళ్లు, ఇళ్లకు చేరింది.

ఎంఎస్ఎంఈల నమోదుకు సర్వే

- మన రాష్ట్రంలో ఉద్యం పోర్టల్ కింద నమోదైన ఎంఎస్ఎంఈలు 5,26,993
- పోర్టల్‌లో నమోదుతో ఆయా సంస్థలకు ఎంతో మేలు
- పైలట్ ప్రాజెక్టు చేపట్టాలని కలెక్టర్లకు సీఎస్ ఆదేశం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో లక్షలాదిగా ఉన్న సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలను (ఎంఎస్ఎంఈలను)గుర్తించి వాటిని నమోదు చేసే బృహత్తర కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ గుర్తింపు లేకపోవడంతో నమోదుకాని ఎంఎస్ఎంఈలకు ఎటువంటి ప్రభుత్వసాయం అందటం లేదు. కేంద్ర ప్రభుత్వరంగ ఉద్యం పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రాయితీలతో పాటు బ్యాంకు రుణాలు, ప్రభుత్వరంగ సంస్థలకు ఉత్పత్తులు విక్రయించే అవకాశాలు ఎంఎస్ఎంఈలకు ఏర్పడతాయి. 2015–16 శాంపిల్ సర్వే ప్రకారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 33,87,000 నమోదుకాని ఎంఎస్ఎంఈలు ఉన్నట్లు ప్రభుత్వం అంచనా వేసింది. మన రాష్ట్రం నుంచి ఉద్యం పోర్టల్‌లో నమోదైన ఎంఎస్ఎంఈల సంఖ్య 5,26,993 మాత్రమే. ఎంఎస్ఎంఈల సంఖ్య పరంగా మన రాష్ట్రం 13వ స్థానంలో ఉంది. 31.22 లక్షల ఎంఎస్ఎంఈలతో మహారాష్ట్ర మొదటిస్థానంలో, 17.82 లక్షలతో తమిళనాడు రెండోస్థానంలో ఉన్నాయి. రాష్ట్రంలో ఇలా నమోదుకాని ఎంఎస్ఎంఈలను గుర్తించి వాటిని నమోదు చేయించడం ద్వారా ప్రభుత్వ పథకాలు అందించే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ఎంఎస్ఎంఈ సర్వే పేరిట వాస్తవంగా ఉన్న ఎంఎస్ఎంఈల సంఖ్యను వెలికి తీయనుంది. గ్రామ, వార్డు వలంటీర్ల సహాయంతో ఈ వివరాలను సేకరించడానికి టీసీఎస్ సంస్థతో ప్రత్యేకంగా ఒక యాప్‌ను రూపొందించారు. ఈ యాప్ ద్వారా ఎంఎస్ఎంఈ వ్యాపార పరిమాణ, ఏ రంగానికి సంబంధించిన ఉత్పత్తులను ఉత్పత్తి చేస్తుంది, ఎంతమందికి ఉపాధి కల్పిస్తోంది, ఎంఎస్ఎంఈ ఇన్వెస్ట్‌మెంట్స్, ఎంప్లాయిమెంట్ వంటి అన్ని వివరాలను సేకరించనున్నారు. ఈ సర్వే బాధ్యతను ప్రభుత్వం పరిశ్రమల శాఖతోపాటు జిల్లా కలెక్టర్లకు అప్పగించింది. ఈ సర్వేకి సంబంధించి గ్రామ, వార్డు వలంటీర్లకు శిక్షణ ఇచ్చి తొలుత పైలట్ ప్రాజెక్టు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె.ఎస్.జవహర్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. ఈ సర్వే అనంతరం వచ్చిన డేటా ఆధారంగా రాష్ట్రంలో ఎంఎస్ఎంఈల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయనున్నారు.

భక్త మహాశయులకు...



వనదుర్గ ఆలయం వద్ద భక్తుల విశ్రాంతి భవనం

- అన్నవరం దేవస్థానం సౌకర్యాలు
- నడక దారిలో డార్మెట్రీ నిర్మాణం
- 90 శాతం పూర్తయిన పనులు
- రూ.రెండు కోట్లతో భక్తుల వసతికి ఏర్పాట్లు

అన్నవరం: ఆధ్యాత్మిక చింతనతో.. మది నిండా భక్తిభావంతో.. ఆ స్వామివారిని స్మరిస్తూ రత్నగిరికి కాలినడక వచ్చే భక్త మహాశయులకు సౌకర్యాలు ఒనగూరుతున్నాయి.. మెట్ల మార్గం నుంచి అలసి సొలసి వచ్చేవారి కోసం విశ్రాంతి భవనం (డార్మెట్రీ) సకల హంగులతో రూపుదిద్దుకుంటోంది.. రత్నగిరిపై వనదుర్గ ఆలయం ఎదురుగా రూ.రెండు కోట్లతో దాత పెన్నాడ వెంకట రాజామణి సారథ్యంలో భక్తుల విశ్రాంతి భవన నిర్మాణం జరుగుతోంది. ఇది ఆగస్టు నెలాఖరు నాటికి పూర్తి కానుంది. గత ఏడాది ఆగస్టులో పనులు ప్రారంభం కాగా, ఇప్పటికే 90 శాతం పూర్తయ్యాయి. వచ్చే ఆగస్టు నెలాఖరుకు మిగిలిన పనులు పూర్తి చేసి డార్మెట్రీని దేవస్థానానికి అప్పగించాలని దాత నిర్ణయించారు. డార్మెట్రీని దేవస్థానానికి అప్పగించిన వెంటనే ప్రారంభించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఈఓ చంద్రశేఖర్ అజాద్ వివరించారు.

అలా పునాది పడి..

రత్నగిరి సత్యదేవుని దర్శనానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వస్తుంటారు. ఇందులో చాలామంది మెట్ల దారి నుంచి వచ్చి మొక్కులు తీర్చుకుంటుంటారు. అలాంటి వారికోసం డార్మెట్రీ నిర్మించాలని దేవస్థానం అధికారులు నిర్ణయించారు. బాత్‌రూమ్‌లలో స్నానం చేసి, తమ వస్తువులను అక్కడే లాకర్లలో భద్రపరుచుకునేందుకు శ్రీవనదుర్గ అమ్మవారి ఆలయం వద్ద ఈ భవనం చేపట్టాలని భావించారు. ఈ సమయంలోనే రాజమహేంద్రవరానికి చెందిన దాత పెన్నాడ వెంకట రాజామణి డార్మెట్రీ నిర్మించడానికి ముందుకు వచ్చారు. అప్పటి ఈఓ వి.త్రినాథరావు శ్రీవనదుర్గ ఆలయం వద్ద ఉన్న పాత భవనాన్ని కూల్చి వేసి ఆ స్థలాన్ని దాతకు అప్పగించారు. ఈ నిర్మాణానికి గత ఏడాది ఆగస్టు 13న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్రప్రసాద్ భూమిపూజ చేశారు.

వెయ్యి మంది సేదతీరేలా..

మొత్తం 3,900 చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడంతస్తులలో ఈ భవనం నిర్మిస్తున్నారు. ఏకకాలంలో సుమారు వెయ్యి మంది సేదతీరే విధంగా సౌకర్యాలు కల్పిస్తున్నారు. మూడు అంతస్తులలోనూ టాయిలెట్లు, స్నానపు గదులు ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల భక్తులు కొండపై వసతి గదుల కోసం ప్రయత్నించకుండా ఇక్కడే స్నానం చేసి స్వామివారిని దర్శనానికి రావొచ్చని అధికారులు తెలిపారు. ఈ పనులు ప్రారంభించిన మూడు నెలలకే పునాదుల దశ పూర్తి చేయగా, ఏప్రిల్ నెలలోనే మూడు శ్లాబ్‌ల నిర్మాణం పూర్తి చేశారు. ప్రస్తుతం నిర్మాణం పూర్తయి వెలుపల ప్లాస్టింగ్, టైల్స్ అతికించడం పనులు చేస్తున్నారు. టాయిలెట్ల నిర్మాణం, విద్యుత్తు సరఫరా పనులు కూడా దాదాపుగా పూర్తయ్యాయని నిర్మాణ కాంట్రాక్టర్ అబ్బులు తెలిపారు.

ఆగస్టు నెలాఖరుకు సిద్ధం

సత్యదేవుని సన్నిధికి వచ్చే భక్తుల సౌకర్యార్థం దాత రాజామణి డార్మెట్రీ నిర్మిస్తున్నారు. అనుకున్న సమయానికన్నా పనులు వేగంగా చేస్తున్నారు. ఆగస్టు నెలాఖరుకు దీనిని పూర్తి చేసి దేవస్థానానికి అప్పగిస్తామని చెప్పారు. మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధి, దేవదాయశాఖ ఉన్నతాధికారులతో కలసి ప్రారంభోత్సవ తేదీ ఖరారు చేస్తాం.

– చంద్రశేఖర్ అజాద్, ఈఓ, అన్నవరం దేవస్థానం

డప్పె కొట్టి చెబుతున్నా!

రాజులేలిన గడ్డపై జరిగే జాతరకు రాష్ట్ర ప్రభుత్వం విశిష్ట స్థానం కల్పించింది. భక్తులు, స్థానికుల మనోభావాలకు అధిక ప్రాధాన్యమిచ్చింది. వెంకటగిరి రాజాల ఆకాంక్షను నెరవేర్చింది. పోలేరమ్మ తల్లి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలకు మెండుగా ఉండాలని సంకల్పించింది. ఈమేరకు నేతన్న నేస్తం కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటగిరి పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగా ప్రకటించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



వెంకటగిరి పోలేరమ్మ ఆలయ ముఖద్వారం

- రాష్ట్ర పండుగగా వెంకటగిరి పోలేరమ్మ జాతర
- వెంకటగిరీయుల ఆకాంక్షను నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- ప్రభుత్వ ఆధ్వర్యంలో మరింత శోభాయమానం కానున్న జాతర

వెంకటగిరి(తిరుపతి జిల్లా): వెంకటగిరి పోలేరమ్మ తల్లి జాతరకు శతాబ్దాల చరిత్ర ఉంది. ఏడాదికొకసారి జరిగే జాతరలో పోలేరమ్మను దర్శించుకుంటే కోర్కెలు తీరుతాయన్న నమ్మకం భక్తుల్లో బలంగా ఉంది. వెంకటగిరి సంస్థాన రాజులు ఏలుతున్న రోజులవి. 1917లో వెంకటగిరిలో కలరా మహమ్మారి వందలాది మందిని బలితీసుకుంది. ఈ క్రమంలో వెంకటగిరి సంస్థానాధీశులు భారీ ఎత్తున శీతలయాగం నిర్వహించారు. మరోవైపు వెంకటగిరి నలువైపులా పొలిమేరలో గ్రామశిలలను ఏర్పాటు చేసి క్రమం తప్పకుండా జాతర నిర్వహించారు. అప్పటి నుంచి వెంకటగిరి జాతర జరుగుతూనే వస్తోంది. వెంకటగిరి సంస్థానాధీశుల ఆధీనంలో జరుగుతున్న పోలేరమ్మజాతర 1992 నుంచి దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

అరుదైన వేదిక

వెంకటగిరి పోలేరమ్మజాతర నిమ్నవర్గాలతోపాటు జానపద కళారూపాల ప్రదర్శనకు అరుదైన వేదికగా నిలుస్తోంది. మతాలకు అతీతంగా వెంకటగిరీయులు నిర్వహించుకుంటారు. ఈ జాతరలో నిమ్నవర్గాలకు చెందిన వ్యక్తులు ముందుండి జాతరను నిర్వహిస్తారు. రాష్ట్రంలోనే ఎంతో ప్రాచుర్యం పొందిన ఈ జాతరకు దేశవిదేశాల్లో ఉన్న వెంకటగిరీయులే కాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లిస్తుంటారు. జాతరకు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటే ఆ ఏడాది అంతా పోలేరమ్మతల్లి ఆశీస్సులు ఉంటాయని భక్తుల విశ్వాసం.

నెరవేరిన కల

వెంకటగిరి పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగా నిర్వహించాలనే స్థానికుల కల నెరవేరింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంకటగిరిలో నేతన్ననేస్తం ఐదో విడత ప్రారంభోత్సవ కార్యక్రమంలో పోలేరమ్మ జాతరను వెంకటగిరీయుల ఆకాంక్ష మేరకు రాష్ట్ర పండుగగా గుర్తించేందుకు జీవో విడుదల చేస్తామని ప్రటించారు.



ఘటోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

జాతర విశిష్టత

గ్రామశక్తి పోలేరమ్మ తల్లి జాతర 1917 నుంచి వెంకటగిరిలో నిర్వహిస్తున్నారు. వినాయకచవితి అనంతరం వచ్చే తొలి బుధవారంతో జాతర చాటింపు ప్రారంభమై మూడో చాటింపుతో జాతర ముగిస్తుంది. పుట్టినిల్లు అయిన కుమ్మరింట అమ్మవారి ప్రతిమ తయారు చేస్తారు. అమ్మవారికి కళ్లు, దిష్టిచుక్క పెట్టరు. అనంతరం కాంపాళెంలోని గాలిగంగులకు పూజలు నిర్వహించి మెట్టినిల్లు అయిన జీనుగుల వారి వీధికి తీసుకొస్తారు. అక్కడే అత్తింటివారైన రజకులు పోలేరమ్మను స్వీకరిస్తారు. అక్కడ కళ్లు, దిష్టిచుక్క, పూలతో ప్రత్యేకంగా అలంకరిస్తారు. అనంతరం రథంపై ఆశీనులు చేసి అశేషభక్తజన సందోహం మధ్య గుడివద్ద నిలుపుదల చేస్తారు. అప్పటి నుంచి మరుసటి రోజు సాయంత్రం వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. తర్వాత మధ్యాహ్నం దున్నపోతను బలిచ్చి గండదీపంగా పిలవబడే నూనెదీపంతో రజక వ్యక్తిని వీధులన్నిటిలో తిప్పుతారు. బలి ఇచ్చిన దున్నపోతు రక్తంతో తయారు చేసిన అన్నంతో ఊరికి పొలి చుడతారు. ఆ తర్వాత పోలేరమ్మతల్లి ఊరేగింపు (విరూపోత్సవం) ప్రారంభమవుతుంది. ఆ సమయంలో అమ్మవారి మట్టిని తీసుకునేందుకు భక్తులు పోటీ పడుతారు.

ప్రియురాలిని హత్య చేసింది ప్రియుడే!

- నిందితుడు నాగబాబు, సహకరించిన నరసింహం అరెస్ట్
- హత్య కేసును ఛేదించిన పోలీసులు



మల్లేశ్వరితో ప్రియుడు నాగబాబు, వారి కుమార్తె (ఫైల్)

అమలాపురం టౌన్: స్థానిక వనచర్ల వీధికి చెందిన శ్రీపతి మల్లేశ్వరి (24)ది హత్యేనని పోలీసు దర్యాప్తులో తేలింది. రెండు వారాలుగా సాగుతున్న ఈ కేసు చిక్కుముడి చివరికి వీడింది. డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ ఆధ్వర్యంలో పట్టణ సీఐ డి.దుర్గాశేఖరరెడ్డి లోతుగా దర్యాప్తు చేసి హత్య కోణాన్ని వెలికి తీశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆదివారం డీఎస్పీ అంబికా ప్రసాద్ వివరించారు. ఆయన కథనం మేరకు.. నాగబాబు, మల్లేశ్వరిలకు గతంలో వేర్వేరుగా పెళ్లిళ్లు జరిగాయి. నాగబాబు భార్యను, మల్లేశ్వరి భర్తను వదిలేసి వీరిద్దరూ స్థానిక వనచర్ల వీధిలో సహ జీవనం సాగించారు. వీరికి రెండున్నరేళ్ల కుమార్తె కూడా ఉంది. మల్లేశ్వరి వేరే వ్యక్తితో అక్రమ సంబంధం కలిగి ఉందన్న అనుమానంతో ఆమెను నాగబాబు తరచూ మద్యం తాగి వేధించేవాడు. ఐదేళ్ల కిందట అమలాపురంలో నాగబాబు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నప్పుడు అందులో పనిచేసే ఓ వ్యక్తితో అక్రమ సంబంధం కలిగి ఉందన్నది నాగబాబు అనుమానం.

హత్య చేసిందిలా..

ఈ నెల 7వ తేదీ రాత్రి నుంచి మల్లేశ్వరి కనిపించకపోవడంతో ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొలుత అమలాపురం పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. తర్వాత 9వ తేదీ ఉదయం అమలాపురం బైపాస్ రోడ్డులో శ్మశానం వద్ద పంట కాలువ నీటి అంచున మల్లేశ్వరి మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండడాన్ని స్థానికులు, పోలీసులు గుర్తించారు. 7వ తేదీ రాత్రి వనచర్లవారి వీధిలోని వారున్న ఇంట్లోనే మల్లేశ్వరి మెడకు చీరను బిగించి నాగబాబు హత్య చేశాడు. అతనికి ఆ ఇంటి యాజమాని కుమారుడు కముజు నరసింహం సహకరించాడు. అప్పటికే చనిపోయిన మల్లేశ్వరికి ఒంట్లో బాగోలేదని.. ఆస్పత్రికి తీసుకు వెళుతున్నామని ఇరుగు పొరుగు వారికి చెప్పి నాగబాబు, నరసింహం ఇద్దరూ మోటారు సైకిల్‌పై ఆమె మృతదేహాన్ని తీసుకు వెళ్లారు. పంట కాలువ వద్దకు వెళ్లి మృతదేహాన్ని పడేశారు. మృతదేహం కాలువలో కొట్టుకుపోయి సముద్రంలో కలిసిపోతుందని వారు అంచనా వేశారు. అయితే ఆ మృతదేహం కాలువ నీటి అంచునే ఆగిపోవడంతో వారి పథకం నెరవేరక ఆనక వారి కుట్ర బయటపడింది. పోస్టుమార్టం నివేదిక వస్తేనే గాని అది ఆత్మహత్యా... హత్యా అనేది ఇప్పుడే చెప్పలేమని అప్పట్లో పోలీసులు అనుమానాస్పద మృతిగా నమోదు చేశారు. పోస్టుమార్టం నివేదికలో మల్లేశ్వరిది హత్యేనని తేలడంతో పోలీసులు ఈ కేసును హత్య కేసుగా మార్చి ఆ దిశగా దర్యాప్తు చేశారు. నిందితుడు నాగబాబు, సహకరించిన నరసింహంలను అరెస్ట్ చేసి ఆదివారం కోర్టులో హాజరు పరిచారు. కోర్టు రిమాండ్ విధించడంతో వారిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్లు పట్టణ సీఐ దుర్గాశేఖరరెడ్డి తెలిపారు.

సన్నిధి

గురువాణి



అందం.. అంటే!!!

ప్రపంచ ప్రఖ్యాత ఆంగ్లకవి జాన్ కీట్స్ ఒక మాటన్నారు...''ఎ థింగ్ ఆఫ్ బ్యూటీ ఈజ్ ఎ జాయ్ ఫరెవర్''– అని. ఒక అందమైన వస్తువు ఎప్పటికీ సంతోషకారకమే. అందమైన వస్తువు అంటే ... నాకు ఏది అందంగా కనపడుతుందో, మీకు అది అందంగా కనపడకపోవచ్చు. నాకు అందంగా కనిపించింది దేశకాలాలతో సంబంధం లేకుండా అది నాకు శాంతి కారణమయి ఉంటుంది.

అసలు లోకంలో ఏ పనిచేసినా దేని కోసం చేస్తాం? శాంతి కోసమే. ఏది శాంతిని ఇవ్వగలదో అదే అందం. ఏది మనసుకు అశాంతి ఇవ్వడం ప్రారంభించిందో అది అందవిహీనం. భగవద్గీతలో గీతాచార్యుడు ఒకమాటంటాడు – ''తత్త దేవా గచ్ఛత్వమ్ మమ తేజోంశ సంభవమ్''.. అని. అటువంటి గొప్ప అందం ఎక్కడయినా ఉంటే .. అది భగవంతుని తేజస్సు అవుతుంది.

నేను ఒకప్పుడు నైమిశారణ్యానికి వెళ్ళాను. అక్కడ గోమతీ నదీతీరంలో ఒక పెద్ద వటవృక్షాన్ని చూసాను. ఎంత పెద్దదంటే.. దాని కొమ్మలు, ఆకులు, ఊడలు తగలకుండా దాని చుట్టూ తిరగడానికి 15–20 నిమిషాలు పడుతుంది. ఎన్ని కొమ్మలు, ఎన్ని ఊడలు, పైన పక్షులు, పక్షి గూళ్ళు.. అలా చూస్తుండిపోయాను. ఇప్పటికి పదేళ్ళు పైగానే అయిపోయి ఉంటుంది. అయినా ఇప్పటికీ అది జ్ఞాపకానికి వస్తే.. దాని సౌందర్యం, దాని పరిమాణం వెంటనే మనసులో మెదిలి అప్పటివరకు నాలో ఉన్న ఉద్వేగం కానీ ఇతరత్రా చికాకులు, విసుగు, అశాంతి అన్నీ మటుమాయమైపోతాయి.

ఒకసారి ఒక కోనేరులో సహస్రదళ కమలాన్ని చూసాను. వెయ్యిరేకుల పద్మం. అక్కడున్నవాళ్ళు దాన్ని కోసి తెస్తే ... నా రెండు చేతులా నిండుగా అది తాజాగా కనిపించడమే కాదు... దగ్గరనుంచి చూస్తే.. ఎన్ని రెక్కల దొంతర్లు, ఎన్నెన్ని రంగులు, ఎంత చక్కటి అమరిక, మధ్యలో ఉన్న దుద్దు, ముఖానికి దగ్గరగా తీసుకుంటే ఎంత చల్లదనం.. అలా దానిని ఆస్వాదిస్తూ ఉండిపోయాను. కొంతసమయం తరువాత అది వాడిపోతుంది, మట్టిలో కలిసిపోతుంది... కానీ నా జ్ఞాపకాల్లో అది వాడలేదు, నశించలేదు, నా స్మృతిపథంలో దానికి బురద లేదు, మొగ్గలేదు, వందలాది రేకులతో, చిత్రవిచిత్ర వర్ణాలతో నా చేతిలో బాగా విప్పారి, నాకు చల్లదనాన్నిచ్చి... అలా నా మనసులో ముద్రితమైన ఆ పూవు మాత్రం నా చివరి శ్వాస వరకు, నేనెప్పుడు గుర్తుకు తెచ్చుకున్నా మొదటిసారి చూసినప్పుడు ఎంత అనుభూతి చెందానో, అంతే అనుభూతిని పొందుతూనే ఉంటాను. అలా గుర్తుకొచ్చినప్పుడు ఆ అందం నాకు సంతోషాన్నిస్తుంది, శాంతినిస్తుంది. అంటే దానికి దేశకాలాలతో సంబంధం లేదు. 'బీజస్యాంతరివాంకురోజగదివం ప్రాంగే నిర్వికల్పం పునః మాయాకల్పిత దేశ కాలకకలగా వైచిత్రచిత్రై కృతం' అంటారు శంకరులు. అలా అది ఎప్పటికీ నాలోనే ఉండిపోతుంది. ఒకవేళ మళ్ళీ వెళ్ళినా అక్కడ అది ఉండవచ్చు, ఉండకపోవచ్చు. కానీ మొదటిసారి చూసి అనుభూతి చెందిన అందం నా స్వంతం. అదెప్పటికీ నాతోనే ఉండి... నాకు సంతోషాన్ని, శాంతిని, ఉపశమనాన్ని కలిగిస్తూనే ఉంటుంది. అంటే ఏది నీకు శాంతికారకమో, సంతోష కారకమో అదే నిజమైన అందం.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

మంచిమాట

రూపం లేని ఇంధనం ఆశ

ఆశ మనిషిని కదిలించి నడిపించే రూపం లేని ఇంధనం; ఆశ మనిషిని ఎప్పటికప్పుడు బతికిస్తూ ఉండే ఆకృతి లేని మూలకం. ఆశలేకపోతే మనిషికి మనుగడే ఉండదు. మనుగడకు మనుగడ ఉండాలంటే మనిషికి ఆశ ఉండాలి. మనిషి పొందుతున్న ప్రతిదానికీ ఆశపడడమే కీలకం. మనిషి గమ్యానికీ ఆశ ఆరంభం. మనిషికి ఆశ అంతం అవడం ఉండకూడదు. ఆశ అన్నది అంతం అవడం అంటే మనిషి అంతం అవడం తప్పితే మరొకటి కాకూడదు. మనిషి క్రియాశీలకం అవడానికి ఆశే ప్రేరణ. ఆశవల్లే మొత్తం ప్రపంచం క్రియాశీలకం ఔతోంది.

'ఆశ అనేది మనుషులకు ఉన్న శృంఖలాల్లో అత్యంత ఆశ్చర్యకరమైంది. దానికి బద్ధులైనవాళ్లు పరుగులు పెడతూ ఉంటారు; ఆ శృంఖలాల నుంచి విముక్తులైనవాళ్లు చతికిలబడిపోతూ ఉంటారు' అని హితోపదేశం తెలియజెబుతోంది. ఆశ ఉన్న మనిషి పరుగెడుతూ ఉంటాడు; ఆశలేని మనిషి చతికిలబడిపోతాడు; చచ్చుబడిపోతాడు.

ఆశను కలిగించే మాటలు నీకు శక్తిని ఇస్తాయి' అని జపనీస్ కవి–బౌద్ధతాత్త్వికుడు డైసకు ఇకెద ఒక కవితలో అంటారు. ఈ డైసకు ఇకేదకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న వేర్వేరు విశ్వవిద్యాలయాల నుంచి 300కు పైగా డాక్టరేట్స్ వచ్చాయి! 2వ ప్రపంచ యుద్ధంలో అమెరికా అణుబాంబు దాడికి ఆయన మినహా కుటుంబం మొత్తం బలి అయిపోయింది. అ పరిస్థితి నుంచి ఆయన ఆశతో, ఆశ ఇచ్చిన శక్తితో విశ్వ – విశ్వవిద్యాలయాల నుంచి 300కు పైగా డాక్టరేట్స్ అందుకున్న మహోన్నతుడిగా ఎదిగారు. శక్తి, మహాశక్తి ఆశ మనిషిని ముందుకు, మునుముందుకు నడిపిస్తూ ఉంటుంది; మహోన్నతుణ్ణి చేస్తూ ఉంటుంది.

ఆశ వేరు దురాశ వేరు. మనిషికి ఆశపడడంపై అవగాహన ఉండాలి. ఏ వ్యక్తి ఐనా తనను తాను చూసుకోకుండా లేదా తనను తాను తెలుసుకోకుండా ఆశపడుతూ ఉండడం తప్పు. ఆశ అనేదే లేకపోతే మనుగడ జరగదు. కానీ దురాశ వల్ల మనుగడ తిన్నగా ఉండదు, సాగదు.

ఆశ వికటిస్తే దురాశ ఔతుంది; వికృతమైన మనస్తత్వానికి దురాశ ఒక అభివ్యక్తి. ప్రపంచాన్ని తన గుప్పెట్లో పెట్టుకోవాలి అన్న హిట్లర్ దురాశ పెనువినాశనానికి కారణమై చివరికి అతడి అంతానికీ కారణం ఐంది. నెపోలియన్ కూడా ప్రపంచాన్ని జయించేయాలన్న దురాశతో యుద్ధాలు చేసుకుంటూ వెళ్లి చివరికి బ్రిటిష్ వాళ్ల చేతికి చిక్కి చెరసాలపాలై ఆపై అనాథై మరణించాడు. 'దురాశ దుఃఖానికి చేటు' అని ఎప్పుడో చెప్పబడ్డ మాట ఇప్పటికీ, ఎప్పటికీ సరైందే; ఎప్పటికప్పుడు అది మనకు దిశానిర్దేశం చేసేదే. మనం ఎప్పుడూ దురాశకు అతీతంగానే ఉండాలి.

ఆశ ఫలించని వేళల్లో మనిషిని నిరాశ చుట్టుకుంటుంది. నిరాశకు లోనుకాని మనిషి ఉండడం ఉండదు. నిరాశకు బలి ఐపోయినవాళ్లూ ఉన్నారు. నిరాశ అనే వ్రణం ఎవరినైనా సలుపుతుంది. నిరాశ కలిగినప్పుడు ఆ నిరాశకు చిత్తైపోకుండా ఉండాలంటే, నిరాశపై విజయం సాధించి రాణించాలంటే మనిషికి ఉండాల్సింది ఆశే. ఆశతోనే మనిషి నిరాశపై నెగ్గాలి.

పుట్టిన ప్రతివ్యక్తికి పాలు తాగడం నుంచీ ఆశ మొదలు ఔతుంది. నిజానికి వ్యక్తికి పాలు తాగడంకన్నా ముందే ఆశ మొదలు ఔతుంది; ఆ ఆశవల్లే పాలుతాగడం మొదలు ఔతుంది; ఆశ మొదలు కాగా మనిషికి మనుగడ మొదలు ఔతుంది. మనిషి పోయేంత వరకూ మనిషిని వీడిపోకుండా ఉండాల్సింది ఆశ. వర్తమానం భవిష్యత్తును ఆవాహన చెయ్యాలంటే మనకు కావాల్సినవి ఆశ ఆపై సదాశ. ఆశ, సదాశలతో మనం అభ్యున్నతిని పొందాలి.

> **ఆశ ప్రగతికి మూలం; దురాశ పతనానికి మూలం. ఈ విషయాన్ని మనిషి అవగతం చేసుకోవాలి. మనిషికి ఆశ ఉండాలి; తన ఆశకు తగినట్టు మనిషి తనను తాను సిద్ధం చేసుకోవాలి. ఆశ, సదాశల్ని ప్రయుక్తం చేసుకుని ప్రతిమనిషీ ప్రశస్తం అవాలి.**



– రోచిష్మాన్

బౌద్ధవాణి

ధర్మసాధన

ఒకసారి బుద్ధుడు తన భిక్షువులతో కలసి ఒక విశాలమైన పొలం లోంచి నడిచిపోతున్నాడు. ఆ పొలం అంతకుముందే తగలబడి ఉంది. పంటను తీశాక రైతులు చెత్తనంతా తగలబెట్టారు. కానీ... ఆ తర్వాత వర్షం పడింది. ఆ తగలబడిన మసి లోంచి పచ్చని గడ్డి పిలకలు నవనవలాడుతూ పైకి లేస్తున్నాయి.

బుద్ధుడు వాటి వంక చూస్తూ ముందుకు నడిచాడు. ఆ పొలం దాటి పెద్ద కాలువ కట్ట ఎక్కారు. ఆ కట్ట మీద మొదలు పైకి నరికిన పెద్ద తుమ్మచెట్టు మోడు కనిపించింది. ఆ తర్వాత రకరకాల చెట్ల మోడులు కనిపించాయి. వాటి మధ్య నరికేసిన తాటిచెట్లు మోడులూ కనిపించాయి.

బుద్ధుడూ, భిక్షువులూ ఆ మోళ్ళను గమనిస్తూనే ముందుకు నడిచి వెళ్ళారు. వారు కొంత దూరం పోయాక నదీ తీరంలో పెద్ద మర్రిచెట్టు కనిపించింది. అప్పటికే ఎండ ఎక్కుతూ ఉంది. కొంత సేపు సేద తీరడానికి ఆ చెట్టు కింద ఆగారు.

భిక్షువులు కొన్ని సందేహాలు అడిగారు. వాటికి సమాధానమిచ్చాడు. ఆ తరువాత ఆయన ప్రబోధం 'చిత్త మలినాలు' మీదికి మళ్ళింది. ఆ విషయం చెప్తూ స్వచ్ఛ జలం గురించి చెప్పాడు.



బుద్ధునికి నిత్య జీవితంలో తమకు అనుభవమయ్యే అంశాల్ని జోడించి, తేలికగా అర్థం అయ్యేలా చెప్పటం అలవాటు. దానితో అప్పటి వరకూ తాము నడచి వచ్చిన దారిలోని సంఘటనలు తీసుకున్నాడు.

''భిక్షువులారా! చూశారుగా! మనం నడచి వచ్చిన పొలాన్ని తగులబెట్టారు. అయినా ఆ తరువాత దానిలోని గడ్డి, తుంగ పరకలూ మొలకెత్తాయి. అలాగే... గట్టు మీది ఎన్నో చెట్లు మొదలంటూ నరికినా, మరలా పిలకలు వేశాయి. చివురులు తొడిగాయి. ఐతే ఒకే ఒక జాతి వృక్షాలు మాత్రం నరికివేశాక అవి ఎలాంటి చివురులు తొడగలేవు. అవి ఏమిటో గమనించారా?'' అని అడిగాడు.

ఒక భిక్షువు వినమ్రంగా 'భగవాన్! తాటిచెట్లు' అన్నాడు. బుద్ధుడు చిరుమందహాసంతో –

''అవును భిక్షూ! నీ పరిశీలన సరైనదే! మన మనస్సులో రాగద్వేషాలూ, కోరికలూ, మోహాలు అనే అకుశలాలు అన్నీ అలాగే నరికివేయబడాలి. అవి మరలా మొలకెత్తకూడదు. చివురులు తొడక్కూడదు. తాటిచెట్టును కొట్టి వేశాక, ఎలా చివురులు వేయదో, పిలకలు తొడగదో మన మనో క్షేత్రంలో అకుశలాల్ని, కోర్కెల్ని (తృష్ణల్ని) అలాగే తొలగించుకోవాలి. మొదలంటూ నరికిన తాటిచెట్టులా తృష్ణల్ని తెగతెంచుకోవాలి. అదే తృష్ణాక్షయం. అలాంటి చిత్తమే నిర్మల చిత్తం. స్వచ్ఛమైన నీటిలాంటి చిత్తం. మన ధర్మ సాధనంతా అలాంటి నిర్మల చిత్తం కోసమే!'' అన్నాడు.

ఆ గంభీర ధర్మోపదేశం వారి హృదయాల్ని తాకింది. వారి మనో ఫలకంపై మొదలు నరికిన తాటిచెట్టు ప్రత్యక్షం అయింది. అప్రయత్నంగా అందరూ కనురెప్పలు మెల్లగా మూశారు. ఏకాగ్రతలోకి జారుకున్నారు. ధ్యాన నిమగ్నులయ్యారు.

> **మనోశుద్ధి అంటే చిత్తశుద్ధి. చిత్తం ఈ మలినాల నుండి విముక్తి చెందడం. అలా విముక్తి చెందిన చిత్తంలో తిరిగి మరలా అమానవీయ విషయాలు మొలకెత్తవు. సమూలంగా నిర్మూలించబడతాయి.**

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా

కుశలమా!

సూర్య హీరోగా నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'కంగువ'. శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ దిశా పటానీ హీరోయిన్. స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్‌పై కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఆదివారం(జూలై 23) సూర్య పుట్టిన రోజు సందర్భంగా 'కంగువ' టీజర్‌ని విడుదల చేశారు మేకర్స్. 'కొండల కోనల్లో కోటి పులులు పట్టినోడు, ముక్కోటి చుక్కలెక్కి దిక్కులెల్ల గెలిచినోడు, ఒక్కడే ఒక్క వీరుడురా.. వాడే కంగ' వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. 'కుశలమా' అంటూ సూర్య చెప్పే డైలాగ్‌తో టీజర్ ముగుస్తుంది. ''చారిత్రక నేపథ్యంతో రూపొందుతోన్న చిత్రం 'కంగువ'. సూర్య కెరీర్‌లో భారీ బడ్జెట్‌తో ఈ మూవీ తెరకెక్కుతోంది. త్రీడీలో విజువల్ వండర్‌గా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇచ్చేందుకు టీమ్ శ్రమిస్తోంది. పాన్ వరల్డ్ మూవీగా పది భాషల్లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. సూర్య బర్త్ డే సందర్భంగా తెలుగు, ఇంగ్లీష్, హిందీ, తమిళ్, కన్నడ, మలయాళ భాషల్లో టీజర్‌ని రిలీజ్ చేశాం.. మరో నాలుగు భాషల్లో త్వరలోనే విడుదల చేస్తాం. వచ్చే ఏడాది వేసవిలో 'కంగువ' రిలీజ్ కానుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఏజే రాజా, కో ప్రొడ్యూసర్: నేహా జ్ఞానవేల్ రాజా.



● సూర్య



● చిరంజీవి

వినోదం ఎక్స్‌ట్రా

నితిన్ హీరోగా వక్కంతం వంశీ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాకు 'ఎక్స్‌ట్రా' అనే టైటిల్ ఖరారు చేశారు. 'ఆర్డినరీ మేన్' అనేది ట్యాగ్‌లైన్. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రేష్ఠ్ మూవీస్, ఆదిత్యా మూవీస్ అండ్ ఎంటర్‌టైన్మెంట్స్, రుచిర ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబరు 23న విడుదల కానుంది. తాజాగా ఆదివారం ఈ సినిమా టైటిల్, ఫస్ట్‌లుక్, రిలీజ్ డేట్‌ను ప్రకటించారు మేకర్స్. ''కిక్' సినిమా తర్వాత ఆ రేంజ్‌లో క్యారెక్టర్ బేస్డ్ స్క్రిప్ట్‌తో 'ఎక్స్ ట్రా' సినిమా తెరకెక్కుతోంది. ఆడియన్స్‌కు రోలర్ కోస్టర్ లాంటి ఎక్స్‌పీరియన్స్ ఇస్తూనే, నవ్విస్తూ సర్‌ప్రైజ్‌లతో మెప్పిస్తుంది మా సినిమా'' అన్నారు వక్కంతం వంశీ. ఈ సినిమాకు సంగీతం: హారిస్ జైరాజ్.



● 'ఎక్స్ ట్రా' లో నితిన్

ట్రైలర్ రెడీ

చిరంజీవి టైటిల్ రోల్‌లో నటించిన తాజా చిత్రం 'భోళాశంకర్' ట్రైలర్ రిలీజ్‌కు ముహూర్తం ఖరారైంది. ఈ నెల 27న ట్రైలర్ విడుదలకానుంది. మెహర్ రమేష్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో చిరంజీవి సరసన తమన్నా నటించగా, ఆయన చెల్లెలి పాత్రలో కీర్తి సురేష్ నటించారు. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మించారు. ఈ సినిమా ఆగస్టు 11న థియేటర్స్‌లో రిలీజ్ కానున్న సంగతి తెలిసిందే. కాగా 'భోళాశంకర్' ట్రైలర్‌ను ఈ నెల 27న(గురువారం) విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ఆదివారం అధికారికంగా ప్రకటించి, చిరంజీవి లుక్‌ని రిలీజ్ చేసింది. చేతిలో కత్తి పట్టుకుని సీరియస్ లుక్‌లో నడిచి వస్తున్నారు చిరంజీవి. ఈ సినిమాలో సుకాంత్, రఘుబాబు, మురళీ శర్మ, రవిశంకర్, 'వెన్నెల' కిషోర్, తులసి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: మహతి స్వర సాగర్, కెమెరా: డడ్లీ, లైన్ ప్రొడక్షన్: మెహర్ మూవీస్.

వరుణ్‌కు జోడీగా...

హీరోయిన్ మీనాక్షీ చౌదరి మంచి ఫామ్‌లో ఉన్నారు. వరుస సినిమాలకు సైన్ చేస్తూ కెరీర్‌లో దూసు కెళుతున్నారీ బ్యూటీ. ఇప్పటికే మహేశ్‌బాబు 'గుంటూరు కారం' చిత్రంలో ఓ హీరోయిన్‌గా, విశ్వక్‌సేన్ ('వీఎస్10') చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న ఈ బ్యూటీని తాజాగా మరో అవకాశం వరించిందని ఫిల్మ్‌నగర్ సమాచారం. వరుణ్ తేజ్ హీరోగా 'పలాస' ఫేమ్ కరుణ కుమార్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. మోహన్ చెరుకూరి (సీవీఎం), డా.విజయేందర్ రెడ్డి తీగల నిర్మించనున్న ఈ సినిమా ఈ నెల 27న ప్రారంభం కానుంది. 1960 నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో వరుణ్ సరసన నటించే చాన్స్ మీనాక్షీ చౌదరికి దక్కిందన్నది ఫిల్మ్‌నగర్ లేటెస్ట్ టాక్. మరి.. వరుణ్, మీనాక్షీలు ఈ సినిమా కోసం జోడీ కడతారా? వేచి చూడాలి.



● మీనాక్షీ చౌదరి

వృషభ షురూ

మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో, రోషన్ లీడ్ రోల్‌లో నటిస్తున్న ద్విభాషా చిత్రం (తెలుగు, మలయాళం) 'వృషభ'. నందకిశోర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్రీకాంత్, రాగిణి ద్వివేది, జహ్రా ఎస్ ఖాన్, షానయ కపూర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అభిషేక్ వ్యాస్, ఏక్తా కపూర్, విశాల్‌గుర్నాని, జుహీ పరేఖ్ మెహతా, శ్యామ్ సుందర్, శోభాకపూర్, వరుణ్ మాథుర్ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నటి ఊహ క్లాప్ కొట్టారు. మోహన్‌లాల్, రోషన్ పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట నందకిశోర్. తండ్రీకొడుకుల అనుబంధం నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని తెలిసింది. తెలుగు, మలయాళంతో పాటు తమిళం, కన్నడం, హిందీ భాషల్లోనూ ఈ చిత్రం విడుదల కానుంది.



● మోహన్‌లాల్

ఫుల్ ఎంటర్‌టైనర్



● విశ్వక్ సేన్

విశ్వక్ సేన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'వీఎస్10'(వర్కింగ్ టైటిల్). రవితేజ ముళ్లపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో మీనాక్షీ చౌదరి కథానాయిక. ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. ఆగస్టు 6 ఉదయం 11:11 గంటలకు ఈ సినిమా టైటిల్‌ను ఒక గ్లింప్స్ ద్వారా ప్రకటించనున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. ఈ మేరకు విడుదల చేసిన పోస్టర్‌లో విశ్వక్ సేన్ ఇంటెన్స్ లుక్‌లో కనిపించారు. ''ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'వీఎస్10'. ఈ మూవీ కోసం విశ్వక్ స్టైలిష్‌గా మేకోవర్ అయ్యారు. త్వరలో మా సినిమా రెండవ షెడ్యూల్ ప్రారంభం కానుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, కెమెరా: మనోజ్ కాటసాని, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: 'సత్యం' రాజేష్, విద్యాసాగర్ జె.

రీల్స్

అలాంటి ఆదరణ ఎక్కడా దొరకదు

– రెబ్బా మోనికాజాన్

''సామజవరగమన' సినిమా సక్సెస్ టూర్‌కు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు వెళ్లాం. నాకు తెలుగు భాష రాకపోయినా అక్కడి ప్రజలు నా పట్ల ఎంతో ప్రేమ, ఆప్యాయతను చూపించారు.. అలాంటి ఆదరణ ఎక్కడా దొరకదు. అందుకే నేను తెలుగు ప్రజలకు దగ్గరగా ఉండాలనుకుంటున్నాను'' అని రెబ్బా మోనికాజాన్ అన్నారు. శ్రీవిష్ణు, రెబ్బా మోనికాజాన్ జంటగా రామ్ అబ్బరాజు దర్శకత్వం వహించిన చిత్రం 'సామజవరగమన'. అనిల్ సుంకర సమర్పణలో రాజేష్ దండా నిర్మించిన ఈ మూవీ జూన్ 29న విడుదలైంది. ఈ చిత్రం ద్వారా టాలీవుడ్‌కి పరిచయమైన రెబ్బా మోనికాజాన్ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ–''నేను మలయాళీ అయినా బెంగళూరులో పెరిగాను. చదువు పూర్తయ్యాక కొన్ని యాడ్స్ చేశాను. మలయాళంలో కొన్ని సినిమాలు చేశాను. దక్షిణాదిలో నేను ఇతర చిత్రాల్లో నటించినా 'సామజవరగమన' నాకు మంచి గుర్తింపు తీసుకొచ్చింది.. అందుకే నేను చాలా లక్కీ అనుకుంటున్నాను. తెలుగులో కొన్ని కథలు వింటున్నాను. నా తర్వాతి సినిమాకి తెలుగు నేర్చుకొని డబ్బింగ్ చెబుతాను'' అన్నారు.



మిస్టీరియస్ డ్రామా

అభిలాష్, రమ్య, ప్రాచీ ఠాకూర్, శివకోన, ప్రభాకర్, నేహా దేశ్‌పాండే ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రాజుగారి కోడిపులావ్'. కుటుంబ కథా 'వి' చిత్రం అనేది ట్యాగ్‌లైన్. శివ కోన దర్శకత్వంలో అనిల్ మోదుగ, శివకోన నిర్మించిన ఈ సినిమాను ఆగస్టు 4న విడుదల చేస్తున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో చిత్రయూనిట్ నిర్వహించిన విలేకర్ల సమావేశంలో అభిలాష్ మాట్లాడుతూ– ''రాజుగారి కోడిపులావ్' రొటీన్ సినిమా కాదు.. కొత్తగా మిస్టీరియస్‌గా ఉంటుంది'' అన్నారు. ''మా సినిమా ప్రేక్షకులకు నచ్చుతుంది'' అన్నారు శివ. నటీనటులు కునాల్, నేహాదేశ్ పాండే, రమ్య, ప్రాచీ ఠాకూర్ మాట్లాడారు.



● నేహా దేశ్‌పాండే, శివ కోన

పవర్‌ఫుల్ పోలీస్

సీహెచ్‌వీ సుమన్ బాబు హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'గిద్దలూరు పోలీస్‌స్టేషన్'. శ్రీ సుమన్ వెంకటాద్రి ప్రొడక్షన్స్‌పై ఈ మూవీ రూపొందుతోంది. సుమన్ బాబు మాట్లాడుతూ– ''చట్టం ఎవరి చుట్టం కాదు. కర్తవ్యమే ప్రాణం అని నిరూపించిన ఒక పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ కథే 'గిద్దలూరు పోలీస్‌స్టేషన్'. అందరూ ఆలోచించే కథ, కథనం ఉంటుంది. ఆగస్టు 15న మా సినిమా ఫస్ట్ గ్లింప్స్ రిలీజ్ చేస్తాం. డిసెంబరులో సినిమా రిలీజ్ చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ప్రమోద్ పులిగిల్ల, కెమెరా: గణేష్, లైన్ ప్రొడ్యూసర్: అబ్దుల్ రెహమాన్.



● సుమన్ బాబు



పోరాడి ఓడిన సాకేత్-యూకీ జోడీ

హాల్ ఆఫ్ ఫేమ్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో సాకేత్ మైనేని-యూకీ బాంబ్రీ (భారత్) జోడీ పోరాటం ముగిసింది. అమెరికాలోని న్యూపోర్ట్‌లో జరిగిన ఈ టోర్నీలో సాకేత్-యూకీ ద్వయం పురుషుల డబుల్స్ విభాగంలో సెమీఫైనల్లో పోరాడి ఓడింది. గంటా 59 నిమిషాలపాటు జరిగిన సెమీఫైనల్లో మూడో సీడ్ సాకేత్-యూకీ జంట 7-6 (7/2), 6-7 (2/7), 9-11తో టాప్ సీడ్ నథానియల్ లామోన్స్-జాక్సన్ విత్రో (అమెరికా) ద్వయం చేతిలో ఓటమి చవిచూసింది. సాకేత్-యూకీలకు 10,660 డాలర్ల (రూ. 8 లక్షల 74 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 90 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

విజేత సుమిత్ నగాల్



భారత అగ్రశ్రేణి టెన్నిస్ క్రీడాకారుడు సుమిత్ నగాల్ తన కెరీర్‌లో నాలుగో ఏటీపీ చాలెంజర్ టోర్నీ సింగిల్స్ టైటిల్ సాధించాడు. ఫిన్‌లాండ్‌లో ఆదివారం ముగిసిన టాంపెరె ఓపెన్ టోర్నీ ఫైనల్లో సుమిత్ 6-4, 7-5తో డలిబోర్ సిర్సినా (చెక్ రిపబ్లిక్)పై గెలిచాడు. తద్వారా యూరోప్ సర్క్యూట్‌లో రెండు చాలెంజర్ టైటిల్స్ నెగ్గిన తొలి భారతీయ టెన్నిస్ ప్లేయర్‌గా గుర్తింపు పొందాడు. సుమిత్‌కు 9,880 యూరోల (రూ. 9 లక్షలు) ప్రైజ్‌మనీ,75 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



భారత ‘ఎ’ జట్టుకు నిరాశ


కొలంబో: ఎమర్జింగ్ కప్ ఆసియా అండర్-23 క్రికెట్ టోర్నమెంట్‌లో భారత ‘ఎ’ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో పాకిస్తాన్ ‘ఎ’ 128 పరుగుల తేడాతో భారత్‌ను ఓడించి వరుసగా రెండోసారి విజేతగా నిలిచింది. టాస్ నెగ్గిన భారత్ ఫీల్డింగ్ ఎంచుకోగా... మొదట పాకిస్తాన్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 352 పరుగుల భారీస్కోరు చేసింది. తయ్యాబ్ తాహిర్ (71 బంతుల్లో 108; 12 ఫోర్లు, 4 సిక్సర్లు) మెరుపు శతకం సాధించగా, ఓపెనర్లు అయూబ్ (59; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఫర్హాన్ (65; 4 ఫోర్లు, 4 సిక్సర్లు) అర్ధసెంచరీలు చేశారు. రాజ్‌వర్ధన్, రియాన్ పరాగ్ చెరో 2 వికెట్లు తీశారు. తర్వాత భారత్ ‘ఎ’ 40 ఓవర్లలోనే 224 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓపెనర్ అభిషేక్ శర్మ (51 బంతుల్లో 61; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. కెప్టెన్ యశ్ ధుల్ (41 బంతుల్లో 39; 4 ఫోర్లు), సాయి సుదర్శన్ (28 బంతుల్లో 29; 4 ఫోర్లు) మెరుగ్గా ఆడారు. పాక్ బౌలర్లలో సుఫియాన్ 3, వసీమ్, ముంతాజ్, ఇక్బాల్ తలా 2 వికెట్లు తీశారు. టోర్నీ ఆసాంతం రాణించిన నిశాంత్ సింధుకు ‘ప్లేయర్ ఆఫ్ ద సిరీస్’ లభించింది.

రవి దహియాకు షాక్

న్యూఢిల్లీ: భారత స్టార్ రెజ్లర్ రవి దహియా ఆసియా క్రీడలకు అర్హత సాధించలేకపోయాడు. టోక్యో ఒలింపిక్స్‌లో రజతం, కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణం, వరుసగా మూడేళ్లు ఆసియా చాంపియన్‌గా నిలిచిన రవి దహియా (57 కేజీలు) ఆదివారం నిర్వహించిన సెలెక్షన్ ట్రయల్స్‌లో ఆతీశ్ తోడ్కర్ (మహారాష్ట్ర) చేతిలో అనూహ్యంగా ఓడిపోయాడు. అయితే ఈ విభాగంలో అమన్ సెహ్రావత్ విజేతగా నిలిచి ఆసియా క్రీడల బెర్త్‌ను దక్కించుకున్నాడు. ఇతర విభాగాల్లో దీపక్ పూనియా (86 కేజీలు), విక్కీ (97 కేజీలు), యశ్ (74 కేజీలు), సుమిత్ మలిక్ (125 కేజీలు), విశాల్ కాళీరామన్ (65 కేజీలు) విజేతలుగా నిలిచారు. 65 కేజీల విభాగంలో బజరంగ్ పూనియాకు నేరుగా ఆసియా క్రీడల్లో ఆడే అవకాశం కల్పించడంతో విశాల్ ‘స్టాండ్‌బై’గా ఉంటాడు.



సిరాజ్ పడగొట్టేశాడు



- భారత పేసర్ దెబ్బకు విండీస్ 255కే ఆలౌట్
- టీమిండియాకు 183 పరుగుల ఆధిక్యం
- రెండో ఇన్నింగ్స్‌లో 118/2

పోర్ట్ ఆఫ్ స్పెయిన్: భారత స్పీడ్‌స్టర్ మొహమ్మద్ సిరాజ్ (5/60) నిప్పులు చెరిగే బౌలింగ్ స్పెల్‌తో వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌ను ఊహించని విధంగా ముగించాడు. ఓవర్‌నైట్ స్కోరు 229/5తో ఆదివారం నాలుగో రోజు ఆట కొనసాగించిన కరీబియన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 115.4 ఓవర్లలో 255 పరుగులకే కుప్పకూలింది. కేవలం 26 పరుగులే జోడించి సగం వికెట్లను కోల్పోయింది. నాలుగో రోజు తొలి ఓవర్లోనే ముకేశ్... అతానజ్ (37; 3 ఫోర్లు)ను అవుట్ చేస్తే... మిగిలిన 4 వికెట్లను స్వల్పవ్యవధిలో సిరాజ్ పడేశాడు. హోల్డర్ (15; 2 ఫోర్లు), అల్జారీ జోసెఫ్ (4), కీమర్ రోచ్ (4), గాబ్రియెల్ (0)లను సిరాజ్ తన నాలుగు ఓవర్ల సూపర్ స్పెల్‌తో పడగొట్టేశాడు. బుల్లెట్లలా దూసుకొస్తున్న బంతులకు అనుభవజ్ఞుడైన హోల్డరే నిలువలేకపోయాడు. దీంతో తర్వాత టెయిలెండర్లు వచ్చీరాగానే బ్యాట్లెత్తారు. 116వ ఓవర్ వేసిన సిరాజ్ వరుస బంతుల్లో రోచ్, గాబ్రియెల్‌లను అవుట్ చేశాడు. ఒకవేళ రెండో ఇన్నింగ్స్‌లో తొలి బంతికే వికెట్ తీస్తే ‘హ్యాట్రిక్’ నమోదవుతుంది. భారత్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 183 పరుగుల ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన భారత్ వర్షంతో ఆట నిలిచే సమయానికి 15 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 118 పరుగులు చేసింది. ఆటకు సోమవారం ఆఖరిరోజు కావడంతో కెప్టెన్, ఓపెనర్ రోహిత్ శర్మ (44 బంతుల్లో 57; 5 ఫోర్లు, 3 సిక్సర్లు) దూకుడుగా ఆడాడు. యశస్వి జైస్వాల్ (30 బంతుల్లో 38; 4 ఫోర్లు, 1 సిక్స్)కూడా ధాటిగానే ఆడాడు. ఈ ఇద్దరు నిష్క్రమించగా... శుబ్‌మన్ గిల్ (10 బ్యాటింగ్), ఇషాన్ కిషన్ (8 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ప్రస్తుతం భారత్ 301 పరుగుల ఆధిక్యంలో ఉంది.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 438; **వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్:** బ్రాత్‌వైట్ (బి) అశ్విన్ 75; తేజ్‌నారాయణ్ చందర్‌పాల్ (సి) అశ్విన్ (బి) జడేజా 33; మెకెంజీ (సి) ఇషాన్ కిషన్ (బి) ముకేశ్ 32; బ్లాక్‌వుడ్ (సి) రహానే (బి) జడేజా 20; అతానజ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ముకేశ్ 37; జొషువా (బి) సిరాజ్ 10; హోల్డర్ (సి) ఇషాన్ కిషన్ (బి) సిరాజ్ 15; జోసెఫ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) సిరాజ్ 4; రోచ్ (సి) ఇషాన్ కిషన్ (బి) సిరాజ్ 4; వారికన్ (నాటౌట్) 7; గాబ్రియెల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) సిరాజ్ 0; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం** (115.4 ఓవర్లలో ఆలౌట్) 255. **వికెట్ల పతనం:** 1-71, 2-117, 3-157, 4-178, 5-208, 6-229, 7-233, 8-244, 9-255, 10-255. **బౌలింగ్:** సిరాజ్ 23.4-6-60-5, జైదేవ్ ఉనాద్కట్ 16-3-44-0, అశ్విన్ 33-10-61-1, ముకేశ్ 18-6-48-2, జడేజా 25-10-37-2.

భారత్ రెండో ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (సి) జొషువా (బి) వారికన్ 38; రోహిత్ శర్మ (సి) జోసెఫ్ (బి) గాబ్రియెల్ 57; గిల్ (బ్యాటింగ్) 10; ఇషాన్ కిషన్ (బ్యాటింగ్) 8; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం** (15 ఓవర్లలో 2 వికెట్లకు) 118. **వికెట్ల పతనం:** 1-98, 2-102. **బౌలింగ్:** రోచ్ 2-0-22-0, జోసెఫ్ 4-0-37-0, హోల్డర్ 4-0-26-0, గాబ్రియెల్ 3-0-15-1, వారికన్ 2-0-15-1.

ఎదురులేని సాత్విక్-చిరాగ్ జోడీ

కొరియా ఓపెన్‌లో టైటిల్ సొంతం ● ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ జంటపై గెలుపు ● ఈ ఏడాది నాలుగో టైటిల్ కైవసం



చిరాగ్ శెట్టి   సాత్విక్ సాయిరాజ్

యోసు (కొరియా): ఈ ఏడాది తమ అద్భుతమైన ప్రదర్శన కొనసాగిస్తూ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ తమ ఖాతాలో నాలుగో టైటిల్‌ను జమ చేసుకుంది. కొరియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 టోర్నీలో ప్రపంచ మూడో ర్యాంక్ ద్వయం సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) చాంపియన్‌గా అవతరించింది. ఆదివారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జంట 17-21, 21-13, 21-14తో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్ జోడీ ఫజర్ అల్ఫియాన్-మొహమ్మద్ రియాన్ అర్దియాంతో (ఇండోనేసియా)పై అద్భుత విజయం సాధించింది. 62 నిమిషాలపాటు జరిగిన ఈ తుది పోరులో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాత్విక్, మహారాష్ట్ర ఆటగాడు చిరాగ్ తొలి గేమ్‌లో తడబడినా వెంటనే తేరుకొని తర్వాతి రెండు గేమ్‌లను దక్కించుకున్నారు. తొలి గేమ్‌లో ఒక దశలో 2-10తో వెనుకబడ్డ భారత జోడీ ఆ తర్వాత అంతరాన్ని తగ్గించినా గేమ్‌ను సొంతం చేసుకోలేకపోయింది. అయితే రెండో గేమ్ నుంచి సాత్విక్, చిరాగ్ ఆట మారింది. ముఖ్యంగా సాత్విక్ తిరుగులేని స్మాష్‌లతో చెలరేగాడు. ఫలితంగా స్కోరు 15-11 వద్ద భారత జోడీ వరుసగా ఐదు పాయింట్లు నెగ్గి 20-15తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత రెండు పాయింట్లు చేజార్చుకున్నా వెంటనే మరో పాయింట్ నెగ్గి గేమ్‌ను దక్కించుకొని మ్యాచ్‌లో నిలిచింది. నిర్ణాయక మూడో గేమ్‌లో సాత్విక్-చిరాగ్ ఆరంభంలోనే 7-3తో ఆధిక్యంలోకి వెళ్లి ఈ ఆధిక్యాన్ని చివరిదాకా కాపాడుకొని గేమ్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నారు. విజేతగా నిలిచిన సాత్విక్-చిరాగ్ జోడీకి 33,180 డాలర్ల (రూ. 27 లక్షల 20 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 9200 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ‘వరుసగా టైటిల్స్ గెలుస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఈ వారం మాకెంతో అద్భుతంగా గడిచింది. ఈ టోర్నీ మొత్తం గొప్పగా ఆడాం. మా ప్రదర్శనతో సంతృప్తిగా ఉన్నాం. మంగళవారం నుంచి జరిగే జపాన్ ఓపెన్‌లో మా జోరు కొనసాగించాలని పట్టుదలతో ఉన్నాం’ అని సాత్విక్, చిరాగ్ వ్యాఖ్యానించారు.

4 ఈ ఏడాది సాత్విక్-చిరాగ్ నెగ్గిన టైటిల్స్. స్విస్ ఓపెన్ సూపర్-300, ఆసియా చాంపియన్‌షిప్, ఇండోనేసియా ఓపెన్ సూపర్-1000, కొరియా ఓపెన్ సూపర్-500 టోర్నీలలో టైటిల్స్ గెలిచారు.

ఏపీ సీఎం వైఎస్ జగన్ అభినందన

సాక్షి, అమరావతి: కొరియా ఓపెన్‌లో డబుల్స్ టైటిల్ నెగ్గిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి (మహారాష్ట్ర)లను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. భవిష్యత్‌లో జరిగే టోర్నీల్లోనూ వీరిద్దరూ విజయ పరంపర కొనసాగించాలని సీఎం జగన్ ఆకాంక్షించారు.

వెర్‌స్టాపెన్ జోరు

ఈ సీజన్‌లో తొమ్మిదో విజయం



బుడాపెస్ట్: ఫార్ములావన్ సీజన్‌లో తన జోరు కొనసాగిస్తూ రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ వరుసగా ఏడో విజయాన్ని, ఓవరాల్‌గా తొమ్మిదో టైటిల్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. ఆదివారం జరిగిన హంగేరి గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ నిర్ణీత 70 ల్యాప్‌లను అందరికంటే వేగంగా ఒక గంటా 38 నిమిషాల 08.634 సెకన్లలో పూర్తి చేసి గెలుపొందాడు. ‘పోల్ పొజిషన్’తో రేసును ఆరంభించిన హామిల్టన్‌ను వెర్‌స్టాపెన్ తొలి ల్యాప్ మలుపు వద్ద ఓవర్‌టేక్ చేసి వెనుదిరిగి చూడలేదు. ఈ గెలుపుతో ఫార్ములావన్ చరిత్రలో వరుసగా 12 రేసుల్లో నెగ్గిన తొలి జట్టుగా రెడ్‌బుల్ గుర్తింపు పొందింది. 1988లో మెక్‌లారెన్ జట్టు వరుసగా 11 రేసుల్లో గెలిచింది.

ఆసీస్‌దే ‘యాషెస్’ సిరీస్

మాంచెస్టర్: నాలుగో టెస్టులో గెలిచి యాషెస్ సిరీస్‌లో సజీవంగా ఉండాలని ఆశించిన ఇంగ్లండ్ జట్టుపై వరుణ దేవుడు కరుణించలేదు. ఎడతెరిపిలేని వాన కారణంగా ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ జట్ల మధ్య నాలుగో టెస్టులో ఐదో రోజు ఆట సాధ్యపడలేదు. దాంతో మ్యాచ్ ‘డ్రా’గా ముగిసింది. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 214/5తో మరో 61 పరుగులు వెనుకంజలో నిలిచింది. ఐదో రోజు త్వరగా ఆస్ట్రేలియాను ఆలౌట్ చేసి విజయంపై ఇంగ్లండ్ కన్నేసింది. కానీ వర్షం కారణంగా ఇంగ్లండ్ ఆశలు ఆవిరయ్యాయి. ప్రస్తుత ఐదు టెస్టుల సిరీస్‌లో ఆస్ట్రేలియా 2-1తో ఆధిక్యంలో ఉంది. చివరి టెస్టులో ఇంగ్లండ్ నెగ్గినా సిరీస్ 2-2తో సమంగా ముగుస్తుంది. అయితే క్రితంసారి యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా గెలుపొందడంతో ఈసారీ ఆ జట్టు వద్దే యాషెస్ సిరీస్ ట్రోఫీ ఉంటుంది.

భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

● గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం — ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఐఎం, బెంగళూరులో లైబ్రరీ ట్రైనీ పోస్టులు

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం).. లైబ్రరీ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04
» **అర్హత:** ఎంఎల్ఐఎస్సీ ఉత్తీర్ణతతో పాటు లైబ్రరీ టెక్నాలజీపై పరిజ్ఞానం ఉండాలి.
» **నెలవారీ స్టైపెండ్:** రూ.20,000.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.07.2023
» **వెబ్‌సైట్:** iimb.ac.in

ఏకలవ్య పాఠశాలల్లో 6329 టీజీటీ, హాస్టల్ వార్డెన్ పోస్టులు

దేశవ్యాప్తంగా నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్(నెస్ట్స్).. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్ల(ఈఎంఆర్ఎస్)లో డైరెక్ట్ ప్రాతిపదికన టీజీటీ, హాస్టల్ వార్డెన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 6329
» **పోస్టుల వివరాలు:** ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ)-5660, హాస్టల్ వార్డెన్(పురుషులు)-335, హాస్టల్ వార్డెన్(మహిళలు)-334.
» **సబ్జెక్టులు:** హిందీ,ఇంగ్లిష్, మ్యాథ్స్,సోషల్ స్టడీస్, సైన్స్,బెంగాలీ,గుజరాతీ,కన్నడ,మలయాళం, మణిపురి, మరాఠీ, ఒడియా, తెలుగు, ఉర్దూ, మిజో, సంస్కృతం, సంతాలి, మ్యూజిక్, ఆర్ట్, పీటీటీ(మేల్), పీఈటీ(ఫిమేల్), లైబ్రేరియన్.
» **అర్హత:** టీజీటీ ఖాళీలకు సంబంధిత విభాగంలో డిగ్రీ, బీఈడీతో పాటు సీటెట్ ఉత్తీర్ణులై ఉండాలి. టీజీటీ పీఈటీ పోస్టులకు డిగ్రీ, బీపీఈడీ, టీజీటీ లైబ్రేరియన్ పోస్టులకు డిగ్రీ, బీఎల్ఐఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. » **వయసు:** 18.08.2023 నాటికి 18 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు టీజీటీ ఉద్యోగాలకు రూ.44,900 నుంచి 1,42,400; రూ.35,400 నుంచి రూ.1,12,400, హాస్టల్ వార్డెన్‌కు రూ.29,200 నుంచి రూ.92,300.
» **ఎంపిక విధానం:** ఈఎంఆర్ఎస్ స్టాఫ్ సెలక్షన్ ఎగ్జామ్-2023, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** ఓఎంఆర్ ఆధారిత(పెన్ పేపర్) విధానంలో ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలు అడుగుతారు. టీజీటీ రాతపరీక్షకు 120 మార్కులు(120 ప్రశ్నలు), లాంగ్వేజ్ కాంపిటెన్సీ టెస్టుకు 30 మార్కులు(30 ప్రశ్నలు) కేటాయించారు. హాస్టల్ వార్డెన్ రాత పరీక్షకు 120 మార్కులు(120 ప్రశ్నలు) కేటాయించారు. టీజీటీ పరీక్షకు మూడు గంటలు, హాస్టల్ వార్డెన్ పరీక్షకు రెండున్నర గంటల వ్యవధి ఉంటుంది.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.08.2023
» **వెబ్‌సైట్:** emrs.tribal.gov.in

బ్యాంక్ కొలువు కావాలా..!

బ్యాంకు ఉద్యోగాల అభ్యర్థులకు మరో ప్రభుత్వ రంగ బ్యాంకు.. ఆహ్వానం పలుకుతోంది! బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర.. స్కేల్-2, స్కేల్-3 ఆఫీసర్స్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంపికైతే ప్రారంభంలోనే నెలకు రూ.50 వేలకు పైగా వేతనం అందుకోవచ్చు!! ఈ నేపథ్యంలో. .బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఆఫీసర్ పోస్టుల వివరాలు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం తదితర వివరాలు..

» బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో ఆఫీసర్స్ పోస్టులు
» మొత్తం 400 ఉద్యోగాల భర్తీకి ప్రకటన విడుదల
» రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక
» రూ.50వేలకు పైగా వేతనం

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర తాజా నోటిఫికేషన్ ద్వారాస్కేల్-2, స్కేల్-3 ఆఫీసర్స్ హోదాలో మొత్తం నాలుగు వందల పోస్టులను భర్తీ చేయనుంది. వీటిల్లో స్కేల్-3 ఆఫీసర్(ఎంఎంజీఎస్-3)-100 పోస్టులు; స్కేల్-2 ఆఫీసర్ (ఎంఎంజీఎస్-2)-300 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- 60 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. లేదా సీఏ, సీఎంఏ, సీఎఫ్ఏ వంటి కోర్సులు ఉత్తీర్ణులవ్వాలి. జేఏఐఐబీ, సీఏఐఐబీ ఉత్తీర్ణులకు ప్రాధాన్యం ఉంటుంది. నిర్దేశిత విద్యార్హతలతోపాటు అభ్యర్థులకు పని అనుభవం కూడా తప్పనిసరి. స్కేల్ -2 ఆఫీసర్ పోస్టులకు బ్యాంకుల్లో కనీసం మూడేళ్లు, స్కేల్-3 ఆఫీసర్ పోస్టులకు బ్యాంకుల్లో కనీసం అయిదేళ్ల అనుభవం తప్పనిసరి.
- **వయసు:** స్కేల్-3 ఆఫీసర్ పోస్టులకు 25-38 ఏళ్లు; స్కేల్-2 ఆఫీసర్ పోస్టులకు 25-38 ఏళ్లు ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ


స్కేల్-3, స్కేల్-2 ఆఫీసర్ పోస్టులకు సంబంధించి రెండు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. ముందుగా రాత పరీక్ష నిర్వహిస్తారు. ఆ తర్వాత పర్సనల్ ఇంటర్వ్యూ/గ్రూప్ డిస్కషన్ దశలు ఉంటాయి. ఈ రెండిటిలోనూ ప్రతిభ చూపిన వారితో మెరిట్ జాబితా రూపొందించి కొలువులు ఖరారు చేస్తారు.

150 మార్కులకు రాత పరీక్ష

ఎంపిక ప్రక్రియలో తొలి దశ రాత పరీక్షను నాలుగు విభాగాల్లో 150 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో.. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 20 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 20 ప్రశ్నలు, రీజనింగ్ ఎబిలిటీ 20 ప్రశ్నలు, ప్రొఫెషనల్ నాలెడ్జ్ 90 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం రెండు గంటలు. పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ఉంటుంది. ప్రశ్నలు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటాయి.

తదుపరి దశ ఇంటర్వ్యూ

రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా.. నిర్దేశిత కటాఫ్‌ను అనుసరించి ఒక్కో పోస్ట్‌కు నలుగురిని (1:4 నిష్పత్తి) చొప్పున పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. 100 మార్కులకు ఈ ఇంటర్వ్యూ ఉంటుంది. ఇందులో అభ్యర్థులకు బ్యాంకింగ్ రంగంపై ఉన్న అవగాహన, అదే విధంగా ఇప్పటి వరకు తాము పని చేసిన విభాగాలు, నిర్వర్తించిన విధులు వంటి వాటిపై ప్రశ్నలు అడుగుతారు.



గ్రూప్ డిస్కషన్

గ్రూప్ డిస్కషన్ కూడా నిర్వహించే అవకాశం ఉంది. పర్సనల్ ఇంటర్వ్యూకు అభ్యర్థులను ఎంపిక చేసే క్రమంలో గ్రూప్ డిస్కషన్ నిర్వహించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ గ్రూప్ డిస్కషన్‌లో అభ్యర్థులను సమకాలీన అంశాలపై చర్చించి.. తమ అభిప్రాయాలు చెప్పాలని సూచిస్తారు.

వెయిటేజీ విధానం

తుది జాబితాను రూపొందించే క్రమంలో రెండు దశల్లోనూ చూపిన ప్రతిభను పరిగణనలోకి తీసుకుంటారు. ఇందుకోసం వెయిటేజీ విధానాన్ని అమలు చేస్తారు. రాత పరీక్షలో మార్కులకు 75 శాతం; పర్సనల్ ఇంటర్వ్యూ మార్కులకు 25 శాతం చొప్పున వెయిటేజీ ఉంటుంది. ఈ రెండు దశల్లో సాధించిన మార్కులను 100 మార్కులకు క్రోడీకరించి వెయిటేజీ ప్రకారం.. తుది విజేతలను ఖరారు చేస్తారు.

ప్రొబేషన్, సర్వీస్ బాండ్

తుది విజేతలుగా నిలిచి.. కొలువులు ఖరారు చేసుకున్న అభ్యర్థులకు ప్రొబేషన్ పిరియడ్ విధానం, అదే విధంగా సర్వీస్ బాండ్ నిబంధన అమలు చేస్తున్నారు. ఆరు నెలల ప్రొబేషన్ పిరియడ్‌తోపాటు, రెండేళ్లపాటు బ్యాంకులో పని చేస్తామని రూ.రెండు లక్షలకు సమానమైన సర్వీస్ బాండ్‌ను ఇవ్వాల్సి ఉంటుంది.

ఆకర్షణీయ వేతనం

- స్కేల్-3, స్కేల్-2 ఆఫీసర్లుగా ఎంపికైన వారికి ప్రారంభంలోనే ఆకర్షణీయ వేతనాలు లభిస్తాయి
- స్కేల్-3 ఆఫీసర్లకు రూ.63,840 - రూ.78,230 వేతన శ్రేణి ఉంటుంది.
- స్కేల్-2 ఆఫీసర్లకు రూ.48,170 - రూ.69,810 వేతన శ్రేణి ఉంటుంది.

స్కేల్-7 వరకు పదోన్నతులు

భవిష్యత్తు పదోన్నతులను పరిగణనలోకి తీసుకుంటే స్కేల్-2, స్కేల్-3 హోదాలో అడుగు పెట్టిన వారు స్కేల్-7 హోదాకు చేరుకునే అవకాశం ఉంటుంది. ఆయా హోదాల్లో కనీసం మూడేళ్ల సీనియారిటీ ప్రాతిపదికగా పదోన్నతులు లభిస్తాయి. బ్యాంకు అంతర్గతంగా నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తే.. మరింత వేగంగా పదోన్నతులు అందుకునే అవకాశం ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** జూలై 25, 2023
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్
- **వివరాలకు వెబ్‌సైట్:** https://bankofmaharashtra.in/currentopenings
- **ఆన్‌లైన్ దరఖాస్తు వెబ్‌సైట్:** https://ibpsonline.ibps.in/bmcgomay23

రాత పరీక్షలో విజయానికి ఇలా

ఇంగ్లిష్

ఈ విభాగంలో రాణించేందుకు అభ్యర్థులు ఇడియమ్స్, సెంటెన్స్ కరెక్షన్, వొకాబ్యులరీ, సెంటెన్స్ రీ అరేంజ్‌మెంట్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూట్స్‌పై అవగాహన పెంచుకోవాలి. అదే విధంగా ఇంగ్లిష్ వొకాబ్యులరీపై పట్టు సాధించాలి. ఇందుకోసం ఇంగ్లిష్ దిన పత్రికలు చదవడం, వాటిలో వినియోగిస్తున్న పదజాలం, వాక్య నిర్మాణం వంటి వాటిపై దృష్టి పెట్టాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

- ఈ విభాగం కోసం అర్థమెటిక్ అంశాల(పర్సంటేజెస్, నిష్పత్తులు, లాభ-నష్టాలు, నంబర్ సిరీస్, బాడ్‌మాస్ నియమాలు)ను ప్రాక్టీస్ చేయాలి. వీటితో పాటు గత పరీక్షలు, వెయిటేజీ కోణంలో డేటా ఇంటర్‌ప్రిటేషన్, డేటా అనాలిసిస్‌లపై పట్టు పెంచుకోవాలి. అదే విధంగా... క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, సింప్లిఫికేషన్స్, అప్రాక్సిమేషన్స్ అంశాలను అధ్యయనం చేయాలి.
- **రీజనింగ్ ఎబిలిటీ:** ఈ విభాగంలో మార్కుల సాధనకు కోడింగ్-డీకోడింగ్, బ్లడ్ రిలేషన్స్, డైరెక్షన్, సిలాజిజమ్ విభాగాలను బాగా ప్రాక్టీస్ చేయాలి.

ప్రొఫెషనల్ నాలెడ్జ్

బ్యాంకింగ్ రంగం పరిణామాలు, విధానాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. బ్యాంకింగ్ రంగంలోని అబ్రివేషన్లు, పదజాలం, విధులు, బ్యాంకులకు సంబంధించిన కొత్త విధానాలు, కోర్ బ్యాంకింగ్‌కు సంబంధించి చట్టాలు, విధానాలు, రిజర్వ్ బ్యాంకు విధులు వంటి వాటిపై పూర్తిగా అవగాహన ఏర్పరచుకోవాలి.

జనరల్ అవేర్‌నెస్‌లో కరెంట్ అఫైర్స్, స్టాక్ జనరల్ నాలెడ్జ్ కోణంలోనూ ఆర్థిక సంబంధ వ్యవహారాలు (ఎకానమీ, ప్రభుత్వ పథకాలు)కు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి.

ఐటీబీపీలో కానిస్టేబుల్ పోస్టులు

పదోతరగతి ఉత్తీర్ణులై సర్కారీ కొలువు కోసం అన్వేషిస్తున్న అభ్యర్థులకు తీపి కబురు. కేంద్ర హోంశాఖ పరిధిలోని ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటీబీపీ).. ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. డ్రైవింగ్ లైసెన్స్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, రాత పరీక్ష, ట్రేడ్ టెస్ట్, మెడికల్ టెస్టుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. జూలై 26 తేదీలోగా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చు.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 458
- **పోస్టుల వివరాలు:** కానిస్టేబుల్ (డ్రైవర్) గ్రూప్-సి, నాన్-గెజిటెడ్ (నాన్ మినిస్టీరియల్)-458 పోస్టులు (యూఆర్-195, ఎస్సీ-74, ఎస్టీ-37, ఓబీసీ-110, ఈడబ్ల్యూఎస్-42)

అర్హతలు

గుర్తింపు పొందిన బోర్డు లేదా సంస్థ నుంచి మెట్రిక్యులేషన్ లేదా పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. వ్యాలిడ్ హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ (హెచ్ఎంవీ) కలిగి ఉండాలి. ●**వయసు:** 21 నుంచి 27 ఏళ్లు మధ్య ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఎంపిక ఇలా

- ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్(పీఈటీ), ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్(పీఎస్‌టీ), రాత పరీక్ష, ఒరిజినల్ డాక్యుమెంట్ల వెరిఫికేషన్, ప్రాక్టికల్ డ్రైవింగ్ స్కిల్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- పీఈటీ, పీఎస్‌టీ అర్హత పరీక్షలు. కాగా రాత పరీక్ష 100 మార్కులకు, డ్రైవింగ్ టెస్ట్ 50 మార్కులకు ఉంటాయి.

ఫిజికల్ స్టాండర్డ్‌టెస్ట్(పీఎస్‌టీ)

ఎత్తు: అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అభ్యర్థులు 170 సెం.మీ; అస్సాం, హిమాచల్ ప్రదేశ్; జమ్మూ కాశ్మీర్, లద్దాక్‌కు చెందిన గుర్కాస్, డోగ్రాస్ తదితర ప్రత్యేక వర్గాలు వారు 165 సెం.మీ., కొండ ప్రాంతాలోన్ని నార్త్-ఈస్టర్న్ రాష్ట్రాల వారు 162.5 సెం.మీ. ఎత్తు, ఇతరులు 160 సెం.మీ ఎత్తు ఉండాలి. అలాగే ఛాతీ ఊపిరి పీల్చినప్పుడు, వదిలినప్పుడు 80-85 మధ్య వ్యత్యాసం ఉండాలి. ప్రత్యేక వర్గాల వారికి 5 సెం.మీ మేర సడలింపు వర్తిస్తుంది.

ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్(పీఈటీ)

ఈ పరీక్షలో భాగంగా 1.6 మీటర్ల దూరాన్ని పురుషులు 7.30 నిమిషాల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. 11 ఫీట్ల లాంగ్ జంప్‌ను మూడు ప్రయత్నాల్లో, 3 1/2 ఫీట్ హైజంప్‌ను 3 ప్రయత్నాల్లో పూర్తిచేయాలి.

రాత పరీక్ష

జాబ్స్ ఇన్ఫో

ఈ పరీక్ష మొత్తం 100 మార్కులకు ఉంటుంది. ఇందులో జనరల్ నాలెడ్జ్ 10 ప్రశ్నలు- 10 మార్కులు, మ్యాథమెటిక్స్ 10ప్రశ్నలు-10 మార్కులు, హిందీ 10 ప్రశ్నలు-10 మార్కులు, ఇంగ్లిష్ 10 ప్రశ్నలు-10 మార్కులు, ట్రేడ్ రిలేటెడ్ థియరీ క్వశ్చన్స్ 60-ప్రశ్నలు 60 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం 2 గంటలు.

డ్రైవింగ్ టెస్ట్

రాత పరీక్షలో అర్హత సాధించిన వారిని షార్ట్‌లిస్ట్ చేసి డ్రైవింగ్ టెస్ట్‌కు పిలుస్తారు. ఈ పరీక్షకు 50మార్కులు ఉంటాయి.ఇందులో భాగంగా ప్రత్యేకంగా డిజైన్ చేసిన ట్రాక్స్ మీద హెవీ అండ్ లైట్ మోటార్ వెహికిల్స్‌కు సంబంధించి ప్రాక్టికల్ టెస్టులను నిర్వహిస్తారు. ఇవే కాకుండా వెహికల్ మెయింటెన్స్, వివిధ పరిస్థితుల్లో డ్రైవింగ్ చేసే విధానాన్ని గమనిస్తారు.

తుది ఎంపిక

రాత పరీక్ష, డ్రైవింగ్ టెస్టులో ఎంపికైన వారికి డాక్యుమెంట్ వెరిఫికేషన్ నిర్వహిస్తారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన అభ్యర్థులకు మెడికల్ టెస్టులను నిర్వహించి తుదిగా ఎంపిక చేసి..ఉద్యోగాల్లోకి తీసుకుంటారు.

వేతనాలు

ఈ ఉద్యోగాలకు ఎంపికైన వారికి పే లెవల్-3 ప్రకారం-రూ.21,700-69,100 వరకు వేతన శ్రేణి లభిస్తుంది.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** జూలై 26, 2023
- **వెబ్‌సైట్:** https://itbpolice.nic.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
888	234
66,684	19,745

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	14,033	▽	31
డోజోన్స్	35,228	△	3
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,664	△	18
డాక్స్	16,177	▽	27
షాంఘై	3,168	▽	2
నికాయ్	32,304	▽	186

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

విపత్తుల నుంచి రక్షణ ఉందా?





- వరదలతో ఊహించనంత ఆస్తి నష్టం
- వాహనాల ఇంజన్లకు మరమ్మతులు
- ఈ కాలంలో ఎన్నో ప్రాణాంతక వ్యాధులు
- హోమ్ ఇన్సూరెన్స్‌తో ఎన్నో ప్రయోజనాలు
- సమగ్ర బీమాకు తోడుగా రైడర్లు ఉండాల్సిందే
- హెల్త్ ప్లాన్‌లో అన్నింటికీ రక్షణ ఉండేలా చూసుకోవాలి

ఏటా వానాకాలంలో భారీ వర్షాల కారణంగా ఎదురయ్యే నష్టం భారీగా ఉంటోంది. ఎడతెరిపి లేకుండా 24 గంటల పాటు వర్షం పడితే పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాలు వరద నీటి మధ్య చిక్కుకుపోవడం గురించి వింటూనే ఉన్నాం. వాహనాలు నీట మునగడం, ఇంటికి నష్టం, మౌలిక సదుపాయాలు దెబ్బతినడం చూస్తూనే ఉన్నాం. చెరువులు తెగి, నదులు పొంగడం వల్ల గ్రామాల్లోనూ పంటలకు, ఇతరత్రా ఎంతో నష్టం వాటిల్లుతోంది. ఇదంతా ప్రకృతి వైపరీత్యాల వల్ల ఎదురయ్యే పరిణామం. ఈ విషయంలో మనం పెద్దగా చేయగలిగేదేమీ ఉండదు. కాకపోతే ఒక్క చర్యతో విపత్తుల వల్ల ఎదురయ్యే ప్రతికూల పరిణామాల తాలూకు నష్టాన్ని పరిమితం చేసుకోవచ్చు. తగినంత బీమా కవరేజీ కల్పించుకోవడమే ఇందుకు ఉన్న ఏకైక మార్గం. సమగ్రమైన కవరేజీతో, అన్ని నష్టాలకూ రక్షణ కల్పించే విధంగా బీమా కవరేజీ ఉండాలి. ఇందుకు ఏం చేయాలన్నది తెలియజేసే కథనమే ఇది.

కార్లకు బీమా



ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాల వల్ల ఎదురయ్యే నష్టాన్ని భర్తీ చేసే వాహన బీమా పాలసీలు ఎన్నో అందుబాటులో ఉన్నాయి. సమగ్రమైన కవరేజీతోపాటు, స్టాండర్డ్ పాలసీల్లో నచ్చింది తీసుకోవచ్చు. కాకపోతే కారుకు కాంప్రహెన్సివ్ బీమా పాలసీ తీసుకున్నామని చెప్పి నిశ్చింతంగా ఉండడానికి లేదు. వరద నీరు కారణంగా ఇంజన్‌కు నష్టం ఏర్పడితే ఈ పాలసీల్లో పరిహారం రాదు. టైర్లు పేలిపోవడం, వరదనీరు కారణంగా వాహనం నిలిచిపోయినా పరిహారం రాదు. ''వరద నీటి వల్ల ఇంజన్ ఆన్ అవ్వకపోతే అందుకు కాంప్రహెన్సివ్ ప్లాన్‌లో కవరేజీ రాదు. అంతేకాదు విడిభాగాలు మార్చాల్సి వచ్చినా లేదా విడిభాగాలకు మరమ్మతులు చేయాల్సి వచ్చినా కానీ, తరుగుదలకు చెల్లింపులు చేయవు. అందుకని వాహనదారు తప్పనిసరిగా ఇంజన్ ప్రొటెక్షన్ కవర్, స్పాట్ అసిస్టెన్స్, డిప్రీసియేషన్ కవర్ తప్పకుండా తీసుకోవాలి''అని ప్రోబస్ ఇన్సూరెన్స్ బ్రోకర్ డైరెక్టర్ రాకేశ్ గోయల్ సూచించారు. సాధారణంగా ఈ కవరేజీలు యాడాన్ లేదా రైడర్ రూపంలో అందుబాటులో ఉంటాయని, వాహన బీమాతోపాటు వీటిని కూడా తీసుకోవాలన్నారు.

వర్షాలు, వరదలకు ఇంటికి కూడా నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. వడగండ్లు, పిడుగులతో కూడిన వర్షాలకు ఇంటి నిర్మాణం దెబ్బతినొచ్చు. కుండపోతకు ఇంటి పైకప్పుకు నష్టం కలగొచ్చు. అలాగే, ఎలక్ట్రిక్ వైరింగ్, ఇతర వస్తువులు, ఫర్నిచర్ దెబ్బతినడం వల్ల ఆర్థిక నష్టం ఎదురుకావచ్చు. అలాంటి పరిస్థితుల్లో హోమ్ ఇన్సూరెన్స్ ఎంతో ఆదుకుంటుంది. దురదృష్టవశాత్తూ మన దేశంలో హోమ్ ఇన్సూరెన్స్‌ను తీసుకుంటున్న వారు చాలా తక్కువ మందే ఉన్నారు. హౌస్ ఇన్సూరెన్స్ పట్ల అవగాహన లేకపోవడం, తప్పుడు అభిప్రాయాల కారణంగా మన దేశంలో దీని విస్తరణ చాలా నిదానంగా ఉందని బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ రిటైల్ నాన్‌మోటార్ నేషనల్ హెడ్ గురుదీప్ సింగ్ పేర్కొన్నారు. అయితే హోమ్ ఇన్సూరెన్స్ తీసుకోవడానికి ముందు తెలుసుకోవాల్సిన అంశాలు కొన్ని ఉన్నాయి. ''ప్రకృతి విపత్తుల (యాక్ట్

ఇంటికి బీమా




ఆఫ్ గాడ్) కారణంగా వాటిల్లే నష్టానికి కవరేజీనే ఈ బీమా పాలసీలు ఆఫర్ చేస్తాయి. అలాగే, ఊహించని ఇతర ఉత్పాతాల వల్ల నష్టానికి కూడా రక్షణనిస్తాయి. ఏడాదికి మించిన కవరేజీని ఒకేసారి తీసుకోవడం వల్ల ప్రీమియంలో ఆదా చేసుకోవచ్చు. కాంప్రహెన్సివ్ హోమ్ కవర్ తీసుకోవాలి. దోపిడీ, దొంగతనం, వ్యక్తిగత ప్రమాద కవరేజీ, ఇల్లు దెబ్బతినడం వల్ల నష్టపోయే అద్దె ఆదాయాన్ని భర్తీ చేసే కవరేజీలు ఉండాలి. ఇంట్లోని ఖరీదైన పెయింటింగ్‌లు, ఆభరణాలకూ బీమా రక్షణ కల్పించుకోవాలి. థర్డ్ పార్టీ లయబిలిటీ కవరేజీని కూడా తీసుకోవాలి'' అని గురుదీప్ సింగ్ సూచించారు.

ఇంటి నవీకరణ, పునర్నిర్మాణ సమయంలో ఏవైనా మార్పులు చేసినట్టయితే, హోమ్ ఇన్సూరెన్స్ తీసుకునే సమయంలో కచ్చితమైన విలువను పేర్కొనాలని సింగ్ పేర్కొన్నారు. ''మీ ఇల్లు దీర్ఘకాలం పాటు ఖాళీగా ఉంటే, హోమ్ ఇన్సూరెన్స్ కలిగి ఉండడం ఎంతో అవసరం. సరైన చిరునామా, ప్రాపర్టీ విలువ సరిగ్గా పేర్కొనడం వల్ల పాలసీదారు తన వంతు నష్టాన్ని భరించాల్సిన అవసరం లేకుండా నివారిస్తుంది'' అని సింగ్ తెలిపారు. ఇంట్లోని వస్తువులకు బీమా కవరేజీ కోసం విడిగా ఒక్కో ఆర్టికల్ వివరాలను పూర్తిగా పేర్కొనడం, వాటి విలువను కూడా నమోదు చేయడాన్ని మర్చిపోవద్దు. రీప్లేస్‌మెంట్ లేదా రీఇన్‌స్టేట్‌మెంట్ కవర్‌ను తీసుకోవాలి. ''హోమ్ ఇన్సూరెన్స్ విభాగంలో మార్కెట్ వేల్యూ కవరేజీ లేదంటే రీఇన్‌స్టేట్‌మెంట్ కవరేజీ తీసుకోవచ్చు. మార్కెట్ వేల్యూ కవర్‌లో తరుగుదల పోను మీ ఇంటి విలువలో మిగిలిన మొత్తాన్ని పరిహారం రూపంలో పొందుతారు. రీఇన్‌స్టేట్‌మెంట్ కవర్‌లో ఇంటి పునర్‌నిర్మాణానికి అయ్యే ఖర్చుకు సమాన స్థాయిలో బీమా పరిహారం లభిస్తుంది. ఉదాహరణకు వరదలు వచ్చి ఇల్లు దెబ్బతింటే, అప్పుడు ఇంటిని తిరిగి నిర్మించుకోవాల్సి రావచ్చు. అటువంటి సందర్భాల్లో హౌస్ రీఇన్‌స్టేట్‌మెంట్ కవర్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది''అని ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ అండర్‌రైటింగ్ చీఫ్ సంజయ్‌దత్తా వివరించారు.

వర్షా కాలంలో దోమల వల్ల, నీరు కలుషితం కావడం వల్ల, వైరస్‌ల కారణంగా ఎన్నో ఆరోగ్య సమస్యలు ఎదురవుతుంటాయి. డెంగీ, మలేరియా, వైరల్ ఫీవర్, టైఫాయిడ్ జ్వరం, డయేరియా, చికున్ గునియా ముప్పు వర్షాకాలంలో ఎక్కువ. వీటి కారణంగా ఆసుపత్రిలో చేరితే రూ. వేలు, లక్షల బిల్లు చెల్లించుకోవాల్సి రావచ్చు. అందుకని వెక్టార్ బోర్న్ డిసీజ్ ఇన్సూరెన్స్‌ను ప్రతీ కుటుంబం తప్పకుండా తీసుకోవడం మంచిది. ఈ కవరేజీ కింద దోమలు, ఇతర కీటకాలు, బ్యాక్టీరియా, వైరస్ కారణంగా వచ్చే వ్యాధులకు సైతం కవరేజీ లభిస్తుంది. ముఖ్యంగా డెంగీ, టైఫాయిడ్, మలేరియా రిస్క్ ఈ కాలంలో ఎక్కువ ఉంటుంది. సరైన చికిత్స తీసుకోకపోతే వీటిల్లో ప్రాణ ప్రమాదం ఏర్పడొచ్చు. మనదేశంలో డెంగీ, మలేరియా మరణాలు ఎక్కువగా ఉంటున్నాయి. ఏటా లక్షలాది మంది వీటి బారిన పడుతున్నారు. ''కాంప్రహెన్సివ్ హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజీ లేని వారు, తప్పకుండా వెక్టార్ కేర్ ఇన్సూరెన్స్ కవరేజీని తమకు, తమ కుటుంబ సభ్యులకు తీసుకోవాలి.

వ్యాధుల నుంచి రక్షణ



కీటకాల వల్ల ఎదురయ్యే అనారోగ్యం చికిత్సలకు పరిహారాన్ని ఇవి చెల్లిస్తాయి''అని బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ హెడ్ భాస్కర్ నెరుర్కార్ సూచించారు. కీటకాల వల్ల ఎదురయ్యే అనారోగ్యానికి చికిత్స పొందేందుకు ఎక్కువ మొత్తంలో ఖర్చు అయ్యే రిస్క్ ఉంటుంది. డెంగీ బారిన పడితే కోలుకునేందుకు 8–10 రోజులు పట్టొచ్చు. చికిత్సా ఖర్చు రూ. లక్షల్లో ఉంటుంది. మెట్రోల్లో రూమ్ రెంట్ రూ. లక్ష ఉంటుందని, ఒక్కసారి ప్లేట్‌లెట్లు ఎక్కించేందుకు రూ.40,000 తీసుకుంటున్నారని పాలసీబజార్ అంచనా. డెంగీ కారణంగా ప్లేట్‌లెట్లు పడిపోతే ఒకరికి ఒకటికి మించిన సార్లు ప్లేట్‌లెట్లు ఎక్కించాల్సి రావచ్చు.

•••

బీమా పరిశ్రమ ప్రత్యేకంగా వెక్టార్ కేర్ ఇన్సూరెన్స్, వెక్టార్ బోర్న్ హెల్త్ ఇన్సూరెన్స్‌ను ఆఫర్ చేస్తున్నాయి. డెంగీ జ్వరం, మలేరియా, ఫైలేరియా, కాలా అజార్, చికెన్ గునియా, జపనీస్ ఎన్‌సెఫలైటిస్, జికా వైరస్‌లకు వీటిల్లో కవరేజీ ఉంటుంది. ఈ ప్లాన్ తీసుకున్న వారు జీవిత కాలంలో ఒక్కసారే క్లెయిమ్ చేసుకోగలరు. ''మీ బేసిక్ హెల్త్ ఇన్సూరెన్స్‌లో వీటికి కవరేజీ లేకపోతే.. ఒక్కో వ్యాధికి విడిగా కవరేజీ తీసుకోవచ్చు. డెంగీ, మలేరియా ఈ రెండూ మన దేశంలో ఎక్కువగా వచ్చే వ్యాధులు. కనుక వీటికి కవరేజీ కలిగి ఉండడం ఎంతో అవసరం''అని పాలసీ బజార్ హెల్త్ ఇన్సూరెన్స్ హెడ్ అమిత్ చాబ్రా సూచించారు.

ఇవి ఉండేలా చూసుకోవాలి

- **ఆటో బీమా:** ఇంజన్ ప్రొటెక్షన్ కవర్, రోడ్‌సైడ్ అసిస్టెన్స్, ఇంజన్ ఆయిల్, నట్లు, బోల్టులు, గ్రీజులు, వాషర్లతో కూడిన కన్స్యూమబుల్ రైడర్‌లను కూడా తీసుకోవాలి.
- **హోమ్ ఇన్సూరెన్స్:** రీప్లేస్‌మెంట్ కాస్ట్ క్లాజ్ ఉందేమో చూసుకోవాలి. ఇది ఉంటే అప్పుడు ఇంటి పునర్నిర్మాణానికి కావాల్సినంత బీమా సంస్థ చెల్లిస్తుంది. ఇంట్లోని విలువైన గ్యాడ్జెట్లు, ఆభరణాలు, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులకు సైతం కవరేజీ ఉండాలి. మరమ్మతులు, ప్లంబింగ్, కార్పెంటరీ, పెస్ట్‌కంట్రోల్ కవరేజీ ఉందేమో చూడాలి. దాదాపు అన్ని రకాల నష్టాలకు పరిహారం ఇచ్చే సమగ్రమైన ప్లాన్‌ను తీసుకోవడమే సరైనది.
- **వెక్టార్ బోర్న్ డిసీజ్:** తమ హెల్త్ ఇన్సూరెన్స్‌లో వెక్టార్ బోర్న్ డిసీజ్‌కు కవరేజీ ఉందేమో చూసుకోవాలి. లేకపోతే విడిగా కొనుగోలు చేసుకోవాలి. విడిగా ఒక్కో వ్యాధి, దానికి ఉప పరిమితుల గురించి అడిగి తెలుసుకోవాలి.

బీమా లేక భారీ నష్టం



ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టం ఏ స్థాయిలో ఉంటుందో ఒక్కోసారి గణాంకాలను చూస్తే కానీ అర్థం కాదు. 2001 నుంచి ప్రకృతి విపత్తుల కారణంగా 85,000 మంది మరణించగా, వేలాది కోట్ల రూపాయల నష్టం ఏర్పడినట్టు ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక తాజాగా స్పష్టం చేసింది. హోమ్ ఇన్సూరెన్స్ కేవలం 8 శాతం మందే కలిగి ఉండడంతో, పెద్ద మొత్తంలో నష్టపోవాల్సి వచ్చినట్టు వాస్తవాన్ని గుర్తు చేసింది. 1900 నుంచి ప్రకృతి వైపరీత్యాల పరంగా అమెరికా, చైనా తర్వాత భారత్ మూడో అతిపెద్ద బాధిత దేశంగా ఉంది. మన దేశంలో 764 సహజ విపత్తులు సంభవించాయి. తుపానులు, వరదలు, భూకంపాలు, కొండ చరియలు విరిగి పడడం, కరువు ఈ జాబితాలో ఉన్నాయి. ముఖ్యంగా 1900 నుంచి 2000 మధ్య 361 పెద్ద వైపరీత్యాలు నమోదు కాగా, ఆ తర్వాత 22 ఏళ్లలో (2001–2022) 402 విపత్తులు చోటు చేసుకున్నాయి. అంటే గతంతో పోలిస్తే ప్రకృతి విపత్తులు పెరిగిపోయినట్టు ఈ గణాంకాలు పరిశీలిస్తే తెలుస్తోంది. ముఖ్యంగా 41 శాతం వైపరీత్యాలు వరదల కారణంగా సంభవించినవే ఉన్నాయి. ఆ తర్వాత తుపానుల వల్ల ఎక్కువ ప్రమాదాలు జరిగాయి. 2020లో వచ్చిన వరదల కారణంగా రూ. 52,500 కోట్ల నష్టం వాటిల్లింది. కానీ, ఇందులో బీమా కవరేజీ ఉన్నది కేవలం 11 శాతం ఆస్తులకే కావడం వాస్తవం. ఇంటికి, ఆస్తులకు, ఆరోగ్యానికి, జీవితానికి బీమా ఎంత ముఖ్యమో ఈ గణాంకాలు కళ్లకు కడుతున్నాయి.

ఐసీఐసీఐ లాభం హైజంప్

క్యూ1లో రూ. 10,636 కోట్లు



ముంబై: ప్రయివేట్ రంగ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) తొలి త్రైమాసికం(క్యూ1)లో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన క్యూ1(ఏప్రిల్–జూన్)లో నికర లాభం 44 శాతం జంప్‌చేసి రూ. 10,636 కోట్లను తాకింది. స్టాండెలోన్ లాభం సైతం 40 శాతం ఎగసి రూ. 9,648 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం(స్టాండెలోన్) రూ. 28,337 కోట్ల నుంచి రూ. 38,763 కోట్లకు పురోగమించింది. నికర వడ్డీ ఆదాయం 38 శాతం ఎగసి రూ. 18,227 కోట్లను తాకింది. రుణాల్లో 18 శాతం వృద్ధి సాధించగా.. నికర వడ్డీ మార్జిన్లు 4.78 శాతంగా నమోదయ్యాయి. వడ్డీయేతర ఆదాయం 12 శాతం పుంజుకుని రూ. 5,183 కోట్లయ్యింది. స్థూల మొండి బకాయిలు(ఎన్‌పీఏలు) 2.81 శాతం నుంచి 2.76 శాతానికి తగ్గాయి. స్లిప్పేజీలు రూ. 4,297 కోట్ల నుంచి రూ. 5,318 కోట్లకు పెరిగాయి. వీటిలో రిటైల్ విభాగం వాటా రూ. 5,012 కోట్లుకాగా.. కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్) 17.9 శాతానికి చేరడంతో పెట్టుబడుల సమీకరణ అవసరంలేనట్లు బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సందీప్ బాత్రా పేర్కొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

24-7-2023	
విశాఖ	475–00
చిత్తూరు	463–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	415–00
విజయవాడ	415–00
రిటైల్ ధర (డజను)	72.00
23-7-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	400–00
వరంగల్	402–00
రిటైల్ ధర	4.60

స్టాక్స్ వ్యూ

పంజాబ్ నేషనల్ బ్యాంక్ | ఎల్‌కేపీ సెక్యూరిటీస్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 63 **టార్గెట్:** రూ. 80

ఎందుకంటే: ప్రభుత్వ రంగ సంస్థ పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) కొద్ది త్రైమాసికాలుగా నిలకడైన పనితీరును చూపుతోంది. హోల్‌సేల్ బుక్‌ను పూర్తిగా సంస్కరించిన బ్యాంక్ ఈ ఆర్థిక సంవత్సరం(2023–24)లో మరిన్ని రికవరీలను అంచనా వేస్తోంది. గత ఆర్థిక సంవత్సరం(2022–23)లో పటిష్ట రుణ వృద్ధిని సాధించగా.. ఈ ఏడాది సైతం ఇదేస్థాయి పురోగతిని ఆశిస్తోంది. ఎంసీఎల్‌ఆర్ బుక్ ధర(వడ్డీ రేటు)లలో సవరణలు చేపడుతున్న బ్యాంక్ నికర వడ్డీ మార్జిన్లు మెరుగుపడనున్నట్లు భావిస్తోంది. కార్పొరేట్ రుణ ఒత్తిళ్లు తగ్గుతుండటంతో అధిక రికవరీలకు వీలుంది. మొండి రుణాల రికవరీ, ఎన్‌ఏఆర్‌సీఎల్‌కు కొన్ని మొండి రుణాల విక్రయం నేపథ్యంలో బ్యాలన్స్‌షీట్ పటిష్టం కానుంది. దీంతో మొండి బకాయిలు(ఎన్‌పీఏలు) సాధారణ స్థితికి చేరే వీలుంది. వీటికితోడు రుణాల్లో వృద్ధి, చౌక రుణ వ్యయాలు రిటర్న్ రేషియోలను మెరుగుపరచనున్నాయి. వెరసి అందుబాటులో ఉన్న ట్రేడవుతున్న షేరుకి విలువను చేకూర్చే అవకాశముంది. సహచర సంస్థలు పీఎన్‌బీ హౌసింగ్, పీఎన్‌బీ గిల్ట్స్ బ్యాంకుకు దన్నుగా నిలవనున్నాయి. రానున్న రెండేళ్ల కాలంలో బ్యాంక్ లోన్‌బుక్ వార్షికంగా 11–12 శాతం చొప్పున బలపడవచ్చని అంచనా. ఇందుకు రిటైల్ రుణాల్లో వృద్ధి సహకరించనుంది. ఈ ఏడాది రుణవ్యయాలు సాధారణ స్థితికి చేరనున్నట్లు భావిస్తున్నాం. దీంతో వచ్చే ఏడాది(2024–25)కల్లా రిటర్న్ రేషియోలు ఆర్‌వోఏ 0.5 శాతం, ఆర్‌వోఈ 7.8 శాతంగా నమోదయ్యే అవకాశముంది.

ఒబెరాయ్ రియల్టీ | హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 1,055 **టార్గెట్:** రూ. 1,158

ఎందుకంటే: ప్రయివేట్ రంగ కంపెనీ ఒబెరాయ్ రియల్టీ సరికొత్త వృద్ధిబాటలో సాగనుంది. రానున్న కొన్నేళ్లలో ప్రవేశపెట్టనున్న కొత్త ప్రాజెక్టులు ఇందుకు దారి ఏర్పాటు చేయనున్నాయి. గతేడాది(2022–23) ముందస్తు అమ్మకాలు వార్షికంగా 31 శాతానికిపైగా జంప్‌చేసి రూ. 5,100 కోట్లను తాకాయి. ఈ బాటలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24)లోనూ రూ. 6,500 కోట్ల ప్రీసేల్స్‌ను సాధించవచ్చని అంచనా. ఇందుకు గోరెగావ్ గార్డెన్ సిటీలో ప్రవేశపెట్టనున్న కొత్త టవర్లు, థానే మైక్రో మార్కెట్లో తొలి ప్రాజెక్టు సహకరించనున్నాయి. 2024 మార్చికల్లా వాణిజ్య పోర్ట్‌ఫోలియోగా అభివృద్ధి చేస్తున్న కామర్జ్3 నిర్వహణలోకి వచ్చే వీలుంది. పూర్తిస్థాయిలో ఆక్యుపెన్సీ ఉంటే వార్షికంగా రూ. 500 కోట్లు అద్దె ఆదాయం లభించవచ్చని అంచనా. ఇక 2024 జూన్‌కల్లా బొరివలీ మాల్ అందుబాటులోకి వచ్చే అవకాశముంది. పూర్తి ఆక్యుపెన్సీ ఉంటే మాల్ ద్వారా రూ. 350 కోట్ల అద్దె ఆదాయాన్ని కంపెనీ అంచనా వేస్తోంది. ఆక్యుపేషన్‌కు సిద్ధంగా ఉన్న ముంబైలోని 360డబ్ల్యూ, ములుండ్ ప్రాజెక్టుల ద్వారా పటిష్ట క్యాష్‌ఫ్లోను సాధించవచ్చని భావిస్తున్నాం. ముంబై మెట్రోపాలిత ప్రాంతానికి ఆవల అభివృద్ధి చేస్తున్న ప్రాజెక్టులు కంపెనీకి మరింత విలువను చేకూర్చనున్నాయి. స్థూల అభివృద్ధి విలువ(జీడీవీ)రీత్యా 2023 ఫిబ్రవరిలో బ్లూస్టార్ నుంచి రూ. 190 కోట్లకు 8 ఎకరాల భూమిని పొందింది. అంతేకాకుండా ఆటో విడిభాగాల కంపెనీ ఎన్‌ఆర్‌బీ బేరింగ్స్ నుంచి మరో 6.3 ఎకరాల భూమిని సొంతం చేసుకుంది. ఇవి పోఖ్రాన్(థానే)లోగల 60 ఎకరాలకు అనుకుని ఉంటాయి.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

అన్‌లిస్టెడ్ షేర్లపై మూలధన లాభాల పన్ను?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



నా వయసు 40 ఏళ్లు. పీపీఎఫ్‌లో నేను 15 ఏళ్లుగా ఇన్వెస్ట్ చేస్తున్నాను. వచ్చే ఏడాదితో గడువు ముగుస్తుంది. దీంతో గడువు ముగిసిన తర్వాత చేతికి అందే మొత్తాన్ని మెరుగైన వృద్ధి అవకాశాలున్న ఎన్‌పీఎస్, తదితర పథకాల్లో వచ్చే 15–20 ఏళ్ల కాలానికి పెట్టుబడులు పెడదామని అనుకుంటున్నాను. పీపీఎఫ్ నుంచి వచ్చే మొత్తం పన్ను రహితమని తెలుసు. ఈ మొత్తాన్ని క్రమంగా ఈక్విటీ పథకాల్లోకి ఎలా మళ్లించుకోవాలి? సూచించగలరు. – సుచిత్ పూతియా

మీ పెట్టుబడుల నిధిని ఈక్విటీ పథకాల్లోకి మళ్లించుకోవడానికి ముందు మీరు పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలు కొన్ని ఉన్నాయి. మొదటిది ఎంత కాలానికి పెట్టుబడులు పెడుతున్నారనేది స్పష్టత ఉండాలి. సాధారణంగా ఏకమొత్తంలో డబ్బు ఉండి, ఈక్విటీల్లో పెట్టుబడులు పెడదామనుకుంటే.. గరిష్టంగా మూడేళ్లకు మించకుండా క్రమానుగతంగా (సిప్) ఇన్వెస్ట్ చేసుకోవాలి. ఉదాహరణకు మీ వద్ద రూ.30 లక్షలు ఉన్నాయని అనుకుందాం. ఈ మొత్తాన్ని సమకూర్చుకోవడానికి ఐదేళ్ల కాలం పట్టింది. అప్పుడు ఈ మొత్తాన్ని 12 నుంచి 24 భాగాలు చేసుకోవాలి. అన్ని వాయిదాల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. దీనివల్ల పెట్టుబడుల సగటు వ్యయం, రిస్క్‌ను తగ్గించుకోవచ్చు. మీరు 15–20 ఏళ్ల కాలానికి ఇన్వెస్ట్ చేద్దామని అనుకుంటున్నారు. కనుక మీరు ఈక్విటీలకు ఎక్కువ కేటాయింపులు చేసుకోవచ్చు. ఈక్విటీ పెట్టుబడులు దీర్ఘకాలంలో ద్రవ్యోల్బణాన్ని మించి మెరుగైన రాబడిని ఇవ్వగలవు. ఇక మీ పెట్టుబడిని ఎన్‌పీఎస్ ఖాతాలో ఇన్వెస్ట్ చేసుకోవాలని అనుకుంటే, యాక్టివ్ చాయిస్ ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. 75 శాతాన్ని ఈక్విటీలకు కేటాయించుకోవాలి. ఎన్‌పీఎస్‌లో ఉపసంహరణల పరంగా ఆంక్షలు ఉన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. 60 ఏళ్లకు వచ్చిన తర్వాత ఎన్‌పీఎస్ మొత్తం నిధి నుంచి మీరు 60 శాతాన్నే ఉపసంహరించుకోవచ్చు. మిగిలిన 40 శాతంతో యాన్యుటీ ప్లాన్ కొనుగోలు చేసుకోవాల్సి ఉంటుంది. కొన్ని ప్రత్యేక సందర్భాల్లోనే అంటే, వైద్య వ్యయాలు, పిల్లల ఉన్నత విద్య, వివాహాల కోసం పాక్షిక ఉపసంహరణకు వెసులుబాటు ఉంటుంది. మీరు క్రమశిక్షణ కలిగిన ఇన్వెస్టర్‌గా ఎన్‌పీఎస్ నిధిని రిటైర్మెంట్ వరకు ముట్టుకోకుండా ఉంటే, అలాంటప్పుడు ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఇవి అచ్చమైన ఈక్విటీ పథకాలు. ఉపసంహరణపై ఎలాంటి ఆంక్షలు ఉండవు. ఎన్‌పీఎస్‌లో ఈక్విటీ పెట్టుబడులు మొత్తం లార్జ్‌క్యాప్ స్టాక్స్‌లోనే ఇన్వెస్ట్ చేస్తుంటారు. కానీ ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ మిడ్, స్మాల్‌క్యాప్‌లోనూ ఇన్వెస్ట్ చేయడం ద్వారా వైవిధ్యం పాటిస్తుంటాయి. దీనివల్ల మెరుగైన రాబడులకు అవకాశం ఉంటుంది. అయితే మీరు ఇంత వరకు ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయని వారు అయితే, పెట్టుబడులు మొత్తాన్ని ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసే విషయమై ఆందోళన ఉంటే అప్పుడు అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్‌ను ఎంపిక చేసుకోవచ్చు. అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్ అన్నవి 65 శాతం పెట్టుబడులను ఈక్విటీలకు కేటాయించి, 35 శాతాన్ని డెట్‌లో పెడుతుంటాయి. దీనివల్ల ఈక్విటీ అస్థిరతలు తగ్గి, మరింత స్థిరమైన రాబడులకు వీలు కలుగుతుంది.

నాకు ఒక అన్‌లిస్టెడ్ కంపెనీలో 20 ఏళ్ల నుంచి పెట్టుబడులు ఉన్నాయి. సదరు అన్‌లిస్టెడ్ కంపెనీ, ఒక లిస్టెడ్ కంపెనీలో విలీనం అయింది. దీంతో నేను ఈ షేర్లను విక్రయించేశాను. మూలధన లాభాల పన్నును నేను ఎలా లెక్కించాలో చెప్పగలరు? – విష్ణుప్రియ

మూలధన లాభాల పన్నును నిర్ణయించే ముందు అన్‌లిస్టెడ్ కంపెనీలో పెట్టుబడి దీర్ఘకాలమా? లేక స్వల్పకాలమా? అన్నది తేల్చాలి. ఏదైనా అన్‌లిస్టెడ్ షేరులో పెట్టుబడి 24 నెలలకు మించి కొనసాగించి ఉంటే, అది దీర్ఘకాలిక మూలధన ఆస్తి అవుతుంది. 24 నెలలకు మించి కొనసాగించినప్పుడు వచ్చే మూలధన లాభంపై 20 శాతం పన్ను పడుతుంది. దీని నుంచి ఇండెక్సేషన్ (ద్రవ్యోల్బణం ప్రభావం మినహాయింపు) ప్రయోజనం క్లెయిమ్ చేసుకోవచ్చు. ఒక ఆర్థిక సంవత్సరంలో ఈక్విటీల్లో రూ.లక్ష దీర్ఘకాల మూలధన లాభం వరకు పన్ను ఉండదని తెలిసిందే. అంతకుమించిన దీర్ఘకాల మూలధన లాభంపై 10 శాతం పన్ను పడుతుంది. కానీ, కొనుగోలు, విక్రయం సమయంలోనూ సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ చెల్లించనట్టయితే ఈ ప్రయోజనానికి అనర్హులు. కానీ, మీ కేసులో మీరు కొనుగోలు సమయంలో కాకుండా, కేవలం విక్రయించేటప్పుడే సెక్యూరిటీస్ లావాదేవీల పన్ను చెల్లించారు. కనుక దీర్ఘకాల మూలధన లాభం నుంచి ద్రవ్యోల్బణం మినహాయించి, మిగిలిన మొత్తంపై 20 శాతం పన్ను చెల్లిస్తే సరిపోతుంది.

క్లుప్తంగా...

తెలుగు రాష్ట్రాల స్థాయి ఫొటోగ్రఫీ పోటీలు

ఫొటోలు పంపేందుకు గడువు ఆగస్టు 2



తెనాలి: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ అకాడమీ ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఫొటోగ్రఫీ పోటీలను నిర్వహిస్తున్నట్టు అకాడమీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఫొటోగ్రాఫర్/శిక్షకుడు సుధాకర రెడ్డి కానాల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఫొటోగ్రఫీని అంతర్జాతీయ స్థాయిలో నిలిపిన డాక్టర్ భగవాన్ దాస్, బండి రాజన్‌బాబు జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న పోటీలకు పోర్ట్రెయిట్, లాండ్‌స్కేప్ ఫొటోలను కలర్/మోనోక్రోమ్‌లో పంపుకోవచ్చని పేర్కొన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల ఫొటోగ్రాఫర్లు మాత్రమే అర్హులనీ, సొంతంగా తీసిన ఫొటోలనే పోటీలకు పంపాలని, ఒక్కో అభ్యర్థి ఒక్కో సెక్షన్‌లో మూడు ఫొటోలను మాత్రమే పంపాలని సూచించారు. ప్రతి ఫొటోకు టైటిల్, అభ్యర్థి పేరు, ఫోన్ నంబరు, చిరునామాతో ఆగస్టు 2వ తేదీలోగా పంపాలని తెలిపారు. గతంలో అకాడమీకి పంపిన ఫొటోలు చెల్లవని పేర్కొన్నారు. విజేతలకు ఆగస్టు 19న జరిగే ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవంలో బహుమతులను ప్రదానం చేస్తామని తెలిపారు. వివరాలకు 98480 92182 నంబర్లో సంప్రదించాలని కోరారు.

ముగిసిన తొలి విడత 'స్కూల్ లీడర్ షిప్' శిక్షణ

నేటి నుంచి రెండో విడత ప్రారంభం

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయుల్లో నాయకత్వం పెంపొందించేందుకు చేపట్టిన 'స్కూల్ లీడర్ షిప్' తొలివిడత (ఫస్ట్ స్పెల్) కార్యక్రమం ఆదివారంతో ముగిసినట్టు సమగ్ర శిక్షా రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా (సీమ్యాట్) ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి విశాఖపట్నం, కాకినాడ, తిరుపతి, అనంతపురం, బాపట్ల, విజయవాడ కేంద్రాలుగా 1400 మంది హెచ్‌ఎంలకు శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. రెండో విడతలో భాగంగా సోమవారం నుంచి మరో 1400 మందికి శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 14 వేల మంది హెచ్‌ఎంలు విడతల వారీగా పాల్గొంటారని తెలిపారు. 'స్కూల్ లీడర్ షిప్' మాడ్యూల్‌ను అనుసరించి ప్రధానోపాధ్యాయులు పాఠశాలలను నిర్వహించాలని సూచించారు.

'ఇంటి'పై ఏడుపు ఇంతింత కాదయ్యా..

పేదల ఇళ్ల నిర్మాణంపై రామోజీ పగ..

సాక్షి, అమరావతి: కృష్ణారామా అనుకోవాల్సిన వృద్ధాప్యంలో ఈనాడు రామోజీ రావు నిత్యం కడుపుమంటతో రగిలిపోతున్నారు. సీఎంగా వైఎస్ జగన్‌ను ఒక్క నిమిషం కూడా ఊహించుకోలేకపోతున్నారు. నిత్యం రాష్ట్ర ప్రభుత్వంపై అసత్య కథనాలను వండి వార్చడమే పనిగా పెట్టుకుని పనికిమాలిన రాతలు రాస్తున్నారు. నిరుపేదలకు ఇళ్ల కట్టించి ఇవ్వడమే మహా పాపమైనట్లు తెగ గగ్గోలు పెడుతున్నారు. ఈ విషయంలో న్యాయపరంగా ఎన్ని అడ్డంకులు సృష్టించాలో అన్నీ కల్పించినా ఎల్లో ముఠా ఆటలు సాగలేదు. అయినా గాలి కబుర్లను పోగేస్తూ అసత్య కథనాలను అడ్డగోలుగా అచ్చేస్తున్నారు. ఇందులో భాగమే తాజాగా రామోజీ కక్కిన 'సెంటు పట్టా.. అక్రమాల చిట్టా!.. కథనం. జాబితాలో భారీగా అనర్హులకు చోటు అంటున్న ఆ అబద్ధాల పుట్టలో వాస్తవాలేమిటంటే..

రాష్ట్రంలో ఇల్లులేని నిరుపేదకు పక్కా ఇల్లు ఉండాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం. అందుకోసం పేదరికమే అర్హతగా అన్ని వర్గాల్లోను ఇళ్లు లేని నిరుపేదలకు 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా 30.65 లక్షల ఇంటి పట్టాలను మహిళల పేరు మీద ఇచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో ఇప్పటికే 21.25 లక్షల ఇళ్ల నిర్మాణం వేగంగా జరుగుతోంది. ఇందులో 6 లక్షల ఇళ్లు పూర్తయ్యాయి కూడా. ఇప్పుడు ఈ పేదలకు ఇంతలా మేలు జరుగుతుంటే 'ఈనాడు' పత్రిక భరించలేకపోతోంది. కడుపు మంటతో తప్పుడు రాతలకు తెగబడింది. సీఆర్డీఏ పరిధిలో అనర్హులకు స్థలాలు ఇచ్చారంటూ ఆధారాలేకుండా గాలి కబుర్లను పోగేసి అచ్చేసింది. వాస్తవానికి.. ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలకు చెందిన 50,793 మంది లబ్ధిదారులకు పట్టాలిచ్చారు. వీరెవరికీ గతంలో ఇల్లుగాని, ఇంటి స్థలంగాని లేదు. అర్హుల జాబితాను అన్ని వివరాలతో ఆన్‌లైన్‌లో పెట్టి, అనేక వడపోతల అనంతరమే ఎంపిక చేశారు. అయినా రామోజీ ఏడుపు మామూలుగా లేదు.

మరోసారి 'ఈనాడు' అక్కసు

నిజానికి.. సీఆర్డీఏ పరిధిలో నిరుపేదలు ఉండకూడదన్నది పచ్చ ముఠా లక్ష్యం. అందుకోసం ముందునుంచీ ఈ విషయంలో రామోజీ తప్పుడు కథనాలు ప్రచురిస్తూనే ఉన్నారు. ఇక ముఖ్యమంత్రి చేతుల మీదుగా సోమవారం ఈ ప్రాంతంలో ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న తరుణంలో ప్రభుత్వానికి వస్తున్న మంచి పేరును తట్టుకోలేక మరో తప్పుడు కథనాన్ని అచ్చేశారు. లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు జరిగాయంటూ రామోజీ గగ్గోలు పెట్టారు. వాస్తవానికి కుల, మత, ప్రాంతం చూడకుండా ప్రభుత్వం పూర్తి పారదర్శకతతో కేవలం అర్హతే కొలమానంగా లబ్ధిదారులను గుర్తించింది.

పేదలకు ఇంటి స్థలం ఇవ్వొద్దని 26 కేసులు..

నిజానికి.. 'నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు' పథకంపై ఈనాడు మొదటి నుంచి అసత్య కథనాలే ప్రచురిస్తోంది. గత ప్రభుత్వంలో భూమిని సేకరించి లబ్ధిదారులకు ఒక్క పట్టా ఇచ్చిన సందర్భం లేకపోయినా ఏనాడూ ఒక్క వార్త కూడా రాయకపోగా కనీసం నాటి ప్రభుత్వాన్ని సైతం ప్రశ్నించలేదు. ఈరోజు అభూత కల్పనలు రాస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు పేదలకు ఇంటి స్థలం ఇవ్వడం నేరమంటోంది. ఈ ఉద్దేశంతోనే సీఆర్డీఏ పరిధిలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వకూడదని ఎల్లో గ్యాంగ్ వివిధ కోర్టుల్లో ఇప్పటివరకు 26 కేసులు వేసింది. వీటన్నిటినీ సీఎం వైఎస్ జగన్ సర్కారు అధిగమించి ఈ ప్రాంతంలో 1,402.58 ఎకరాలను ఆర్–5 జోన్‌గా చట్టప్రకారం ప్రకటించి, 25 లేఅవుట్లను అభివృద్ధి చేసింది. ఈ ఏడాది మే 26న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 50,793 మంది నిరుపేద అర్హులకు అక్కడ పట్టాలను పంపిణీ చేశారు. వీరిలో గుంటూరు జిల్లాకు చెందిన 23,762 మంది, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన 27,031 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో ఏ ఒక్కరూ గతంలో ఇంటి స్థలం తీసుకున్నది లేదు. వీరెవ్వరికీ సొంత ఇల్లూ లేకున్నా నిరాధార ఆరోపణలతో ప్రభుత్వంపై బురద జల్లే పనికి రామోజీ దిగజారారు.

నిర్దిష్ట అర్హతలు ఉంటేనే ఎంపిక..

ఇంటి పట్టా అర్హతలపై 2019 ఆగస్టులోనే జీఓ ఎంఎస్–367ను రాష్ట్ర ప్రభుత్వం జారీచేసింది. అందులో ఏం పేర్కొన్నారంటే..

- ఎవరైనా ప్రభుత్వం ఇచ్చే ఇల్లును పొందాలంటే గ్రామ/వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. తరువాత, ఆ జీఓలో తెలిపిన ప్రమాణాల ఆధారంగా 'అర్జీదారు కుటుంబాన్ని' యూనిట్‌గా తీసుకుని ధ్రువీకరిస్తారు. అర్జీదారుని ఆర్థిక స్థితి, భూమి విస్తీర్ణం, ఉద్యోగ పరిస్థితి, గృహ విద్యుత్ వాడకం, పట్టణ ప్రాంతంలో ఉన్న గృహ విస్తీర్ణం, నాలుగు చక్రాల వాహనం ఇలా.. అర్హతలను బట్టి అర్హుడా కాదా అని తేలుస్తారు.
- ప్రాథమికంగా వారి అర్హతను గుర్తించాక క్షేత్రస్థాయిలో సచివాలయ సిబ్బంది దరఖాస్తుదారు పరిస్థితిని పరిశీలించి ఆమోదిస్తారు లేదా తిరస్కరిస్తారు. తర్వాత తహశీల్దారు పరిశీలిస్తారు.
- ఇలా వివిధ స్థాయిల్లో వడపోత అనంతరం గ్రామ/వార్డు సచివాలయాల్లో లబ్ధిదారుల జాబితాను సామాజిక తనిఖీ కోసం ప్రదర్శిస్తారు. ఎవరైనా ఈ జాబితాపై అభ్యంతరం తెలియజేస్తే వాటిని పరిశీలించిన తర్వాత తుది జాబితా రూపొందిస్తారు.
- ఇప్పుడు లబ్ధిపొందిన వారి జాబితాను 2020 డిసెంబర్ నాటికి మొత్తం విచారణ ప్రక్రియ పూర్తిచేసి తుది జాబితాను రూపొందించారు.
- అప్పట్లో కోర్టు కేసులు ఉన్న కారణంగా కోర్టు ప్రక్రియ పూర్తయ్యాక ఇంటి పట్టా ఇస్తామని సీఎం పేరిట లబ్ధిదారులకు లేఖ కూడా ఇచ్చారు.

ఈ అర్హతలు ఉంటేనే స్థలం లేదా ఇల్లు..

ప్రభుత్వం నుంచి ఇంటి స్థలం పొందాలంటే రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు నిర్దిష్టమైన అర్హతలు రూపొందించింది. అవి..

గ్రామీణ ప్రాంతాల్లో..

- లబ్ధిదారు దారిద్య్ర రేఖకు దిగువన (బీపీఎల్) ఉండాలి. వారి కుటుంబానికి తెల్ల రేషన్ కార్డు తప్పనిసరి. రాష్ట్రంలో ఎక్కడా సొంత ఇల్లుగాని ఇంటి స్థలం గానీ ఉండరాదు. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన ఏ హౌసింగ్ పథకంలోను లబ్ధిపొంది ఉండకూడదు.
- లబ్ధిదారునికి 2.5 ఎకరాల మాగాణి, లేదా ఐదెకరాల మెట్టభూమి మించి ఉండకూడదు.
- ఆధార్ కార్డు తప్పనిసరి.
- అన్ని వివరాలు లబ్ధిదారు అనుమతితోనే అధికారులు సేకరిస్తారు.

పట్టణ ప్రాంతంలో..

- లబ్ధిదారునికి పై అర్హతలతో పాటు కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించి ఉండకూడదు.

- మూడేళ్ల అనంతరం అన్ని కోర్టు చిక్కులూ అధిగమించి లబ్ధిదారులకు ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఇదేకాక.. ఇంటి పట్టా కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులుగా గుర్తిస్తే వారందరికీ ఇదే ప్రక్రియలో ఇక్కడే ఇంటి పట్టాలనూ ఇచ్చారు.
- ఇక ఈ లేఅవుట్లలో రూ.385.52 కోట్లతో మౌలిక వసతులు, రూ.73.74 కోట్లతో సామాజిక వసతులు (అంగన్‌వాడీ, స్కూల్, ఆసుపత్రి), రూ.1,081.39 కోట్లతో ఇళ్ల నిర్మాణ ప్రక్రియను సోమవారం ప్రారంభించనున్నారు. దీంతో రామోజీ మరోసారి దుగ్ధతో విషం కక్కుతున్నారు.

డియర్ పవన్.. మీకు ట్యూషన్ చెబుతా

- నేనిచ్చే అసైన్‌మెంట్లపైన హోం వర్క్ చేయండి
- ట్విట్టర్‌లో కౌంటర్ ఇచ్చిన మంత్రి బొత్స
- మెగా డీఎస్సీ ఏదంటూ ట్వీట్ చేసిన పవన్

సాక్షి, అమరావతి: 'ప్రియమైన పవన్ కళ్యాణ్.. ఈరోజు నుంచి నేను మీకు ట్యూషన్లు తీసుకుంటాను, కానీ నాదొక షరతు.. అదేంటంటే మీరు హోంవర్క్ చేస్తానని వాగ్దానం చేయాలి. ఈ ఏడు పాఠాలను క్షుణ్ణంగా చదవడమే నేటి అసైన్‌మెంట్'.. అంటూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పవన్‌ను ట్యాగ్ చేస్తూ ఆదివారం ట్వీట్ చేశారు. 'మెగా డీఎస్సీ నోటిఫికేషన్, టీచర్స్ రిక్రూట్‌మెంట్, టీచర్ ట్రైనింగ్ లేదు, నష్టాలు వచ్చే స్టార్టప్‌కి కోట్లలో కాంట్రాక్టు ఇస్తారు. వైసీపీ ప్రభుత్వం స్టాండర్డ్ ప్రోటోకాల్‌ను పాటించిందా? టెండర్ కోసం ఎన్ని కంపెనీలు దరఖాస్తు చేశాయి? ఎవరు షార్ట్ లిస్ట్ చేశారు? ఇది పబ్లిక్ డొమైన్‌లో ఉందా? వైసీపీ ప్రభుత్వం స్పందించాలి' అంటూ శనివారం జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ట్వీట్ చేశారు. దీనిపై స్పందించిన మంత్రి బొత్స.. పవన్‌కు కౌంటర్ ఇచ్చారు. ఈ ఏడు పాఠ్యాంశాలను నేర్చుకోండి అంటూ ట్వీట్ చేశారు. మంత్రి ట్వీట్‌లో ఏముందంటే..

- పాఠం 1: పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ టెండర్లకు సంబంధించి అర్హత లేదా పరిధిని నిర్ణయించే అధికారాన్ని తీసుకొచ్చిన ఏకైక ప్రభుత్వం ప్రపంచంలోనే ఏపీ సర్కార్ అనేది దయచేసి తెలుసుకోండి.
- పాఠం 2: రూ.100 కోట్లకు పైబడిన ఏదైనా ప్రభుత్వ టెండర్ పరిధిని, అర్హతలను హైకోర్టు అనుమతితో నియమితులైన ప్రత్యేక న్యాయమూర్తి (ప్రస్తుతం జస్టిస్ శివశంకర్‌రావు) ఖరారు చేస్తారు.
- పాఠం 3: టెండర్ స్పెసిఫికేషన్స్ పబ్లిక్ డొమైన్‌లో ఉంచుతారు. వాటిపై కంపెనీలు ప్రతిస్పందించడానికి 21 రోజుల సమయం ఇస్తారు. టెండర్ స్పెసిఫికేషన్స్ ప్రత్యేక న్యాయమూర్తే చూస్తారు.
- పాఠం 4: ప్రపంచంలో టెండర్లపై న్యాయపరమైన ప్రివ్యూను అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం మాది అని చెప్పడానికి గర్విస్తున్నాం. దీనిద్వారా అన్ని కంపెనీలకు సమాన ప్రాధాన్యం ఉంటుంది.
- పాఠం 5: గూగుల్ సెర్చ్‌లో ప్రాథమిక పరిజ్ఞానం ఉంటే టెండర్ల వివరాలను మీరూ తెలుసుకోవచ్చు. (ఆగస్టు 2022 నుంచి పబ్లిక్ డొమైన్‌లో ఉన్నాయి) మీరు తెలుసుకోలేరని జ్యుడిషియరీ ప్రివ్యూ లింక్‌ను మీకు పంపిస్తున్నాను.. కాబట్టి మీరు దాన్ని కోల్పోయే అవకాశం లేదు.
- పాఠం 6: ఏపీ విద్యారంగం అత్యంత పారదర్శక విభాగం అని చెప్పుకోవడానికి మేం గర్విస్తున్నాం. విద్యారంగంలో సాధించిన మార్పులు, ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.
- పాఠం 7: ప్రజలను తప్పుదోవ పట్టించేలా మీకు శిక్షణ ఇస్తున్న వారిని చూసి నేను జాలిపడుతున్నాను. నేను ముందే వాగ్దానం చేసినట్టుగా మీ జ్ఞానాన్ని పెంచుకునేందుకు మీ మెదడును శ్రద్ధగా ఉపయోగిస్తానంటే నేను మీకు ట్యూషన్లు చెప్పడానికి సిద్ధంగా ఉన్నాను.. అంటూ బొత్స చేసిన ట్వీట్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది.

ఆగస్టులో విశేష ఉత్సవాలు

తిరుమల : ఆగస్టులో నిర్వహించనున్న విశేష ఉత్సవాలపై టీటీడీ పీఆర్‌ఓ విభాగం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. 1వ తేదీన పౌర్ణమి గరుడ సేవ, 12న మతత్రయ ఏకాదశి, 15న భారత స్వాతంత్య్ర దినోత్సవం, శ్రీ చక్రత్తాళ్వార్ వర్షతిరునక్షత్రం, శ్రీ ప్రతివాది భయంకర అణ్ణంగరాచార్య వర్ష తిరునక్షత్రం, 21న గరుడ పంచమి, తిరుమల శ్రీవారి గరుడ సేవ, 22న కల్కి జయంతి, 25న తరిగొండ వెంగమాంబ వర్ధంతి, వరలక్ష్మీవ్రతం, 26న తిరుమల శ్రీవారి పవిత్రోత్సవాలకు అంకురార్పణ, 27 నుంచి 29వ తేదీ వరకు శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు, 30న శ్రీ వైఖానస మహాముని జయంతి, శ్రావణపౌర్ణమి, రాఖీ పండుగ, 31న హయగ్రీవ జయంతి. తిరుమల శ్రీవారు శ్రీ వైఖనసాచార్య స్వామి సన్నిధికి వేంచేపు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొంది.

'మహతి'లో జాతీయస్థాయి నాటక పోటీలు



నృత్య ప్రదర్శనలు చేస్తున్న కళాకారులు



తిరుపతి కల్చరల్ : టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ సౌజన్యంతో అభినయ ఆర్ట్స్ వారు ఈనెల 30వ తేదీవ వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి నాటక, నృత్య పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం తిరుపతి మహతి కళాక్షేత్రంలో మొదలైన పోటీలను ముఖ్య అతిథులుగా టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, విశ్వం విద్యాసంస్థల అధినేత ఎన్.విశ్వనాథ్‌రెడ్డి, తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి శ్రీకారం చుట్టారు. వారు మాట్లాడుతూ అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి బీఎస్ రెడ్డి కళామతకు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కళలు సమాజ చైతన్య కరదీపికలని, వాటిని పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అనంతరం కథా రచయిత పేరూరు బాలసుబ్రమణ్యంతో పాటు కళారంగానికి విశేష సేవలు అందిస్తున్న కళాకారులను పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. ఈ క్రమంలో మధ్యాహ్నం వరకు నిర్వహించిన నృత్య పోటీలలో కళాకారులు అద్భుతంగా అభినయించి అలరించారు. బాపట్ల శ్రీవిఘ్నేశ్వర నవ్యనాటక కళాసమితి ఆధ్వర్యంలో మహా వీర ధనంజయ పౌరాణిక పద్యనాటకాన్ని ప్రదర్శించారు. తెనాలికి చెందిన డీఎల్ కాంతారావు పోస్టల్ ఉద్యోగుల కళాపరిషత్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన ది వెనస్ సాంఘిక నాటక ప్రేక్షకులను రంజింపజేసింది. అనంతరం బీఎస్ రెడ్డి కళాకారులను జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అభినయ ఆర్ట్స్ ప్రతినిధులు విజయకుమార్, నరసింహులు, పీఆర్ నాయుడు, మర్ధం గజేంద్ర, ధర్మయ్య పాల్గొన్నారు.

భారీ వాహనాలకు నో ఎంట్రీ

- రోడ్ కం రైలు వంతెనపై లారీలు, బస్సులకు బ్రేక్
- రెండు, మూడు చక్రాల వాహనాలు, కార్లకు అనుమతి
- గామన్ బ్రిడ్జి మీదుగా భారీ వాహనాల రాకపోకలు



కొవ్వూరు టోల్‌గేట్ జంక్షన్ వద్ద భారికేడ్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న పోలీసులు

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం)/కొవ్వూరు: రాజమహేంద్రవరం– కొవ్వూరును అనుసంధానిస్తూ ఉన్న రోడ్ కం రైలు వంతెనపై ఆదివారం నుంచి లారీలు, బస్సుల రాకపోకలను నిలిపివేశారు. ఈ మేరకు ఆదేశాలిచ్చినట్లు కలెక్టర్ మాధవీలత ఆదివారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. రోడ్ కం రైలు బ్రిడ్జి నిర్మాణం పూర్తయిన తరువాత 1974 నుంచి అన్ని వాహనాల రాకపోకలు జరిగాయన్నారు. ఈ బ్రిడ్జి జీవిత కాలం 65 ఏళ్లుగా నిర్ణయించారని, ఇది అందుబాటులోకి వచ్చి 49 సంవత్సరాలు పూర్తి అవుతుందన్నారు. రోజు రోజుకూ విపరీతమైన పెరుగుతున్న ట్రాఫిక్ నేపథ్యంలో బ్రిడ్జి డెక్ జాయింట్‌లు దెబ్బతింటున్నాయన్నారు. వంతెన భద్రత దృష్ట్యా ఆర్‌అండ్‌బీ అధికారుల సూచనల మేరకు లారీలు, బస్సులు తిరగడాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేశామని అన్నారు. వంతెన మరిన్ని సంవత్సరాల పాటు ప్రజలకు అందుబాటులో ఉండే విధానంగా టూ వీలర్స్, మూడు చక్రాల వాహనాలు, కార్లు తిరిగేందుకు చర్యలు తీసుకున్నామని మాధవీలత పేర్కొన్నారు. ఈ వంతెన మీదుగా 10.2 టన్నుల బరువు మించి ఉన్న వాహనాలు తిరిగితే వంతెన దెబ్బతినే అవకాశం ఉందని 2007, 2011లలో నిపుణుల కమిటీ నివేదిక ఇచ్చిందని అన్నారు. ఈ దృష్ట్యా ప్రజలు సహకరించాలని కోరారు. అనుమతించిన వాహనాలు మాత్రమే వంతెనపై నుంచి తిరిగేలా మధ్యలో పోల్స్ ఏర్పాటు చెయ్యాలని ఆదేశించారు. కొవ్వూరు– రాజమహేంద్రవరం మీదుగా ప్రయాణించే భారీ వాహనదారులు, బస్సులు జాతీయ రహదారిపై ఉన్న నాలుగు లైన్ల వంతెన గామన్ బ్రిడ్జి (4వ వంతెన) మీదుగా వెళ్లాలని కలెక్టర్ తెలిపారు. ఇదిలా ఉంటే రోడ్డు కం రైలు వంతెన నుంచి లారీలు, బస్సులు, లోడు వాహనాలు వెళ్లకుండా కొవ్వూరు టోల్‌గేట్ జంక్షన్ వద్ద పట్టణ పోలీసులు గస్తీ ఏర్పాటు చేశారు.

ఉద్యానం ఉల్లాసం

- సాగుకు రాయితీలతో ప్రోత్సాహం
- కలెక్షన్ సెంటర్లు, కోల్డ్‌స్టోరేజ్‌ల నిర్మాణం
- జిల్లాలో 20 కలెక్షన్ సెంటర్లు, మూడు కోల్డ్ స్టోరేజ్‌లు
- రైతులకు ఎంతో ప్రయోజనం

పెదకూరపాడు: ఉద్యాన పంటల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. సేద్యానికి రాయితీలు అందిస్తోంది. రైతులకు కావాల్సిన సదుపాయాలూ సమకూరుస్తోంది. దీనిలో భాగంగా జిల్లాలో 20 కలెక్షన్ సెంటర్లు, మూడు కోల్డ్ స్టోరేజ్‌లను నిర్మించింది. కలెక్షన్ సెంటర్ల నిర్మాణానికి ప్రభుత్వం ఒక్కో యూనిట్‌కు రూ.11.25లక్షలు, రాష్ట్రీయ క్రిష్ వికాష్ యోజన (ఆర్‌కేవీవై) ద్వారా రూ.5.25 లక్షలు, మిషన్ ఫర్ ఇంటిగ్రెటెడ్ డెవలప్‌మెంట్ ఫర్ హార్టీకల్చర్ (ఎంఐడీహెచ్) ద్వారా రూ.ఆరు లక్షలు ఖర్చు చేసింది. కోల్డ్‌స్టోరేజ్‌కు ఒక్కోదానికి ఆర్‌కేవీవై ద్వారా రూ.ఆరు లక్షలు, ఎంఐడీహెచ్ ద్వారా రూ.5.25లక్షలు వెచ్చించింది. ప్రస్తుతం కోల్డ్‌స్టోరేజ్‌లు, కలెక్షన్ సెంటర్లు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఒక్కో కోల్డ్‌స్టోరేజ్ నిల్వ సామర్థ్యం 10 టన్నుల వరకు ఉంది.

అత్యధికంగా మిర్చి

జిల్లాలో అత్యధికంగా రైతులు మిర్చి సాగుచేస్తారు. దీంతోపాటు మొక్కజొన్న, కూరగాయలు సాగు చేస్తుంటారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట వర్షాలకు తడిచి రైతులు నష్టపోతున్నారు. దీనిని నివారించేందుకు ప్రభుత్వం కలెక్షన్ సెంటర్లు నిర్మించింది. ఈ సెంటర్లలో తడిచిన పంటలను ఆరబెట్టుకునే సౌలభ్యం ఉంటుంది. అక్కడే పంట ఉత్పత్తులు గ్రేడింగ్ కూడా చేసుకోవచ్చు. అలాగే పంటకు తగిన ధర లేనప్పుడు కోల్డ్ స్టోరేజ్‌లలో నిల్వ చేసుకోవచ్చు. కలెక్షన్ సెంటర్లు, కోల్డ్ స్టోరేజ్‌లు రైతు ఉత్పత్తిదారుల సంఘాల నిర్వహణలో ఉంటాయి.

రాయితీలు ఇలా..

జిల్లాలో ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. కొత్త సాగుదారులకు భారీగా రాయితీలు ఇస్తోంది. జిల్లా రైతులకు హెక్టారుకు మామిడికి రూ.రూ.7,980, జామకు రూ.17,599, బొప్పాయికి రూ.18,497, కూరగాయలకు 20,000, పందిరి కూరగాయలకు 2,50,00, బత్తాయికి (రెండో పంట) రూ.3,201 రాయితీగా అందజేస్తోంది. రాయితీలపై ఉద్యాన శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించడంతో ఈ ఖరీఫ్‌లో అధిక శాతం మంది ఈ పంటల సాగుకు మొగ్గు చూపిస్తున్నారు. డ్రాగన్ ఫ్రూట్ సాగుపైనా కర్షకులు ఆసక్తిగా ఉన్నారని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు.

ఈ ఏడాది ఉద్యాన పంటల సాగు ఇలా..

పంట	విస్తీర్ణం (హెక్టార్లలో)
మిర్చి	58,000
బొప్పాయి	390
అరటి	393
జామ	391
మామిడి	331
నిమ్మ	288
బత్తాయి	765

రాయితీలను వినియోగించుకోవాలి



ఉద్యాన పంటలను నిల్వ చేసుకునేందుకు రైతు ఉత్పత్తిదారుల సంఘాలు(ఎఫ్‌పీఓల) ఆధ్వర్యంలో కలెక్షన్ సెంటర్లు, కోల్డ్‌స్టోరేజ్‌లు నిర్మించాం. కొత్తగా ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు ఏడాది నుంచి మూడేళ్ల పాటు వివిధ రూపాల్లో ప్రభుత్వం రాయితీలు అందిస్తోంది. వీటిని కర్షకులు వినియోగించుకోవాలి.

– బెన్ని, జిల్లా ఉద్యానవన శాఖాధికారి

వైద్య విద్యకు మహర్దశ

వైఎస్సార్ సీపీ ఉభయగోదావరి జిల్లాల వైద్య విభాగ సమన్వయకర్త మురళీకృష్ణ



డాక్టర్ యనమదల మురళీకృష్ణ

కాకినాడ క్రైం: కనీవినీ ఎరుగని రీతిలో ఏకకాలంలో రాష్ట్రంలో 17 వైద్య కళాశాలల నిర్మాణం చేపట్టడం సంచలనమని వైఎస్సార్ సీపీ ఉభయగోదావరి జిల్లాల వైద్య విభాగ సమన్వయకర్త, కాకినాడకు చెందిన ప్రముఖ సాంక్రమిక వ్యాధుల నిపుణుడు యనమదల మురళీకృష్ణ అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వైద్య విద్యకు మహర్దశ పట్టిందని ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి కొత్తగా నిర్మిస్తున్న వాటిలోని ఐదు కళాశాలలలో 750 ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అనుమతిచ్చిందని అన్నారు. కేంద్ర వైద్య మండలి నిబంధనలను అనుసరించి పదిహేను శాతం సీట్లు సెంట్రల్ పూల్‌కి కేటాయించాల్సి ఉందని, అయితే రాష్ట్ర విద్యార్థులు ఈ సీట్లు పొందడంలో ముందు వరుసలో ఉంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో చంద్రబాబు మంగళగిరి ఎయిమ్స్ తప్ప ఒక్క వైద్య కళాశాలను తీసుకురాలేకపోయారని గుర్తు చేశారు. అది కూడా విభజన హామీలలో వచ్చిందే తప్ప బాబు చేసిన కృషి ఏమీ లేదన్నారు. ప్రస్తుతం నూతన వైద్య కళాశాల రాకతో 375 ఎంబీబీఎస్ సీట్లు రూ.17 వేల వార్షిక ఫీజుతో భర్తీ కానున్నాయని, ఇది సామాన్యులకు అనుకూలించే అంశమని గుర్తు చేశారు. అలాగే ఎంబీబీఎస్ మొదటి ఏడాదిలో బోధించే అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ సబ్జెక్టుల బోధనకు అవసరమైన అన్ని వసతుల ఏర్పాటుకు నూతన భవనాల నిర్మాణంలో ఇంజినీరింగ్ ప్రణాళికలు సిద్ధమయ్యాయని తెలిపారు. రెండవ ఏడాది నుంచి క్లినికల్స్ మొదలవుతాయని, అప్పుడు మాత్రమే అనుబంధ వైద్య శాలల అవసరం ఉంటుందని డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. ఇన్ని అనుకూలతల మధ్య ప్రతికూలతలు వెదుకుతూ ప్రజల్ని తప్పుదారి పట్టించడం ఓ వర్గం మీడియాకు పరిపాటిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిధుల సమీకరణ కోసం సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్ల కేటాయింపు వైద్య విద్య ప్రారంభం నుంచి ఉన్నదేనని తెలిపారు. కేవలం రూ.17 వేల వార్షిక మొత్తానికి కేటాయించే ప్రయోజనాలను వదిలేసి 375 సీట్లకు అధిక ఫీజులంటూ తప్పుడు ప్రచారాలు చేయడం మానుకోవాలని సూచించారు.

• తెలంగాణ

కళ్యాణి చాళుక్యులు, కాకతీయులు తొలిచిన క్వారీ

నాగర్‌కర్నూలు జిల్లా మన్ననూరులో గుర్తింపు

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్లే దారిలో ఉమామహేశ్వరం క్షేత్రం సమీపంలో అప్పట్లో అటు కళ్యాణి చాళుక్యులు, వారి తర్వాత సామ్రాజ్యాన్ని స్థాపించిన కాకతీయులు నిర్మించిన పలు కట్టడాలకు ఒకే క్వారీ నుంచి గ్రానైట్ రాళ్లను వినియోగించినట్టు స్పష్టమైంది. వారసత్వ స్థావరాలను గుర్తించడం, వాటిని పరిరక్షించుకోవడంలో స్థానికులకు అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా శ్రీశైలం దారిలోని నాగర్‌కర్నూలు జిల్లా మన్ననూరు ఘాట్‌రోడ్డు సమీపంలోని ప్రతాపరుద్రుని కోట ప్రాంతాన్ని ఆదివారం చరిత్ర పరిశోధకులు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి సందర్శించారు. ఇక్కడే శ్రీశైలం క్షేత్ర తొలి ద్వారంగా, శివపుర ద్వారంగా పేర్కొనే ద్వార తోరణం ఇప్పటికీ పదిలంగా ఉంది. దీన్ని కళ్యాణి చాళుక్యుల పాలన చివరి భాగంలో నిర్మించారని శివనాగిరెడ్డి చెప్పారు. ఆ తర్వాత ఆ పక్కనే కాకతీయ చక్రవర్తి మొదటి ప్రతాపరుద్రుడి హయాంలో కోట నిర్మించారన్నారు. ఈ రెండు నిర్మాణాలకు అక్కడి సమీపంలోని గుట్టను క్వారీగా చేసుకుని రాళ్లను తెచ్చినట్టు పేర్కొన్నారు. దాదాపు 870 ఏళ్ల క్రితం ఆ రాళ్లను తొలిచిన ఆనవాళ్లను గుర్తించామన్నారు. గుట్టలోని చాలా భాగాన్ని అప్పట్లో తొలిచి భారీగా రాతిని ఇక్కడి నుంచి తరలించి నిర్మాణాలకు వాడినట్లు తెలిపారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943